
'ప్రతిపల్లెలోనూ అందరికీ గ్యాస్ సరఫరా, ప్రతి మహిళకూ ఆర్థిక భరోసా నా ధ్యేయం'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 18+20 వెల: ₹5.00

సంపుటి: 10 సంచిక: 310

బుధవారం 31-1-2018

SIMULTANEOUSLY PRINTED AT VIJAYAWADA | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAHMUNDRY | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



అండర్-19 ప్రపంచకప్ ఫైనల్లో భారత్

- సెమీస్‌లో పాకిస్తాన్‌పై 203 పరుగులతో ఘనవిజయం
- శనివారం ఆస్ట్రేలియాతో టైటిల్ పోరు -స్పోర్ట్స్‌లో



నేడే బ్లడ్ మూన్

- అరుణ వర్ణంతో కాంతులీననున్న జాబిల్లి
- సా॥ 4.21 నుంచి 7.37 గంటల మధ్య కనువిందు
- గ్రహణం కారణంగా ఉదయం 10:30కే ఆలయాల మూసివేత

5లో



సీజేఐ వేతనం నెలకు రూ.2.80 లక్షలు!

- సుప్రీంకోర్టు, హైకోర్టు జడ్జీల వేతనాలను పెంచే బిల్లుపై రాష్ట్రపతి సంతకం

5లో

చక్రం తిప్పిన ప్రభుత్వ పెద్దలు..

ఒకే దెబ్బకు రెండు జాక్‌పాట్లు!



కాంక్రీట్ పనులతో పాటు జలవిద్యుత్ ప్రాజెక్టు నవయుగకే

- పాతధరలకే కాంక్రీట్ పనులంటూ ప్రచారం
- టెండర్ వివాదం నుంచి గట్టెక్కే ఎత్తుగడ..
- రూ.5,358.23 కోట్ల జలవిద్యుత్ ప్రాజెక్టు దక్కేలా వ్యూహం
- అంచనా వ్యయం పెంపుతో రూ. 1,454.42 కోట్ల లబ్ధి
- పట్టిసీమ తరహాలోనే నెలసరి బోనస్‌లకూ ప్లాన్
- పనులు నత్తనడక.. రాకెట్‌వేగంలో అంచనావ్యయం పెంపు

కేంద్ర ప్రభుత్వం అభ్యంతరం

పోలవరం జలాశయం అంతర్గత పనులకు రూ.1483.22 కోట్లతో ఇటీవల పిలిచిన టెండర్‌పై కేంద్రం, పోలవరం అథారిటీ అభ్యంతరం వ్యక్తం చేసింది. పెరిగిన అంచనా వ్యయం రూ.287 కోట్ల భారాన్ని ఎవరు భరిస్తారని ప్రశ్నించింది.

ఆర్థిక శాఖ ఆక్షేపణ..

పోలవరం జలాశయం పనులు డిసెంబర్, 2019 నాటికి పూర్తయ్యే అవకాశాలు కన్పించడం లేదని.. ఇప్పటికిప్పుడు రూ.5,338.95 కోట్లతో జలవిద్యుదుత్పత్తి ప్రాజెక్టు పనులు చేపట్టడంలో ఔచిత్యమేమిటని ఆర్థిక శాఖ ప్రశ్నించింది. ప్రాజెక్టుకు తెచ్చిన అప్పులపై వడ్డీల భారం పడుతుందన్న సాకు చూపిస్తూ హైడల్ ప్రాజెక్టు పనులను నవయుగకు అప్పగించేలా టెండర్లను ఖరారు చేసే యత్నాలకు అభ్యంతరం తెలిపింది.

కానీ సీఎం ఇలా అంటున్నారు

పోలవరం జలాశయంలో 31 లక్షల క్యూబిక్ మీటర్ల కాంక్రీట్ పనులను పాత ధరలకే చేసేందుకు నవయుగ ముందుకొచ్చిందని సీఎం చంద్రబాబు ఇటీవల ప్రకటించారు. అందువల్ల ఆ సంస్థకే కాంక్రీట్ పనులు నామినేషన్‌పై అప్పగిస్తున్నామన్నారు.

సాక్షి, అమరావతి

రాష్ట్రానికి వరప్రదాయిని వంటి పోలవరం ప్రాజెక్టు ఒక అడుగు ముందుకు నాలుగు అడుగులు వెనక్కి అన్నట్లుగా నడుస్తోంది. పనులు నత్తనడకన సాగుతుంటే.. అవినీతి, కమీషన్ల వ్యవహారాలు రాకెట్ వేగంతో పరుగులు పెడుతున్నాయి. ఈ ప్రాజెక్టులో ఒకే దెబ్బకు రెండు పిట్టలు కాదు రెండు జాక్‌పాట్‌లు కొట్టేలా సర్కారు పెద్దలు వ్యూహం రచించారు. అవేమిటంటే.. పోలవరం జలాశయంలో కాంక్రీట్ పనులను నవయుగకే నామినేషన్ పద్ధతిలో అప్పగించడం. కేంద్రం కళ్లకు గంతలు కట్టి దీన్ని ఒకే చేయించుకున్నారు. ఇక పోలవరం జలాశయం పనులు 2019 నాటికి పూర్తవుతాయనే భ్రమ కల్పించడం ద్వారా ఆర్థికశాఖ అభ్యంతరాలకు చెక్ పెట్టి... రూ.5,338.95 కోట్ల విలువైన జలవిద్యుదుత్పత్తి ప్రాజెక్టు టెండర్లను

మిగతా 2వ పేజీలో ▶

పోలవరం పనులు నవయుగకే!

- రాష్ట్రప్రభుత్వ ప్రతిపాదనకు కేంద్రం అంగీకారం

2లో

'పల్స్'లో లేకుంటే..

పింఛన్ కట్!

- పల్స్ సర్వేలో కుటుంబ వివరాల నమోదు తప్పనిసరి
- నమోదు చేసుకోని పింఛనుదారులు 4.69 లక్షల మంది
- వివరాలు ఇవ్వకపోతే పింఛన్ రాదంటున్న అధికారులు



రాష్ట్రంలో మొత్తం పింఛనుదారులు **44,32,592**

ఇప్పటి వరకు పల్స్ సర్వేలో నమోదు కానివారు **4,69,346**

సాక్షి, అమరావతి

రాష్ట్రంలో ప్రస్తుతం ప్రతి నెలా 44.32 లక్షల మందికి వృద్ధాప్య, వితంతు, దివ్యాంగ పింఛన్లు మంజూరవుతున్నాయి. అయితే, వీరిలో 4.69 లక్షల మంది ఏడాది క్రితం ప్రభుత్వం నిర్వహించిన పల్స్ సర్వేలో తమ పేర్లు నమోదు చేసుకోలేదని అధికారులు గుర్తించారు. 4.69 లక్షల మంది పింఛనుదారుల వివరాల సేకరణకు ప్రతి గ్రామ పంచాయతీలో, పట్టణ వార్డు కార్యాలయాల్లో ప్రత్యేక క్యాంపులు నిర్వహించాలని గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ సీఈవో ఈ నెల 26న రెవెన్యూ శాఖకు లేఖ రాశారు. పల్స్ సర్వేలో వివరాల నమోదుకు నిర్ణీత గడువేదీ విధించలేదు. అయితే, ఒకటి రెండు నెలల దాకా నమోదు చేయించుకోకపోతే పింఛన్లు రద్దు చేసే

మిగతా 6వ పేజీలో ▶

> "గ్రామంలో పింఛనుదారులకు విజ్ఞప్తి. పింఛన్లు తీసుకుంటున్న వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు పల్స్ సర్వేలో పేర్లు నమోదు చేయించుకోవాలి. గ్రామ పంచాయతీ కార్యాలయానికి వచ్చి సర్వేలో కుటుంబ వివరాలను నమోదు చేయించుకోండి. లేకపోతే పింఛన్లు రద్దవుతాయి"
>
> *- మంగళవారం విజయవాడ శివారులోని కానూరులో గ్రామ పంచాయతీ అధికారుల మైక్‌లో చేసిన ప్రచారమిదీ..*

పక్కాగా ప్రాక్టికల్స్

ఇంటర్ బోర్డు కమిషనర్ ఉదయలక్ష్మి



- రేపట్నుంచి ప్రారంభం.. అధ్యాపకులకూ జంబ్లింగ్ విధానం
- తప్పులు జరిగితే బాధ్యులపై కఠిన చర్యలు
- మాల్ ప్రాక్టీసులను ప్రోత్సహిస్తే సస్పెన్షన్ వేటు
- కాంట్రాక్టు అధ్యాపకులైతే విధుల నుంచి తొలగింపు

3లో

14 వరకు ఓటర్ల నమోదు

'సాక్షి'తో రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ఆర్.పి.సిసోడియా

- ముసాయిదా ఓటర్ల జాబితాలు బూత్ స్థాయిలో అందుబాటులో
- పేర్లు లేనివారు అక్కడికక్కడే నమోదు చేసుకోవచ్చు
- ఆన్‌లైన్‌లో కూడా నమోదుకు అవకాశం
- ఫిబ్రవరి 4, 11న ప్రత్యేకంగా బూత్ స్థాయిల్లో నమోదు
- మార్చి 24న ఓటర్ల తుది జాబితా ప్రకటన

18లో

గోప్యతకు రక్షణ



- సామాజిక మాధ్యమ దిగ్గజం ఫేస్‌బుక్ తొలిసారిగా తన గోప్యతా నిబంధనలను వెల్లడించింది. ప్రపంచవ్యాప్తంగా 200 కోట్ల మందికి పైగా ఫేస్‌బుక్ ఉపయోగిస్తుండగా, ఈ సంస్థ ఇప్పటివరకు ఇలాంటి నిబంధలను ప్రకటించలేదు.

- వివరాలు 5లో

శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా గిద్దలూరు క్రాస్ సమీపంలో మంగళవారం పాదయాత్ర సాగిస్తున్న ప్రతిపక్ష నేత వైఎస్ జగన్



మీ కష్టాలు చూశాకే.. 45 ఏళ్లకే పింఛన్

చేనేతల ఆత్మీయ సమ్మేళనంలో ప్రతిపక్ష నేత వైఎస్ జగన్

- ప్రత్యేక కార్పొరేషన్‌తో నేతన్నలకు చేయూత
- నూలు కొనుగోలుపై రూ.2 వేలు సబ్సిడీ
- ఆర్టిజాన్ కార్డులతో ప్రయోజనం ఉండేలా చూస్తాం
- నవరత్నాలతో పేదలందరినీ ఆదుకుంటాం
- మీ పిల్లల ఉన్నత చదువు బాధ్యత నాది
- ఆపద సమయాల్లో అండదండగా ఉంటామని భరోసా

- వివరాలు 6లో

ఇంజనీరింగ్‌లో కొత్త సిలబస్

- వచ్చే విద్యాసంవత్సరం నుంచి అమలు!
- తరగతి గదిలో పాఠాల కంటే క్షేత్రస్థాయి ప్రయోగాలకే ప్రాధాన్యం



- వివరాలు 3లో

నష్టాలను బడ్జెట్ తీరుస్తుందా?

కేంద్ర బడ్జెట్‌పై ఆశలు పెట్టుకున్న చిన్న, మధ్యతరహా పరిశ్రమల యజమానులు.. నోట్ల రద్దు, జీఎస్టీతో నష్టపోయామంటున్న వ్యాపారులు



నోట్ల రద్దు, జీఎస్టీ చిరు వ్యాపారాలపై తీవ్ర ప్రభావం చూపించింది. చాలా మంది సీజన్ వ్యాపారులు వివిధ షాపుల్లో గుమస్తాలుగా చేరిపోయారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టే బడ్జెట్‌పైనే ఆశలు పెట్టుకున్నాం.

– గుంటూరు ఆంజనేయులు, చిరు వ్యాపారి, ఏలూరు



ఎగుమతుల ద్వారా ఆదాయం పెరగాలంటే 2005 ఎస్ఈజెడ్ పాలసీని అమలు చేయాలి. ఆ పాలసీ ప్రకారం ఆదాయ పన్ను నుంచి మినహాయింపునిస్తున్నట్లు ప్రకటించారు. కానీ ప్రస్తుతం మినిమమ్ ఆల్టర్నేటివ్ ట్యాక్స్ పేరుతో 18.5శాతం పన్ను చెల్లించాల్సి వస్తుంది. లాభాలను డివిడెండ్లుగా ప్రకటించడానికి కంపెనీ డివిడెండ్ డిస్ట్రిబ్యూషన్ టాక్స్‌ని కంపెనీలు భరించాల్సి వస్తుండడంతో భారం పడుతుంది.

– వినయ్‌శర్మ, ఏడబ్ల్యూస్ ఇండియా చైర్మన్, వీఎస్ఈజెడ్


సాక్షి, అమరావతి: ఈ ఏడాది కేంద్ర బడ్జెట్‌పై చిన్న, మధ్యతరహా పరిశ్రమలు భారీ ఆశలను పెట్టుకున్నాయి. రెండేళ్ల నుంచి తీవ్ర ఒడిదుడుకులు ఎదుర్కొంటున్న ఈ రంగాన్ని గాడిలో పెట్టే విధంగా రాయితీలు, ప్రోత్సాహకాలు ప్రకటిస్తారని అంచనా వేస్తున్నారు. పెద్ద నోట్ల రద్దు, జీఎస్టీలతో దేశంలో అత్యధిక మందికి ఉపాధి కల్పించే ఎంఎస్ఎంఈ రంగం ఒడిదుడుకులు ఎదుర్కొంటోంది. దేశవ్యాప్తంగా 3.60 కోట్ల యూనిట్లు ఉండగా వీటిపై ఆధారపడి 12 కోట్ల మంది జీవనం సాగిస్తున్నారు. అంతేకాదు దేశీయ తయారీరంగంలో మూడోవంతు, ఎగుమతుల్లో 45 శాతం ఈ రంగం నుంచే ఉన్నాయి. ఇలాంటి అత్యంత కీలకమైన రంగం వరుసదెబ్బలతో కునారిల్లుతోంది. దీంతో ఈ రంగాన్ని ఆదుకునే విధంగా పలు ప్రోత్సాహకాలను అరుణ్ జైట్లీ ఈ బడ్జెట్‌లో ప్రకటిస్తారా? అని ఆశగా



ఎదురుచూస్తున్నారు. కార్పొరేట్ ట్యాక్స్, డివిడెండ్ డిస్ట్రిబ్యూషన్ ట్యాక్స్‌తో పాటు వ్యక్తిగత ఆదాయపన్ను పరిమితిని పెంచుతారని అంచనా వేసు న్నట్లు ఆంధ్రా చాంబర్ ఆఫ్ కామర్స్ (విజయవాడ చాప్టర్) ప్రెసిడెంట్ ఎం.రాజయ్య 'సాక్షి'కి తెలిపారు. జీఎస్టీలో రిటర్నులు దాఖలు అనేది చిన్న వ్యాపారులకు చాలా ఇబ్బందిగా మారిందని, దీన్ని మరింత సులభతరం చేయాలని చిత్తూరు జిల్లా మదనపల్లికి చెందిన వ్యాపారి శబరీనాథ్ కోరారు. సినిమా టికెట్ ధరతో సంబంధం లేకుండా 18 శాతం ఏక పన్ను రేటును అమలు చేయాలని ఏపీ థియేటర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ ముత్తవరపు శ్రీనివాసు తెలిపారు. టీవీలు, ఫ్రిజ్‌లు వంటి కన్స్యూమర్ డ్యూరబుల్స్‌పై 28 శాతం పన్ను విధించడంతో అమ్మకాలు తగ్గాయని సోనోవిజన్ మేనేజింగ్ పార్టనర్ భాస్కరమూర్తి తెలిపారు.

చిరుద్యోగులకు ఊరటనిస్తారా..

సాక్షి, అమరావతి



బడ్జెట్ అంటేనే చిరుద్యోగులు దడదడలాడుతుంటారు. ఏ వస్తువుల ధరలు పెరుగుతాయో అని కంగారు పడుతుంటారు. చిరుద్యోగి జాతకంలో ఎప్పుడూ ఆదాయం 2గా ఉంటే వ్యయం 12గా ఉంటోంది. ఈ సారైనా కేంద్ర బడ్జెట్‌లో తమను కనికరిస్తారా అనే ఆశతో వారు ఎదురు చూస్తున్నారు. రాష్ట్రంలో పనిచేస్తున్న చాలామంది మధ్యతరగతి, చిరు ఉద్యోగులు జీతాలు సరిపోక, పన్నులు కట్టలేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. బడ్జెట్‌లో ఆదాయపు పన్ను పరిమితిని పెంచి ఆర్థికమంత్రి ఉద్యోగులకు ఊరటనిస్తారని ఆశిస్తున్నారు. పెట్రోల్, డీజిల్ ధరలు తారస్థాయికి చేరడంతో నిత్యావసర వస్తువుల ధరలు భారీగా పెరుగుతున్నాయి. ఈ స్థాయిలో జీతాలు మాత్రం పెరగడం లేదని ఉద్యోగులు వాపోతున్నారు. గత రెండేళ్ల నుంచి వ్యాపారాలు లేక ఉద్యోగులకు జీతాలు పెంచడం లేదని, కానీ ధరలు మాత్రం 20 నుంచి 30 శాతం పెరిగిపోవడంతో కుటుంబాన్ని ఎలా నెట్టుకురావాలో అర్థంకావడం లేదని చీరాలకు చెందిన ప్రైవేటు ఉద్యోగి కిశోర్ ఆవేదన వ్యక్తం చేశారు.

జీతాల పెరుగుదల లేదు

ధరలు పెరుగుతున్న స్థాయిలో జీతాలు పెరగడం లేదు. దీనికితోడు పెద్ద నోట్ల రద్దు, జీఎస్‌టీ వంటివాటితో వ్యాపారాలు పూర్తిగా దెబ్బతిన్నాయి. దీంతో చాలా సంస్థలు పెరుగుతున్న ధరలకు అనుగుణంగా జీతాలు పెంచలేని పరిస్థితి. ఇప్పుడు చేతికి అందుతున్న జీతం 15వ తేదీ రాకుండానే ఖర్చు అయిపోతోంది. ఈ బడ్జెట్‌లోనైనా ఆదాయ పన్ను పరిమితి పెంచితే కొంతైనా ఊరట లభిస్తుంది.

– కె. నారాయణరావు, ప్రైవేట్ ఉద్యోగి, పాలకొండ, శ్రీకాకుళం జిల్లా

విజయవాడలో పెరిగిన ఖర్చులు

రాష్ట్ర విభజన తర్వాత హైదరాబాద్ నుంచి విజయవాడకు తరలి రావాల్సి వచ్చింది. కానీ ఇక్కడ ఇంటి అద్దెలు, ఇతర వ్యయాలు చాలా ఎక్కువగా ఉన్నాయి. దీన్ని దృష్టిలో పెట్టుకొని మెట్రో నగరాల్లో పనిచేసే హెచ్‌ఆర్‌ఏ నిబంధనలను ఇక్కడ కూడా అమలు చేయాలి. అలాగే పెరిగిన జీవనవ్యయాలను దృష్టిలో పెట్టుకొని స్టాండర్డ్ డిడక్షన్‌ను తిరిగి ప్రవేశపెట్టాలి.

– జి.గణేష్ కుమార్, ప్రభుత్వ ఉద్యోగి, అమరావతి.



మహాత్మా గాంధీ వర్ధంతి సందర్భంగా హైదరాబాద్‌లోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో నివాళులర్పిస్తున్న పార్టీ నేతలు ఎంవీఎస్ నాగిరెడ్డి, వాసిరెడ్డి పద్మ, లక్ష్మీపార్వతి, చల్లా మధుసూదన్ తదితరులు

వైఎస్సార్ సీపీ కార్యాలయంలో మహాత్ముడికి నివాళులు

సాక్షి, హైదరాబాద్: జాతి పిత మహాత్మాగాంధీ వర్ధంతిని పురస్కరించుకుని మంగళవారం వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో పార్టీ నేతలు ఘనంగా నివాళులర్పించారు. పార్టీ నేతలు ఎన్.లక్ష్మీపార్వతి, వాసిరెడ్డి పద్మ, ఎంవీఎస్ నాగిరెడ్డి, ఆర్.జగన్నాథం, చల్లా మధుసూదనరెడ్డి, డాక్టర్ ప్రఫుల్లరెడ్డి, ఇ.రాజశేఖర్, దేవేందర్‌తో సహా పలువురు గాంధీ చిత్ర పటం వద్ద పూలు సమర్పించి శ్రద్ధాంజలి ఘటించారు.

వివిధ ప్రాంతాలకు ప్రత్యేక రైళ్లు

రైల్వేస్టేషన్ (విజయవాడ పశ్చిమ): ప్రయాణికుల రద్దీ దృష్ట్యా వివిధ ప్రాంతాలకు ప్రత్యేక రైళ్లు నడుపుతున్నట్లు విజయవాడ డివిజన్ ఇన్‌చార్జ్ పీఆర్వో జే.వి.ఆర్కే రాజశేఖర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. రైలు నంబర్ (08501) విశాఖపట్నం–సికింద్రాబాద్ మార్చి 6, 13, 20, 27, ఏప్రిల్ 3, 10, 17, 24, మే 1, 8, 15, 22, 29, జూన్ 5, 12, 19, 26 రాత్రి 11 గంటలకు విశాఖలో బయల్దేరి మరుసటిరోజు మధ్యాహ్నం 12కి సికింద్రాబాద్ చేరుతుంది. రైలు నంబర్ (08502) సికింద్రాబాద్–విశాఖ మార్చి 7, 14, 21, 28, ఏప్రిల్ 4, 11, 18, 25, మే 2, 9, 16, 23, 30, జూన్ 6, 13, 20, 27 తేదీల్లో సాయంత్రం 4.30కి సికింద్రాబాద్‌లో బయల్దేరి మరుసటిరోజు తెల్లవారుజామున 4.50కి విశాఖ చేరుతుంది. అలాగే రైలు నంబర్ (08573) విశాఖపట్నం–తిరుపతి ప్రత్యేక రైలు మార్చి 5, 12, 19, 26, ఏప్రిల్ 2, 9, 16, 23, 30, మే 7, 14, 21, 28, జూన్ 4, 11, 18, 25 తేదీల్లో రాత్రి 10.55కి విశాఖలో బయల్దేరి మరుసటిరోజు మధ్యాహ్నం 1.25కి తిరుపతి చేరుతుంది. రైలు నంబర్ (08574) తిరుపతి–విశాఖపట్నం మార్చి 6, 13, 20, 27, ఏప్రిల్ 3, 10, 17, 24, మే 1, 8, 15, 22, 29, జూన్ 5, 12, 19, 26 తేదీల్లో మధ్యాహ్నం 3.30కి తిరుపతిలో బయల్దేరి మరుసటిరోజు ఉదయం 6.50కి విశాఖ చేరుతుంది. ఇవి విజయవాడ మీదుగా రాక పోకలు సాగిస్తాయని రాజశేఖర్ తెలిపారు.

అప్పుల బాధతో యువరైతు ఆత్మహత్య

ఆదోని రూరల్: కర్నూలు జిల్లా ఆదోని మండలం కడితోట గ్రామానికి చెందిన శేకన్న (25) అనే యువరైతు అప్పుల బాధ తాళలేక సోమవారం అర్ధరాత్రి ఆత్మహత్య చేసుకున్నాడు. శేకన్న తనకున్న మూడెకరాల పొలంలో ఈ ఏడాది పత్తి పంట సాగు చేశాడు. ఎకరాకు మూడు క్వింటాళ్లు మాత్రమే దిగుబడి వచ్చింది. దీంతో పెట్టుబడి సైతం తిరిగి రాలేదు. గత ఏడాది కూడా ఇదే పరిస్థితి. పెద్దతుంబళంలోని ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకులో ఈ ఏడాది కొత్తగా రూ.లక్ష పంట రుణం తీసుకున్నాడు. ప్రైవేటు అప్పులు రూ.లక్షన్నర దాకా ఉన్నాయి. ఇతను వ్యవసాయం చేయడంతో పాటు ఆదోని మార్కెట్ యార్డులో హమాలీగా పనిచేసేవాడు. పంట నష్టాలతో అప్పుల్లోకి వెళ్లడం, వాటిని తీర్చలేనన్న బెంగతో తీవ్ర మనోవేదనకు గురయ్యేవాడు. కాగా.. దైవ దర్శనానికి శ్రీశైలం వెళ్లి వచ్చిన శేకన్న సోమవారం ఇంట్లో ప్రత్యేక పూజలు నిర్వహించాడు. బంధుమిత్రులకు విందు భోజనాలు కూడా ఏర్పాటు చేశాడు. ఈ నేపథ్యంలో సోమవారం అర్ధరాత్రి ఇంట్లోని ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. శేకన్నకు భార్య ఈశ్వరమ్మతో పాటు ఐదేళ్లలోపు వయసుగల ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారు. మృతుడి తల్లి ఈరమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పెద్దతుంబళం ఎస్ఐ ఉసేన్ బాషా తెలిపారు.

నేను రాజకీయాల్లో లేను: మాజీ సీఎం రోశయ్య



లక్ష్మీపురం(గుంటూరు): తాను రాజకీయాల్లో లేనని, ఈ మాట స్పృహలో ఉండే చెబుతున్నానని మాజీ సీఎం కొణిజేటి రోశయ్య అన్నారు. మంగళవారం గుంటూరులోని మాజీ ఎమ్మెల్యే చదలవాడ జయరాంబాబు నివాసంలో ఆయన మీడియాతో మాట్లాడారు. తాను ఎప్పటికీ కాంగ్రెస్ పార్టీ వాడినేనని చెప్పారు. కానీ పార్టీ పదవులు తీసుకొని న్యాయం చేసే పరిస్థితిలో లేనన్నారు.

ఒకే దెబ్బకు రెండు జాక్‌పాట్లు

▶ మొదటి పేజీ తరువాయి

అదే సంస్థకు కట్టబెట్టడానికి చాకచక్యంగా కథ నడిపించడం.. ఈ తతంగం పూర్వాపరాలేమిటో పరిశీలిద్దాం..

నవయుగకే దక్కేలా..

పోలవరం ప్రాజెక్టులో అంతర్భాగంగా 960 మెగావాట్ల సామర్థ్యంతో నిర్మించే జలవిద్యుదుత్పత్తి ప్రాజెక్టుకు రూ.3,157.93 కోట్లను అంతర్గత అంచనా విలువ(ఐబీఎం)గా నిర్ణయించిన ఏపీ జెన్‌కో(విద్యుదుత్పత్తి సంస్థ) గతేడాది జనవరి 9న టెండర్ నోటిఫికేషన్ జారీ చేసింది.. తాను ఎంపిక చేసిన సంస్థకే పనులు దక్కేలా టెండర్లలో ప్రభుత్వ పెద్దలు చక్రం తిప్పారు. గతేడాది సెప్టెంబరు 15న సాంకేతిక బిడ్, అక్టోబర్ 11న ఆర్థిక బిడ్‌ను తెరిచారు. ముందే అనుకున్నట్లుగానే.. 4.83 శాతం అధిక ధరలకు నవయుగ, 12.92 శాతం అధిక ధరలకు మేఘ, 14.85 శాతం అధిక ధరలకు కోట్ చేస్తూ టాటా పవర్ షెడ్యూళ్లను దాఖలు చేశాయి. తక్కువ ధరకు షెడ్యూళ్లు దాఖలు చేసి 'నవయుగ' ఎల్–1గా నిలిచింది.

టెండర్లు ముగిశాక అంచనా పెంపు..

టెండర్ల ప్రక్రియ ముగిసి.. నవయుగ సంస్థకు పనులు దక్కాక అంచనా వ్యయం పెంచాలంటూ సర్కారు పెద్దలు ఒత్తిడి తెచ్చారు. ఆ ఒత్తిళ్లకు తాళలేని అధికారులు నిబంధనలకు విరుద్ధంగా అంచనా పెంచేశారు. 2016–17 ధరల ప్రకారం జలవిద్యుదుత్పత్తి ప్రాజెక్టును జీఎస్టీ, లేబర్ సెస్ వంటి పన్నులతో కలిపి రూ. 3,903.81 కోట్లకు పూర్తి చేయవచ్చని ప్రతిపాదించారు. అక్కడితో సంతృప్తి చెందని చంద్రబాబు అంచనా వ్యయం మరింత పెంచాలంటూ వత్తిడి తెచ్చారు. ప్రాజెక్టు పనులు చేస్తున్న సమయంలో పెట్టుబడిపై వడ్డీతో కలిపి అంచనా వ్యయం రూ.5,358.23 కోట్లకు అధికారులు పెంచేశారు. వీటిని పరిగణనలోకి తీసుకుంటే అంచనా వ్యయం రూ. 1454.42 కోట్లు పెరిగినట్లు స్పష్టమవుతుంది. ఈ ప్రాజెక్టుకు ఆర్ఈసీ (రెన్యువబుల్ ఎనర్జీ కార్పొరేషన్) రూ.3,965.11 కోట్ల రుణం ఇచ్చిందని, మిగతా రూ.1,373.84 కోట్లను అంతర్గత వనరుల ద్వారా సమకూర్చుకుంటామని జెన్‌కో వివరించింది.

అభ్యంతరాలే అస్త్రాలు..

పీపీఏ, ఆర్థిక శాఖ వ్యక్తం చేసిన అభ్యంతరాలనే అస్త్రాలుగా మల్చుకుని.. మాస్టర్ ప్లాన్ అమలుకు ప్రభుత్వ పెద్దలు శ్రీకారం చుట్టారు. పోలవరం జలాశయం పనుల్లో రూ.1,483.22 కోట్ల విలువైన పనులకు టెండర్లు పిలిస్తే.. వాటిని రద్దు చేసి రూ.2,800 కోట్ల విలువైన పనులను నామినేషన్ పద్ధతిలో నవయుగకు కట్టబెట్టాలని నిర్ణయించారు. జలాశయం పనులు చేస్తున్నదన్న సాకు చూపి అదే సంస్థకు జలవిద్యుదుత్పత్తి ప్రాజెక్టు పనులను కూడా కట్టబెడుతూ టెండర్లను ఖరారు చేయాలన్నది సర్కారు పెద్దల ఎత్తుగడ. ఇక ఐబీఎంను పెంచడం ద్వారా టెండర్ల సమయంలో నవయుగకు రూ.1454.42 కోట్ల లబ్ధి చేకూర్చడమే కాక పట్టిసీమ 'బోనస్' వ్యూహాన్ని ఇక్కడా అమలు చేయడానికి పూనుకున్నారు. జలవిద్యుదుత్పత్తి ప్రాజెక్టులో ప్రతి నెలా నిర్దేశించిన పని కంటే అధికంగా చేస్తామని.. అధికంగా చేసిన పని విలువలో 50 శాతం బోనస్ ఇవ్వాలని నవయుగ సంస్థతో ప్రతిపాదింపజేశారు. చేసిన పనులకు 30 రోజుల్లోగా కాకుండా 20 రోజుల్లోనే బిల్లులు ఇవ్వాలని పేర్కొంది. ఒకవేళ నిర్దేశించిన పని కన్నా తక్కువగా చేస్తే.. తక్కువ పడే పని విలువలో 50 శాతాన్ని జరిమానా విధించాలని సూచించారు. కానీ.. డిజైన్‌ల ఆమోదం, భూసేకరణ, జలాశయం పనుల్లో జాప్యం, బిల్లుల చెల్లింపులో ఆలస్యమైతే తమది తప్పు కాదని.. అది సర్కారుదే బాధ్యతని మెలిక పెట్టారు. దీనివల్ల సకాలంలో ప్రాజెక్టు పూర్తవుతుందని.. వడ్డీ భారం తగ్గుతుందని నవయుగ ప్రతిపాదించింది. ఉదాహరణకు ఒక నెలలో రూ.100 కోట్ల విలువైన పని చేయాలని సర్కార్ లక్ష్యంగా నిర్దేశిస్తే.. కాంట్రాక్టర్ రూ.120 కోట్ల విలువైన పని చేస్తే.. అదనంగా చేసిన రూ.20 కోట్ల పనికిగానూ కాంట్రాక్టర్‌కు రూ.పది కోట్లు బోనస్‌గా సర్కార్ ఇవ్వాల్సి ఉంటుంది. కాంట్రాక్టర్ ఒకవేళ ఆ మేరకు పనులు చేయకపోతే జరిమానా విధించే అవకాశమే ఉండదు. ఎందుకంటే.. డిజైన్‌ల ఆమోదంలోనో, బిల్లుల చెల్లింపులోనో, భూసేకరణలోనో జాప్యాన్ని చూపి కాంట్రాక్టర్ తప్పించుకునే వెసులుబాటు ఉంది. రాష్ట్రంలో ఇప్పటివరకూ ఏ కాంట్రాక్టర్‌పై జరిమానా విధించకపోవడమే దీనికి తార్కాణం. కాంట్రాక్టర్ ప్రతిపాదనపై ఆమోదముద్ర వేయాలని జెన్‌కో అధికారులపై ప్రభుత్వ పెద్దలు తీవ్రస్థాయిలో ఒత్తిడి తెస్తున్నారు. జెన్‌కో అధికారులు అంగీకరించని నేపథ్యంలో కేబినెట్ తీర్మానం ద్వారా టెండర్లపై ఆమోదముద్ర వేసి.. కమీషన్లు రాబట్టుకోవడానికి వేగంగా పావులు కదుపుతున్నారు.

ఆర్థిక శాఖ అభ్యంతరాలు..

జెన్‌కో ప్రతిపాదనలపై ఆర్థిక శాఖ తీవ్ర అభ్యంతరాలు వ్యక్తం చేసింది. బహిరంగ మార్కెట్లో తక్కువ వడ్డీకే రుణం లభ్యమవుతున్నప్పుడు.. ఆర్ఈసీ వద్ద 10.95 శాతం అధిక వడ్డీకి రుణం తీసుకోవడంపై అభ్యంతరం వ్యక్తం చేసింది. పోలవరం జలాశయం పనులు డిసెంబర్, 2019 నాటికి పూర్తయ్యే అవకాశాలు లేవని.. జలవిద్యుదుత్పత్తి ప్రాజెక్టును ఇప్పుడు చేపట్టడం వల్ల ఏం ప్రయోజనం ఉంటుందని.. అధిక వడ్డీ భారం పడుతుందని అభిప్రాయపడింది. టెండర్ల ప్రక్రియ ముగిశాక ఐబీఎం, అంచనాల పెంపుపై అభ్యంతరం తెలిపింది. రాష్ట్ర జలవనరుల శాఖ అధికారులతోనూ పోలవరం ప్రాజెక్టు అథారిటీ (పీపీఏ)తోనూ సంప్రదింపులు జరిపామని, డిసెంబర్, 2019 నాటికి పోలవరం జలాశయం పనులు పూర్తవుతాయని ఆర్థిక శాఖకు జెన్‌కో వివరించింది. జలవిద్యుదుత్పత్తి కేంద్రంలో మూడు యూనిట్లు ఏప్రిల్, 2021 నాటికి.. 12 యూనిట్లు అక్టోబర్, 2022 నాటికి ఉత్పత్తి చేసేలా పనులను పూర్తి చేస్తామని తెలిపింది. జెన్‌కో వివరణలపై అధ్యయనం చేసిన ఆర్థికశాఖ మరోసారి అసంతృప్తి వ్యక్తం చేసింది. పోలవరం జలాశయం పనులను పూర్తి చేయడం, నిర్వాసితులకు సహాయ పునరావాస ప్యాకేజీ అమలుపై సందేహాలు వ్యక్తం చేసింది. జలాశయం పనులు సకాలంలో పూర్తి కాకపోతే జలవిద్యుదుత్పత్తి ప్రాజెక్టు లాభదాయకతపై తీవ్ర ప్రభావం చూపుతుందని స్పష్టం చేసింది.

పోలవరం పనులు నవయుగకే!

- నామినేషన్‌పై స్పిల్ వే, స్పిల్ ఛానల్ పనులు
- రాష్ట్రప్రభుత్వ ప్రతిపాదనకు కేంద్రం అంగీకారం
- పాత ధరలకే ఆ పనులను పూర్తి చేయాలి
- ఇందుకోసం ప్రత్యేకంగా ఒప్పందం చేసుకోవాలి
- రాష్ట్ర ప్రభుత్వానికి కేంద్రమంత్రి గడ్కరీ సూచన
- ఆడిటింగ్ పూర్తయిన తర్వాతే మిగతా నిధులు..



పోలవరం ప్రాజెక్టు (ఫైల్)

సాక్షి, ఢిల్లీ/అమరావతి: పోలవరం జలాశయం(హెడ్ వర్క్స్) పనుల్లో 60సీ నిబంధన కింద పాత కాంట్రాక్టర్ నుంచి మినహాయించిన పనులను 'నవయుగ' కన్‌స్ట్రక్షన్స్‌కు సబ్ కాంట్రాక్టు కింద అప్పగించేందుకు కేంద్రప్రభుత్వం అంగీకరించింది. ఆ పనులను పాత ధరలకే పూర్తి చేయాలని కేంద్ర జలవనరుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ షరతు విధించారు. కానీ, ధరల విషయంలో కేంద్రాన్ని రాష్ట్ర ప్రభుత్వం మభ్య పెడుతోందని జలవనరుల శాఖ అధికారవర్గాలే ఆరోపిస్తోండటం గమనార్హం. మంగళవారం ఢిల్లీలో మంత్రి గడ్కరీ తన కార్యాలయంలో కేంద్ర, రాష్ట్ర జలవనరుల శాఖ అధికారులు, తన సలహాదారు, ట్రాన్స్‌ట్రాయ్, నవయుగ సంస్థల ప్రతినిధులతో సమావేశమయ్యారు.

రాష్ట్రప్రభుత్వ ప్రతిపాదనకు ఆమోదం..

నెల రోజుల గడువులో పాత కాంట్రాక్టర్ నిర్దేశించిన మేరకు పనులు చేయలేకపోయారని, ఆ పనులను పాత ధరలకే చేయడానికి ముందుకొచ్చిన నవయుగకు నామినేషన్ విధానంలో అప్పగించడానికి అనుమతి ఇవ్వాలన్న రాష్ట్ర ప్రభుత్వ ప్రతిపాదనను గడ్కరీ ఆమోదించారు. పనుల విలువ ఎంత ఉంటుందని ప్రశ్నించారు. వారం రోజుల్లోగా పనుల విలువ లెక్క కడతామని రాష్ట్ర జలవనరుల శాఖ అధికారులు గడ్కరీకి వివరించారు. పనుల విలువను పక్కాగా తేల్చి.. 2019 నాటికి పనులు పూర్తయ్యే ప్రత్యేకంగా ఒప్పందం చేసుకుని వాటిని నవయుగకు అప్పగించాలని గడ్కరీ ఆదేశించారు. ఎర్త్ కమ్ రాక్ ఫిల్ డ్యామ్(ప్రధాన జలాశయం), కాఫర్ డ్యామ్‌లు, అనుబంధ పనులతోపాటూ స్పిల్ వేలో మిగిలిన పనులను సకాలంలో పూర్తి చేసేలా ప్రణాళిక రూపొందించాలని ట్రాన్స్‌ట్రాయ్ సంస్థ ప్రతినిధులను ఆదేశించారు.

ఆడిటింగ్ ప్రక్రియ తర్వాతే మిగతా నిధులు..

పోలవరం ప్రాజెక్టును జాతీయ ప్రాజెక్టుగా ప్రకటించినప్పటి నుంచి ఇప్పటివరకూ కేంద్రం రూ.4,329.06 కోట్లను విడుదల చేసిందని అధికారులు వివరించారు. ఇప్పటివరకూ చేసిన పనులకే మరో రూ.3,200 కోట్లను విడుదల చేయాల్సి ఉందని చెప్పారు. రూ.1,100 కోట్లను విడుదల చేసేలా నాబార్డును ఆదేశిస్తామని గడ్కరీ చెప్పారు. ఆడిటింగ్ ప్రక్రియ పూర్తయిన తర్వాతే మిగతా నిధుల విడుదలపై నిర్ణయం తీసుకుంటామని తేల్చిచెప్పారు. పోలవరం ప్రాజెక్టు సవరించిన అంచనా వ్యయ ప్రతిపాదనలపై ఆమోదముద్ర వేయాలన్న రాష్ట్ర ప్రభుత్వ ప్రతిపాదనపై గడ్కరీ ఆచితూచి స్పందించినట్లు అధికారవర్గాలు తెలిపాయి. సవరించిన అంచనా వ్యయ ప్రతిపాదనలను కేంద్ర జలసంఘం, నీతి అయోగ్ పరిశీలిస్తున్నాయని చెప్పిన గడ్కరీ.. నీతి అయోగ్ ఆమోదం తెలిపితేనే వాటిని పరిశీలిస్తామని తేల్చిచెప్పినట్లు సమాచారం.

స్వీయ ప్రయోజనాలే మిన్న

- ఇదీ ముఖ్యమంత్రి చంద్రబాబు తీరు
- ప్రత్యేక హోదా, విభజన చట్టం హామీలపై కేంద్రాన్ని ప్రశ్నించిందే లేదు
- ఫిరాయింపు ఎమ్మెల్యేల సీట్ల కోసం పదేపదే 'పునర్విభజన' విజ్ఞప్తులు
- పోలవరంలో సొంతవారికి కాంట్రాక్టుల కోసమే కేంద్రంపై విమర్శలు
- అనుకున్నవి నెరవేరాక కేంద్రంతో రాజీ పడుతున్నారంటున్న విశ్లేషకులు

సాక్షి, అమరావతి: 'మిత్రధర్మం పాటిస్తున్నాం. బీజేపీకి ఇష్టం లేకపోతే నమస్కారం పెడతాం' అంటూ తీవ్ర వ్యాఖ్యలు చేసి రెండు రోజులు కూడా గడవక ముందే కేంద్రంతో సంప్రదింపులు జరిపి పోలవరం జలాశయంలో స్పిల్ వే పనులను తనకు నచ్చిన సంస్థ నవయుగకు నామినేషన్ పద్ధతిపై దక్కేలా చేసుకోవడం రాజకీయవర్గాల్లో చర్చనీయాంశమైంది.

పునర్విభజన కోసం అంతులేని తాపత్రయం..

పోలవరం జలాశయంలో స్పిల్ వే పనులను కొత్త కాంట్రాక్టర్‌కు అప్పగించాలన్న రాష్ట్ర ప్రభుత్వ ప్రతిపాదనను కేంద్రం తప్పుపట్టింది. ప్రధానిని స్వయంగా కలసి నియోజకవర్గాల పెంపుపై విజ్ఞప్తి చేసినా స్పష్టమైన హామీ లభించలేదు. దీంతో రెండు రోజుల క్రితం చంద్రబాబు కేంద్రంపై తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ఇష్టం లేకపోతే నమస్కారం పెడతామని స్పష్టం చేశారు. రాష్ట్ర ప్రయోజనాలకు విఘాతం కలిగినప్పుడు కేంద్రంలోని ఎన్డీయే ప్రభుత్వం నుంచి తన పార్టీ మంత్రులను రాజీనామా చేయిస్తామనిగానీ.. మద్దతు ఉపసంహరిస్తామనిగానీ ప్రకటించని చంద్రబాబు తన సొంత ప్రయోజనాలకు విఘాతం కలిగినప్పుడు మాత్రమే కేంద్రంపై తీవ్ర వ్యాఖ్యలు చేయడం, వాటిని నెరవేర్చుకున్నాక రాజీ పడటం రివాజుగా మారిందనే విమర్శలుగా బలంగా వ్యక్తమవుతున్నాయి. రాష్ట్రానికి హక్కుగా సంక్రమించిన ప్రత్యేక హోదా కోసం పోరాడాల్సిన సీఎం చంద్రబాబు.. దానిని వదిలేసి పోలవరం నిర్మాణ బాధ్యతలను రాష్ట్ర ప్రభుత్వానికి అప్పగించాలంటూ కేంద్రంపై ఒత్తిడి తెచ్చారు. చివరకు ప్రత్యేక హోదాను తాకట్టు పెట్టి మరీ పోలవరం నిర్మాణ బాధ్యతలను దక్కించుకోవడంపై అధికారవర్గాలు విస్తుపోతున్నాయి. ఇదంతా ఎందుకంటే సొంత పార్టీకి చెందిన ఎంపీ రాయపాటికి చెందిన ట్రాన్స్‌ట్రాయ్‌ని ముందు పెట్టి కమీషన్లు దండుకోవడం కోసమేనని జలవనరుల శాఖ వర్గాలే విమర్శిస్తున్నాయి. పోలవవరం బాధ్యతలు దక్కిన వెంటనే అంచనా వ్యయాన్ని రూ.1481 కోట్లు పెంచేసి.. కమీషన్లు దండుకున్నారని ఆ వర్గాలు పేర్కొంటున్నాయి.

దాదాపు 16 నెలల పాటు ఊరుకుని ఇటీవల ప్రధాని మోదీతో సమావేశమైనప్పుడు రాష్ట్ర ప్రయోజనాలతో ముడిపడిన విభజన చట్టం హామీల అమలుపై చర్చించకుండా నియోజకవర్గాల పునర్విభజన చేయాలని చంద్రబాబు కోరడాన్ని అధికారవర్గాలు ఎత్తిచూపుతున్నాయి. ఫిరాయింపు ఎమ్మెల్యేలకు సీట్ల సర్దుబాటు కోసమే ఆయన నియోజకవర్గాల పునర్విభజన కోసం పట్టుబడుతున్నారని సొంతపార్టీలో కూడా బలంగా వినిపిస్తోంది.

సాగర్ నీటి కోటాకు కోత!

- ఎడమ కాలువలో ఏపీకి 12 టీఎంసీలు కేటాయింపు
- ఇప్పటివరకూ ఏపీ సరిహద్దుకు చేరింది 5.49 టీఎంసీలే
- కోటా పూర్తయిందంటున్న తెలంగాణ సర్కార్
- కనీసం బోర్డుకు ఫిర్యాదు కూడా చేయలేని దుస్థితిలో ఏపీ ప్రభుత్వం



సాక్షి, అమరావతి: కృష్ణా బోర్డు ఉత్తర్వులను తెలంగాణ ప్రభుత్వం ధిక్కరిస్తున్నా ఏపీ ప్రభుత్వం నోరుమెదపడం లేదు. నాగార్జున సాగర్ ఎడమ కాలువకు కృష్ణా బోర్డు కేటాయించిన నీటిలో సగం కూడా విడుదల చేయకుండానే కోటా పూర్తయిందని తెలంగాణ ప్రభుత్వం తేల్చేసింది. ఆంధ్రప్రదేశ్ రైతుల ప్రయోజనాలను కాలరాస్తూ సాగర్ ఎడమ కాలువకు బుధవారం నుంచి నీటి సరఫరా నిలిపేస్తామని ప్రకటించింది. రాష్ట్ర ప్రభుత్వం దీన్ని కనీసం బోర్డు దృష్టికి తెచ్చే ప్రయత్నం కూడా చేయటం లేదు. నాగార్జున సాగర్ ఎడమ కాలువ కింద కృష్ణా, పశ్చిమ గోదావరి జిల్లాల్లో రబీలో 2.85 లక్షల ఎకరాల్లో రైతులు పంటలు సాగు చేశారు. పంటలు చేతికి అందాలంటే కనీసం మరో 45 రోజులపాటు నీటిని సరఫరా చేయాలి. కృష్ణా బోర్డు తొలుత ఎనిమిది ఆ తర్వాత నాలుగు కలిపి మొత్తం 12 టీఎంసీలను ఏపీ కోటా కింద సాగర్ ఎడమ కాలువకు కేటాయించింది. ఏపీ సరిహద్దుకు 12 టీఎంసీలను చేర్చాలని ఉత్తర్వుల్లో పేర్కొంది. నీటి సరఫరా నష్టాలపై కమిటీ నివేదిక ఇచ్చాక అందులో ఏపీ కోటా కింద వచ్చే నీటిని ఆ రాష్ట్రం కోటాలోనే వేస్తామని బోర్డు స్పష్టం చేసింది.

ఇంకా 6.51 టీఎంసీలు వస్తేనే కోటా పూర్తి

కృష్ణా బోర్డు ఉత్తర్వులను పరిగణనలోకి తీసుకుంటే రాష్ట్ర సరిహద్దుకు 12 టీఎంసీలు చేరితేనే సాగర్ ఎడమ కాలువలో ఏపీ కోటా పూర్తవుతుంది. అయితే నవంబర్ నుంచి ఇప్పటివరకూ రాష్ట్ర సరిహద్దుకు కేవలం 5.49 టీఎంసీలు మాత్రమే చేరాయి. మరో 6.51 టీఎంసీలు రాష్ట్ర సరిహద్దుకు చేరితేగానీ ఏపీ కోటా పూర్తి కాదు. కానీ 12 టీఎంసీలు చేరినట్లు లెక్కలు చెబుతున్న తెలంగాణ సర్కార్ బుధవారం నుంచి నీటి సరఫరాను నిలిపివేస్తామని ప్రకటించింది. బోర్డు ఉత్తర్వులను తెలంగాణ సర్కార్ తుంగలో తొక్కుతున్నా ఏపీ ప్రభుత్వం నోరుమెదపడం లేదు. కనీసం బోర్డు దృష్టికి తీసుకెళ్లే ప్రయత్నం చేయకపోవడంపై రైతులు మండిపడుతున్నారు. పంట చేతికందే దశలో నీటి సరఫరా నిలిపివేస్తే తీవ్రంగా నష్టపోతామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.




తిరుమల ఆలయం వద్ద రెడ్డిసుబ్రహ్మణ్యం, సభ్యులు

శ్రీవారి ఆదాయానికి గండికొట్టొద్దు

పిటిషన్స్ కమిటీ చైర్మన్ రెడ్డిసుబ్రహ్మణ్యం

సాక్షి, తిరుమల: శాసన మండలి, శాసన సభ కమిటీలకు ప్రొటోకాల్ నిబంధనల ప్రకారం ఉచితంగానే శ్రీవారి దర్శనానికి వెళ్లే అవకాశం ఉందని, అయితే శ్రీవారి ఆదాయానికి గండికొట్టకుండా టికెట్లు కొనుగోలు చేసి స్వామి దర్శనానికి వెళ్లటం ఆనందంగా ఉందని రాష్ట్ర శాసన మండలి పిటిషన్స్ కమిటీ చైర్మన్ రెడ్డి సుబ్రహ్మణ్యం అన్నారు. మంగళవారం కమిటీ సభ్యులతో కలసి తిరుమల శ్రీవారిని దర్శించుకున్న అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. ఇదే పద్ధతిని మిగిలిన శాసనసభ, శాసన మండలి కమిటీలు అనుసరించాలని ఆయన సూచించారు. శ్రీవారి దర్శనానికి వచ్చే భక్తులకోసం టీటీడీ మెరుగైన ఏర్పాట్లు చేస్తోందని అన్నారు.

హామీల సాధనకు కేంద్రంపై ఒత్తిడి తీసుకురండి

- ఢిల్లీలో పలువురు నేతలను కోరిన ఉత్తరాంధ్ర చర్చా వేదిక ప్రతినిధులు
- కలసి వచ్చే వారికి వైఎస్సార్ సీపీ పూర్తి మద్దతు: విజయసాయిరెడ్డి

సాక్షి, న్యూఢిల్లీ: రాష్ట్ర విభజన చట్టంలో ఇచ్చిన హామీలను సాధించుకునేందుకు కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని ఉత్తరాంధ్ర చర్చా వేదిక ప్రతినిధుల బృందం ఢిల్లీలో పలు పార్టీల నేతలను కోరింది. మాజీ మంత్రి కొణతాల రామకృష్ణ ఆధ్వర్యంలోని బృందం మంగళవారం ఢిల్లీలో కేంద్ర మంత్రి సుజనా చౌదరి, ఎంపీలు డి. రాజా, విజయసాయిరెడ్డిలను కలసి వినతి పత్రాలు ఇచ్చింది. ఎన్నికల ముందు బీజేపీ ఇచ్చిన హామీలను అధికారంలోకి వచ్చి నాలుగేళ్లు గడిచినా అమలు చేయలేదని, హామీల సాధనకు పార్లమెంట్ బయట, లోపల పోరాటాలు చేసి కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలని కొణతాల నేతలను కోరారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా, విశాఖ రైల్వే జోన్, ఉత్తరాంధ్ర జిల్లాలకు ప్రత్యేక ప్యాకేజీ, దుగరాజపట్నం పోర్టు లాంటి హామీలను సాధించుకునేందుకు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మొదటి నుంచీ పోరాటం చేస్తోందని, హామీల సాధనలో కలసి వచ్చే వారికి తమ పార్టీ పూర్తి మద్దతు ఇస్తుందని వైఎస్సార్ సీపీ రాజ్యసభ సభ్యుడు వి విజయసాయిరెడ్డి ఈ సందర్భంగా నేతలకు తెలిపారు.

ప్రొఫెసర్ బాబులుపై నిర్భయ కేసు

సస్పెన్షన్ వేటు వేసిన జేఎన్‌టీయూ–కే వీసీ

కాకినాడ/బాలాజీచెరువు: జేఎన్‌టీయూ–కే ఎంటెక్ విద్యార్థినులను లైంగికంగా వేధించారన్న ఆరోపణలు ఎదుర్కొంటున్న తూర్పు గోదావరి జిల్లా జేఎన్‌టీయూ–కే ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ (ఐఎస్‌టీ) డైరెక్టర్ ప్రొఫెసర్ బాబులుపై నిర్భయ కేసు నమోదైంది. మూడు రోజులుగా ఈ వ్యవహారంపై వివాదం చెలరేగి విద్యార్థులు రోడ్డెక్కి ఆందోళన చేయడం, మహిళా కమిషన్ జోక్యం చేసుకోవడం, విచారణ కమిటీ ఏర్పాటైన నేపథ్యంలో రిజిస్ట్రార్ సుబ్బారావు సర్పవరం పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ప్రొఫెసర్ బాబులపై సెక్షన్ 354, 354ఎ, 509ల కింద నిర్భయ కేసు నమోదు చేసినట్లు సీఐ చైతన్య కృష్ణ చెప్పారు. త్వరలోనే ప్రొఫెసర్‌ను అదుపులోకి తీసుకుంటామని, ప్రొఫెసర్‌పై ఫిర్యాదు చేసిన 40మంది విద్యార్థుల నుంచి రాతపూర్వకంగా స్టేట్‌మెంట్ తీసుకుంటున్నట్లు తెలిపారు. కాగా, ప్రొఫెసర్ బాబులుపై సస్పెన్షన్ వేటు వేసినట్లు జేఎన్‌టీయూ–కే వీసీ వీవీఎస్.కుమార్ మంగళవారం తెలిపారు.

'ఏసియాస్ గ్రేటెస్ట్ బ్రాండ్స్' విజేత శ్రీ చైతన్య

సాక్షి, హైదరాబాద్: విద్యా రంగంలో సేవలకు గాను ఏషియావన్ మేగజైన్ ప్రకటించిన 'ఏసియాస్ గ్రేటెస్ట్ బ్రాండ్స్–2017' అవార్డు శ్రీ చైతన్య విద్యా సంస్థలకు దక్కింది. విజేతను ప్రఖ్యాత సంస్థ ప్రైస్‌వాటర్‌హౌస్ కూపర్స్ ఎంపిక చేసింది. సింగపూర్‌లో జరిగిన కార్యక్రమంలో సంస్థ వ్యవస్థాపక చైర్మన్ బీఎస్ రావు తరపున అకడమిక్ డైరెక్టర్ సుష్మ అవార్డును స్వీకరించారు. ఇది తమ సంస్థ అత్యుత్తమ ప్రతిభకు దక్కిన గౌరవమని బీఎస్ రావు ఈ సందర్భంగా పేర్కొన్నారు. తమకు సహకరిస్తున్న విద్యార్థుల తల్లిదండ్రులు, అధ్యాపకులకు కృతజ్ఞతలన్నారు.


అవార్డుతో అకడమిక్ డైరెక్టర్ సుష్మ

ఇంజనీరింగ్‌లో కొత్త సిలబస్

- వచ్చే విద్యాసంవత్సరం నుంచి అమలు!
- తరగతి గదిలో పాఠాల కంటే క్షేత్రస్థాయి ప్రయోగాలకే ప్రాధాన్యం
- పారిశ్రామిక అవసరాలకు అనుగుణంగా నూతన కరిక్యులమ్
- సిలబస్ రూపకల్పనలో నిమగ్నమైన ప్రత్యేక కమిటీ

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో సాంకేతిక విద్యా కోర్సుల్లో ప్రస్తుతం ఉన్న కరిక్యులమ్‌లో మార్పులు చేసి కొత్త సిలబస్‌ను ప్రవేశపెట్టనున్నారు. ఈ మేరకు అఖిల భారత సాంకేతిక విద్యామండలి(ఏఐసీటీఈ) కరిక్యులమ్‌ను రూపొందించింది. రాష్ట్రాలకు కొన్ని మార్గదర్శకాలను విడుదల చేసింది. వాటి ప్రకారం సిలబస్‌ను రూపొందించే కార్యక్రమాన్ని ఉన్నత విద్యా మండలి చేపట్టింది. తిరుపతి ఐఐటీ డీన్ ప్రొఫెసర్ కృష్ణయ్య ఆధ్వర్యంలో ఒక కమిటీని నియమించింది. ఇందులో వివిధ వర్సిటీలు, ఇంజనీరింగ్ కళాశాలల సీనియర్ ప్రొఫెసర్లు, పారిశ్రామికవేత్తలు, ఇతరులు సభ్యులుగా ఉన్నారు. ఈ కమిటీ సిలబస్ రూపకల్పనపై కసరత్తు చేస్తోంది. కొత్త సిలబస్ వచ్చే విద్యాసంవత్సరం నుంచి అమల్లోకి రానున్నట్లు తెలుస్తోంది.

నైపుణ్యాలు, సామాజిక బాధ్యత

విద్యార్థులు తరగతి గదుల్లో పాఠాలు వినడానికే పరిమితం కావడం వల్ల నైపుణ్యాలు పెరగడం లేదని ఏఐసీటీఈ భావిస్తోంది. అందుకే కొత్త కరిక్యులమ్‌లో ప్రాక్టికల్స్‌కు పెద్దపీట వేసింది. ప్రాక్టికల్స్‌ను పరిశ్రమలతో అనుసంధానించాలని ప్రతిపాదించింది. విద్యార్థులు క్షేత్రస్థాయికి వెళ్లి పరిశ్రమలు లేదా సంబంధిత సంస్థల్లో దాదాపు 3 నెలలపాటు తప్పనిసరిగా ఇంటర్న్‌షిప్ చేయాల్సి ఉంటుంది. ఇందులో సమాజ అధ్యయనం కూడా ఒక భాగంగా చేర్చారు.

క్రెడిట్లు 160కి కుదింపు

పాఠ్యప్రణాళికలో మార్పుల్లో భాగంగా మరో కీలక నిర్ణయాన్ని ఏఐసీటీఈ తీసుకోవడంతో విద్యార్థులపై భారం చాలావరకు తగ్గనుంది. గతంలో డిగ్రీ అర్హత కోసం థియరీలో 220 క్రెడిట్లు సాధించాల్సి వచ్చేది. దీన్ని 160 క్రెడిట్లకు తగ్గించనున్నారు. 160 వరకు క్రెడిట్లు సాధించినవారిని డిగ్రీకి అర్హులుగా పరిగణిస్తారు. ఆపై అదనంగా మరో 20 క్రెడిట్లు సాధిస్తే హానర్స్‌తో కూడిన డిగ్రీకి అర్హులుగా పరిగణిస్తారు.

రాజ్యాంగం, పర్యావరణ పరిరక్షణ అధ్యయనం

డ్యూయెల్ డిగ్రీ కోర్సుల్లో భాగంగా ఒకేసారి రెండు డిగ్రీలను అభ్యసించే విధానం ఇప్పటికే అమలవుతోంది. ఇంజనీరింగ్‌లో కూడా ఈ రెండో కోర్సు కోసం 60 సబ్జెక్టులను ఏఐసీటీఈ గతంలోనే నిర్ణయించింది. ఇప్పుడు కొత్తగా ఇంజనీరింగ్ విద్యార్థులు వేదాలు, పురాణాలు వంటివి కూడా అధ్యయనం చేయొచ్చు. రాజ్యాంగం, పర్యావరణ పరిరక్షణ వంటి అంశాలను తప్పనిసరి చేస్తున్నారు. అయితే వీటికి క్రెడిట్లు ఇవ్వరు. ఏఐసీటీఈ మార్గదర్శకాలకు అనుగుణంగా కమిటీ సిలబస్‌ను రూపొందిస్తోందని ఉన్నత విద్యామండలి వైస్ చైర్మన్ ప్రొఫెసర్ పి.నరసింహారావు తెలిపారు.

యూజీలో క్రెడిట్ల విధానం

అంశం	క్రెడిట్లు
1 హ్యుమానిటీస్, సోషల్ సైన్సెస్(మేనేజ్‌మెంట్ కోర్సులతో సహా)	12
2 బేసిక్ సైన్స్ కోర్సులు	25
3 ఇంజనీరింగ్ సైన్స్ కోర్సుల్లో (వర్కుషాప్, డ్రాయింగ్, ఎలక్ట్రికల్, మెకానికల్, కంప్యూటర్ తదితర అంశాలకు)	24
4 ప్రొఫెషనల్ కోర్ కోర్సులు	48
5 ప్రొఫెషనల్ ఎలక్టివ్ కోర్సులు (స్పెషలైజేషన్ బ్రాంచ్‌లు)	18
6 ఓపెన్ సబ్జెక్టులు, ఎంపిక చేసుకున్న టెక్నికల్ అంశాలకు	18
7 ప్రాజెక్టు వర్కు, సెమినార్, ఇంటర్న్‌షిప్	15
మొత్తం	160

క్షేత్రస్థాయిలో ప్రాక్టికల్స్

ఇంజనీరింగ్ కొత్త సిలబస్‌పై కసరత్తు జరుగుతోంది. క్రెడిట్లను 160కి కుదించడం వల్ల విద్యార్థులపై ఒత్తిడి తగ్గుతుంది. తరగతి గదుల్లో కాకుండా క్షేత్రస్థాయిలో ప్రయోగాలు చేసేలా ప్రాక్టికల్స్ ఉంటాయి. చదువు పూరి కాగానే ఉద్యోగాలు వచ్చేలా సిలబస్‌లో మార్పులు చేయాల్సి ఉంది.
– వీవీఎస్ కుమార్, ఉపకులపతి, జేఎన్‌టీయూ–కాకినాడ

అధ్యాపకులకు శిక్షణ ఇవ్వాలి

ఆలోచనతో కూడిన ప్రాక్టికల్ విద్య అవసరం. థియరీ మాత్రమే కాకుండా టెక్నికల్ స్కిల్స్ అభివృద్ధి చెందాలి. కొత్త పారిశ్రామిక అవసరాలను దృష్టిలో పెట్టుకొని సిలబస్ రూపొందించాలి.
– భాస్కర్‌చౌదరి, ఇంజనీరింగ్ కాలేజీల యాజమాన్యాల సంఘం ప్రధాన కార్యదర్శి

విద్యార్థులకు ఎంతో మేలు

ఉద్యోగాలకు అవసరమైన రీతిలో ఇంజనీరింగ్ సిలబస్‌లో మార్పు చేస్తే విద్యార్థులకు ఎంతో మేలు జరుగుతుంది. కొత్త సిలబస్‌కు తగ్గట్టుగా కాలేజీల్లో ప్రొఫెసర్లు, అధ్యాపకులను నియమించాలి.
– బి.లలితాశ్రీ,, బీటెక్ నాలుగో సంవత్సరం, గాయత్రి విద్యా పరిషత్, విశాఖపట్నం

పక్కాగా ప్రాక్టికల్స్

- ఇంటర్ బోర్డు కమిషనర్ ఉదయలక్ష్మి
- రేపట్నుంచి ప్రారంభం.. అధ్యాపకులకూ జంబ్లింగ్ విధానం
- తప్పులు జరిగితే బాధ్యులపై కఠిన చర్యలు
- అన్ని కేంద్రాలకు అరగంట ముందుగా ఆన్‌లైన్‌లో ప్రశ్నపత్రం



మాట్లాడుతున్న ఇంటర్మీడియెట్ బోర్డు కమిషనర్ ఉదయలక్ష్మి

గుంటూరు ఎడ్యుకేషన్: ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షా కేంద్రాలలో ఎక్కడైనా తప్పులు జరిగితే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని ఇంటర్ బోర్డు కమిషనర్ బి. ఉదయలక్ష్మి హెచ్చరించారు. మాల్ ప్రాక్టీసులను ప్రోత్సహిస్తే తీవ్రమైన చర్యలు ఉంటాయన్నారు. ఫిబ్రవరి 1వతేదీ నుంచి ప్రారంభం కానున్న ఇంటర్మీడియెట్ ప్రాక్టికల్స్‌పై మంగళవారం గుంటూరులోని ఏసీ కళాశాలలో చీఫ్ సూపరింటెండెంట్లు, శాఖాధికారులు, ఎగ్జామినర్లతో ఆమె సమీక్ష నిర్వహించారు. మాల్ ప్రాక్టీస్ నిరోధించేందుకు పటిష్ట చర్యలు చేపట్టామన్నారు. ఇలాంటివి ఎక్కడైనా జరిగితే విధుల్లో ఉన్న ఎగ్జామినర్లను బాధ్యులను చేస్తామని స్పష్టం చేశారు. రెగ్యులర్ అధ్యాపకులైతే సస్పెన్షన్ వేటు, కాంట్రాక్టు అధ్యాపకులైతే పూర్తిగా విధుల నుంచి తొలగిస్తామని తెలిపారు. ప్రాక్టికల్స్‌లో అక్రమాలను అరికట్టేందుకే జంబ్లింగ్ విధానాన్ని అమల్లోకి తెచ్చామన్నారు. అధ్యాపకులను సైతం జంబ్లింగ్ ద్వారా వేర్వేరు సెంటర్లకు పంపే విధానాన్ని ప్రవేశపెట్టామని చెప్పారు.

మాన్యువల్ ప్రశ్నపత్రాలకు స్వస్తి

రాష్ట్రవ్యాప్తంగా ప్రాక్టికల్స్ జరిగే కేంద్రాలలో సీసీ కెమెరాలతో పటిష్ట నిఘా ఏర్పాట్లు చేసినట్లు ఇంటర్ బోర్డు కమిషనర్ ఉదయలక్ష్మి తెలిపారు. ప్రభుత్వ కళాశాలల పరిధిలో ఒక్కో కాలేజీకి రూ. 25 వేలు చొప్పున నిధులు విడుదల చేశామన్నారు. ప్రైవేట్, ఎయిడెడ్ కళాశాలల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాల్సిన బాధ్యత సంబంధిత యాజమాన్యాలపై ఉందని స్పష్టం చేశారు. ప్రైవేట్, కార్పొరేట్ కళాశాలల్లో సెంటర్ కోడ్, పేరు, చిరునామా స్పష్టంగా తెలిపేలా బోర్డులు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. మాన్యువల్ విధానంలో ప్రశ్నపత్రాలను పంపే విధానానికి స్వస్తి పలుకుతున్నట్లు చెప్పారు. అన్ని కేంద్రాలకు అరగంట ముందుగా ఆన్‌లైన్‌లో ప్రశ్నపత్రాన్ని చేరవేసి చీఫ్ సూపరింటెండెంట్‌కు ఓటీపీ పంపుతామన్నారు. పరీక్షా కేంద్రాల చిరునామా సులువుగా గుర్తించేందుకు వీలుగా జియో ట్యాగింగ్ చేశామని చెప్పారు. సమావేశంలో కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ రమేష్, ఆర్జేడీ వై.పరంధామయ్య, ఆర్‌ఐవో జెడ్ఎస్ రామచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

'వైశ్య రత్న' రామమూర్తి కన్నుమూత



పెనుగొండ: అఖిల భారత వాసవీ పెనుగొండ ట్రస్ట్ గౌరవ అధ్యక్షుడు ఎస్.శ్రీరామమూర్తి(87) మంగళవారం బెంగళూరులో మృతి చెందారు. శ్రీరామమూర్తికి ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. రూ.666తో చిన్నవయసులోనే ప్లైవుడ్ వ్యాపారం ప్రారంభించిన శ్రీరామమూర్తి.. అంచలంచెలుగా ఎదిగారు. ఆయన ఏర్పాటు చేసిన 'మూర్తి గ్లాస్ అండ్ ప్లైవుడ్' సంస్థ ప్రముఖ వ్యాపార సంస్థల్లో ఒకటిగా నిలిచింది. పలు ఆలయ నిర్మాణాలకు సహకారం అందించిన శ్రీరామమూర్తి.. ఆ తర్వాత సుబ్రం ట్రస్ట్ ఏర్పాటు చేశారు. ఆర్యవైశ్యుల ఇలవేల్పు వాసవీ కన్యకాపరమేశ్వరి జన్మస్థలమైన పెనుగొండను ప్రపంచంలోనే ప్రముఖ దివ్యక్షేత్రంగా తీర్చిదిద్దాలని భావించారు. ఇందులో భాగంగా అఖిల భారత వాసవీ పెనుగొండ ట్రస్ట్ ఏర్పాటు చేసి వాసవీ థాంలో అన్నదాన భవనం, అష్టభుజి పుష్కరిణి, వాసవీ మందిర్, సువర్ణ అద్దాల మండపం నిర్మించారు. చిత్తూరులో వాసవీ మందిరం, తిరుమలలో ఒక రూం, షిర్డీలో ధ్యాన మందిరం, బెంగళూరులో వాసవీ మందిరం, హిందూ సేవా పరిస్తాన్ క్యూర్ ఆస్పత్రికి రెండు ఎకరాల దానం చేసి సేవా తత్పరతను చాటుకొన్నారు.

టీడీపీ భూకబ్జాలపై సీబీఐ దర్యాప్తు జరపాలి

- ఏపీని కబ్జాలమయంగా మార్చేశారు
- చంద్రబాబు, లోకేష్ కనుసన్నల్లోనే భూదందాలు
- వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ



సాక్షి, హైదరాబాద్: ఆంధ్రప్రదేశ్‌లో నాలుగేళ్లుగా సాగుతున్న భూకబ్జాలపై సీబీఐ విచారణ జరిపించాలని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ డిమాండ్ చేసింది. విజయవాడలో టీడీపీ ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు, మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు భూకబ్జాలకు పాల్పడుతుంటే చర్యలు తీసుకోవాల్సిన ప్రభుత్వం సిట్‌ల పేరుతో కాలయాపన చేస్తోందని పార్టీ అధికార ప్రతినిధి వాసిరెడ్డి పద్మ ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం హైదరాబాద్‌లోని పార్టీ కేంద్ర కార్యాలయంలో ఆమె విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్ర రాజధాని నగరం విజయవాడ ప్రాంతం భూకబ్జాలకు అడ్డాగా మారిందని ధ్వజమెత్తారు. ఎస్‌ఆర్‌ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల భూముల కబ్జాపై ఆ కళాశాల పూర్వ విద్యార్థులు మంగళవారం వీధుల్లోకి రావడం రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనమన్నారు. ఇప్పటికే రైతుల, సామాన్యుల భూములను చంద్రబాబు ప్రభుత్వం దౌర్జన్యంగా లాక్కుంటూ ఉంటే ఆయన అనుచరులు అదే బాటలో బరితెగిస్తున్నారన్నారు. గేదె చేనులో మేస్తే దూడ గట్టున మేస్తుందా అన్నట్లు చంద్రబాబు, ఆ పార్టీ నేతల పరిస్థితి తయారైందని ఆమె దుయ్యబట్టారు. స్వాతంత్ర్య సమరయోధుడి భూమిని తన భార్య సుజాత, అనుచరుల పేరుతో తప్పుడు పత్రాలను సృష్టించి ఆక్రమించుకున్న ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావుపై ఎందుకు చర్య తీసుకోలేదని పద్మ ప్రశ్నించారు. ఎమ్మెల్యే బొండాను చూస్తే జనం భయపడరని కానీ ఆయన కబ్జాల వెనుక ముఖ్యమంత్రి ఉన్నారని జనం భయపడుతున్నారన్నారు. ఏపీ రాజధానిలో ఎక్కడ భూమి కనిపించినా టీడీపీ నేతలు గద్దల్లా వాలిపోయి భూకబ్జాలు చేస్తున్నారన్నారు. బొండా భూకబ్జాల వెనుక చంద్రబాబు హస్తం, భాగస్వామ్యం ఉందని అందుకే ఎమ్మెల్యే ఎంత చెలరేగి పోతున్నారన్నారు. చంద్రబాబు తాను స్వయంగా కృష్ణా నది ఒడ్డున కబ్జా చేసి నిర్మించిన ఇంట్లో ఉంటున్నారని ఆమె విమర్శించారు. ఉమ్మడి రాష్ట్రంలో తాను సీఎం ఉన్నప్పుడు సైబరాబాద్‌లో సుజనా చౌదరి, మురళీమోహన్, సీఎం రమేష్‌లకు ఏ విధంగా అయితే భూములు అప్పగించారో అదే తరహాలో రాజధాని ప్రాంతంలో కూడా వందల ఎకరాలు టీడీపీ నేతలకు అప్పగిస్తున్నారన్నారు. విశాఖపట్టణంలో లక్ష ఎకరాల భూకబ్జాకు మంత్రి గంటా శ్రీనివాసరావు, ఆయన అనుచరులు పాల్పడ్డారని మరో మంత్రి ఆరోపించినా చర్యలు తీసుకోలేదన్నారు.

ఉత్తరాంధ్ర ఎంపీలు రైల్వే జోన్ అడగలేదు

సౌత్ సెంట్రల్ రైల్వే జోనల్ బోర్డు సభ్యుడు జాన్‌బాబు


రైల్వే బోర్డు మెంబర్ జాన్‌బాబు

సాక్షి, విశాఖపట్నం: విశాఖకు రైల్వే జోన్ కావాలని ఉత్తరాంధ్ర ఎంపీల్లో ఒక్కరు కూడా ఢిల్లీలో ఏనాడు మాట్లాడలేదని సౌత్ సెంట్రల్ రైల్వే జోనల్ బోర్డు సభ్యుడు జాన్‌బాబు (తెలంగాణ) అన్నారు. రైల్వే జోన్ ఏర్పాటు ఆర్థిక భారమైనప్పటికీ ప్రజలు బలంగా కోరుకుంటుంటే ఏర్పాటు చేసేందుకు కేంద్రం కాదనదని చెప్పారు. విశాఖపట్నంకు మంగళవారం వచ్చిన జాన్‌బాబు మీడియాతో మాట్లాడుతూ.. నిధుల కొరత వల్లే రైల్వే జోన్ ఏర్పాటు చేయడం లేదన్న వాదనలో వాస్తవం లేదని స్పష్టం చేశారు. ఏపీకి చెందిన ప్రజాప్రతినిధులు అడగక పోవడం వల్లే కేంద్రం సీరియస్‌గా తీసుకోవడం లేదన్నారు. రానున్న బడ్జెట్‌లో కేటాయింపుల కోసం ఇటీవలే ఏపీ, తెలంగాణ ఎంపీలతో వేర్వేరుగా రైల్వే బోర్డు సమావేశమైందని, ఈ సమావేశంలో ఉత్తరాంధ్రకు చెందిన ఒక్క ఎంపీ కూడా రైల్వే జోన్ కావాలని అడగలేదన్నారు. కొంతమంది అయితే రైల్వే గెస్ట్‌హౌస్‌లు కావాలని కోరారన్నారు. విశాఖ లోకసభ సభ్యుడు కె.హరిబాబు ఏనాడు రైల్వే జోన్ కావాలని కోరలేదని ఆయన గుర్తు చేశారు. త్వరలోనే ప్రధాని నరేంద్ర మోదీని కలిసి విశాఖ రైల్వే జోన్ విషయాన్ని ఆయన దృష్టికి తీసుకెళ్తామన్నారు. ఇప్పటికైనా ఏపీ ఎంపీలు ప్రధానిని కలసి అభ్యర్థిస్తే సవరణ బడ్జెట్‌లోనైనా రూ. 500 కోట్లు కేటాయింపులు జరుగుతాయని తెలిపారు.

'స్టీల్ ప్లాంట్' నోటిఫికేషన్‌పై హైకోర్టు స్టే

- నేటినుంచి జరగాల్సిన పరీక్షలు వాయిదా
- ఆన్‌లైన్ పరీక్ష నిర్ణయాన్ని తప్పుపట్టిన న్యాయమూర్తి



సాక్షి, హైదరాబాద్/ఉక్కునగరం (గాజువాక): రాష్ట్రీయ ఇస్పాత్ నిగం లిమిటెడ్ (విశాఖపట్నం స్టీల్ ప్లాంట్)లో జూనియర్ ట్రైనీ, ఫీల్డ్ అసిస్టెంట్ ట్రైనీల పోస్టుల భర్తీ నిమిత్తం జారీ చేసిన నోటిఫికేషన్‌పై హైకోర్టు మంగళవారం స్టే విధించింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ ఎం ఎస్ రామచంద్రరావు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేశారు. నోటిఫికేషన్‌లో రాతపరీక్ష నిర్వహిస్తామని చెప్పి, అందుకు విరుద్ధంగా ఆన్‌లైన్ పరీక్ష నిర్వహించాలన్న స్టీల్ ప్లాంట్ అధికారుల నిర్ణయాన్ని న్యాయమూర్తి తప్పుపట్టారు. ఈ ఉత్తర్వుల నేపథ్యంలో బుధవారం (31) నుంచి ఫిబ్రవరి 4 వరకు జరగాల్సిన పరీక్ష వాయిదా పడినట్లయింది. 645 జూనియర్ ట్రైనీలు, 91 ఫీల్డ్ అసిస్టెంట్ ట్రైనీల పోస్టుల భర్తీ కోసం విశాఖ స్టీల్ ప్లాంట్ అధికారులు గత ఏడాది నోటిఫికేషన్ జారీ చేశారు. చివరి నిమిషంలో రాతపరీక్ష ద్వారా కాకుండా ఆన్‌లైన్ విధానంలో పరీక్ష నిర్వహిస్తామని చెప్పారు. దీనిపై అభ్యంతరం వ్యక్తం చేస్తూ పి.భాస్కరరావు, ఎస్.పెంటారావులు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ వ్యాజ్యంపై మంగళవారం జస్టిస్ ఎం.ఎస్. రామచంద్రరావు విచారణ జరిపారు. పిటిషనర్ల తరపు న్యాయవాది టి.రజనీకాంత్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ, విశాఖ స్టీల్ ప్లాంట్ భూ సేకరణలో భూములు కోల్పోయిన వారి కోటాలో ఉద్యోగాలు పొందేందుకు పిటిషనర్లు అర్హులని తెలిపారు. జనవరి 31 నుంచి ఫిబ్రవరి 4 వరకు ఆన్‌లైన్ ద్వారా పరీక్ష నిర్వహిస్తామంటూ ఈ నెల 2న స్టీల్ ప్లాంట్ అధికారులు నోటీసు ద్వారా తెలియచేశారన్నారు. పిటిషనర్లకు ఆన్‌లైన్ పరీక్ష గురించి ఎటువంటి అవగాహన లేదన్నారు. నోటిఫికేషన్‌కు విరుద్ధంగా పరీక్షా విధానాన్ని మార్చడం సరికాదన్నారు. ఈ వాదనలతో ఏకీభవించిన న్యాయమూర్తి పోస్టుల భర్తీ నిమిత్తం జారీ చేసిన నోటిఫికేషన్‌పై స్టే విధిస్తూ మధ్యంతర ఉత్తర్వులు జారీ చేశారు. ఉదయం ఇచ్చిన ఈ ఉత్తర్వులను సవాలు చేస్తూ స్టీల్ ప్లాంట్ అధికారులు మధ్యాహ్నం ధర్మాసనం ముందు అప్పీల్ దాఖలు చేశారు. ఈ అప్పీల్‌పై విచారణ జరిపిన జస్టిస్ సురేశ్ కెయిత్ నేతృత్వంలోని ధర్మాసనం స్టే ఎత్తివేతకు నిరాకరించింది. ఆన్‌లైన్ పరీక్షపై అత్యధికులకు అవగాహన ఉండదని ధర్మాసనం కూడా వ్యాఖ్యానించింది. కాగా కోర్టు ఉత్తర్వుల నేపథ్యంలో ఉద్యోగాల భర్తీకోసం నిర్వహించాల్సిన పరీక్షను వాయిదా వేస్తున్నట్లు స్టీల్ ప్లాంట్ యాజమాన్యం తెలిపింది.

అధికార పార్టీ నేతలే కోడి పందేలు ఆడారు

హైకోర్టులో న్యాయవాది భానుప్రకాశ్ పిటిషన్

సాక్షి, హైదరాబాద్: ఇటీవల సంక్రాంతి సందర్భంగా కోడి పందేలు నిర్వహించిన తెలుగుదేశం పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, మాజీ ఎమ్మెల్యేలపై ఫిర్యాదు చేసినా పోలీసులు పట్టించుకోలేదని ఓ న్యాయవాది హైకోర్టులో పిటిషన్ వేశారు. కోర్టు ఆదేశాలకు విరుద్ధంగా కోడి పందేలు నిర్వహించిన అధికార పార్టీ ప్రజా ప్రతినిధులపై కేసులు నమోదు చేసేలా పోలీసులను ఆదేశించాలని కోరుతూ గుంటూరు జిల్లా తాడివాకవారిపాలెంకి చెందిన న్యాయవాది తాడివాక భానుప్రకాశ్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. పిటిషన్‌లో రేపల్లి ఎమ్మెల్యే అనగాని సత్యప్రసాద్, ఎమ్మెల్సీ అన్నం సతీష్ ప్రభాకర్, మాజీ ఎమ్మెల్యేలు దేవినేని మల్లికార్జునరావు, ముమ్మనేని వెంకట సుబ్బయ్యలను ప్రతివాదులుగా చేర్చారు. ఈ వ్యాజ్యంపై మంగళవారం న్యాయమూర్తి జస్టిస్ ఆకుల వెంకటశేషసాయి విచారణ జరిపారు. ఇప్పటికే కోడి పందేలపై దాఖలైన ప్రజా ప్రయోజన వ్యాజ్యం (పిల్)పై తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి (ఏసీజే) నేతృత్వంలోని ధర్మాసనం విచారణ జరుపుతున్న నేపథ్యంలో ఈ వ్యాజ్యాన్ని కూడా ఆ పిల్‌కు జత చేయాలని రిజిస్ట్రీని ఆదేశించారు.

సాగు భూముల్లో చేపల చెరువులపై వివరణ ఇవ్వండి

మత్స్య, అటవీ, నీటిపారుదల శాఖలకు హైకోర్టు నోటీసులు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో ఉభయ గోదావరి జిల్లాలతో పాటు కృష్ణా, గుంటూరు, నెల్లూరు జిల్లాల్లో వ్యవసాయ భూములను నిబంధనలకు విరుద్ధంగా పెద్ద ఎత్తున చేపలు, రొయ్యల చెరువులుగా మార్చేస్తున్నారని, దీంతో అత్యంత సారవంతమైన భూములు ఉప్పునేలలుగా మారిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేస్తూ మద్రాసు హైకోర్టు విశ్రాంత తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఈ ధర్మారావు రాసిన లేఖపై హైకోర్టు స్పందించింది. ఈ లేఖను విచారణకు స్వీకరించిన న్యాయస్థానం దీనిపై వివరణ ఇవ్వాలంటూ మత్స్య, అటవీ, నీటిపారుదలశాఖల ముఖ్య కార్యదర్శులతో పాటు మత్స్యశాఖ కమిషనర్, తూర్పు, పశ్చిమ గోదావరి, కృష్ణా, గుంటూరు, నెల్లూరు జిల్లాల కలెక్టర్లకు నోటీసులు జారీ చేసింది.

గుంటూరు మునిసిపల్ కమిషనర్‌కు ధిక్కార నోటీసు

జారీ చేసిన హైకోర్టు

సాక్షి, హైదరాబాద్: కోర్టు ముందు వాస్తవాలను దాచిపెట్టినందుకు గుంటూరు మునిసిపల్ కమిషనర్ సి.అనురాధకు హైకోర్టు మంగళవారం కోర్టు ధిక్కార నోటీసులు జారీ చేసింది. కోర్టు ధిక్కారం కింద ఎందుకు చర్యలు తీసుకోరాదో వివరించాలని ఆమెను ఆదేశించింది. తదుపరి విచారణను నాలుగు వారాలకు వాయిదా వేసింది. ఈ మేరకు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి (ఏసీజే) జస్టిస్ రమేశ్ రంగనాథన్, న్యాయమూర్తి జస్టిస్ ఎం.ఎస్.కె.జైస్వాల్‌లతో కూడిన ధర్మాసనం ఉత్తర్వులు జారీ చేసింది. గుంటూరులో నిబంధనలకు విరుద్ధంగా కబేళా నిర్వహించడం, గాడిదలను బహిరంగంగా వధిస్తూ, వాటి మాంసాన్ని విక్రయిస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదంటూ కాకినాడకు చెందిన జంతు సంరక్షణ సంఘం కార్యదర్శి ఎస్.గోపాల్‌రావు, మరో ముగ్గురు హైకోర్టులో వ్యాజ్యం వేశారు. దీనిపై ధర్మాసనం విచారణ జరిపింది.

చెన్నంపల్లి కోటలో తవ్వకాలపై పూర్తి వివరాలివ్వండి

ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశం.. విచారణ వచ్చే వారానికి వాయిదా

సాక్షి, హైదరాబాద్: కర్నూలు జిల్లా తుగ్గలి మండల పరిధిలోని చెన్నంపల్లి కోటలో గుప్త నిధుల కోసం ప్రభుత్వ ఆధ్వర్యంలో జరుగుతున్న తవ్వకాలకు సంబంధించిన పూర్తి వివరాలను తమ ముందుంచాలని హైకోర్టు మంగళవారం ప్రభుత్వాన్ని ఆదేశించింది. తదుపరి విచారణను వచ్చే వారానికి వాయిదా వేసింది. ఈ మేరకు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రమేశ్ రంగనాథన్, జస్టిస్ ఎం.ఎస్.కె. జైస్వాల్‌తో కూడిన ధర్మాసనం ఉత్తర్వులు జారీ చేసింది. చెన్నంపల్లి కోటలో గుప్త నిధుల కోసం ప్రభుత్వ ఆధ్వర్యంలో జరుగుతున్న తవ్వకాలపై సాక్షి దినపత్రికలో ప్రచురితమైన కథనాలను కర్నూలు జిల్లా, దూపాడుకు చెందిన డాక్టర్ బ్రహ్మారెడ్డి హైకోర్టు దృష్టికి తీసుకొచ్చారు. తవ్వకాల పేరుతో చారిత్రక కట్టడాలను ధ్వంసం చేస్తున్నారని, దీనిని అడ్డుకోవాలని ఆయన హైకోర్టుకు లేఖ రాశారు. తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి సూచన మేరకు ఈ లేఖను పిల్‌గా మలచారు. ఈ వ్యాజ్యంపై మంగళవారం ఏసీజే నేతృత్వంలోని ధర్మాసనం విచారణ జరిపి, పూర్తి వివరాలను తమ ముందుంచాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది.

సాక్షి

బుధవారం, జనవరి, 31

మళ్లీ జమిలి ఎన్నికల చర్చ

కేంద్రంలో ఎన్‌డీఏ ప్రభుత్వం ఏర్పడ్డాక మొదలైన 'జమిలి ఎన్నికల' చర్చ మళ్లీ తెరపైకొచ్చింది. ఈసారి రాష్ట్రపతి రాంనాథ్ కోవింద్ పార్లమెంటు ఉభయ సభలనుద్దేశించి ప్రసంగిస్తూ ఈ ప్రస్తావన చేశారు. ప్రధాని నరేంద్రమోదీ ఎన్‌డీఏ భాగస్వామ్యపక్షాల సమావేశంలో కూడా దీనిపై మాట్లాడారు. నిజానికి ఈ ప్రతిపాదనను చాన్నాళ్లక్రితమే బీజేపీ తీసుకొచ్చింది. ఏకకాలంలో ఎన్నికలు అవసరమంటూ 2012లో బీజేపీ సీనియర్ నేత ఎల్.కె. అద్వానీ అప్పటి రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీకి లేఖ రాశారు. ప్రధాని నరేంద్రమోదీ రెండేళ్లక్రితం ఈ అంశాన్ని మరోసారి ఎజెండాలోకి తెచ్చారు. ఒకే దేశం–ఒకేసారి ఎన్నికలు అనే ప్రతిపాదనను సమర్థించే పార్టీలు, నాయకులూ ఉన్నట్టే వ్యతిరేకించేవారు కూడా ఉన్నారు. దీనికి అనుకూలంగా మాట్లాడేవారి వాదనల్లోని అంశాలే రాష్ట్రపతి ప్రసంగంలో కూడా ఉన్నాయి. తరచు ఎన్నికల వల్ల ఖజానాపై భారం పడటం, మానవ వనరులను వాటిపై కేంద్రీకరించాల్సి రావడం, ప్రతి ఎన్నికలకూ అమల్లోకొచ్చే నియమావళి కారణంగా అభివృద్ధి కార్యక్రమాలకు ఆటంకం ఏర్పడటం ఇందులో ముఖ్యమైనవి. దేశంలో 36 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలుండగా... ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, అరుణాచల్‌ప్రదేశ్, ఒడిశా, సిక్కింలలో జమిలి ఎన్నికలు జరుగుతున్నాయి. మిగిలిన రాష్ట్రాల అసెంబ్లీల కాలవ్యవధి వేర్వేరు రకాలుగా ఉంటున్నది. 2016లో తమిళనాడు, పశ్చిమబెంగాల్, కేరళ, పుదుచ్చేరి, అస్సాం ఎన్నికలు జరిగాయి. నిరుడు పంజాబ్, గోవా, ఉత్తరాఖండ్, ఉత్తరప్రదేశ్, మణిపూర్, హిమాచల్‌ప్రదేశ్, గుజరాత్ అసెంబ్లీలకు ఎన్నికలు జరిగాయి. వచ్చే నెలలో త్రిపుర, మేఘాలయ, నాగాలాండ్ ఎన్నికలు జరగాల్సి ఉంది. వాటి తర్వాత కర్ణాటక, మిజోరం ఎన్నికలుంటాయి. ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్, రాజస్థాన్ అసెంబ్లీలకు ఎన్నికలొస్తాయి. ఆ వెంటే లోక్‌సభ ఎన్నికలుంటాయి. ఇలా ఎన్నికలు జరిగినప్పుడల్లా లక్షలాదిమంది కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సిబ్బంది అవసరం ఉంటుంది. శాంతిభద్రతల పరిరక్షణకు పోలీసులనూ, పారా మిలిటరీ దళాలనూ తరలించాల్సి వస్తుంది. ఈ ఏర్పాట్లన్నిటికీ భారీ మొత్తం వ్యయమవుతుంది.

ఒకేసారి ఎన్నికల వల్ల మన ఫెడరల్ స్ఫూర్తి దెబ్బతింటుందని, జాతీయ అంశాలు ప్రాంతీయ ఆకాంక్షలను మింగేస్తాయని జమిలి ఎన్నికల వ్యతిరేకులు చెబుతారు. ఈ వాదనలో వాస్తవం ఉంది. అలాగే ఒకేసారి ఎన్నికలవల్ల ఓటర్లు ఒకే పార్టీకి ఓటేసే అవకాశాలు 77 శాతం వరకూ ఉన్నాయని ఎన్నికల ఫలితాలను విశ్లేషించే నిపుణులు తేల్చిచెప్పారు. పైపెచ్చు వేర్వేరు ఎన్నికల వల్ల పాలకుల్లో జవాబుదారీతనం పెరుగుతుంది. త్వరలోనే మళ్లీ జనం ముందుకు వెళ్లకతప్పదన్న స్పృహ ఉంటే ఇష్టారాజ్యం చేసే అవకాశాలు తక్కువ. జనం నెత్తిన పెనుభారం పడే విధానాల అమలుకు సాహసించరు. నియమావళి వల్ల పాలన కుంటుపడుతుందన్న వాదనలో పసలేదు. అత్యవసరమైనవాటికి ఎన్నికల సంఘం మినహాయింపు ఇస్తూనే ఉంది. పాలకులే ప్రతి ఎన్నికనూ ప్రతిష్టగా భావిస్తూ హడావుడి చేస్తున్నారు. అసెంబ్లీ ఎన్నికలకు ప్రధాని దగ్గరనుంచి ముఖ్యనేతలు తరలిరావడం, ఉప ఎన్నికలు జరిగేచోట సీఎంలు తమ కేబినెట్‌లను మోహరించడం వేలం వెర్రిగా మారింది. నంద్యాల ఉప ఎన్నికలప్పుడు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు ఏం చేశారో అందరికీ తెలుసు. నిజానికి ఇలాంటి చర్యలవల్లే పాలన కుంటుబడుతోంది.

దేశంలో వివిధ అసెంబ్లీల కాలపరిమితులు వేర్వేరుగా ఉండటం, లోక్‌సభ ఎన్నికలతో పొంతన లేకపోవడం తొలి సార్వత్రిక ఎన్నికల తర్వాత కొద్దికాలానికే మొదలైంది. 1951–52లో లోక్‌సభకూ, అసెంబ్లీలకూ జమిలి ఎన్నికలు జరగ్గా... ట్రావెన్‌కూర్ కొచ్చిన్, పటియాలా తూర్పు పంజాబ్ స్టేట్స్ యూనియన్ (పీఈపీఎస్‌యూ)లు కేరళ, పంజాబ్‌లుగా ఆవిర్భవించడం, ఆ రాష్ట్రాల్లో కొత్తగా అధికారంలోకొచ్చినవారు మెజారిటీ కోల్పోవడం వంటి పరిణామాలతో అక్కడి అసెంబ్లీలకు 1954లో మధ్యంతర ఎన్నికలు తప్పలేదు. అప్పుడు కేరళలో అధికారంలోకొచ్చిన కాంగ్రెస్ చీలిపోవడంతో ఆ ప్రభుత్వమూ 1956లో పడిపోయింది. 1957లో జరిగిన సార్వత్రిక ఎన్నికలతోపాటు కేరళ అసెంబ్లీకి కూడా ఎన్నికలు జరగ్గా ఆ ఎన్నికల్లో దేశంలోనే తొలిసారి కమ్యూనిస్టులు అధికారంలోకొచ్చారు. 1959లో నెహ్రూ ప్రభుత్వం ఆ సర్కారును రద్దుచేయడంతో ఆ మరుసటి ఏడాది మధ్యంతర ఎన్నికలొచ్చాయి. 1962లో మూడో సార్వత్రిక ఎన్నికలు జరిగాయి. అంతకు ముందు సంవత్సరం ఒరిస్సాలో ప్రభుత్వం కుప్పకూలి అక్కడ అసెంబ్లీ ఎన్నికలు తప్పలేదు. 1967 తర్వాత తరచు రాష్ట్రాల్లో ప్రభుత్వాలు పడిపోవడం, ఎన్నికలు రావడం ఒక ధోరణిగా మారింది. 1969లో కాంగ్రెస్ నిట్టనిలువుగా చీలిపోవడం వల్ల లోక్‌సభకే మధ్యంతర ఎన్నికలు తప్పలేదు.

కొన్ని దేశాల్లో పౌరులకు రీకాల్ హక్కుంది. ఎన్నికైన ప్రభుత్వాలు వాగ్దానాలు గాలికొదిలితే... అప్రజాస్వామికంగా వ్యవహరిస్తే రిఫరెండమ్ ద్వారా వాటిపై అసమ్మతిని ప్రకటించి ఆ ప్రభుత్వాలను రద్దు చేయించడం ఈ రీకాల్ హక్కు సారాంశం. మన దేశంలో ఇలాంటి విధానం లేదు సరికదా చట్టసభల్లో తగినంత మెజారిటీ లేనపుడు విపక్ష సభ్యులను లోబర్చుకోవడం రివాజైంది. ఆంధ్రప్రదేశ్ సీఎం చంద్రబాబు, తెలంగాణ ముఖ్యమంత్రి చంద్రశేఖరరావు దీన్ని మరింత దిగజార్చారు. అసెంబ్లీలో తమకు తగినంత మెజారిటీ ఉన్నా కేవలం ప్రతిపక్షాన్ని బలహీనపరిచే ఉద్దేశంతో ఫిరాయింపులకు తెరతీశారు. ఈ బాపతు చర్యలపై మౌనం వహిస్తూ జమిలి ఎన్నికల అంశాన్ని చర్చకు తీసుకురావడంలో అర్థం లేదు. ముందు ఎన్నికల వ్యవస్థపైనా, చట్టసభలపైనా దేశ పౌరుల్లో విశ్వాసమూ, గౌరవమూ ఏర్పడటానికి ఏం చేయాలో ఆలోచించాల్సిన అవసరం ఉంది. ఎన్నికల సమయంలో భావోద్వేగాలను రెచ్చగొట్టడం, తప్పుడు వాగ్దానాల్విడం, విచ్చలవిడిగా డబ్బు వెదజల్లడం, హింసకు దిగడం వంటి ధోరణులు నానాటికీ పెరుగుతున్నాయి. వీటిని కట్టడి చేయడంపై ముందుగా దృష్టి సారిస్తే... ఆ ఎన్నికలు ఏకకాలంలో జరగాలో, ఇప్పటిలా వేర్వేరుగా ఉంటే సరిపోతుందో ఆలోచించవచ్చు.



> జమిలి ఎన్నికలు అనే భావనే అప్రజాస్వామికం. ప్రభుత్వాలపై మధ్యంతర రేటింగ్ ఇచ్చే కనీస అవకాశాన్ని కూడా ఇది దూరం చేస్తుంది.
>
> – శశిథరూర్
> సీనియర్ కాంగ్రెస్ నేత, ఎంపీ

గ్రహం అనుగ్రహం

శ్రీ హేవిళంబి నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిర ఋతువు మాఘ మాసం, తిథి పౌర్ణమి రా.7.49 వరకు, తదుపరి బ.పాడ్యమి, నక్షత్రం పుష్యమి సా.6.38 వరకు, తదుపరి ఆశ్లేష, వర్జ్యం... లేదు, దుర్ముహూర్తం ప.11.49 నుంచి 12.34 వరకు, అమృతఘడియలు ప.12.36 నుంచి 1.45 వరకు, సంపూర్ణ చంద్రగ్రహణం.


సూర్యోదయం : 6.37
సూర్యాస్తమయం : 5.49
రాహుకాలం : ప 12.00 నుంచి 1.30 వరకు
యమగండం : ఉ.7.30 నుంచి 9.00 వరకు



నమాజ్ వేళలు

ఫజర్	5.34	మగ్రీబ్	6.11
జొహర్	12.29	ఇషా	7.25
అసర్	4.35		


ఉత్తమ రాజకీయాలకు దారేది?



దేవులపల్లి అమర్

పవన్ కల్యాణ్ తెలంగాణలో తిరగడాన్ని కూడా ఎవరూ అభ్యంతర పెట్టాల్సిన పనిలేదు. ఎవరికయినా స్వేచ్ఛ ఉంది. కానీ పవన్ మాట్లాడుతున్నదేమిటి? కేసీఆర్ తాట తీస్తానన్న నోటితోనే, 'ఆయన అంటే నాకు మొదటి నుంచి చాలా అభిమానం' అంటున్నారు. విభజన బాధతో పదకొండు రోజులు పస్తు ఉన్నానన్న నోటితోనే జై తెలంగాణ నినాదం వందేమాతరం అంత పవిత్రమయిందని కూడా అంటున్నారు. ఆయన మాటల్ని తెలంగాణ ప్రజలు నమ్మాలా? అభిప్రాయాలు ఎప్పుడూ ఒకేవిధంగా ఉండాల్సిన అవసరంలేదు, మారవచ్చు.

డేట్‌లైన్ హైదరాబాద్



సుప్రీంకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ సుదర్శన్‌రెడ్డి ఈ మధ్య ఒక సభలో మాట్లాడినప్పుడు 'రాగ్ దర్బారీ' అనే ఒక రాగం గురించి ప్రస్తావించారు. వెనకటికి మహారాజును పొగడటానికి ప్రత్యేకంగా కొంత మందిని నియమించేవాళ్లట. వారికి రకరకాల పేర్లు. వందిమాగధులనీ, విదూషకులనీ ఉండేవారు. ఆస్థానకవుల పనీ దాదాపు అదే. కానీ రాజరిక వ్యవస్థ అంతరించింది. ప్రజాస్వామ్యం వచ్చింది. అయినా ఈ ప్రభువులను పొగిడే జాతి మాత్రం వేర్వేరు రూపాల్లో కొనసాగుతూనే ఉన్నది. తెలుగు రాష్ట్రాల్లో ఇప్పుడు నడుస్తున్నది కూడా రాగ్ దర్బారీయే అంటే అతిశయోక్తి కాదు. ఆధునిక యుగపు ప్రభువులను కీర్తించడానికి కొత్తగా ఒక విదూషకుడు రాగ్ దర్బారీ ఆలపిస్తూబయలుదేరాడు. పైగా రాజాస్థానానికే పరిమితం కాకుండా రాజ్యం అంతటా తిరిగి ప్రభువు కీర్తి ప్రతిష్టలను ప్రజల ముందు వేనోళ్ల నోరారా పొగిడే పని భుజాన వేసుకున్నాడు ఈ కొత్త విదూషకుడు. అంతే కాదు రాజును విమర్శించే వాళ్లను దండించడానికి ఆ కాలంలో కొరడాలు వాడితే, ఇప్పుడు చట్టాలకు కొత్త పదును పెట్టి పరుష పదజాలాలు వాడితే కారాగార వాసం తప్పదని హుకుంనామాలు జారీ చేసేశారు. ఎంతసేపు ఈ డొంక తిరుగుడు? నేరుగా విషయానికి రావచ్చు కదా అని విసుక్కునే వాళ్ల కోసం ఇక విషయానికి వచ్చేద్దాం!

పరిహాసమవుతున్న ప్రజాస్వామ్యం

తెలంగాణ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖరరావును 'తెలంగాణ గాంధీ' అని కీర్తిస్తున్న వాళ్లు ఉన్నారు. ఆయన ఫొటోలకు పాలాభిషేకాలు చేస్తున్న వాళ్లూ ఉన్నారు. ఆయనను స్తుతిస్తున్న వాళ్లూ అనేక మంది ఉన్నారు తెలంగాణ సమాజంలో. పదమూడు సంవత్సరాల సుదీర్ఘ మలిదశ శాంతియుత పోరాటం తరువాత ప్రత్యేక రాష్ట్రం సాధించిన తెలంగాణ రాష్ట్ర సమితి అగ్రనేతగా చంద్రశేఖరరావు సర్వదా, సదా అభినందనీయుడే. అయితే ముఖ్యమంత్రిగా ఆయన నాయకత్వంలో నడుస్తున్న ప్రభుత్వాన్ని పల్లెత్తు మాట అనడానికి వీల్లేదు అంటేనే చిక్కంతా. తనను ఎవరూ విమర్శించడానికి వీల్లేదని మహాత్ముడు ఎన్నడూ అనలేదు. తెలంగాణ సాధన కోసం జరిగిన పోరాటంలో భాగం అయినవాళ్లూ, కాని వాళ్లూ ఎవరయినా సరే ప్రభుత్వ పనితీరు పట్ల ఒక అభిప్రాయం కలిగి ఉండే, ఆ అభిప్రాయాన్ని వ్యక్తం చేసే స్వేచ్ఛ, విమర్శించే హక్కు ప్రజాస్వామ్యంలో మన రాజ్యాంగం పౌరులందరికీ ఇచ్చింది. ఆ స్వేచ్ఛ ఒకరికి ఒక రకంగా, ఇంకొకరికి మరో రకంగా ఉండదు. అధికారంలో ఉన్నాను కాబట్టి నేను ఎవరినయినా 'సన్నాసులు', 'పనికిమాలి నోళ్లు' అంటాను. కానీ నన్ను ఎవరూ ఏమీ అనకూడదు అంటే కుదరదు. 2001లో తెలంగాణ రాష్ట్ర సమితి ఏర్పాటుకూ, మలిదశ ఉద్యమానికీ స్ఫూర్తిదాయకంగా నిలిచినది 1998 వరంగల్ డిక్లరేషన్. ఆ ఘట్టానికి 20 ఏళ్లు పూర్తయిన సందర్భంగా తలపెట్టిన ఊరేగింపు మీద ప్రభుత్వం ఉక్కుపాదం మోపింది. ఆరోజు వరంగల్ పట్టణంలో తెలంగాణ అమరవీరుల స్థూపం వద్ద గుమిగూడిన తెలంగాణ వాదుల మీద ఆడా మగా అని చూడకుండా పోలీసులు విచక్షణా రహితంగా దాడి చేసి నిర్బంధించారు. తెలంగాణ ఉద్యమకాలంలో తమ పోరాటానికి విశ్వసనీయతను జత చేసిన సంస్థ జేఏసీ. కొలువుల కోసం కొట్లాడుతానని జేఏసీ కోర్టు అనుమతి తెచ్చుకున్నా కూడా ఎక్కడివాళ్లను అక్కడ అరెస్ట్ చేసి సభను భగ్నం చేసేందుకు ప్రయత్నం చేశారు. ఆ మధ్య వరంగల్ పట్టణంలో ఒక మహిళా సంఘం వాళ్లు హాల్ మీటింగ్ పెట్టుకుంటామంటే కూడా అక్కడి పోలీస్ కమిషనర్ అనుమతి ఇవ్వకుండా చేయడంలో హైదరాబాద్ నుంచి ఆదేశాలు ఉన్నాయన్న విషయం ఇక్కడ గుర్తు చేసుకోవాలి. ఇట్లా అనేకం. తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక ఆటా పాటా మాట మీద విరుచుకుపడుతున్న నిర్బంధానికి పరాకాష్ట– ధర్నా చౌక్ ఎత్తివేత. 1985–89 మధ్యకాలంలో ఎన్టీ రామారావు పరిపాలన నాటి పరిస్థితులను గుర్తు చేస్తున్నారు ఈనాటి పాలకులు. అప్పుడు కూడా తెలంగాణలో ఆటా మాటా పాటా బంద్ అయ్యాయి.

ఇదేం ధోరణి?

తన 25వ సినిమా విజయం సాధించలేకపోవడంతో ఇక పూర్తి స్థాయిలో రాజకీయాలనే వృత్తిగా చేసుకునే ఆలోచనకు వచ్చారు నటుడు పవన్ కల్యాణ్. తెలంగాణలోని కరీంనగర్ జిల్లా కొండగట్టు నుంచి యాత్ర ప్రారంభించారాయన. ఆ పర్యటనకు రాష్ట్ర ప్రభుత్వం భద్రతా ఏర్పాట్లు చేయడాన్ని ఎవరయినా ఎట్లా అర్థం చేసుకోవాలి? ఈ ప్రశ్న ఎందుకు వేయవలసి వచ్చిందంటే– సమైక్య రాష్ట్రానికి మద్దతు ఇస్తూ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, ఆనాటి ఎంపీ జగన్‌మోహన్‌రెడ్డి పార్లమెంట్‌లో ప్లకార్డ్ పట్టుకున్నారు. దానిని కారణంగా చూపించి, ఓదార్పు యాత్రలో భాగంగా ఆయన మానుకోటకు బయలుదేరితే రచ్చ రచ్చ చేసి తీవ్ర ఉద్రిక్తతలకు కారకులయ్యారు కొందరు. వారే ఈరోజు అధికారంలో ఉండి పవన్‌కల్యాణ్‌కు ఎర్రతివాచీ పరచడం వెనుక మతలబు ఏమిటి? పవన్‌కల్యాణ్ కేసీఆర్ తాట తీస్తానన్నారు. రాష్ట్రాన్ని విడగొట్టినందుకు భరించలేని దుఃఖంతో పదకొండురోజులు అన్నపానాలు మానేసి బాధపడ్డానన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి తెలంగాణ ఉద్యమాన్ని కించపరుస్తూ ఒక్క పరుష పదప్రయోగం అయినా చేశారా? మరెందుకు ఈ తేడా? అప్పుడు పరిస్థితి వేరు అంటారేమో! అప్పుడయినా ఇప్పుడయినా భావ ప్రకటనా స్వేచ్ఛకు అర్థం మాత్రం ఒకటే. ఇప్పుడు పవన్ కల్యాణ్ తెలంగాణలో తిరగడాన్ని కూడా ఎవరూ అభ్యంతర పెట్టాల్సిన పనిలేదు. ఎవరికయినా స్వేచ్ఛ ఉంది. కానీ పవన్ మాట్లాడుతున్నదేమిటి? కేసీఆర్ తాట తీస్తానన్న నోటితోనే, 'ఆయన అంటే నాకు మొదటి నుండి చాలా అభిమానం' అంటున్నారు. విభజన బాధతో పదకొండు రోజులు పస్తు ఉన్నానన్న నోటితోనే జై తెలంగాణ నినాదం వందేమాతరం అంత పవిత్రమయిందని కూడా అంటున్నారు. ఆయన మాటల్ని తెలంగాణ ప్రజలు నమ్మాలా? అభిప్రాయాలు ఎప్పుడూ ఒకేవిధంగా ఉండాల్సిన అవసరంలేదు, మారవచ్చు. అది ముందు చెప్పాలి. అప్పుడు నేను మాట్లాడిన మాటలు పొరపాటు, చెంపలు వేసుకుంటున్నాను, నా అభిప్రాయం తప్పు అని ప్రజల ముందుకు రావాలి. ఆయన ఆ పని చెయ్యలేదే! రాజకీయ పార్టీ పెట్టానంటున్న పెద్దమనిషి ప్రభుత్వాలను విమర్శించను అంటున్నాడంటే ఆయనను ఎట్లా అర్థం చేసుకోవాలి? రాజకీయ అవినీతికీ, దివాలాకోరుతనానికీ నిదర్శనంగా నిలిచిన ఓటుకు కోట్లు కేసు గురించి మాట్లాడను అని చెబుతున్న ఈ నాయకుడు ఈ దేశానికే నీతిపాఠాలు చెబుతానంటూ బయలుదేరాడు. రెండు తెలుగు రాష్ట్రాల ప్రభుత్వాలు ఆయనకే ఎర్రతివాచీలు పరుస్తున్నాయి.

నిజం చెప్పాలంటే పవన్ కల్యాణ్‌ది అక్కడా ఇక్కడా కూడా రాగ్ దర్బారీయే. ఉద్యమ విజయశక్తిని నరనరాన నింపుకున్న తెలంగాణ రాష్ట్ర సమితి నాయకులూ, శ్రేణులూ తమ అధినేత తాట తీస్తానన్న మాటకు క్షమాపణ చెప్పి, నిరాహారంగా పడుకుని బాధ పడ్డానంటూ తెలంగాణను అవమానించినందుకు ఆ తప్పును కూడా ఒప్పుకుని తెలంగాణ వీధుల్లో కదులు అని పవన్ కల్యాణ్‌ను ఎందుకు నిలదీయలేక పోయారు? పైగా సమర్థనలకు పూనుకోవడం వెనుక ఉన్న ఎజెండా ఏమిటి?

జగన్ యాత్రను హైజాక్ చేయడానికే!

వెయ్యి మందికి పైగా విద్యార్థులు, యువకులు ఆత్మాహుతి చేసుకున్న తరువాత సాధించుకున్న తెలంగాణ రాష్ట్రం కోసం ఇప్పుడు రక్తం ధారపోస్తాను అని ప్రకటించిన పవన్ కల్యాణ్ ఆపై ఆంధ్రప్రదేశ్‌లోకి ప్రవేశించాడు. అక్కడ ప్రతిపక్ష నాయకుడు, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, యువ రాజకీయవేత్త జగన్‌మోహన్ రెడ్డి పాదయాత్ర సాగుతున్నది. జనం నుంచి ఆయనకు అద్భుతమయిన ఆదరణ లభిస్తున్నది. ఆయన పాదయాత్ర దారిలోనే పవన్ కల్యాణ్‌ను ప్రవేశపెట్టింది ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం. ప్రభుత్వం అంటే ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు. ఆయన పథక రచనలో భాగంగానే ఈ పర్యటన సాగుతున్నది. జగన్‌మోహన్‌రెడ్డి శాసనసభలో ప్రతిపక్షనేత, ఆ కారణం వల్ల ఆయనది కేబినెట్ హోదా. శాసనసభలో ప్రతిపక్షాన్ని 'గవర్నమెంట్ ఇన్ వెయిటింగ్' అంటారు. 2014 ఎన్నికల్లో అధికార పక్షానికీ, వైఎస్ఆర్ కాంగ్రెస్‌కూ వచ్చిన ఓట్ల తేడా రెండు శాతం కంటే తక్కువ. అంతటి ప్రజాదరణ కలిగిన నాయకుడు జగన్‌మోహన్‌రెడ్డి. ఆయన ఆ మధ్య అధికార పక్షానికి చెందిన ఒక ఎంపీ నడిపే బస్ ప్రమాదానికి గురైనప్పుడు, ఘటన స్థలాన్ని సందర్శించి మృతదేహాలను పోస్ట్ మార్టం చెయ్యకుండా ఎందుకు తరలించారని జిల్లా కలెక్టర్‌ను నిలదీసినందుకు ఆయన మీద కేసు పెట్టారు. ఏ హోదా లేని సినిమా నటుడు పవన్ కల్యాణ్ పర్యటిస్తుంటే మాత్రం అనంతపురం జిల్లాలో మంత్రి, ప్రజా ప్రతినిధులూ, అధికారులూ ఆయన ఆదేశిస్తే ఫైళ్లు చంకన పెట్టుకుని వెళ్లి సమీక్షలు జరిపారు. పవన్ కల్యాణ్ పార్టీకి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో కనీసం ఒక్క వార్డ్ మెంబర్ కూడా లేదు. జగన్‌మోహన్‌రెడ్డికి లభిస్తున్న ప్రజాదరణను దారి మళ్లించే ప్రయత్నంలో భాగంగా ఈ ఎత్తు వేస్తున్నట్టు కనిపిస్తుంది. పార్ట్‌టైం రాజకీయాలను ప్రజలు ఎప్పుడూ ఆదరించిన దాఖలాలు చరిత్రలో లేవు.

అటు తెలంగాణలో అయినా, ఇటు ఆంధ్రప్రదేశ్‌లో అయినా పవన్ కల్యాణ్ విషయంలో జరుగుతున్నది ఒకే విధంగా కనిపిస్తున్నది. 2019 లోనో, ఇంకొంచెం ముందుగానో వచ్చే ఎన్నికల్లో ఓటమి భయం రెండు రాష్ట్రాల అధిపతులను పట్టి పీడిస్తున్న కారణంగానే పవన్ కల్యాణ్ అడుగులకు మడుగులు ఒత్తుతున్నట్టు అర్థం అవుతున్నది. మరి పవన్‌కల్యాణ్ ఎందుకు అక్కడా ఇక్కడా 'రాగ్ దర్బారీ' అందుకున్నారు? ఏది ఏమయినా అభిమానుల పేరిట ఉన్మాద మూకలను వెంటేసుకుని తిరిగే సినిమా నటుడు రాజకీయాల్లో తమకు ఉపయోగపడతాడని రెండు రాష్ట్రాల అధికారపక్షాలు భావిస్తూ ఉంటే పొరపాటు. సుదీర్ఘ రాజకీయ అనుభవం ఉన్న నాయకులు ప్రజాస్వామ్యాన్ని ప్రమాదంలో పడేసే ఈ వికృత క్రీడకు తెర తీయడం ఆందోళన కలిగించే విషయమే. దీని గురించి రెండు రాష్ట్రాల ప్రజలూ ఆలోచించుకోవాల్సిందే.

datelinehyderabad@gmail.com

దేశంమీద ఎందుకింత కోపం?

ఇజ్రాయెల్‌తో భారత్ ఏర్పర్చుకుంటున్న వ్యూహాత్మక సంబంధాలనూ భారతీయ కమ్యూనిస్టులు వ్యతిరేకిస్తున్నారంటే ఎలా అర్థం చేసుకోవాలి? వ్యవసాయ అభివృద్ధి, సైనిక సంపన్నత దిశగా దేశం అడుగులేయడం వీరికి ఇష్టం లేదా?

సందర్భం



ఎస్. విష్ణువర్ధన్ రెడ్డి

కొన్ని రోజులుగా వామపక్ష పార్టీల రాష్ట్ర స్థాయి నేతల నుంచి జాతీయ స్థాయి నేతల వరకు చైనాకు అనుకూలంగా, భారతదేశానికి వ్యతిరేకంగా ప్రచారం చేస్తున్నారు. మరీ ముఖ్యంగా భారత్‌కంటే చైనా గొప్ప దేశమని మన ఆర్థిక వ్యవస్థకంటే చైనా ఆర్థిక వ్యవస్థ గొప్పదని మాట్లాడుతూ ఈ దేశంలో ఉండే 125 కోట్ల మంది భారతీయులను అవమానిస్తున్నారు. కమ్యూనిస్టు పార్టీలలో ఏదో కిందిస్థాయి నాయకులు మాట్లాడితే అంతగా ఆలోచించాల్సిన అవసరం లేదు. కానీ సీపీఎం చీఫ్ సీతారాం ఏచూరి, కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్, కేరళ రాష్ట్ర కార్యదర్శి కె. బాల క్రిష్ణన్ చైనాను పొగడటం సగటు భారతీయులు జీర్ణించుకోలేకపోతున్నారు. ప్రధానంగా అమెరికా, ఇజ్రాయెల్, భారత్ కూటమి చైనాకు వ్యతిరేకంగా కుట్ర చేస్తు న్నదని ఆరోపిస్తున్నారు. వాస్తవానికి టెక్నాలజీ పరంగా అమెరికా సైతం ఇజ్రాయెల్‌పైన ఆధారపడుతుంది. వ్యవసాయ రంగంలో అనేక పరిశోధనల ద్వారా ఇజ్రాయెల్ ముందుంది. మనది వ్యవసాయ ఆధారిత దేశం కాబట్టి ఇజ్రాయెల్ సహాయంతో కొత్త వంగడాలు తీసు కువచ్చి వ్యవసాయాన్ని అభివృద్ధి చేయాలన్నది కేంద్రప్రభుత్వం ఆలోచన... దేశీయంగా వ్యవసాయాభివృద్ధికి కమ్యూనిస్టులు వ్యతిరేకమో, అనుకూలమో చెప్పాలి.

అమెరికా ఇన్నాళ్లు భారతదేశంలో బలహీన నాయకత్వాలను ఖాతరు చేయకుండా భారత్‌లో సీమాంతర ఉగ్రవాదాన్ని ప్రోత్సహించి పాకిస్తాన్‌ని ప్రేరేపించి, వారికి ఆర్థికంగా సహకరించి పరోక్షంగా భారత్‌ను ఇబ్బంది పెట్టిన దేశంగా మనకు తెలుసు. మోదీ ప్రధాన మంత్రి అయిన తరువాత అమెరికా భారత్ ఒక బలమైన దేశంగా భావించి మనతో చెలిమి చేస్తున్నది. పాకిస్తాన్ ఉగ్రవాదుల స్థావరంగా ప్రపంచానికి చెప్పి వారికి నిధులు సైతం రద్దు చేసి ప్రపంచంలో పాకిస్తాన్‌ను ఏకాకి చేయగలిగాము. ఇది మోదీ దౌత్య విజయమే. ఈ సందర్భంలో పాకిస్తాన్ కొంతమంది తీవ్రవాదులను అరెస్టు చేసింది. అనేక దేశాలు అమెరికా చెలిమి కోసం సాగిలపడుతున్నాయి. కానీ అమెరికా భారత్ చెలిమి కోసం సాగిలపడుతుంది. వ్యూహాత్మకంగా అమెరికాతో సంబంధాలను భారత్ చేపడుతుంటే కమ్యూనిస్టులు జీర్ణం చేసుకోలేకపోతున్నారు.



చైనా భారతదేశంకంటే గొప్ప దేశమని భజన చేస్తున్న కమ్యూనిస్టు నాయకులు వాస్తవాలను గమనించాల్సి ఉంది. చైనా భారత్‌ను ఒకసారి యుద్ధంలో ఓడించి నేటికీ పాకిస్తాన్‌కు సహకరిస్తూ మనల్ని నిత్యం ఇబ్బందులకు గురిచేస్తున్నది. నిత్యం పాకిస్తాన్‌ను రెచ్చగొడుతూ, ప్రత్యక్షంగా పరోక్షంగా పాక్‌కు సహాయం చేస్తూనే ఉన్నది. అలాంటిది.. చైనాను మనం ఆదర్శంగా తీసుకోవాలని కమ్యూనిస్టులు నీతి సూత్రాలు వల్లించడం ఏ దేశభక్తి? చైనా దేశీయంగా బౌద్ధులపై కొనసాగిస్తున్న దాడులు, ముస్లింలను భయభ్రాంతులకు గురిచేయడం, కార్మికులతో 10 నుండి 12 గంటలు గొడ్డుచాకిరి చేయించటం, ప్రతిపక్ష పార్టీలను కాలరాయడం, అవినీతిని ప్రశ్నించిన సొంత పార్టీ నేతలమీద వివిధ కేసులు బనాయించి వేధించడం మనం ఆదర్శంగా తీసు కోవాలా? డోక్లాంలో భారత సైన్యాన్ని ప్రతిరోజూ కవ్వించడం, అరుణాచల్ సరిహద్దుల్లో రోజూ మన సైన్యాన్ని రెచ్చగొట్టడం, బ్రహ్మపుత్రానది మన దేశంలోకి రాకుండా దారి మళ్లించడం, మన సముద్ర జలాల గుండా సీపీఈసీ కారిడార్‌ను నిర్మించి మన దేశంపై దండయాత్ర ఆలోచనలను ఈ కమ్యూనిస్టులు ఎందుకు వ్యతిరేకించడం లేదో ప్రజలకు తెలియాలి.

చైనా తన నిధులతో శ్రీలంకలో పోర్టు నిర్మాణం చేసేందుకు శ్రీలంక ప్రభుత్వంతో ఒప్పందం చేసుకోవడం వెనుక భారత్‌పై దొంగచాటు దెబ్బతీయాలనే ఆలోచన లేదంటారా? మన చుట్టూ ఉన్న చిన్న దేశాలైన నేపాల్, మాల్దీవులు, బంగ్లాదేశ్, మయన్మార్‌లతో వ్యాపారం పేరుతో సైనిక స్థావరాలను ఏర్పాటు చేసుకొని మనల్ని దొంగదెబ్బ తీయడానికి చేస్తున్న ప్రయత్నాన్ని ఆదర్శంగా తీసుకోవాలా? పెట్టుబడిదారీ వ్యవస్థను ప్రోత్సహించి స్వేచ్ఛ, పత్రికలు లేని, ప్రజాస్వామ్యంలేని నియంత పాలనను ఆదర్శంగా తీసుకోవాలా? పంచశీల ఒప్పందాల బంధాల్ని తెగదెంచిన చైనాను ఏ ప్రాతిపదికన ఆదర్శంగా తీసుకోవాలో కమ్యూనిస్టులే జవాబివ్వాలి. ఎన్.ఎస్.జి.లో భారత్‌కు వ్యతిరేకంగా చైనా ఒక్కటే అడ్డు పడుతుంటే ఈ కమ్యూనిస్టుల నోళ్లు ఎందుకు పడిపోయాయి?

చైనాతో భారత్ పోరాడుతున్న సందర్భంలో ఈ దేశంలోని వామపక్ష పార్టీలు చైనాకు వంత పలికాయి. ఈ ద్రోహాన్ని ఈ దేశ ప్రజలు ఇంకా మరచిపోలేదు. నిజానికి కమ్యూనిస్టులకు ఈ దేశంపై గౌరవముంటే ఈ దేశ జాతీయ నాయకుల చిత్రపటాల్ని వారి కార్యాలయాల్లో ఎందుకు ఉంచరు? చేగువేరా, కారల్‌మార్క్స్, లెనిన్, స్టాలిన్.. వీళ్లేనా వీళ్లకు హీరోలు? గాంధీజీ, పటేల్, నేతాజీ, అంబేడ్కర్, మౌలానా అబుల్ కలాం ఆజాద్ తదితరులెవ్వరూ కారా వీరికి ఆదర్శం? వారి కార్యాలయాలపై ఎందుకు జాతీయ జెండాను ఎగరేయరు? సిద్ధాంతం పేరుతో రాద్ధాంతం చేస్తూ దేశ ఔన్నత్యాన్ని కించపరచడం.. పరాయి దేశాలను, శత్రుదేశాలను కీర్తించడం భారత్‌లో కమ్యూనిస్టులకే సాధ్యం. దేశ వ్యతిరేక చర్యలు చేస్తే చైనా దేశస్తుడు ఆ దేశంలో ఉండగలడా? అయినా గతి తప్పిన ఆలోచనలతో– భవిష్యత్తును చూడలేని కమ్యూనిస్టులు పంథా మార్చాలి. గుడ్డిగా విమర్శించడం మాని దేశ అభివృద్ధిలో పాలు పంచుకోవాలి.

వ్యాసకర్త బీజేపీ శిక్షణ విభాగం కన్వీనర్, ఏపీ
ఈ–మెయిల్ : mjrinfravishnu@gmail.com

మృత్యువు చదువులాటలు

కాలం చదువుల పరుగు ప్రవాహంలో, పిల్లల ప్రాణాలతో చెలగాటమాడుతోంది... ఏపీలో ప్రతి రోజూ చదువుతున్న విద్యార్థులు జీవితమే వద్దనుకుంటూ ఆత్మహత్యలు చేసుకుంటున్నారు... విద్యార్థుల ప్రతిభను గ్రేడింగ్ కొలతల బట్టి, వారి శక్తి సామర్థ్యాలను అంచనా కడుతున్న కార్పొరేట్ విద్యా మానసిక రోగంలో తల్లిదండ్రులు కూడా భాగస్వామ్యం పంచుకుంటున్నారు. పిల్లల పట్ల జాగ్రత్తలు తీసుకోవాల్సిన తల్లితండ్రులే ఉదయం నుంచి పిల్లలను చదువులతో నిద్రలేపి మరల చదువుతో నిద్రపుచ్చుతున్నారు... సెలవురోజుల్లో కూడా విద్యార్థులను చదువుల పేరిట మానసికంగా క్షోభకు గురిచేస్తున్నారు. తల్లిదండ్రులకు దూరంగా, సమాజానికి దూరంగా, ఒక రకంగా చదువే జీవితం అదే మీ భవిష్యత్, దీనికి మించి జీవితంలో, ప్రపంచంలో మరేమీ లేదు, ఇప్పుడు చదువుకుంటేనే బాగుపడతారు లేకుంటే లేరనే భయాన్ని విద్యార్థుల మెదడులో జొప్పిస్తూ, మానసికంగా వారిని దెబ్బకొడుతున్నారు. చదువు చదువు అనే చర్నాకోల మాటలతో అటు ఉపాధ్యాయులు, ఇటు తల్లిదండ్రులు విద్యార్థులను నిత్యం భయపెడుతూ చదివిస్తుంటారు. ఎక్కువ మార్కులొస్తే జీనియస్ అని, తక్కువ మార్కులొస్తే దద్దమ్మ అని, విద్యార్థుల మనస్సుల్లో ఒక రకమైన తక్కువ ఎక్కువ అనే ఆత్మన్యూనతను కల్పిస్తారు. ఇక ఉకదంపుడు పొగడ్తలతో ఒకరిని పొగుడ్తూ మరొకరిని తక్కువ చేసే ఆలోచన విద్యార్థులు మనస్సుల్లో నాటతారు. అటు స్కూల్లో, ఇటు కాలేజీలో, తల్లిదండ్రుల నుంచి, ఉపాధ్యాయుల నుంచి, పక్కన చదివే మిత్రులనుంచి, అవమానపు ఎత్తిపొడుపుల మాటలతో, నిత్యం చదువు, ర్యాంకులు, గ్రేడింగ్ మార్కులు అనే ముళ్లకిరీటం మోయలేక మానసికంగా కృంగుబాట్లకు గురవుతున్న విద్యార్థులు... ఆత్మస్థైర్యం చెప్పేవారు లేక మానసిక వేదనకు గురవుతూ ఒకనొక దశలో ఆత్మహత్యే సరైనదనే నిర్ణయానికి వచ్చేస్తున్నారు. పిల్లలే మనకు ముఖ్యం.. ర్యాంకులు, గ్రేడులు కాదు, అవి కొంత వరకే మనకు అవసరం కుటుంబం, సమాజం గుర్తించాలి.

– తంగిరాల సోని, కంచికచర్ల । 96766 09234

ఇన్ బాక్స్

డ్రైనేజీలపై మెట్లు

మన రాష్ట్రంలో కొంతమంది గృహ యజమానులు ఎవరి ఇళ్లముందున్న మురుగు కాల్వలపై వారు మెట్లు కట్టి మురుగు నీటి పారుదలకు ఆటంకం కలిగిస్తున్నారు. దీంతో పారిశుధ్య పనివారికి మురుగు తీయడానికి వీలు కావడం లేదు. పైగా ఊరంతా భరింపరాని దుర్గంధంతో, పగలు కూడా దోమకాటుతో ప్రజలు నానా బాధలకు గురవుతున్నారు. దోమల మందులు ఎన్నిసార్లు కొట్టినా, ఎన్నిసార్లు పొగ పెట్టినా మురుగు నిల్వ ఉన్నంతవరకు దోమలు చావవు. డెంగ్యూ రోగాలు తప్పవు. మెట్ల మధ్య కనీసం మూడు అడుగులు ఖాళీ వదిలితే మురుగు తీయడానికి వీలవుతుంది. రాష్ట్రమంతటా ఇదే పరిస్థితి కాబట్టి ప్రభుత్వం వెంటనే డ్రైనేజీలపై కట్టిన మెట్లను కొట్టివేయడానికి తక్షణ చర్యలు తీసుకోవాలి.

– గోపాలుని శ్రీరామమూర్తి, వినుకొండ

పంట – కలుపు



పొలంలో ఏదైనా తనకి కావలసిన పంట పండించుకోవటానికి రైతు ఎంతగానో కృషి చేయవలసి ఉంటుంది. పొలం దున్నాలి. పదును చెయ్యాలి. కావలసిన విత్తనాలు నాటాలి. నీరు పెట్టాలి. చీడ పీడలు రాకుండా మందులు వెయ్యాలి. పశువులు తినకుండా కాపాడాలి. అయినా ఏదో ఒక చిన్న సమస్య అనుకున్నంత ఫలసాయం రాకుండా అడ్డుపడుతుంటుంది. కానీ, కలుపుమొక్కల సంగతి చూడండి. విత్తనాలు కూడా వెయ్యనవసరం లేదు. ఎక్కడి నుండి వస్తాయో తెలియదు. పంట కోసం చేసిన ఏర్పాటుని హాయిగా తాము అనుభవించి ఏపుగా పెరుగుతాయి.

సరిగ్గా ఇదే విధంగా మనలో మంచి ఆలోచనలు, చెడు ఆలోచనలు తలెత్తి నాటుకుపోవటం అనే క్రమం సాగుతుంది. అదేం చిత్రమో కాని చెడుకి ఆకర్షణ అధికం. బలం కూడా ఎక్కువే. అంతిమ విజయం మంచికే అంటాం కాని, ఈ లోపు జరగవలసిన హాని జరిగిపోతూ ఉంటుంది.

జ్యోతిర్మయం

మంచిభావాలు అనే విత్తనాలు మొలకెత్తటానికి అనువుగా మనసు అనే క్షేత్రాన్ని చదును చేయాలి. ఇదే క్రమశిక్షణ. శారీరక మానసిక శుద్ధి క్రమశిక్షణ వల్ల సిద్ధిస్తుంది. కలిగిన మంచి ఆలోచనలు మనస్సులో గాఢంగా నాటుకొని పెంపొందే విధంగా తగిన వాతావరణాన్ని కల్పించుకోవాలి. వచ్చిన మంచిఆలోచనలని నిరంతరం మననం చెయ్యటం, వీలైనంత వరకు ఆచరణలో పెట్టటానికి ప్రయత్నం చేయాలి.

పంట బాగా ఎదగాలని ప్రయత్నం చేస్తే, చేసిన శ్రమఫలాన్ని అంతా కలుపు మొక్కలే పొంది బలంగా ఎదుగుతాయి. అదే విధంగా, మంచి భావాలనే నిరంతరం మనసులో నింపుకుని ఉండాలని ఎంత ప్రయత్నం చేసినా, దురాలోచనలు సందు చూసుకుని దూరిపోయి, ఎక్కువ ప్రాబల్యాన్ని సంతరించుకుంటాయి. ప్రయత్నం లేకుండానే పెచ్చుపెరిగే ప్రతి కూల భావజాలానికి అడ్డుకట్టవేసి, సానుకూల భావాలని ప్రయత్న పూర్వకంగా పెంపొందించుకుని పోషించుకుంటూ ఉండాలి. వద్దనుకున్న కలుపు మొక్కలు ఎదిగినంత వేగంగా పంట ఎదగనట్టే చెడు ఆలోచనలు వచ్చినంత త్వరగా మంచి ఆలోచనలు రావు. మంచి చేయాలనే ఆలోచన కలగవచ్చు. కానీ, దానిని అమలుపరచటం గురించి మనస్సులో స్థిరంగా అనుకోవటం కాని, ఎక్కువ సేపు ఆలోచించటం గాని సాగదు. పనికిరాని భావాలని మనస్సులో నుండి తొలగిపోయేట్టు చేసినప్పుడే మనస్సులో మంచిభావాలు విస్తరణకు ఖాళీ ఏర్పడుతుంది.

అందుకే మనస్సులో మెదిలిన సదాలోచనని వెంటనే అమలు చెయ్యమని, దురాలోచనని వీలైనంత ఆలస్యం చెయ్యమని చెపుతారు పెద్దలు. సేద్యంలో కలుపుతీతకి ఉన్నంత ప్రాధాన్యం సాధనలో శారీరక మానసిక శుద్ధికి ఉంది.

– డాక్టర్ ఎస్. అనంతలక్ష్మి



మహాత్మాగాంధీ వర్ధంతి సందర్భంగా మంగళవారం ఢిల్లీలోని గాంధీ సమాధి 'రాజ్‌ఘాట్' వద్ద నివాళులర్పిస్తున్న రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్, ప్రధాని నరేంద్ర మోదీ. ఉపరాష్ట్రపతి వెంకయ్య, మాజీ ప్రధాని మన్మోహన్, కాంగ్రెస్ మాజీ అధ్యక్షురాలు సోనియా తదితరులు సైతం నివాళులర్పించారు.

పాత పద్ధతిలోనే పాస్‌పోర్ట్

ఆరెంజ్ రంగులో జారీ చేయాలన్న నిర్ణయం వెనక్కి




న్యూఢిల్లీ: ఈసీఆర్(ఎమిగ్రేషన్ చెక్ రిక్వైర్డ్) హోదా ఉన్న పౌరులకు ఆరెంజ్ రంగు పాస్‌పోర్ట్ జారీచేయాలన్న నిర్ణయాన్ని కేంద్రం విరమించుకుంది. మంత్రి సుష్మా స్వరాజ్ అధ్యక్షతన సోమవారం జరిగిన సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు విదేశాంగ శాఖ ప్రకటించింది. విదేశాంగ శాఖ, మహిళా, శిశు సంక్షేమ శాఖ అధికారులతో కూడిన కమిటీ చేసిన సిఫార్సుల మేరకు పాత విధానాన్నే కొనసాగించాలని నిర్ణయించినట్లు పేర్కొంది. ఆరెంజ్ రంగు కవర్‌తో పాటు చివరి పేజీలో వ్యక్తిగత వివరాలు ముద్రించాలని గతంలో విదేశాంగ శాఖ నిర్ణయం తీసుకున్న సంగతి తెలిసిందే. 'పలువురు వ్యక్తులు, బృందాల నుంచి వచ్చిన విజ్ఞప్తులను పరిశీలించిన మీదట ప్రస్తుత విధానాన్నే కొనసాగించాలని నిర్ణయించాం' అని విదేశాంగ శాఖ తెలిపింది. ఈసీఆర్ కేటగిరీ ప్రజలకు ఆరెంజ్ రంగులో ప్రత్యేక పాస్‌పోర్టు జారీచేయాలన్న బీజేపీ తీరు వివక్షాపూరితమని గతంలోనే ప్రతిపక్షాలు విమర్శించాయి.

సీజేఐ వేతనం నెలకు రూ.2.80 లక్షలు!

న్యూఢిల్లీ: సుప్రీంకోర్టు, హైకోర్టు జడ్జీల వేతనాలను దాదాపు రెండు రెట్లు పెంచే బిల్లుపై రాష్ట్రపతి కోవింద్ సంతకం చేశారు. హైకోర్టు, సుప్రీంకోర్టు న్యాయమూర్తుల (వేతన, సర్వీసు నిబంధనల) సవరణ బిల్లు ఇప్పటికే పార్లమెంట్ ఆమోదం పొందింది. మంగళవారం రాష్ట్రపతి సంతకంతో ఈ బిల్లు చట్ట రూపం దాల్చింది. దీని ప్రకారం సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి వేతనం రూ.1 లక్ష నుంచి రూ.2.80 లక్షలకు పెరుగుతుంది. సుప్రీంకోర్టు జడ్జీలు, హైకోర్టు ప్రధాన న్యాయమూర్తుల వేతనాలు కూడా రూ.80 వేల నుంచి రూ.2.50 లక్షలకు పెరుగుతాయి. 2016 జనవరి 1 నుంచే జడ్జీల వేతన పెంపు అమల్లోకి వస్తుంది.

గాంధీజీ 'హేరామ్' అనడం నేను విన్లేదు



చెన్నై: నాథూరాం గాడ్సే తుపాకీ తూటాకు నేలకొరిగిన మహాత్మా గాంధీ చివరిసారిగా 'హేరామ్' అన్నారో లేదో తనకు తెలియదని గాంధీజీ వ్యక్తిగత సహాయకుడు వెంకిట కళ్యాణం (96) చెప్పారు. తుదిశ్వాస విడవడానికి కొన్ని క్షణాల ముందు గాంధీ 'హేరామ్' అనలేదని కళ్యాణం దశాబ్దం క్రితం చెప్పడంతో అప్పట్లో ఈ వార్త సంచలనం సృష్టించింది. ఈ వివాదంపై ఇన్నాళ్లకు కళ్యాణం స్పష్టతనిచ్చారు. ''గాంధీజీ 'హేరామ్' అనలేదని నేను ఎప్పుడూ చెప్పలేదు. ఆయన 'హేరామ్' అనడం నేను విన్లేదు అని చెప్పా. ఆయన హేరామ్ అని అన్నారేమో.. నాకు తెలియదు. గాంధీజీపై కాల్పులు జరిగిన ఆ క్షణాన అక్కడంతా గందరగోళంగా ఉంది. అక్కడున్నవారంతా అరుస్తున్నారు. నాకసలేం వినిపించలేదు'' అని ఆయన అన్నారు. 1943 నుంచి గాంధీజీ చనిపోయేదాకా ఆయనకు సహాయకుడిగా పనిచేశారు.

సీజేఐ అభిశంసనకు సీపీఎం విఫలయత్నం

సాక్షి ప్రతినిధి, ఢిల్లీ: భారత ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) జస్టిస్ దీపక్ మిశ్రాను పార్లమెంటులో అభిశంసించాలన్న సీపీఎం ప్రయత్నాలు ఫలించేలా కనిపించడం లేదు. అభిశంసన తీర్మానం ప్రవేశపెట్టడంపై కాంగ్రెస్‌లోనే భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతుండగా, బీజేపీ ఈ అంశంపై మౌనం వహించింది. సుప్రీంకోర్టులో నలుగురు సీనియర్ మోస్ట్ న్యాయమూర్తులు జస్టిస్ చలమేశ్వర్, జస్టిస్ రంజన్ గొగోయ్, జస్టిస్ ఎంబీ లోకూర్, జస్టిస్ కురియన్ జోసెఫ్‌లు ఈ నెల 12న మీడియా ముందుకు వచ్చి జస్టిస్ మిశ్రాపై పలు ఆరోపణలు చేయడం తెలిసిందే. దీంతో సీజేఐను పార్లమెంటులో అభిశంసించేందుకు అన్ని పార్టీల మద్దతు కూడగట్టేందుకు సీపీఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి ప్రయత్నిస్తున్నారు. కాంగ్రెస్‌లో కపిల్ సిబల్ సహా కొందరు నేతలు అభిశంసనకు మద్దతివ్వగా.. చిదంబరం, ఆనంద్ శర్మ, ఆంటోనీ తదితరులు వ్యతిరేకించారు. అయితే దీనిపై ఇంకా తుది నిర్ణయం తీసుకోలేదు. అయితే తొలిదశ బడ్జెట్ సమావేశాల్లో ఈ అంశం ప్రస్తావనకే రాకపోవచ్చనీ, మార్చి 5 నుంచి ప్రారంభమయ్యే రెండో దశ సమావేశాల్లో దీన్ని చేపట్టే అవకాశం ఉండొచ్చని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి.

'తొలిసారి' ఒకే కార్యక్రమంలో సీజేఐ, జడ్జీలు

నలుగురు న్యాయమూర్తులు మీడియా ముందుకు వచ్చి సీజేఐపై ఆరోపణలు చేసిన అనంతరం తొలిసారిగా...జస్టిస్ ఎంబీ లోకూర్, జస్టిస్ కురియన్ జోసెఫ్‌లు సీజేఐతో కలసి ఓ కార్యక్రమంలో పాల్గొన్నారు. సుప్రీంకోర్టు ప్రాంగణంలోనే నిర్వహించిన ఈ కార్యక్రమంలో వారు కరచాలనం కూడా చేసుకున్నారు.

ఆ సీఎం వద్ద 4 వేలు కూడా లేవు!



అగర్తలా: రాజకీయ నేతలంటే భారీగా ఆస్తులు, కోట్లకొద్దీ డబ్బు అనే అభిప్రాయం ప్రజల్లో ఉంది. అయితే, ఇప్పటికి నాలుగుసార్లు సీఎంగా పనిచేసి, ఐదోసారి బరిలోకి దిగుతున్న త్రిపుర సీఎం మాణిక్ సర్కార్(69) సొంత ఆస్తి వివరాలు చూస్తే ఎవరికైనా ఆశ్చర్యం కలుగకమానదు. రాష్ట్ర అసెంబ్లీకి త్వరలో ఎన్నికలు జరుగనుండగా ఆయన ధన్‌పూర్ స్థానానికి సీపీఎం తరఫున సోమవారం నామినేషన్ వేశారు. ఈ నామినేషన్ పత్రాల్లో ఆస్తిపాస్తుల వివరాలను సర్కార్ పొందుపరిచారు. వీటి ప్రకారం..మాణిక్ సర్కార్ వద్ద ఉన్న నగదు రూ.1,520 కాగా, బ్యాంకు ఖాతాలో ఉన్న డబ్బు రూ.2,410 మాత్రమే. ఈయనకు వ్యవసాయ భూములు గానీ ఇళ్ల స్థలాలు గానీ లేవు. ముఖ్యమంత్రికి ప్రభుత్వం నుంచి అందే వేతనం మొత్తాన్ని పార్టీకి విరాళంగా ఇస్తూ పార్టీ నుంచి జీవనభృతిగా నెలకు రూ.5వేలు మాత్రం పొందుతున్నారు. కాగా, మాణిక్ సర్కారు సతీమణి పాంచాలీ భట్టాచార్య కేంద్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగిని. ఈమె వద్ద నగదు రూ.20,140కాగా రెండు బ్యాంకు ఖాతాల్లో కలిపి దాదాపు రూ.2 లక్షల నగదు ఉంది. వీటితోపాటు రూ.9.25 లక్షల ఫిక్స్‌డ్ డిపాజిట్లు.. 20 గ్రాముల బంగారు నగలు ఉన్నాయి. ఈమె పేరుతో రూ.21 లక్షల విలువైన 888.35 చదరపు అడుగుల ఇంటి స్థలంలో రూ.15 లక్షల విలువైన ఇల్లు ఉంది.





ఉద్యోగులు తమ వినూత్న ఆలోచనలను పంచుకునేందుకు, కలసి పని చేసేందుకు అమెజాన్ సంస్థ కొత్తగా నిర్మించిన గోళాకార కట్టడమిది. అడవిని తలపించేలా చెట్లతో నిండిన అధునాతన సదుపాయాలున్న ఈ భవంతి అమెరికాలోని సియాటెల్ సిటీలో సోమవారం ప్రారంభమైంది.

నేడే సూపర్ బ్లూ బ్లడ్ మూన్

సాయంత్రం 4.21- 7.37 గంటల మధ్య కనువిందు

న్యూఢిల్లీ: సుమారు 150 ఏళ్ల తర్వాత ఆకాశంలో నేడు ఒక అద్భుతం ఆవిష్కృతం కాబోతోంది. సూపర్‌మూన్, బ్లూమూన్, సంపూర్ణ చంద్రగ్రహణం మూడు కలసి కనువిందు చేయబోతున్నాయి. సంపూర్ణ చంద్రగ్రహణం సందర్భంగా భూమి పూర్తిగా నీడలోనే ఉండిపోనుండటంతో జాబిల్లి ముదురు ఎరుపురంగులో (బ్లడ్‌మూన్‌గా) కనిపించనుంది. సాయంత్రం 4.21 గంటలకు ప్రారంభమై రాత్రి 7.37 గంటల వరకు ఆసియా, తూర్పు రష్యా, మధ్య ప్రాచ్యప్రాంతం, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్‌లలో ఈ ఖగోళ వింత చోటుచేసుకోనుంది. అమెరికా పశ్చిమ ప్రాంతంలో ఇది మరింత బాగా కనపడవచ్చు.

భారత్ వ్యాప్తంగా...

మన దేశంలోనూ సంపూర్ణ చంద్ర గ్రహణాన్ని వీక్షించొచ్చని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. చందమామపై పాక్షిక నీడ లేదా భూమికి చెందిన పెన్యుంబ్రా నీడతో ఇది భారత్‌లో సాయంత్రం 5.20కి ప్రారంభమవుతుంది. ప్రధాన గ్రహణం మాత్రం సూర్యాస్తమయం తర్వాత 6.25 నిమిషాలకు ప్రారంభమై, తూర్పు వైపు ఆకాశంలో కనిపిస్తుంది. ఆ తర్వాత జాబిల్లి వెండి రంగులోకి మారుతుంది. కొన్ని నిమిషాల తరువాత మొత్తం నీడ పరచుకుంటుంది. రాత్రి 7.25 గంటల నుంచి దాని పరిమాణం క్రమంగా తగ్గుతూ ఉంటుంది. దీనిని నెలలో రెండో నిండుపున్నమి లేదా నీలవర్ణ చంద్రుడిగా (బ్లూమూన్)గా పిలుస్తారు(జనవరి 1న తొలి పౌర్ణమి ఏర్పడింది). బ్లూమూన్ సందర్భంగా నదులు, సముద్రాల్లో అలలు కొంచెం ఎత్తులో ఎగిసిపడతాయని, దీని వల్ల భయపడాల్సిందేమీ లేదని శాస్త్రవేత్తలు చెబుతున్నారు.

సూపర్‌మూన్...

చంద్రుడు గుండ్రంగా ఒక స్థిరకక్ష్యలో కాకుండా కొంచెం అటూ ఇటూగా (అప్సిడల్ ప్రిసిషన్)లో భ్రమిస్తుండటంతో కొన్ని పర్యాయాలు భూమికి కొంత సమీపంగా వస్తాడు. ఇలాంటి సందర్భాల్లో... పున్నమి రోజుల్లో సూర్యుడికి ఎదురుగా వస్తాడు. ఈ కారణంగా చంద్రుడి పరిమాణం పెరిగినట్లుగా అనిపిస్తుంది. ఈ విధంగా పౌర్ణమినాడు చంద్రుడు భూమికి దగ్గరగా వచ్చినపుడు 'సూపర్‌మూన్' అని పిలుస్తారు. భూమండలానికి సమీపంగా రావడం వల్ల చంద్రుడు కొంచెం పెద్దగా, మరింత ప్రకాశవంతంగా కనిపిస్తాడు. సాధారణంగా కనిపించే జాబిల్లితో పోల్చితే ఇది 30 శాతం పెద్దదిగా, రోజు కనిపించే దాని కంటే 14 శాతం ఎక్కువ ప్రకాశవంతంగా కనిపిస్తాడని సైంటిస్టులు వెల్లడించారు.

ఆకాశంలో చోటుచేసుకునే ఈ అరుదైన అద్భుత దృశ్యాన్ని వీక్షించేందుకు ప్రత్యేకమైన బైనాక్యులర్లు, టెలిస్కోప్‌ల అవసరం లేదని, మామూలుగా అందరూ చంద్రుడిని చూసినట్టే ఎలాంటి ఉపకరణాలు లేకుండా చూడొచ్చునని శాస్త్రవేత్తలు వెల్లడించారు. మరో సంపూర్ణ చంద్రగ్రహణం వచ్చే జూలై 27న ఏర్పడనుందని, అది బ్లూ లేదా సూపర్‌మూన్ మాత్రం కాదని వారు తెలిపారు.



ఎప్పుడు, ఎక్కడెక్కడ...

తెలుగు రాష్ట్రాల్లో విశాఖపట్నంలో సూపర్ బ్లూబ్లడ్ మూన్‌ను ముందుగా వీక్షించొచ్చు. హైదరాబాద్ ప్రజలు సంపూర్ణ చంద్రగ్రహణాన్ని మొత్తం చూసే అవకాశముంది. దేశవ్యాప్తంగా అయితే ఈశాన్య రాష్ట్రాలతో పాటు కోల్‌కతా ప్రజలు ఈ అద్భుతాన్ని అందరికన్నా ముందు చూడొచ్చు. చంద్రోదయం..అరుణాచల్‌ప్రదేశ్ రాజధాని ఇటానగర్‌లో సాయంత్రం 4.47 గంటలకు, కోల్‌కతా–5.16, పట్నా–5.25, ఢిల్లీ–5.53, చెన్నై–6.04, ముంబై–6 గంటల 27 నిమిషాలకు జరగనుంది.

2500 డాలర్లకు గ్రీన్‌కార్డ్!

అదనంగా చెల్లిస్తే సత్వరమే ఆమోదం!

- 'ఇమిగ్రేషన్ వాయిస్' సంస్థ ప్రతిపాదన
- మెక్సికో గోడ కోసం 4 బిలియన్ డాలర్లు సేకరించవచ్చని అంచనా
- డ్రీమర్ల ప్యాకేజీలో చేర్చాలని డిమాండ్



వాషింగ్టన్: భారతీయ అమెరికన్ల దశాబ్దాల గ్రీన్‌కార్డ్ ఎదురుచూపులకు అంతం పలికే దిశగా ఒక వినూత్న ప్రతిపాదన తెరపైకి వచ్చింది. గ్రీన్‌కార్డ్ కోసం దరఖాస్తు చేసుకున్నవారు అదనంగా ఏకమొత్తంలో 2500 డాలర్లను చెల్లిస్తే సత్వరమే గ్రీన్‌కార్డును అందించాలన్నదే ఆ ప్రతిపాదన. ప్రస్తుతం గ్రీన్‌కార్డుల జారీకి దేశాలవారీగా కోటా పరిమితి ఉన్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఈ ప్రతిపాదన కార్యరూపం దాలిస్తే.. అమెరికాలో ఉంటున్న వేలాది భారతీయుల శాశ్వత నివాస స్వప్నం నెరవేరుతుంది.

2500 డాలర్ల అదనపు చెల్లింపు ప్రతిపాదనను అమెరికాకు చెందిన 'ఇమిగ్రేషన్ వాయిస్' అనే స్వచ్ఛంద సంస్థ తెరపైకి తెచ్చింది. భారత్ సహా పలు దేశాల ఇమిగ్రేషన్ సమస్యల పరిష్కారానికి ఈ సంస్థ కృషి చేస్తోంది. ఈ అదనపు వసూలు వల్ల దాదాపు 4 బిలియన్ డాలర్లు(400 కోట్ల డాలర్లు) ఆర్థిక వ్యవస్థలోకి చేరుతాయని, ఆ మొత్తాన్ని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ లక్ష్యమైన మెక్సికో గోడ నిర్మాణానికి, అలాగే, దేశ అంతర్గత భద్రతను పటిష్టపరిచేందుకు వినియోగించవచ్చని ఆ సంస్థ సూచిస్తోంది. వాషింగ్టన్‌కు చెందిన ఈ స్వచ్ఛంద సంస్థ పలువురు అమెరికన్ చట్ట సభ్యులతో ఈ అంశంపై సంప్రదింపులు కొనసాగిస్తోంది. త్వరలో అమెరికన్ కాంగ్రెస్‌లో ప్రవేశపెట్టనున్న డ్రీమర్ల (డిఫర్డ్ యాక్షన్ అగైనెస్ట్ చైల్డ్‌వుడ్ అరైవల్స్) ప్యాకేజీలో ఈ ప్రతిపాదనను చేర్చాలని కాంగ్రెస్ సభ్యులపై ఒత్తిడి తీసుకొస్తోంది.

హెచ్–1బీ వీసాలపై అమెరికా వచ్చిన దాదాపు 10–15 లక్షల మంది భారతీయులు గ్రీన్‌కార్డ్ కోసం ఎదురుచూస్తున్నారు. కోటా పరిమితి కారణంగా గ్రీన్‌కార్డ్ పొందేందుకు నిపుణులైన భారతీయ వలసదారులు 25 ఏళ్ల నుంచి 92 ఏళ్ల వరకు ఎదురుచూడాల్సిన పరిస్థితి నెలకొందని జీసీ రిఫార్మ్స్ అనే సంస్థ చెబుతోంది. ప్రస్తుతం వీసా చట్టంలో సంస్కరణలకు ఉద్దేశించిన 'హెచ్ఆర్ 392'(ద ఫెయిర్‌నెస్ ఫర్ హై స్కిల్డ్ ఇమిగ్రెంట్స్ యాక్ట్) బిల్లు ఆమోదానికి ప్రయత్నాలు కొనసాగుతున్నాయి. అయితే ఆ బిల్లుకు 300 మంది కాంగ్రెస్ సభ్యుల మద్దతు ఉన్నా ఇప్పట్లో ఆమోదం పొందేలా కన్పించడం లేదు. అందువల్ల తాజా ప్రతిపాదనను త్వరలో అమెరికన్ కాంగ్రెస్‌లో ప్రవేశపెట్టబోయే డ్రీమర్ల(డీఏసీఏ) ప్యాకేజీలో అనుబంధంగా చేర్చాలని ఇమిగ్రేషన్ వాయిస్ డిమాండ్ చేస్తోంది. దీంతో అందరికీ ప్రయోజనం ఉంటుందని ఆ సంస్థ ప్రతినిధి లియోన్ ఫ్రెస్కో తెలిపారు. 'మెక్సికో గోడ నిర్మాణానికి అమెరికా డబ్బును వాడకూడదని ట్రంప్ భావిస్తున్నారు. మరోవైపు మెక్సికో కూడా డబ్బులు ఇచ్చేందుకు సిద్ధంగా లేదు. ఈ నేపథ్యంలో గ్రీన్‌కార్డులకు అదనంగా 2,500 డాలర్లను వసూలు చేసే అవకాశాన్ని వినియోగించుకోవాలి' అని ఆయన వాదిస్తున్నారు. ఈ ప్రతిపాదన కాంగ్రెస్‌కు నచ్చినా.. డీఏసీఏ బిల్లులో దీనిని చేర్చే విషయం అనుమానాస్పదమేనని ఆయన అన్నారు. తమ ప్రతిపాదనపై అమెరికన్ కాంగ్రెస్ సభ్యులు కెవిన్ యోడెర్, తులసీ గబ్బర్డ్‌లు వైట్‌హౌస్‌తో పాటు కాంగ్రెస్ నాయకత్వానికి లేఖలు రాశారని, డీఏసీఏ బిల్లులో చేర్చాలని వారు కోరారని ఆయన వెల్లడించారు. 'గ్రీన్‌కార్డు కోసం దశాబ్దాలు ఎదురుచూసే అవసరం లేకుండా ఐదారేళ్లలో వచ్చేలా చూస్తే ఇక్కడి భారతీయులు సహా.. చాలామంది దరఖాస్తుదారులు 2,500 డాలర్లు లేదా అంతకంటే ఎక్కువ ఒకేసారి చెల్లించేందుకు సిద్ధంగా ఉన్నారు. మెక్సికో గోడ కోసం దాదాపు 25 బిలియన్ డాలర్లు అవసరం. తాజా గ్రీన్‌కార్డు ప్రతిపాదనతో గోడ కోసం 4 బిలియన్ డాలర్లు సేకరించవచ్చు' అని ఫ్రెస్కో వెల్లడించారు.

స్వచ్ఛందమే..

ఈ ప్రతిపాదన ప్రకారం నలుగురు సభ్యులున్న ఒక కుటుంబం గ్రీన్‌కార్డు పొందాలంటే ఒకేసారి అదనంగా 10 వేల డాలర్లు చెల్లించాల్సి ఉంటుందని 'ఇమిగ్రేషన్ వాయిస్' సహ వ్యవస్థాపకుడు అమన్ కపూర్ తెలిపారు. ఈ ఫీజును గ్రీన్‌కార్డు దరఖాస్తుదారులు మాత్రమే చెల్లిస్తారని, స్వచ్ఛందంగానే వసూలు చేస్తారన్నారు. ఫీజు చెల్లించడం ఇష్టం లేకపోతే గ్రీన్‌కార్డు కోసం వరుసలో వేచి ఉండక తప్పదని అన్నారు. పదేళ్ల వ్యవధిలో గ్రీన్‌కార్డుకు 2,500 డాలర్ల చొప్పున 4 బిలియన్ డాలర్లు వసూలు కావచ్చని అంచనా వేస్తున్నారు.

'పుతిన్ లిస్టు' విడుదల

అధ్యక్ష ఎన్నికల్లో జోక్యం చేసుకున్నారన్న అమెరికా

- జాబితాలో 114 మంది రాజకీయ నాయకులు, 96 మంది వ్యాపారవేత్తలు



మాస్కో: అమెరికా, రష్యాల మధ్య ఉద్రిక్తతలు పెంచే దిశగా అగ్రరాజ్యం విడుదల చేసిన 'పుతిన్ లిస్టు' ప్రకంపనల్ని రేపుతోంది. తమ అధ్యక్ష ఎన్నికల్లో జోక్యం చేసుకున్నారని ఆరోపిస్తూ రష్యాకు చెందిన ప్రముఖ రాజకీయ నాయకులు, వ్యాపారవేత్తల పేర్లతో ఈ జాబితాను అమెరికా విడుదల చేసింది. అధ్యక్ష ఎన్నికల్లో జోక్యం చేసుకున్నందుకు రష్యాను శిక్షించాలని అమెరికన్ కాంగ్రెస్ చేసిన చట్టం అమల్లో భాగంగా సోమవారం అర్ధరాత్రి దాటాక అమెరికా ఆర్థిక శాఖ ఈ జాబితాను విడుదల చేసింది. రష్యా అధ్యక్ష భవనం క్రెమ్లిన్ వెబ్‌సైట్‌లో పేర్కొన్న పుతిన్ పరిపాలన యంత్రాంగంలోని అందరి పేర్లతో పాటు కేబినెట్ మంత్రుల్ని, ఆ దేశానికి చెందిన ప్రముఖ బిలియనీర్లను ఇందులో చేర్చింది. జాబితాలోని 114 మంది రాజకీయ నాయకుల్లో పుతిన్ సహాయకులు, కేబినెట్ మంత్రుల పేర్లు ఉండగా.. 96 మంది బిలియనీర్లలో వివాదరహితులుగా పేరొందిన పలువురు వ్యాపారవేత్తలు కూడా ఉండటం గమనార్హం. రష్యా ప్రధాని దిమిత్రి మెద్వెదెవ్, విదేశాంగ మంత్రి సెర్గీ లావ్‌రోవ్, నిఘా విభాగాలైన ఎఫ్ఎస్‌బీ, జీఆర్‌యూలకు చెందిన ఉన్నతాధికారులు కూడా ఇందులో ఉన్నారు. ఇక బిలియనీర్లలో ప్రముఖ ఆయిల్ వ్యాపారి, చెల్సియా ఫుట్‌బాల్ క్లబ్ యజమాని రోమన్ అబ్రమోవిక్, అల్యూమినియం వ్యాపారి ఓలెగ్ డెరిపస్క, 2012 అధ్యక్ష ఎన్నికల్లో పుతిన్‌పై పోటీచేసిన మిఖాయిల్ ప్రొఖొరావ్‌తో పాటు వివాదరహితులుగా పేరున్న ప్రముఖ సెర్చ్ ఇంజిన్ యాండెక్స్ వ్యవస్థాపకుడు అర్కడి వోలొజ్ తదితరులున్నారు.

నా పేరు లేదే..!: పుతిన్

పుతిన్ దీనిపై మాట్లాడుతూ జాబితాలో తన పేరు చేర్చనందుకు నిరాశ చెందానని వ్యంగ్యాస్త్రాలు సంధించారు. ఇది విద్వేష పూరిత చర్యని, ఈ పరిణామం అమెరికా–రష్యా సంబంధాల్ని మరింత జటిలం చేసిందని ఆయన పేర్కొన్నారు. అయితే ఈ విషయాన్ని మరింత పెద్దదిగా చేసే ఉద్దేశం తనకు లేదన్నారు. ఈ అంశాన్ని వదిలిపెట్టి దేశం గురించి, ఆర్థిక వ్యవస్థ గురించి రష్యా ఆలోచించాలని అన్నారు. రష్యా ప్రతినిధి అలెస్కీ చెపా మాట్లాడుతూ.. ఇది ఉద్రిక్తతల్ని పెంచే చర్యగా పేర్కొన్నారు.

8 నెలల పసిగుడ్డుపై అత్యాచారం

- దేశ రాజధానిలో తాగిన మైకంలో కామాంధుడి అఘాయిత్యం
- కోలుకుంటున్న చిన్నారి

న్యూఢిల్లీ: దేశ రాజధానిలో బాలికలపై, మహిళలపై అత్యాచారాలను మరిచిపోక ముందే మరో ఘోరం జరిగింది. అభం శుభం తెలియని 8 నెలల పసిగుడ్డుపై తాగిన మైకంలో ఓ కామాంధుడు అత్యాచారానికి పాల్పడ్డాడు. ఢిల్లీలోని నేతాజీ సుభాష్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఆదివారం చోటు చేసుకున్న ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. బాధితురాలి తల్లి ఇళ్లలో పని చేస్తుండగా.. తండ్రి కూలి పనిచేస్తూ జీవనం గడుపుతున్నారు. ఎప్పట్లాగే ఆదివారం ఉదయం తల్లి తన పసిబిడ్డను బంధువుల ఇంట్లో వదిలి పనికి వెళ్లింది. మధ్యాహ్నం ఇంటికి తిరిగి వచ్చేసరికి చిన్నారి బట్టల నిండా రక్తపు మరకలతో కనిపించింది. వెంటనే భర్తకు సమాచారం ఇచ్చి.. చిన్నారిని ఆస్పత్రికి తీసుకెళ్లింది. వైద్య పరీక్షల అనంతరం చిన్నారి అత్యాచారానికి గురైనట్లు వైద్యులు నిర్ధారించారు. అయితే ఆమె తమ బంధువుల ఇంట్లో పాపను వదిలివెళ్లిన కొద్దిసేపటికే.. బంధువైన 28 ఏళ్ల యువకుడు చిన్నారిని ఆడిస్తానని మాయమాటలు చెప్పి పక్కకు తీసుకెళ్లి అత్యాచారానికి ఒడిగట్టినట్లు పోలీసులు వెల్లడించారు. నిందితుడిని అరెస్టు చేశామని చెప్పారు. అత్యాచారానికి గురైన చిన్నారి శస్త్రచికిత్స అనంతరం కోలుకుంటోంది. త్వరలోనే డిశ్చార్జి చేస్తామని వైద్యులు వెల్లడించారు. ఇలాంటి ఘటనల్లో ఆరు నెలల్లోగా నిందితులకు శిక్ష పడాలని ఢిల్లీ మహిళా కమిషన్ చీఫ్ స్వాతి మలివాల్ డిమాండ్ చేశారు.

యశ్వంత్, శత్రుఘ్నుల 'రాష్ట్ర మంచ్'

న్యూఢిల్లీ: ప్రధాని మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం రైతులను బిచ్చగాళ్ల స్థాయికి తెచ్చిందని బీజేపీ అసమ్మతి ఎంపీ యశ్వంత్ సిన్హా మండిపడ్డారు. సొంత ప్రయోజనాల కోసం తప్పుడు లెక్కలను బీజేపీ చూపుతోందన్నారు. బీజేపీకి చెందిన మరో ఎంపీ శత్రుఘ్న సిన్హా సహా పలువురు నేతలతో కలసి 'రాష్ట్ర మంచ్' అనే రాజకీయ వేదికను యశ్వంత్ సిన్హా మంగళవారం ప్రారంభించారు. రాష్ట్ర మంచ్ అనేది పార్టీయేతర రాజకీయ కార్యాచరణ బృందమనీ, ఇది ఏ పార్టీకి వ్యతిరేకం కాదనీ, కేవలం దేశ ప్రయోజనాల కోసం పనిచేస్తుందని యశ్వంత్‌సిన్హా స్పష్టం చేశారు. కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా తాము ఉద్యమం చేపడతామన్నారు. కాంగ్రెస్, తృణమూల్, ఎన్సీపీ, ఆప్ ఎంపీలు వరసగా రేణుకా చౌదరి, దినేశ్ త్రివేది, మజీద్ మెమన్, సంజయ్ సింగ్‌లతోపాటు గుజరాత్ మాజీ సీఎం సురేశ్ మెహతా తదితరులు కూడా రాష్ట్ర మంచ్ ప్రారంభ కార్యక్రమానికి హాజరయ్యారు.

గోప్యతకు ఫేస్‌బుక్ రక్షణ



వాషింగ్టన్

సామాజిక మాధ్యమ దిగ్గజం ఫేస్‌బుక్ తొలిసారిగా తన గోప్యతా నిబంధనలను వెల్లడించింది. ప్రపంచవ్యాప్తంగా 200 కోట్ల మందికి పైగా ఫేస్‌బుక్ ఉపయోగిస్తుండగా, ఈ సంస్థ ఇప్పటివరకు ఇలాంటి నిబంధనలను ప్రకటించలేదు. ఫేస్‌బుక్ అకౌంట్ ప్రారంభించేందుకు వినియోగదారులకు నిర్దేశించే నియమ, నిబంధనలకు ఇవి భిన్నమైనవి. ఈ మాధ్యమాన్ని ఉపయోగించేవారు తాము 'యాక్సెస్' చేసే అంశాలపై నియంత్రణకు వీటిని అమల్లోకి తెస్తున్నట్టు ఫేస్‌బుక్ తెలిపింది. ఫేస్‌బుక్ యూజర్స్‌కు వారి గోప్యతపై నియంత్రణ కల్పించడంతో పాటు, వారు షేర్ చేసే సమాచారాన్ని సొంతం చేసుకునేందుకు ఈ నిబంధనలు ఉపయోగపడతాయని పేర్కొంది. వినియోగదారులు వారి సమాచారాన్ని ఏవిధంగా పరిరక్షించుకోవచ్చో వివరించే వీడియోలను ఫేస్‌బుక్ త్వరలోనే విడుదల చేయనుంది. ఫేస్‌బుక్ వినియోగించే వారందరూ తమ సమాచారాన్ని అందరితో పంచుకోవాలని (తమ సంస్థతో సహా) కోరుకోవడం లేదని గుర్తించినట్టు తెలిపింది.

జీడీపీఆర్ చట్టం నేపథ్యంలో...

యూరోపియన్ యూనియన్ (ఈయూ) తీసుకొచ్చిన నూతన డేటా పరిరక్షణ చట్టం జీడీపీఆర్ (జనరల్ డేటా ప్రొటెక్షన్ రెగ్యులేషన్) మే 25 నుంచి అమలుకానుంది. జీడీపీఆర్ చట్టాన్ని అనుసరించడంలో భాగంగానే ఫేస్‌బుక్ తాజా చర్యకు ఉపక్రమించినట్లు తెలుస్తోంది. వినియోగదారులు తమ డేటాను ఎలా మేనేజ్ చేసుకోవచ్చు, పాత పోస్ట్‌లను ఏ విధంగా తొలగించవచ్చు, అకౌంట్‌ను పూర్తిగా తొలగించినప్పుడు డేటా ఏమవుతుందన్న విషయాలను వివరించనున్నట్టు ఆ సంస్థ ప్రకటించింది. గతంలో ఆన్‌లైన్ కార్యకలాపాలను ట్రాక్ చేసే విషయంలో ఈయూ పర్యవేక్షకుల దర్యాప్తులను ఫేస్‌బుక్ ఎదుర్కొంది. జీడీపీఆర్ ప్రకారం.. ఏవైనా కంపెనీల డేటా చోరీకి గురైతే ఆ విషయాన్ని ఆయా కంపెనీలు 72 గంటల్లోనే ప్రకటించాలి. వినియోగదారులు డేటాను పంపేందుకు/తొలగించేందుకు కంపెనీలు అనుమతించాల్సి ఉంటుంది.

గోప్యత నిబంధనలు ఇవే...

తమ డేటాను ఫేస్‌బుక్ యూజర్స్ నియంత్రించుకునేందుకు దోహదపడేలా ఈ నిబంధనలను ప్రకటిస్తున్నట్లు చీఫ్ ప్రైవసీ ఆఫీసర్ ఎరిన్ ఎగన్ చెప్పారు. ఆ వివరాలు ఆయన మాటల్లోనే...

- వినియోగదారుల గోప్యతపై వారికే నియంత్రణ కల్పిస్తున్నాం. ఈ నియంత్రణలేమిటో వారే తెలుసుకుని తదనుగుణంగా వ్యవహరించాలి. ఉదాహరణకు... మా ఆడియన్స్ సెలక్టర్ టూల్ వినియోగదారులు ప్రతి పోస్ట్‌ను ఎవరితో షేర్ చేసుకోవాలనే దానిని నిర్ణయించే అధికారాన్ని కల్పిస్తుంది.
- డేటాను ఫేస్‌బుక్ ఎలా ఉపయోగిస్తుందన్నది యూజర్స్ అర్థం చేసుకునేలా సహాయపడతాం. రోజువారీ ఫేస్‌బుక్ వినియోగంలో భాగంగా ఎడ్యుకేషన్, టూల్స్ వంటి వాటిని జతచేశాం.
- సమాచారాన్ని భద్రంగా ఉంచేందుకు కష్టపడి పనిచేస్తున్నాం. ప్రతి ఫేస్‌బుక్ ప్రొడక్ట్‌లోనూ భద్రతాంశాన్ని పొందుపరుస్తున్నాం. దీనికోసం 'టూ ఫ్యాక్టర్ అథెంటికేషన్' అనే సెక్యూరిటీ టూల్‌ను కూడా అందుబాటులోకి తెచ్చాం.
- వినియోగదారులు తమ సమాచారాన్ని వారే తొలగించవచ్చు. ఎవరితో ఏమి షేర్ చేయాలన్నది వారే నిర్ణయించవచ్చు. వినియోగదారులు ఎప్పుడు కోరుకుంటే అప్పుడు సమాచారాన్ని మా సర్వర్ల నుంచి తొలగిస్తాం.



గాంధీ వర్ధంతి సందర్భంగా సైదాపురం వద్ద ఆయన చిత్రపటానికి నివాళులర్పిస్తున్న జగన్



కలిచేడు వద్ద చేనేతల ఆత్మీయ సమ్మేళనంలో ప్రసంగిస్తున్న ప్రతిపక్ష నేత వైఎస్ జగన్

మీ కష్టాలు చూశాకే.. 45 ఏళ్లకే పింఛన్

ప్రజా సంకల్ప యాత్ర నుంచి సాక్షి ప్రత్యేక ప్రతినిధి: మీ కష్టాలు కళ్లారా చూసినందునే ఎస్సీ, ఎస్టీ, బడుగు బలహీన వర్గాలు, మైనార్టీ మహిళలకు 45 ఏళ్లకే పింఛన్ ఇవ్వాలన్న నిర్ణయం తీసుకున్నానని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, ప్రతిపక్ష నేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చెప్పారు. చేనేత కార్మికుల కోసం ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేసి వారిని అన్ని విధాలా ఆదుకుంటామని హామీ ఇచ్చారు. నూలు కొనుగోలుపై రూ.2 వేల సబ్సిడీ ఇస్తామని ప్రకటించారు. వారి హృదయాల్లో చిరస్థాయిగా నిలిచేలా సంక్షేమానికి, అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. ఆరిజాన్ కార్డుల (చేతి వృత్తుల వారు రుణాలు, సబ్సిడీలు పొందేందుకు) జారీ అర్థవంతంగా ఉండేలా చర్యలు తీసుకుంటానని చెప్పారు. ప్రజా సంకల్ప యాత్రలో భాగంగా 75వ రోజు మంగళవారం శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా వెంకటగిరి నియోజకవర్గంలోని కలిచేడు సమీపంలో జరిగిన చేనేతల ఆత్మీయ సమ్మేళనంలో ఆయన ఉద్వేగభరితంగా ప్రసంగించారు. చంద్రబాబు నాలుగేళ్ల పాలనలో మన జీవితాలు ఏమైనా మెరుగుపడ్డాయా? అని ప్రశ్నించుకోవాల్సిన సమయం ఆసన్నమైందని, ఇంకో ఏడాదిలో ఎన్నికలు జరగబోతున్నాయని చంద్రబాబే ఊదరగొడుతున్న పరిస్థితిలో మనకు ఎలాంటి నాయకుడు కావాలో ఆలోచించాలన్నారు. ఈ సమ్మేళనంలో జగన్ ఇంకా ఏమన్నారంటే..

> మనం ఎంతగా బాధలు పడతా ఉన్నా చంద్రబాబు పట్టించుకోడు.. చేనేతలు ఉపయోగించే ముడి సరుకుల ధరలు రూ.4 వేల నుంచి రూ.7 వేలకు పెరిగినా పట్టించుకోడు.. మరోవైపు అమ్మకం రేట్లు దారుణంగా పడిపోతున్నా పట్టించుకోడు.. కుటుంబం యావత్తు నాలుగు రోజులు కష్టపడినా రూ.800 రావడం లేదు. అంటే రోజుకు రూ.200 కూడా రావడం లేదు. చేనేతలు ఇవాళ ఇంతటి దారుణమైన పరిస్థితిలో ఉన్నారు. – వైఎస్ జగన్

అంగీకరించే స్థితిలోనూ ప్రభుత్వం లేదు...

ధర్మవరం ప్రాంతంలో చేనేత కార్మికులు 34 మంది ఆత్మహత్యలు చేసుకున్నప్పుడు ఎవ్వరూ పట్టించుకోని దశలో నేను స్వయంగా అక్కడికి వెళ్లా. ఆత్మహత్యలు చేసుకున్నారని ఒప్పుకుంటే ఎక్కడ చెడ్డపేరు వస్తుందోనని, రూ.5 లక్షల ఎక్స్‌గ్రేషియో ఇవ్వాల్సి వస్తుందేమోనని ప్రభుత్వం అస్సలు పట్టించుకోలేదు. అటువంటి పరిస్థితుల్లో చేనేత మహిళలు రోజుల తరబడి నిరాహార దీక్షలు చేస్తుంటే నేను అక్కడికి వెళ్లా. ఆత్మహత్యలు చేసుకున్న వారి ప్రతి ఇంటికీ వెళ్లింది ఎవరైనా ఉన్నారా అంటే అది నేనే అని గర్వంగా కూడా చెబుతా. వాళ్లు ఎలా బతుకుతున్నారో.. వాళ్ల సమస్యలు ఏమిటో స్వయంగా తెలుసుకున్నా. మహిళల దీక్షా శిబిరానికి వెళ్లినప్పుడు నిజంగా చాలా బాధ అనిపించింది. 37 రోజులుగా దీక్ష చేస్తున్నారు కదా, ఎవరైనా వచ్చారా? అని అడిగాను. ఎవ్వరూ పట్టించుకోవడం లేదని ఆ తల్లులు చెప్పారు. మరి రిలే దీక్షలు ఎందుకు చేస్తున్నారని అడిగా? నెలనెలా ఇస్తామన్న సబ్సిడీ ఇవ్వాలని కోరుతున్నామయ్యా అని చెప్పారు. పదేళ్ల కిందట వైఎస్ హయాంలో రూ.600 సబ్సిడీ ఉండేదని, దాన్ని రూ.వెయ్యికి పెంచుతున్నట్టు చంద్రబాబు ఊదరగొట్టారని, దాన్ని ఇవ్వాలని ధర్నా చేస్తున్నామన్నారు.

సబ్సిడీ ఇచ్చి మూడేళ్లయింది..

వెయ్యి రూపాయల సబ్సిడీ అని ఊదరగొట్టిన పెద్దమనిషి మీకు (చేనేతలకు) సబ్సిడీ ఇచ్చి ఎన్ని నెలలైంది? (మూడేళ్లు అయిందని మహిళల నుంచి జవాబు) మూడేళ్లు అయింది. పరిస్థితి దారుణంగా తయారైంది. జగన్ ధర్మవరానికి వస్తున్నారంటే కొద్దో గొప్పో ఇవ్వడం, ఆ తర్వాత ఆపేయడంతో కథ మళ్లీ మొదటికి రావడం మామూలైంది. ఎన్నికలు వచ్చేసరికి మాత్రం చంద్రబాబుకు బీసీలు అమాంతం గుర్తుకు వస్తారు. ఇదిగో (టీడీపీ ఎన్నికల ప్రణాళికలోని చంద్రబాబు ఫొటోలను చూపిస్తూ) ఇలా పోజులు పెడతాడు. గౌడ సోదరులు ఎవరైనా కనబడితే వాళ్ల భుజం మీది ట్యూబ్‌ను తన భుజం మీద వేసుకుని పోజు పెట్టి ఫొటో దిగుతాడు. బుట్టలు అల్లుకునే వాళ్లు కనబడితే బుట్టలల్లినట్టు పోజు పెట్టి ఫొటో దిగుతాడు. చేనేత కార్మికులు మగ్గం నేస్తా ఉంటే అక్కడ మంచి పోజు పెట్టి ఫొటో దిగుతాడు. ఎన్నికలకు ముందు ఇలా ఎన్నో పోజులు పెట్టి ఫొటోలు దిగి ఎన్నికల ప్రణాళికలో పెడతాడు. ఇలా ప్రతి కులానికీ ఒక పేజీ పెట్టి ఏ కులాన్నీ వదలకుండా మోసం చేశాడు.

గొప్ప కార్యక్రమం పేదల చదువు..

మనం ప్రకటించిన కార్యక్రమాలలో గొప్పది పేదల చదువు. దివంగత నేత వైఎస్ రాజశేఖరరెడ్డి గారు పేద కుటుంబాలు అప్పుల పాలు కాకూడదని ఆలోచించి.. ఆ రోజుల్లోనే ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని ప్రవేశపెట్టారు. ఈ వేళ మన పిల్లలు పెద్ద చదువులు చదవాలంటే లక్షల్లో ఫీజులు కట్టాల్సిన పరిస్థితి. కానీ చంద్రబాబు ప్రభుత్వం మాత్రం ఈ పథకం కింద ముష్టి వేసినట్టు రూ.30 వేలో, రూ.35 వేలో ఇస్తోంది. మిగతా డబ్బును పేదలు ఎక్కడి నుంచి తెచ్చి కడతారు? అందుకే మన ప్రభుత్వం రాగానే మీ పిల్లల్ని ఇంజినీర్లు చేస్తారో, డాక్టర్లు చేస్తారో, కలెక్టర్లు చేస్తారో, మరేదయినా పెద్ద కోర్సు చదివిస్తారో.. మీ ఇష్టం. ఎన్ని లక్షలు ఖర్చయినా పూర్తిగా ప్రభుత్వమే భరిస్తుంది. హాస్టల్ ఖర్చుల కింద ప్రతి పిల్లవానికీ ఏడాదికి రూ.20 వేలు ఇచ్చి తోడుగా ఉంటాం. చిట్టిపిల్లలను బడికి పంపే ప్రతి తల్లికీ ఏటా రూ.15 వేలు ఇస్తాం. అవ్వాతాతల పింఛన్‌ను రూ.2 వేలు చేస్తాం. ఎస్సీ,ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాల మహిళలకు పింఛన్ రూ.2 వేలు చేయడమే కాకుండా పింఛన్ పొందే వయసునూ 45 ఏళ్లకే తగ్గిస్తాం. అలా చేయడం వల్ల రెక్కాడితే గాని డొక్కాడని ఆ వర్గాలకు ఊరట ఉంటుంది. బతకడానికి భయపడే పరిస్థితి ఉండదు.

వైద్యం ఖర్చు రూ.వెయ్యి దాటితే ఆరోగ్యశ్రీ వర్తింపు

మనందరి ప్రభుత్వం వచ్చాక ఆరోగ్య శ్రీని మార్పు చేస్తాం. ఈ వేళ పరిస్థితి ఏ స్థాయికి దిగజారిందంటే మెదడుకో, గుండెజబ్బో, న్యూరాలజీ సమస్యో వస్తే హైదరాబాద్‌లోని మంచివైన పెద్దాస్పత్రులకు పేదలు పోయే పరిస్థితి లేదు. ఎందుకో తెలుసా? అక్కడ ఆరోగ్యశ్రీ వర్తించదట. ఇక్కడేమో మంచి ఆస్పత్రులు ఉండవు, మంచి ఆస్పత్రులున్న హైదరాబాద్, బెంగళూరు, చెన్నై వంటి చోట్ల ఆరోగ్య శ్రీ వర్తించకుండా చేశారు. నేను పాదయాత్ర చేస్తున్నప్పుడు నిత్యం రెండుమూడు కేసులు ఇట్లాంటివే (ఆరోగ్యశ్రీకి సంబంధించినవి) వస్తున్నాయి. అందుకే మన ప్రభుత్వం వచ్చాక వేయి రూపాయల ఖర్చు దాటే ఎటువంటి వ్యాధినైనా పూర్తిగా ఆరోగ్యశ్రీలోకి తీసుకువస్తాం. ఎన్ని లక్షలు ఖర్చు అయినా మంచి ఆస్పత్రిలో వైద్యం చేయిస్తాం. అది హైదరాబాద్ అయినా, బెంగళూరు అయినా, చెన్నై అయినా సరే ఆరోగ్యశ్రీ పథకంలో భాగంగా ఉచితంగా వైద్యం చేయిస్తాం. డాక్టర్ల సలహా మేరకు చికిత్స అనంతర విశ్రాంతి కాలానికీ డబ్బులు ఇస్తాం. తలసీమియా, మూత్రపిండాలు వంటి దీర్ఘకాలిక వ్యాధులతో ఇబ్బందులు పడే వారికి పది వేల రూపాయల పెన్షన్ కూడా ఇస్తాం'' అని వైఎస్ జగన్ హామీ ఇచ్చారు.




చేనేతల ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతున్న వైఎస్ జగన్, చిత్రంలో ఎంపీ వరప్రసాద్, జెడ్పీ చైర్మన్ బొమ్మిరెడ్డి రాఘవేంద్రరెడ్డి, ఎమ్మెల్యేలు కిలివేటి సంజీవయ్య, పి.అనిల్‌కుమార్, చేనేత సంఘం నాయకులు

చేనేత కార్మికులకు రుణమాఫీ ఏమైంది?

చేనేత కార్మికులకు బ్యాంకు రుణాలు మాఫీ అన్నాడు. అయ్యాయా? (లేదు, లేదు అని జనం నుంచి జవాబు) ఒక్కో చేనేత కుటుంబానికి తక్కువ వడ్డీకి లక్ష రూపాయల వరకు రుణ సౌకర్యం అన్నాడు. ఇచ్చాడా? (లేదు, లేదు అని స్పందన) జిల్లాకో చేనేత పార్క్ అన్నాడు.. ఎక్కడైనా ఏర్పాటు చేశాడా? బడ్జెట్‌లో ప్రతి ఏటా వేయి కోట్ల రూపాయలు కేటాయిస్తానన్నాడు. అదీ చేయలేదు. ప్రతి చేనేత కుటుంబానికి రూ.1.50 లక్షలతో ఉచితంగా ఇల్లు, మగ్గం షెడ్ కట్టిస్తానన్నాడు.. కట్టించాడా? (లేనేలేదని అరుపులు, కేకలు) హామీల సంగతి ఇలా ఉంటే.. మరోపక్క ఉన్నవి కూడా పోయిన పరిస్థితి.

ఇలా చేస్తాం..

చేనేతలకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేస్తాం. ప్రతి చేనేత కుటుంబానికి రూ.2 వేల సబ్సిడీ ఇస్తాం. చేనేతలకు ప్రత్యేకంగా ఇంకా ఏం చేయాలో సూచిస్తే పాదయాత్ర ముగిశాక జరిగే బీసీ గర్జనలో ప్రకటించే డిక్లరేషన్‌లో పెట్టి ప్రతి కుటుంబానికి అండగా ఉండేలా కార్యక్రమాలు చేపడతాం. మనందరి ప్రభుత్వం వచ్చాక నవరత్నాలతో పేదలందరినీ ఆదుకుంటాం. జన్మభూమి కమిటీలు తీసేస్తాం. ప్రతి గ్రామంలో సచివాలయం ఏర్పాటు చేసి మీ గ్రామంలోనే పది మందికి ఉద్యోగాలు ఇస్తాం. మీ సమస్యలు 72 గంటల్లోగా పరిష్కారమయ్యేలా చూస్తాం.



75వ రోజు

30-01-2018, మంగళవారం

తలుపూరు క్రాస్‌రోడ్డు,

శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా

ప్రజా సంకల్పం పాదయాత్ర డైరీ

'పట్టు'సడలుతున్న చేనేత బతుకులు

సిద్ధలయ్యకోన ఎస్టీ కాలనీలో 90 ఏళ్ల అవ్వ దయనీయ పరిస్థితి చూశాక.. అసలీ ప్రభుత్వం సిగ్గెందుకుపడటంలేదా అనిపిస్తోంది. నడుం వంగిపోయి, జవసత్వాలుడిగిపోయి, ఇద్దరు మనుషుల ఆసరాతో దీనంగా నా వద్దకొచ్చి ఆమె బాధ చెప్పుకొంది. దశాబ్దాల కిందటే భర్త చనిపోయాడట. కన్నకొడుకు పట్టించుకోవడంలేదట. ఎక్కడో ఊరి బయట ఓ గుడిసెలో ఉంటుందట. చినుకు పడితే నీళ్లన్నీ ఇంట్లోనే.. సూర్యచంద్రులు కనిపించేలా ఉందట. ఊళ్లోవాళ్లు దయతో ఓ ముద్దపెడితే కడుపు నింపుకొంటోందట. 'చావాలనిపిస్తోందయ్యా..' అన్న ఆ అవ్వ మాటలు కలచివేశాయి. ప్రభుత్వ సాయం పొందడానికి ఇంతకన్నా ఇంకేం అర్హత కావాలి? కనీసం ఇలాంటి వాళ్లనైనా ఈ ప్రభుత్వం కనికరించదా?

కూలి పనులకెళ్లే సుమతి అనే అక్క బాధ వింటే.. మనసున్న ఏ గుండె అయినా కరిగిపోతుంది. 90 శాతం మానసిక, శారీరక వైకల్యంతో ఉన్న కొడుకుని చూస్తూ.. ఆ తల్లి కన్నీరు పెట్టని రోజు లేదని చెప్పింది. భర్త తాగుడుకు బానిసై.. పోషించే దిక్కులేకపోయినా, జీవితాన్ని కరగదీసి అతికష్టంమీద బతుకు బండిని లాగుతున్నానని చెప్పింది. ఇక ఓపిక నశించిందని కన్నీరు పెట్టింది. కనీసం పింఛన్ అయినా ఇవ్వాలని అధికారుల చుట్టూ తిరుగుతున్నా పట్టించుకోవడం లేదంటూ బావురుమంది. ఆ పరిస్థితుల్లో ఉన్న ఆ తల్లి గోడు చంద్రబాబు జన్మభూమి కమిటీలకు ఎందుకు వినిపించలేదు? బతకడానికైనా భరోసా ఇవ్వలేని ఈ ప్రభుత్వం.. ఆ కన్నీటికి ఏం సమాధానం చెబుతుంది?

కలిచేడు వద్ద 'మా స్కూలు మూసేస్తారంట సార్.. మేం పేద పిల్లకాయలం, బయటికెళ్లి చదువుకోలేం. మా స్కూలు మాకు కావాలి సార్' అంటూ మైకా కార్మిక సంక్షేమ పాఠశాల విద్యార్థినులు కన్నీరు పెట్టుకున్నారు. ఇక్కడున్న ఆస్పత్రిని కూడా మూసేశారని కార్మికులు, ప్రజలు వాపోయారు. రాయల్టీలు, సెస్‌ల రూపంలో కోట్లాది రూపాయల ఆదాయాన్ని గడిస్తున్న ప్రభుత్వం మైనింగ్ కార్మికుల గురించి, వారి పిల్లల గురించి పట్టించుకోకపోతే ఎలా?

వెంకటగిరి చేనేతకు ప్రసిద్ధి. తమ శ్రమతో, కళాత్మక నైపుణ్యంతో ప్రపంచ ప్రసిద్ధి పొందిన ఈ చేనేత కుటుంబాల జీవితాలిక్కడ సమస్యల వలయాలు. చిన్న వయసులోనే రోగాల బారిన పడుతున్నవారు, బతుకీడ్చలేక ఆత్మహత్యలు చేసుకుంటున్నవారు ఎందరెందరో. కలిచేడులో జరిగిన చేనేతల ఆత్మీయ సమ్మేళనంలో ఆ కుటుంబాల వ్యథా భరిత గాథలు వింటుంటే చాలా బాధేసింది. ఎన్నికలప్పుడు చంద్రబాబు బూటకపు హామీలిచ్చి ఒక్కటీ నెరవేర్చలేదు. నేతన్నలకు తోడుగా నేను గళం విప్పినప్పుడు మాత్రం ప్రభుత్వంలో కదలిక వస్తోందని, పరిహారమైనా, సబ్సిడీలైనా అప్పుడు మాత్రం హడావుడిగా ఇస్తున్నారని చెప్పారు. 'అన్నా.. ఈ ప్రభుత్వం మూడేళ్లుగా మమ్మల్ని పట్టించుకోవడం లేదు. ఇప్పుడు మీరొచ్చారు కాబట్టి, మీ నోట్లోంచి మాటొచ్చింది కాబట్టి.. ప్రభుత్వంలో కదలిక వస్తుందని ఆశిస్తున్నాం' అన్న వారి మాటలు విన్నాక.. ఈ ప్రభుత్వం ఎంత అన్యాయంగా పనిచేస్తోందో మరింతగా తేటతెల్లమైంది.

ముఖ్యమంత్రిగారికి నాదో ప్రశ్న.. చేనేతలకు వెయ్యి కోట్లతో నిధి, ఆరోగ్య బీమా, వడ్డీ లేకుండా రుణాలు, ఇళ్లు, షెడ్లు, రుణమాఫీ.. అంటూ మీ మేనిఫెస్టోలోని 21వ పేజీలో 25 హామీలను గుప్పించారు గుర్తుందా? ఏ ఒక్కటైనా నెరవేర్చారా? ఇచ్చిన హామీలను గాలికొదిలేయడమే గాక ఉన్న సబ్సిడీలను, బీమాలను, ఇతర పథకాలను నిలిపివేయడం వంచన కాదా?

వైఎస్. జగన్.



ధైర్యంగా ఉండండి.. సమస్యలు పరిష్కరిస్తాం..

ఆత్మీయ సమ్మేళనంలో పలువురు తమ సమస్యలను జగన్ దృష్టికి తెచ్చారు. చట్టసభల్లో చేనేతలకు ప్రాతినిధ్యం ఉండేలా చూడాలని తులసీ కృష్ణ, పేదల గురించి ఇంతగా ఆలోచిస్తున్న మీరు సీఎం కావాలని కళ్యాణ్, మీరొస్తేనే నేతన్నలకు మంచి రోజులొస్తాయని సుబ్రమణ్యం, చంద్రబాబు చేనేతలకు చేసిందేమీ లేదని శ్రీనివాసులు, వెంకటరత్నమ్మ తదితరులు జగన్‌కు సమస్యలు విన్నవించారు. మనందరి ప్రభుత్వం రాగానే సమస్యలు పరిష్కారమవుతాయని ఆయన వారికి ధైర్యం చెప్పారు.

చేనేతలకు ప్రత్యేక బ్యాంకు కావాలి



చేనేత కార్మికులకు ఏ బ్యాంకూ రుణాలు ఇవ్వడం లేదు. అత్యధిక వడ్డీలకు ప్రైవేటు అప్పులు తెచ్చుకుని, ఇల్లూ వాకిళ్లు అమ్ముకుని పిల్లలను చదివించుకుంటున్నారు.. పెళ్లిళ్లు చేస్తున్నారు. చేనేత కార్మికులకు ప్రత్యేకంగా ఒక బ్యాంకు ఏర్పాటు చేయాలి. – ఈశ్వరయ్య

మీది మాట తప్పని వంశమన్నా



అన్నా.. మీరు చెప్పిన పథకాలన్నీ చాలా బాగున్నాయి. కానీ జగనన్న 45 ఏళ్లకే పెన్షన్లు ఇస్తాడా? నమ్మాలా? అంటున్నారు. మీ నాన్న రాజశేఖరరెడ్డి గారు.. అప్పట్లో వర్షాలు వచ్చినప్పుడు ఇక్కడకు వచ్చారు. బస్తా బియ్యం, రూ.2 వేలు ఇస్తానని చెప్పాడు. చెప్పడమే కాదు. ఇచ్చి చూపించాడన్నా.. అదీ వైఎస్ పవర్. – పద్మ, మహిళా కాంగ్రెస్ మాజీ నాయకురాలు

ప్రజా సంకల్ప యాత్ర — మరిన్ని చిత్రాలు టాబ్లాయిడ్‌లో

ప్రజాసంకల్ప యాత్ర 75వ రోజు	75వ రోజు	
ఇప్పటి వరకూ నడిచిన దూరం 1,019.9 కిలో మీటర్లు	నడిచిన దూరం 14.9 కిలో మీటర్లు	ప్రారంభం: ఉ. 8 గంటలకు సైదాపురం
		ముగింపు: సా. 5 గంటలకు తలుపూరు క్రాస్‌రోడ్డు
		ముఖ్యాంశాలు: సైదాపురం, సిద్ధలయ్యకోన, పోకందుల క్రాస్, ఊటుకూరు, గిద్దలూరు క్రాస్, కలిచేడు, తలుపూరు క్రాస్ రోడ్డులో జనంతో మమేకం.
		▪ తురిమెర్లలో పార్టీ జెండా ఆవిష్కరణ.
		▪ కలిచేడులో చేనేత వర్గాల ఆత్మీయ సమ్మేళనం

నేటి పాదయాత్ర షెడ్యూల్

ప్రారంభం: ఉదయం 8 గంటలకు తలుపూరు క్రాస్‌రోడ్డు

ముఖ్యాంశాలు
- సైదాపురం మండలం తలుపూరు క్రాస్ రోడ్డు, సర్వేపల్లి నియోజకవర్గం పొదలకూరు మండలంలోని మలిచేడు క్రాస్, దేగపూడి, ఇనుకుర్తి, మర్రిపల్లి, పొదలకూరులో జనంతో మమేకం.
- పొదలకూరు సెంటర్‌లో బహిరంగ సభ

'పల్స్'లో లేకుంటే.. పింఛన్ కట్!

▶ మొదటి పేజీ తరువాయి

అవకాశాలున్నాయని అధికారులు చెబుతున్నారు. పింఛనుదారులు వీఆర్వో వద్ద లేదా గ్రామ పంచాయతీ కార్యాలయంలో ప్రత్యేకంగా నియమించిన ఉద్యోగి వద్ద తమ కుటుంబ వివరాలను నమోదయ్యాయా లేదా అన్నది పరిశీలించుకోవాలని సూచిస్తున్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల ద్వారా లబ్ధి పొందాలంటే ప్రజలు తమ పేర్లు, కుటుంబ వివరాలను పల్స్ సర్వేలో తప్పనిసరిగా నమోదు చేసుకొని ఉండాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ఇటీవల ప్రకటించిన సంగతి తెలిసిందే. సర్వేలో పేర్లు నమోదు చేసుకోని వారికి ప్రభుత్వ పథకాలు వర్తించబోవని సీఎం తేల్చిచెప్పారు.

జిల్లా	మొత్తం పింఛనుదారులు	పల్స్ సర్వేలో నమోదు కానివారు
అనంతపురం	4,05,712	47,799
చిత్తూరు	4,02,416	38,886
వైఎస్సార్	2,57,521	32,489
తూర్పు గోదావరి	4,92,112	44,325
గుంటూరు	3,79,124	45,993
కృష్ణా	3,53,101	40,338
కర్నూలు	3,27,398	36,127
ప్రకాశం	3,10,682	29,598
నెల్లూరు	2,52,639	31,515
శ్రీకాకుళం	2,85,594	30,410
విశాఖపట్నం	3,36,607	30,600
విజయనగరం	2,62,363	28,262
పశ్చిమ గోదావరి	3,67,323	33,321
మొత్తం	44,32,592	4,69,346

కడుపులో బిడ్డ అడ్డం తిరిగింది
అయినా ప్రాణం పోసింది
పెద్దయ్యాక మళ్లీ అడ్డం తిరిగాడు
ఆమె 'చితి'కిపోయింది
ఆమె.. ఓ తల్లి!

●●●

అందమే శాపమైంది
అడుగడుగూ అగ్నిగుండమైంది
కామం కత్తి దూసింది
ఆమె గొంతు తెగింది
ఆమె.. ఓ అక్క!!

●●●

అనురాగాలు పంచే గారాలపట్టి
పెళ్లయి మెట్టింటికి వెళ్లింది
కట్నకానుకలన్నీ మోసుకెళ్లింది
కొద్దిరోజులకే వేధింపులకు ఆహుతైంది
ఆమె.. ఓ చెల్లి!!

●●●

చిరుప్రాయం చిట్టితల్లి
ఆటలాడుతూ రోడ్డెక్కింది
'చాక్లెట్' ఆశతో వెంట నడిచింది
ముళ్లపొదల్లో నెత్తురుముద్దయింది
ఆమె.. ఓ ముద్దులొలికే పాపాయి!!!

ఓ తల్లి, చెల్లి, అక్క, పాపాయి.. ఎవరైతేనేం..? 'ఆమె'పై జరుగుతున్న అఘాయిత్యాలెన్నో! వెలుగుచూడని దారుణాలు ఇంకెన్నో..! మరి కనీసం వెలుగుచూస్తున్న నేరాల్లో దోషులెందరు చట్టం ముందు నిలబడుతున్నారు? వారిలో ఎందరికి శిక్షలు పడుతున్నాయి? ఎందరు ఊచలు లెక్కిస్తున్నారు? ఈ లెక్కలన్నీ సమాజాన్ని వెక్కిరిస్తూనే ఉన్నాయి. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లో నమోదవుతున్న నేరాల్లో పదంటే పది శాతం కేసుల్లో కూడా దోషులకు శిక్షలు పడటం లేదు. విచారణలో ఏళ్లకేళ్లు జాప్యం.. ఈలోపు మళ్లీ బెదిరింపులు.. బలవంతపు రాజీలు.. వెరసి అన్యాయం జరిగినవారికే మళ్లీ అన్యాయం!!

ఆమెపై అలక్ష్యం



- మహిళలపై నేరాల కేసుల్లో ఏళ్లకేళ్లు దర్యాప్తు.. విచారణ
- నేర పరిశోధనలో లోపాలెన్నో, కోర్టుల చుట్టూ ప్రదక్షిణలు
- సంవత్సరాలు గడుస్తున్నా దక్కని న్యాయం
- ఈ ఆలస్యమే మృగాళ్లలో 'ధైర్యం' పెంచుతోంది
- కేసుల విచారణకు ఫాస్ట్ ట్రాక్ కోర్టులుండాలి: నిపుణులు

ఎన్‌సీఆర్బీ గణాంకాల ప్రకారం... మహిళలపై నేరాల కేసులు

రాష్ట్రం	2014	2015	2016
ఏపీ	16,526	15,967	16,362
తెలంగాణ	14,147	15,425	15,374

సాక్షి, హైదరాబాద్: మహిళలపై నేరాలకు సంబంధించిన కేసుల విచారణ, దర్యాప్తులో తీవ్రజాప్యం జరుగుతోంది. సంచలన కేసులు సైతం ఇందుకు మినహాయింపేమీ కాదు. ఈ ఆలస్యమే మృగాళ్లు మరింత రెచ్చిపోయేందుకు కారణమవుతోంది. గతనెలలో హైదరాబాద్ లాలాగూడ ప్రాంతంలో సంధ్యారాణి... ఈ నెలలో కూకట్‌పల్లిలో జానకి.. సోమవారం చందానగర్‌లో అపర్ణ, ఆమె తల్లీ, నాలుగేళ్ల చిన్నారి.. మంగళవారం హయత్‌నగర్‌లో అనూష, గచ్చిబౌలిలో బొటానికల్ గార్డెన్ వద్ద ముక్కలుగా దొరికిన గుర్తుతెలియని మహిళ.. రాజధానిలోని మూడు కమిషనరేట్ల పరిధిలో వెలుగులోకి వచ్చిన దారుణాలివీ. మహిళలు, యువతులపై జరిగే నేరాల్లో దోషులకు సత్వరమే శిక్షలు పడకపోవడం వల్లే దారుణాలు పెరిగిపోతున్నాయని పలువురు అభిప్రాయపడుతున్నారు.

నాలుగు రోజులే హడావుడి: ఆడపిల్లలపై ప్రేమోన్మాదులు కత్తులు, యాసిడ్‌తో దాడులకు తెగబడిన సమయాల్లో పోలీసులు నాలుగు రోజులు హడావుడి చేస్తున్నారు. కళాశాలలు, హాస్టల్స్ ఉన్న ప్రాంతాల్లో పెట్రోలింగ్ చేస్తున్నారు. తర్వాత కేసు దర్యాప్తు పూర్తయి, కోర్టులో విచారణ ముగిసి దోషులకు శిక్ష పడటం మాత్రం ప్రహసనంగా మారిపోయింది. 'నేరగాళ్లను కఠినంగా శిక్షిస్తాం. ఇలాంటివి పునరావృతం కాకుండా చూస్తాం' అంటూ గంభీరంగా ప్రకటించే అధికార యంత్రాంగం, పాలకుల హామీలు కూడా నీటి మూటలుగా మిగిలిపోతున్నాయి.

నేరగాళ్ల 'ధైర్యం' అదే..!: మహిళలపై నేరాలు పెరగడానికి వ్యవస్థాగత లోపాలు, కుటుంబ వ్యవస్థలు పతనం కావడం, చట్టమంటే భయం లేకుండా పోవడం వంటివి ప్రధాన కారణాలుగా నిపుణులు చెప్తున్నారు. నేషనల్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో (ఎన్‌సీఆర్బీ)-206 గణాంకాల ప్రకారం మహిళలపై జరిగిన నేరాల్లో.. ఏపీలో 9.3 శాతం, తెలంగాణలో 8.1 శాతం కేసుల్లో మాత్రమే దోషులకు శిక్షలు పడ్డాయి. కేసుల విచారణ పూర్తవడానికి ఏళ్లు పడుతుండటంతో అప్పటివరకు బాధితులు పోరాడలేకపోతున్నారు.

మరింత 'భరోసా' కావాలి..: బాధిత మహిళలకు అన్ని విధాల సహాయ సహకారాలు అందించడానికి హైదరాబాద్‌లో భరోసా కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. అయితే దీన్ని కేవలం అత్యాచారం, చిన్నారులపై జరిగే అఘాయిత్యాలు, తీవ్రమైన గృహహింస కేసుల్లోనివారికి మాత్రమే పరిమితం చేశారు. ఈ కేంద్రం బాధితులకు వైద్య, న్యాయ సహాయంతోపాటు పునరావాసం కల్పిస్తోంది. ఈ తరహా కేంద్రాలు ప్రతి జిల్లాలో ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది. అలాగే మహిళలపై జరిగే ప్రతి నేరంలోనూ స్పందించేలా మార్పుచేర్పులు చేయాల్సి ఉంది.

బెయిల్ ఇవ్వొద్దు



మహిళలపై జరిగే నేరాలకు తక్షణం ఫుల్‌స్టాప్ పెట్టాలంటే నేరస్తులకు విచారణ పూర్తయ్యేదాకా బెయిల్ రాకుండా చూడాలి. బెయిల్ వచ్చిందంటే సాక్షులను ప్రభావితం చేయటం, రాజీ కోసం ఒత్తిడి చేస్తున్న ఘటనలు పెరుగుతున్నాయి. మహిళలపై జరిగే నేరాలను రుజువు చేసేందుకు ప్రాసిక్యూషన్ కూడా ఇన్వెస్టిగేషన్ నుంచి జడ్జిమెంట్ వరకు అన్ని జాగ్రత్తలు తీసుకోవాలి. మహిళల కేసుల సత్వర పరిష్కారానికి ఫాస్ట్ ట్రాక్ కోర్టులు తేవాలి. – కాటేపల్లి సరళ, హైకోర్టు అడ్వకేట్

తక్షణ న్యాయం జరగాలి

ఢిల్లీలో నిర్భయ ఘటన తర్వాత స్పందన చూస్తే మహిళలకు మంచిరోజులు వచ్చాయనిపించింది. కానీ కొన్నాళ్ల తర్వాత మళ్లీ పాతరోజులే రిపీట్ అవుతున్నాయి. నేరం జరిగిన వెంటనే కఠిన శిక్షలు అమలు చేయాలి. ఆ దిశగా న్యాయ వ్యవస్థను క్రియాశీలం చేయాలి. హైదరాబాద్‌లో పోలీస్‌స్టేషన్లు మరింత విమెన్ ఫ్రెండ్లీగా తయారు కావాలి. న్యాయం కోసం వెళ్లిన వారిని ప్రశ్నలతో భయపెట్టే పరిస్థితి ఉండొద్దు. – నీలిమా పానుగోటి, సాఫ్ట్‌వేర్ ఇంజినీర్, గచ్చిబౌలి

ఏపీలో ఇలా..

- 2015కు సంబంధించిన 9,349 కేసుల దర్యాప్తు 2016లోనూ కొనసాగాయి
- వీటిలో 66 కేసులను ఆయా పోలీస్ స్టేషన్లకు బదిలీ చేశారు. 153 కేసులు సరైన ఆధారాల్లేక మూతబడ్డాయి. 1,323 కేసులు తప్పుడు ఫిర్యాదులుగా, 226 కేసుల్లో వాస్తవాలు వక్రీకరించినట్లు తేలింది
- 14,774 కేసుల్లో మాత్రమే దర్యాప్తు పూర్తయి కోర్టులో అభియోగపత్రాలు దాఖలయ్యాయి
- విచారణ పూర్తయిన 9,882 కేసుల్లో 922 (9.3 శాతం) కేసుల్లో మాత్రమే దోషులకు శిక్షలు పడ్డాయి

తెలంగాణలో ఇలా..

- 2015కు సంబంధించిన 6,585 కేసుల దర్యాప్తు 2016లోనూ కొనసాగింది
- 50 కేసులను ఆయా ఠాణాలకు బదిలీ చేశారు. 569 కేసులు సరైన ఆధారాల్లేక మూతబడ్డాయి. 642 కేసులు తప్పుడు ఫిర్యాదులుగా, 438 కేసుల్లో వాస్తవాలు వక్రీకరించినట్లు తేలింది.
- 12,185 కేసుల్లోనే దర్యాప్తు పూర్తయి కోర్టులో అభియోగపత్రాలు దాఖలయ్యాయి
- విచారణ పూర్తయిన 5,809 కేసుల్లో 471 (8.1 శాతం) కేసుల్లో మాత్రమే దోషులకు శిక్షలు పడ్డాయి



భర్త దుర్మార్గుడైతే
భార్య గొంతు కోశాడని అంటుంటారు.
భర్త మంచివాడైనా
భార్య గొంతు కోస్తే?
భార్య గొంతు దోచుకెళ్తే?
భార్యను కష్టాలపాలు చేస్తే?
పొగతాగటం భర్తకు మాత్రమే
ప్రమాదం కాదు.
భార్యకు కూడా. నళిని కథ వింటే..
స్మోకింగ్ చేస్తున్న మీ భర్తను
'స్టాప్ స్మోకింగ్' అని అనక మానరు.
ఫేస్‌బుక్‌లో వేలాదిగా
షేర్ అవుతున్న
ఈ కథనాన్ని చదవండి.

"హడావుడిగా నన్ను ఆసుపత్రికి తీసుకెళ్లారు. నా స్వరపేటికలో అల్సర్ వచ్చిందని చెప్పారు పిల్లలు. వాళ్లు ఏదో దాస్తున్నారనిపించింది నాకు.

గొంతు దోచిన భర్త

"ఒక్కసారిగా కుప్పకూలిపోయాను. నేను ఒక్కనాడు కూడా సిగరెట్లు కాల్చలేదు, ఎవ్వరినీ నొప్పించలేదు. అయినా నాకు ఇలా జరిగిందేమిటి అని..."

నా పేరు నళిని. నా జీవితంలో నేను ఒక్క సిగరెట్ కూడా కాల్చలేదు. కాని దురదృష్టం నన్ను వెంటాడింది. గొంతు క్యాన్సర్ వచ్చింది. ఇప్పుడు నాకు స్వరపేటిక లేదు. 1972లో మా బావతో నాకు వివాహం అయ్యింది. చాలా నిక్కచ్చి మనిషి. ఆయన ఇంజనీర్. దేశమంతా ఉద్యోగరీత్యా తిరుగుతుండేవారు. కాని ఆయనకు సిగరెట్లు కాల్చడమనే ఒక బలహీనత ఉంది. నేను ఏం చెప్పినా ఆయన మాత్రం ధూమపానం మానలేదు. ఆయనకు 45 సంవత్సరాల వయసులో 1991లో మైల్డ్ స్ట్రోక్ వచ్చింది. సిగరెట్ల సంఖ్య తగ్గించారే కాని పూర్తిగా మానలేకపోయారు. అయిదేళ్ల తరవాత మళ్లీ గుండెపోటు వచ్చింది. అప్పుడు ఇంక సిగరెట్లు పూర్తిగా మానేయమని డాక్టర్లు హెచ్చరించడంతో మానేశారు. 2005లో నిద్రలోనే కన్నుమూశారు.

ఆయన మరణించిన నాలుగు సంవత్సరాలకి అంటే 2009లో నాకు గొంతు నొప్పి వచ్చింది. స్వరంలో శబ్దం తగ్గిపోయింది. డాక్టరు దగ్గరకు వెళితే మందులు రాశారు. వాడుతూనే ఉన్నా గుణం మాత్రం కనిపించలేదు. ఒక సంవత్సరం పాటు వాడుతూనే ఉన్నాను. తగ్గకపోగా, ఊపిరి సమస్య మొదలైంది. ఒకరోజు ఇంక ఊపిరి ఆగిపోతుందేమో అనిపించింది. నా బాధ చెబుదామంటే నోట్లో నుంచి మాట రాలేదు. మా పిల్లలు కంగారు పడ్డారు.

హడావుడిగా నన్ను ఆసుపత్రికి తీసుకెళ్లారు. నా స్వరపేటికలో అల్సర్ వచ్చిందని చెప్పారు పిల్లలు. వాళ్లు ఏదో దాస్తున్నారనిపించింది నాకు. గట్టిగా అడగడంతో నాకు క్యాన్సర్ వచ్చిందని చెప్పారు.

ఒక్కసారిగా కుప్పకూలిపోయాను. నేను ఒక్కనాడు కూడా సిగరెట్లు కాల్చలేదు, ఎవ్వరినీ నొప్పించలేదు. అయినా నాకు ఇలా జరిగిందేమిటి అని చాలా బాధపడ్డాను.

పాసివ్ స్మోకింగ్ కారణంగా నాకు క్యాన్సర్ వచ్చిందని డాక్టర్లు చెప్పారు. నా భర్త పక్కనే కూర్చోవడం వల్ల ఆయన వదిలిన సిగరెట్ పొగ నేను నాకు తెలియకుండానే పీల్చడం వల్లే ఇలా జరిగిందని అర్థం చేసుకున్నాను. జరిగిన దాని గురించి కాదు, జరగవలసిన దాని గురించి ఆలోచించాలి అనుకున్నాను.

డాక్టర్లు వెంటనే ఆపరేషన్ చేయాలనడంతో మారు మాట్లాడకుండా అంగీకరించాను.

2010, ఏప్రిల్ 19న, నన్ను ఆపరేషన్ థియేటర్‌లోకి తీసుకెళ్లారు. నా కంఠానికి గాటు పెట్టి, స్వరపేటిక, థైరాయిడ్ గ్లాండ్ తీసేశారు. మెడలో ఒక రంధ్రం (స్టోమా) పెట్టారు. వాయిస్ ప్రొస్థసిస్ అమర్చారు. దాని ద్వారానే నేను చెప్పదలచుకున్నది చెప్పడం నేర్చుకోవడం ప్రారంభించాను. ఉదర భాగానికి ఒక గొట్టం అమర్చి దాని ద్వారా నాకు ఆహారం ఇవ్వడం ప్రారంభించారు. మొదట్లో నేను బాగా కుంగిపోయాను. నా పిల్లలు ఇచ్చే మనోధైర్యంతో, క్రమంగా మానసికంగా కోలుకున్నాను. వచ్చిన అనారోగ్యం గురించి ఆలోచించడం మానేశాను. నవ్వడం అలవాటు చేసుకున్నాను. ఇంట్లో ఖాళీగా కూర్చుంటే అనవసరమైన ఆలోచనలు వస్తాయి. అందుకే ఏదో ఒకటి చేయాలనుకున్నాను. నా 64వ ఏట నేను కంప్యూటర్ నేర్చుకోవడం ప్రారంభించాను. చాలా తొందరగా ఫేస్‌బుక్ వాడటం అలవాటు చేసుకున్నాను.

నా మెడలో రంధ్రం ద్వారా అమర్చిన గాలి గొట్టం ద్వారా కష్టపడి మాట్లాడటానికి ప్రయత్నించాను. అయినా నాలో ఏదో అసంతృప్తి వెంటాడుతూనే ఉంది. ఆ రంధ్రం నుంచే వేణువు వాయించడం సాధన చేస్తున్నాను. పెద్దగా వాయించలేకపోయినా, నా ఆత్మానందానికి తగినట్లుగా వేణువు వాయించగలిగితే చాలు. అందుకే ప్రతిరోజూ కొంతసేపు వేణువు సాధన చేస్తున్నాను. నా చీరకు మ్యాచ్ అయ్యేలా నా మెడకి ఉన్న రంధ్రం మూసుకునేలా రకరకాల దుస్తులు కుట్టడం ప్రారంభించాను. పగలంతా పొగాకు వ్యతిరేకంగా ఉద్యమిస్తున్నాను. ఎంతోమంది క్యాన్సర్ రోగులకు మానసిక ధైర్యం ఇస్తున్నాను. ఒక మాటలు రాని వ్యక్తిగా, నేను ఈరోజు చాలా మాట్లాడుతున్నాను. డాక్టర్లు కూడా నా కోసం ఒక మాట్లాడే సాధనం ఇస్తామన్నారు. ఆ సాధనం వల్ల నేను నా స్టోమాని పట్టుకోవలసిన అవసరం ఉండదు.

నేను నా తరఫు నుంచి ఒక సందేశం ఇస్తాను. ఇది చాలా సింపుల్. పాసివ్ స్మోకింగ్‌ను నిర్లక్ష్యం చేయకండి. మీకు ప్రియమైనవారు మీ దగ్గర సిగరెట్ కాలుస్తుంటే, నిర్మొహమాటంగా వద్దని చెప్పేయండి. వారి కోసమే కాదు, మీ కోసం కూడా.


● మనవరాలు, మనవడితో నళిని (71)

"పాసివ్ స్మోకింగ్ కారణంగా నాకు క్యాన్సర్ వచ్చిందని డాక్టర్లు చెప్పారు. నా భర్త పక్కనే కూర్చోవడం వల్ల ఆయన వదిలిన సిగరెట్ పొగ నేను నాకు తెలియకుండానే పీల్చడం వల్లే ఇలా జరిగిందని అర్థం చేసుకున్నాను.


● నళిని సత్యనారాయణన్ (బెంగళూరు)

బడ్జెట్

ఈ చిరునవ్వులు అన్ వాంటెడా?!



ఏటా బడ్జెట్‌కు ముందు 'ఎకనమిక్ సర్వే' విడుదలౌతుంది. మర్నాడో, ఆ తర్వాతి రోజో 'బడ్జెట్' బయటికి వస్తుంది. గడిచిన ఏడాది ఎలా ఉందన్నది 'ఎకనమిక్ సర్వే'. ఈ ఏడాది ఎలా ఉండబోతున్నదన్నది 'బడ్జెట్'. ఈ రెంటినీ కేంద్ర ఆర్థిక శాఖే సమర్పిస్తుంది. విషయం ఇది కాదు. ఎకనమిక్ సర్వే ఫైల్ కవరు ఈసారి లేత గులాబీ రంగులో ఉంది. దాన్ని మహిళా వాదులు ఎలా తీసుకున్నా.. (స్త్రీ, పురుషులు సమానం అయినప్పుడు 'పింక్' కలర్‌తో మహిళల్ని ఇండికేట్ చేయడం ఏంటని కొంతకాలంగా వాదన ఒకటి వినిపిస్తోంది)... ప్రభుత్వం మాత్రం స్త్రీల సంక్షేమానికి, అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తున్నట్లు పింక్ లుక్‌తో ఒక సంకేతం పంపింది. ఈ ఏడాది తొలి 'మన్ కీ బాత్'లో ప్రధాని మోదీ, మొన్నటి 'ఎకనమిక్ సర్వే'లో ఆర్థిక శాఖ స్త్రీ, శిశు అంశాలను ప్రముఖంగా ప్రస్తావించారు. అయితే మన్ కీ బాత్‌లో మోదీ మంచి ఆకాంక్షలు వ్యక్తపరిస్తే, అందుకు భిన్నంగా ఆ ఆకాంక్షల్ని తుంచేస్తున్న చేదు నిజం ఒకటి ఎకనమిక్ సర్వేలో వెల్లడయింది. మగపిల్లవాడు పుట్టడం కోసం ఎదురు చూస్తున్న తల్లిదండ్రుల కారణంగా, వారికి ఇష్టం లేకుండా పుట్టిన ఆడపిల్లల సంఖ్య దేశంలో రెండు కోట్లకు పైగా ఉందట! వీళ్లను 'అన్ వాంటెడ్' చిల్డ్రన్ అని సర్వేలో పేర్కొన్నారు. సమాజంలో ఈ 'అసమాన దృష్టి' పోవాలని ఎకనమిక్ సర్వే ఆశించింది. ఆ ఆశ నెరవేరే విధంగా రేపటి బడ్జెట్‌లో బాలికల సంక్షేమం కోసం ప్రత్యేక విధానాలు ఏమైనా ఉంటే బాగుంటుంది.

అందమే ఆనందం



- పావు టేబుల్ స్పూన్ తేనెలో రెండుటేబుల్ స్పూన్ల పచ్చిపాలను కలపాలి. దూదిని ఈ మిశ్రమంలో ముంచి దాంతో ముఖమంతా రాయాలి. ఈ మిశ్రమం మంచి క్లెన్సర్‌గా ఉపయోగపడుతుంది. కాలుష్యం వల్ల పేరుకుపోయే మలినాలు దీని వల్ల త్వరగా తొలగిపోతాయి. ప్రతిరోజూ రాత్రి పడుకునే ముందు ఇలా చేస్తే చర్మం శుభ్రపడుతుంది. కొద్ది రోజుల్లోనే ముఖ ఛాయలో మార్పుని గమనించవచ్చు.
- అర టీ స్పూన్ తేనెని స్నానం చేసే నీటిలో కలపాలి. ఈ నీటితో స్నానంచేస్తే చర్మం నిగారింపును సంతరించుకుంటుంది.
- తేనెలో నిమ్మరసాన్ని కలిపి ముఖంపై మృదువుగా పదిహేను నిమిషాల పాటు మసాజ్ చేసి చన్నీటితో శుభ్రపరుచుకోవాలి. రోజూ ఇలా చేస్తూ ఉంటే ముఖ వర్చస్సు పెరుగుతుంది.
- పచ్చిపాలలో బాదం పొడిని కలిపి ముఖానికి పట్టించాలి. ఆరిన తర్వాత చల్లని నీళ్లతో కడిగేయాలి. క్రమం తప్పకుండా ప్రతిరోజూ ఉదయం ఈ మిశ్రమాన్ని ఫేస్‌ప్యాక్‌లా వాడితే చర్మ కాంతి నిగనిగలాడుతుంది.
- శనగపిండిలో పసుపు, గ్లిజరిన్, రోజ్ వాటర్ కలిపి ఈ మిశ్రమాన్ని ముఖానికి పట్టించాలి. ఆరిన తరువాత గోరువెచ్చని నీటితో శుభ్రపరిస్తే చర్మం నునుపుగా తయారవుతుంది.

చెట్టు నీడ

అమ్మా! మియ్యావ్

"**బు**క్‌లో ఏమేమున్నాయి? చూద్దామా కృతి బంగారూ" గారంగా కూతుర్ని ఒళ్లోకి తీసుకుంది అమ్మ.

అమ్మ చేతిలోని 'మై ఫస్ట్ ఎబిసి' బుక్ లాక్కుని తనే ఓపెన్ చేసింది కృతి. సి పేజీ ఓపెన్ అయింది.

క్యాట్ అని చెప్పాలా... మాతృభాషలో పిల్లి అని నేర్పించాలా... తల్లికి మీమాంస.

"అమ్మా! మియ్యావ్" అంటూ రెండు చేతులను గొంతు కిందకు చేర్చి కళ్లు పెద్దవి చేసి మూతిని సున్నాలా చుట్టింది ఒకటిన్నర ఏళ్ల కృతి.

ప్రకృతిని కూడా పుస్తకాల్లోనే చూసి నేర్చుకోవడం అలవాటైపోయింది! అయితే పుస్తకాలు తెరవకముందే పిల్లల ఆలోచనల్ని తెరిపిస్తుంది ప్రకృతి.

పేజీలు తిప్పుతున్నారిద్దరూ. హెచ్ పేజీలో కోడి ఉంది. 'హెన్' పలకడం ఈజీ, మాటలు పూర్తిగా నేర్చుకున్న తర్వాత 'కోడి' అని నేర్పించవచ్చు... అనుకునే లోపే...

"అమ్మా! బోబు... బో బ్బో బ్బో... కొక్కొక్కో..." రెక్కలు విచ్చినట్లు చేతుల్ని చాచి చెప్పింది కృతి. తల్లి మురిపెంగా చూసింది కృతిని.

పిల్లలకు తల్లే తొలి గురువు. తల్లి కంటే ముందు ప్రకృతే గురువు. ఆ తల్లికి చిన్నప్పుడు నేర్పించింది కూడా ప్రకృతే. పెద్దయ్యాకే పుస్తకాలు నేర్పించాయి. పుస్తకాలతో నేర్చుకోవడం మొదలు పెట్టినప్పటి నుంచి ప్రకృతిని కూడా ప్రకృతిలో కాకుండా పుస్తకాల్లోనే నేర్చుకోవడం అలవాటైపోయింది! అయితే పుస్తకాలు తెరవకముందే పిల్లల ఆలోచనల్ని తెరిపిస్తుంది ప్రకృతి.

ప్రకృతిలో భాగంగానే నేర్పేవారు ఉంటారా లేక ప్రకృతే నేర్పుతుందా అని వర్డ్స్ వర్త్ ఓ చోట సంశయపడతాడు. నేర్పేవారు ఎవరైనప్పటికీ నేర్చుకోవడం అన్నది మనిషి ప్రవృత్తి. ఆ ప్రవృత్తే మనిషిని ప్రకృతి దగ్గరకు తీసుకెళుతుంది. ఆ తర్వాతే పుస్తకాలు. గురువర్యులు.

యురేకా!

కారణం కనుక్కున్నారు

మహిళలకు మానవజాతి ప్రణమిల్లవలసిన కారణాల్లో ప్రధానమైనది మానవ మనుగడ కోసం ఆమె రక్తాన్ని స్రవించడం! రుతుస్రావం వల్ల ప్రతినెలా ఆమె రక్తాన్ని కోల్పోతుంటుంది. కొంత మందిలో ఆ కోల్పోవడం పరిమితికి మించి ఉంటుంది. అప్పుడు వారు పడే అవస్థ అంతా ఇంతా కాదు. 'ప్యాడ్‌మాన్' సినిమా ట్రైలర్‌లో అక్షయ్ కుమార్ ఒక మాట అంటాడు. 'ఇదే పరిస్థితి మగాళ్లకు ఉంటే చచ్చిపోతారు' అని! ఆలోచిస్తే నిజమేననిపిస్తుంది.

గర్భాశయం లోపల ఎండోమెట్రియమ్ అనే పొర ఉంటుంది. ఈస్ట్రోజెన్, ప్రొజెస్టెరాన్ అనే హార్మోన్ల ప్రభావం వల్ల రుతుచక్రంలో ఈ ఎండోమెట్రియమ్ పొర అనేక మార్పులకు లోనవుతుంది. రుతుస్రావం తర్వాత ఈస్ట్రోజెన్ హార్మోన్ గర్భాశయం లోపలి గోడలపై ప్రభావం చూపడం వల్ల అక్కడ ఎండోమెట్రియమ్ అనే పొర మొదటి పద్నాలుగు రోజులు వృద్ధి చెందుతూ ఉంటుంది. పదిహేనవ రోజు నుంచి విడుదల అయ్యే ప్రొజెస్టెరాన్ అనే హార్మోన్ ప్రభావం వల్ల పొర మరింత వృద్ధి చెందుతుంది. దానికి సన్నటి రక్తనాళాలు కూడా అభివృద్ధి చెందుతాయి. మహిళలోని అండం, పురుష శుక్రకణంతో కలిసి పిండంగా మారనంత వరకు ప్రతి నెలా.. పద్నాల్గవ రోజు తర్వాత ప్రొజెస్టెరాన్ ఉత్పత్తి ఆగిపోతుంది. దాంతో ఎండోమెట్రియమ్‌లో అభివృద్ధి చెందిన రక్తనాళాలు కుంచించుకు పోతాయి. ఫలితంగా ఎండోమెట్రియమ్ పొర గర్భాశయం గోడ నుంచి ఊడిపోయి సన్నటి ముక్కలుగా రక్తంలో కలిసి బ్లీడింగ్ రూపంలో బయటకు వచ్చేస్తుంది. అదే రుతుస్రావం.


అధికంగా ఎందుకవుతుంది?

మహిళల్లో ఆక్సిజన్ తగ్గినప్పుడు వారి ఒంట్లో హెచ్‌ఐఎఫ్-1 (హైపాక్సియా ఇండ్యూసిబుల్ ఫ్యాక్టర్-1) అనే ప్రొటీన్ తయారవుతుంది. ఇది గర్భాశయంలోని పొర ఊడిపోయాక అయ్యే గాయాన్ని త్వరగా మానేలా చేస్తుంది. కొన్ని కారణాల వల్ల కొందరు మహిళల్లో ఈ హెచ్‌ఐఎఫ్-1 చాలా తక్కువగా తయారవుతుంది. అలాంటివాళ్లలోనే రుతుస్రావం సమయంలో చాలా ఎక్కువగా రక్తం పోతుంటుందని తాజా అధ్యయనంలో వెల్లడయింది. ఈ హెచ్‌ఐఎఫ్-1ను ఎక్కువగా తయారయ్యేలా చేస్తే... ఆటోమేటిగ్గా రక్తం పోవడం కూడా తగ్గుతుందని పరిశోధకులు గుర్తించారు!

రుతు సమయంలో ఎక్కువ రక్తం కోల్పోయే మహిళలు మిగతా వారిలా ఆ రోజుల్లో స్వేచ్ఛగా బయటకు రావాలంటే బిడియపడుతుంటారు. పదిమంది దృష్టిలో పడతామేమోనంటూ ఆందోళనగా ఉంటారు. ఇప్పుడిక వారి దేహంలో హెచ్‌ఐఎఫ్-1 ప్రొటీన్‌ను ఎక్కువ స్రవించేలా చేయడం ద్వారా వారి ఆందోళనను దూరం చేయవచ్చునని భావిస్తున్నారు. దీని నిర్ధారణకు ప్రయోగాలు కూడా మొదలయ్యాయి.


● 'ప్యాడ్‌మ్యాన్' చిత్రంలో అక్షయ్‌కుమార్, రాధికా ఆప్టే

లవ్ డాక్టర్ నన్నడగొద్దు ప్లీజ్



ప్రియదర్శిని రామ్
లవ్ డాక్టర్

హాయ్ అన్నయ్యా..! నేను ఒక అబ్బాయిని లవ్ చేస్తున్నాను. కొన్ని నెలల్లో పెళ్లి కూడా చేసుకుందామనుకుంటున్నాం. కానీ చాలా భయమేస్తోంది. ఎందుకంటే తను నాకంటే ముందు ఒక అమ్మాయిని లవ్ చేశాడు. బట్ ఆ అమ్మాయికి వేరే పెళ్లై వెళ్లిపోయిందట. ఆ విషయం తెలిసి కూడా నేను తనని ఇష్టపడ్డాను. తను హ్యాపీగా ఉండాలని నేను తనకి అన్ని విషయాల్లో చాలా సపోర్ట్ ఇస్తాను. కానీ ఎందుకో తను నాతో అసలు ప్రేమగా ఉండడు. నేనంటే ఇష్టమని అందరికీ చెబుతాడు కానీ, అసలు ప్రేమ చూపించడు. మారతాడని త్రీ ఇయర్స్ నుంచి వెయిట్ చేస్తున్నా. కానీ ఎలాంటి మార్పు రాలేదు. నువ్వు ఇలానే ఉంటే నాకు చాలా కష్టంగా ఉంటుందని తనతో చెప్పాను. ''నేనింతే ఇలానే ఉంటాను. ఇష్టమైతే ఉండు, లేదంటే పో...'' అన్నాడు. ఇంట్లో వాళ్లతో ఫైట్ చేసి మరీ ఈ పెళ్లికి సిద్ధమయ్యాను. కానీ పెళ్లి తరువాత కూడా తను ఇలానే ప్రవర్తిస్తే..? అనే ఆలోచన నన్ను బాగా భయపెడుతోంది. ఇలానే జీవితాంతం బాధపడుతూ ఉండాలంటే భయమేస్తోంది. ఇప్పటికే చాలా ఫేస్ చేశాను అన్నయ్యా. తన మాటలను ఇంకా భరించే ఓపిక, సహనం రెండూ నాకు లేవు. అలా అని తన నుంచి దూరంగా ఉండలేను. ఇప్పుడు ఏం చెయ్యాలో అర్థం కావడంలేదు.

– సంధ్య

ఇగో.. ఇగో.. ఇగో....
ప్రేమలో ఉండకూడనిది ఇగో..
ప్రేమలో స్వార్థం ఉండదు..
ప్రేమలో 'నేను' ఉండరాదు..
ప్రేమలో పట్టింపులు పనికిరావు...
ప్రేమలో ఒకరికి గెలుపు ఇంకొకరికి ఓటమి ఉండదు..
ఇద్దరూ గెలవాలి.
ఈ అబ్బాయిని చేసుకుంటే లైఫ్ అంతా సఫర్ అవుతావు..
బూజు దులిపేసుకో...
మనసంతా పట్టిన వాడి బూజు దులిపేసుకో...
నువ్వు పడుతున్నావు కాబట్టి..
పోజులు కొడుతున్నాడు..
అసలు వాడికి ప్రేమంటే ఏంటో తెలియదు..
ఒట్టి సెల్ఫిష్ ఇడియట్..
మొదటి అమ్మాయి అందుకే వాణ్ని తన్ని తగలేసింది..
నీకు దండం పెడతా సంధ్యా....
ఇమీడియట్‌గా బూజు దులిపేసుకో...

'అవును సార్.. ఒట్టి సెల్ఫ్‌గాడు.. పెళ్లి చేసుకుంటే నరకమే.. సార్.. ఈసారి కరెక్ట్ ఆన్సర్ ఇచ్చారు సార్...!'

అదేంటి నీలాంబరీ అబ్బాయిని తిట్టినా నన్ను సమర్థిస్తున్నావు?

'అబ్బాయిని అంటే నాకు కోపం వస్తుంది సార్.. కానీ హీ ఈజ్ నాట్ అబ్బాయి.. హీ ఈజ్ గబ్బాయి..'

అంటే గబ్బు మనిషేనా?

'ఎస్.. అప్పుడప్పుడు మీరు స్మార్ట్‌గా ఉంటారు సార్.. ఇంద అరటిపండు!'

ప్రేమ, ఆకర్షణ, టీనేజ్ అనుబంధాల్లోని అయోమయం మిమ్మల్ని గందరగోళపరుస్తుంటే ప్లీజ్ ఈ అడ్రస్‌కు మాత్రం అస్సలు రాయకండి.
లవ్ డాక్టర్, సాక్షి ఫ్యామిలీ, సాక్షి టవర్స్, రోడ్ నంబరు 1, బంజారాహిల్స్, హైదరాబాద్-34. lovedoctorram@sakshi.com

కాసుకో సుడోకు

		4		1				
	5	8	3					
6		9		2		1	5	
					8	6		9
5	1	6	7		9	3	2	8
8		7	2					
	4	3		7		8		6
					6	7	1	
				8		4		

నిబంధనలు: ప్రతి వరుసలో 1 నుంచి 9 అంకెలు నింపండి (అడ్డంగా, నిలువుగా). ఒక వరుసలో ఒక అంకెను ఒకసారి మాత్రమే వాడాలి. ప్రతి 3x3 చదరం లోనూ 1 నుంచి 9 అంకెలు రావాలి.

నిన్నటి జవాబు

5	8	4	7	9	3	6	2	1
1	2	7	5	8	6	4	9	3
3	9	6	4	2	1	5	8	7
7	4	3	9	6	8	1	5	2
8	6	5	1	4	2	3	7	9
2	1	9	3	7	5	8	4	6
6	7	2	8	3	4	9	1	5
9	5	8	6	1	7	2	3	4
4	3	1	2	5	9	7	6	8

అమెరికాలో ఆటా పాటా



● నాగచైతన్య

ఫైట్ తర్వాత కుర్రాడి ప్రేమకు అమ్మాయి ఫిదా అయినట్లు ఉంది. అందుకే సాంగ్ వేసుకోవడానికి అమెరికా వెళ్లనున్నారట ఈ రీల్ లవర్స్. నాగచైతన్య, నిధి అగర్వాల్ జంటగా చందు మొండేటి దర్శకత్వంలో రూపొందుతున్న సినిమా 'సవ్యసాచి'. హీరో నాగచైతన్య అక్క పాత్రలో భూమిక నటిస్తుండగా, ఓ కీలక పాత్రలో మాధవన్ కనిపించనున్నారు. రీసెంట్‌గా తీసిన హైదరాబాద్ షెడ్యూల్‌లో చేజింగ్ ఫైట్‌లో విలన్స్‌ను చితక్కొట్టాడు చైతూ. మార్చిలో జరిగే మరో షెడ్యూల్‌ను చిత్రబృందం అమెరికాలో ప్లాన్ చేసిందని ఫిల్మ్‌నగర్ సమాచారం. అక్కడ కొన్ని కీలకమైన సన్నివేశాలతోపాటు సాంగ్స్‌ను చిత్రీకరిస్తారట. అక్కడితో సినిమా ఆల్మోస్ట్ కంప్లీట్ అవుతుందట. జూన్‌లో ఈ చిత్రాన్ని విడుదల చేయాలనుకుంటున్నారని వినికిడి. ఈ చిత్రం కాకుండా ప్రస్తుతం మారుతి దర్శకత్వంలో నాగచైతన్య ఓ చిత్రంలో నటిస్తోన్న విషయం తెలిసిందే. ఈ చిత్రానికి 'శైలజారెడ్డి గారి అల్లుడు' అనే టైటిల్‌ని పరిశీలిస్తున్నారు.

'నో' చెప్పలేని ఆఫర్



● నయనతార

నో చెప్పలేని ఆఫర్ వస్తే వెనకా ముందూ ఆలోచించకుండా గ్రీన్ సిగ్నల్ ఇచ్చేస్తారు ఎవరైనా. నయనతార ముందు అలాంటి ఓ భారీ ఆఫర్ ఉందట. ఇంతకీ అంత పెద్ద అవకాశం ఏంటీ? అనే విషయానికొస్తే.. లోక నాయకుడు సరసన నటించే చాన్స్. లోక నాయకుడు ఎవరో ప్రత్యేకంగా చెప్పక్కర్లేదు. ఎలాంటి పాత్రని అయినా సునాయాసంగా చేసేసే కమల్‌హాసన్‌కి సినిమా లవర్స్ ఇచ్చిన బిరుదు అది. కమల్ సరసన 'భారతీయుడు-2'లో నటించమని చిత్ర దర్శకుడు శంకర్ వర్గం నయనతారని సంప్రదించారని టాక్. 1996లో కమల్ హీరోగా శంకర్ తీసిన 'భారతీయుడు'కి ఇది సీక్వెల్. ఇందులో కథానాయిక విప్లవ నాయిక అని సమాచారం. ఈ పాత్రకే నయనతారను అడుగుతున్నారట. కమల్‌తో జోడీ, శంకర్ లాంటి గొప్ప దర్శకుడు, సెన్సేషనల్ హిట్ మూవీ 'భారతీయుడు'కి సీక్వెల్, దాదాపు 200 కోట్ల బడ్జెట్... 'నో' చెప్పలేని ఆఫర్ కదా. మరి.. నయనతారకు కూడా అలానే అనిపిస్తే 'యస్' చెప్పేయడం గ్యారంటీ. ఒకవేళ డేట్స్ అడ్జస్ట్ చేయలేకపోతే అప్పుడు నయనతార స్థానంలో శంకర్ బృందం వేరే తారను అనుకోవాలి.


మంచి ప్రేమకథ



● మనోజ్ నందం, సౌందర్య

మనోజ్ నందం, సౌందర్య జంటగా నటించిన చిత్రం 'ఎక్కడ నా ప్రేమ'. ఏఎండీ హుస్సేన్ దర్శకత్వంలో గాయత్రీ సినీ క్రియేషన్స్ సమర్పణలో ఎస్. రామకృష్ణ, వడ్డే గోపాల్ నిర్మించారు. ఘనశ్యామ్ స్వరపరచిన ఈ సినిమా పాటలను హైదరాబాద్‌లో విడుదల చేశారు. ఎస్. రామకృష్ణ, వడ్డే గోపాల్ మాట్లాడుతూ– ''రెండు తరాల వ్యక్తిత్వాన్ని మా సినిమాలో చూపిస్తున్నాం. ప్రేమే జీవితంగా బతికే యువత నిర్ణయాలు, పిల్లల బాగు కోసం తపించే తల్లిదండ్రుల ఆరాటాలు కథలో ప్రధాన అంశాలు. స్వేచ్ఛ కోరుకునే యువతరం, అనుభవాన్ని చూసిన పెద్దలను ప్రతిబింబించేలా పాత్రలుంటాయి. ఆంక్షలు పెట్టిన కుటుంబ సభ్యులను వదిలి వెళ్లిన ఓ అమ్మాయిని కాపాడేందుకు యువకుడు చేసిన ప్రయత్నమే ఈ చిత్రం. మంచి ప్రేమ కథతో సినిమా ఉంటుంది. ప్రేమికుల్లోని ఆకర్షణ, మనస్పర్థలను దర్శకుడు వినోదాత్మకంగా తెరకెక్కించారు. ఫిబ్రవరి 22న మా సినిమాను విడుదల చేస్తాం'' అన్నారు.

ఎవరూ ఎవరికీ బ్యాకప్ ఇవ్వరు



● రవితేజ

''నేను చాలా సినిమాల్లో పోలీస్‌గా చేశా. అయితే అవి సీరియస్‌తో కూడుకున్నవి. 'టచ్ చేసి చూడు'లో కొంచెం సీరియస్.. ఎక్కువగా ఫన్ ఉంటుంది. ఇటు కుటుంబం.. అటు ఉద్యోగాన్ని ఎలా బ్యాలెన్స్ చేశాడన్నదే కథ" అని రవితేజ అన్నారు. ఆయన హీరోగా విక్రమ్ సిరికొండ దర్శకత్వంలో బేబి భవ్య సమర్పణలో నల్లమలుపు శ్రీనివాస్ (బుజ్జి), వల్లభనేని వంశీ నిర్మించిన చిత్రం 'టచ్ చేసి చూడు'. ఫిబ్రవరి 2న సినిమా విడుదల కానున్న సందర్భంగా రవితేజ పలు విశేషాలు పంచుకున్నారు.

'టచ్ చేసి చూడు' అంటున్నారు. టచ్ చేస్తే షాక్ కొడుతుందా?
టచ్ చేస్తే ఏమవుతుందా? అని నేనూ ఎదురు చూస్తున్నా. ఎంత షాక్ కొడుతుంది? అన్నది రెండో తారీఖు తెలిసిపోతుంది.

కొత్త దర్శకుడు విక్రమ్‌తో సినిమా చేయడం రిస్క్ అనిపించలేదా?
విక్రమ్ డైరెక్షన్‌కి కొత్తేమో కానీ ఇండస్ట్రీకి కాదు. రైటర్‌గా ఇండస్ట్రీలో ఉన్నాడు. డైరెక్టర్ అవ్వాలనే ఇండస్ట్రీకొచ్చాడు. 'మిరపకాయ్' సినిమా నుంచి తను నాకు బాగా పరిచయం.

విక్రమ్ రచయిత అయినా ఈ చిత్రానికి వక్కంతం వంశీ కథ ఇచ్చారేం?
విక్రమ్ నాకో కథ చెప్పాడు. నచ్చింది. నా కమిట్‌మెంట్స్ అవ్వగానే చేద్దామనుకున్నాం. ఈలోగా వక్కంతం వంశీ, బుజ్జి 'టచ్ చేసి చూడు' కథ చెప్పారు. బుజ్జి, విక్రమ్‌కి మంచి సాన్నిహిత్యం ఉండటంతో తన డైరెక్షన్‌లో ఈ సినిమా చేశాం. నిర్మాతలు బుజ్జి, వంశీ, నా కాంబినేషన్‌లో ఎప్పుడో సినిమా రావాల్సింది. కొన్ని కారణాల వల్ల లేటైంది. అయినా ఈ టైమింగ్ బాగుంది.

గతంలో ప్రయోగాత్మక పాత్రలు చేశారు. ఇప్పుడు ఎంటర్‌టైనింగ్ పాత్రలే చేస్తున్నారే?
కొత్త తరహా ప్రయోగాత్మక సినిమాలు చేస్తుంటే పోతున్నాయి మరి. కమర్షియల్‌గా ఆడలేదు. 'నా ఆటోగ్రాఫ్, శంభో శివ శంభో, ఈ అబ్బాయి చాలా మంచోడు, నేనింతే' ఎంత మంచి సినిమాలు. సరిగ్గా ఆడలేదు. నా తొలి ప్రాధాన్యత ప్రేక్షకులను ఎంటర్‌టైన్ చేయడమే.

ఇక ప్రయోగాత్మక పాత్రలకు ఫుల్‌స్టాప్ పెట్టినట్లేనా?
అలా ఏం లేదు. కచ్చితంగా చేస్తాను. గతంతో పోలిస్తే ఇప్పుడు ప్రేక్షకుల ఆలోచనా తీరు మారింది. 'నా ఆటోగ్రాఫ్' సినిమా ఇప్పుడు రిలీజ్ అయ్యుంటే బ్రహ్మాండంగా ఆడేదేమో అని నా స్ట్రాంగ్ ఫీలింగ్. ఈ టైప్ కొన్ని కథలు విన్నాను. చేస్తా.

తెలుగు సినిమా మార్కెట్ రేంజ్ పెరగడంపై మీ ఫీలింగ్?
హ్యాపీ. థ్యాంక్స్ టు రాజమౌళి. 'రాజా ది గ్రేట్' ప్రమోషన్‌కి డార్జిలింగ్ వెళ్లినప్పుడు అక్కడి వారి స్పందన చూసి, ఫుల్ హ్యాపీ.

ఆ మధ్య పూరీ జగన్నాథ్‌తో సినిమా అని వార్తలొచ్చాయే?
జగన్‌తో సినిమా ఉంటుంది. అయితే ఈ ఏడాది కాదు.

మల్టీస్టారర్ సినిమాలు చేసే ఆలోచన ఉందా?
ఎవరితో చేయడానికైనా రెడీ. అది రచయితలు, దర్శకులు ఆలోచించాలి. ఇండస్ట్రీలో అందరు హీరోలూ నాకు ఫ్రెండ్సే.

నటుడిగా సంతృప్తి చెందారా? దర్శకత్వం ఎప్పుడు చేస్తారు?
ప్రస్తుతం నటుడిగా నా పనిని ఎంజాయ్ చేస్తున్నా. కానీ, కచ్చితంగా దర్శకత్వం చేస్తాను. అది ఎప్పుడో తెలియదు. అయితే ఆ సినిమాలో మాత్రం నేను నటించను.

కథ ఎంపిక చేసుకునే విధానంలో ఏమైనా మార్పులొచ్చాయా?
గతంలో స్మాల్ నెగ్లిజెన్స్ ఉండేది. ఇప్పుడు అన్నీ ప్రాపర్‌గా చూసి కథలు సెలెక్ట్ చేసుకుంటున్నా. నా పాత్ర కంటే కథకే నేను ఇంపార్టెన్స్ ఇస్తా.

ఇటీవల ఓ షార్ట్‌ఫిల్మ్ నిర్మించారు కదా?
అవును. అనిల్ అని నా జిమ్ మేట్. సరదాగా ఓ ఐడియా చెప్పాడు. ఆ ఏజ్‌లో తన ఆలోచన నాకు నచ్చింది. అందుకే చేశా. చాలా మంచి రెస్పాన్స్ వచ్చింది.

మీ అబ్బాయి మహాధన్‌ని ఎప్పుడు హీరోని చేస్తున్నారు?
వాడి వయసు ఇప్పుడు పదేళ్లే. హీరోని చేయడానికి చాలా టైమ్ ఉంది.

మీ తర్వాతి ప్రాజెక్టులు ఏంటి?
కల్యాణ్‌కృష్ణతో ఓ సినిమా చేస్తున్నా. ఆ తర్వాత శ్రీనువైట్ల సినిమా ఉంటుంది.

శ్రీనువైట్ల కథ నచ్చి సినిమా చేస్తున్నారా? లేకుంటే బ్యాకప్ ఇవ్వాలనా?
ఎవరూ ఎవరికీ బ్యాకప్ ఇవ్వరు. కథ నచ్చింది. హిట్టా? ఫ్లాపా? అన్నది తర్వాతి విషయం.

అంత మెచ్యూర్టీ ఇంకా రాలేదు



● రష్మికా మండన్న

''ఏ సినిమాకైనా స్టోరీ ఇంపార్టెంట్ అని నమ్ముతాను. 'ఛలో' సినిమాలో ఫ్రెష్ అండ్ ఇంట్రెస్టింగ్ స్టోరీ లైన్ ఉందనిపించింది. వెంటనే గ్రీన్‌సిగ్నల్ ఇచ్చాను'' అన్నారు రష్మికా మండన్న. వెంకీ కుడుముల దర్శకత్వంలో నాగశౌర్య, రష్మిక మండన్న జంటగా ఐరా క్రియేషన్స్ పతాకంపై శంకర్‌ప్రసాద్ మూల్పూరి సమర్పణలో ఉషా మూల్పూరి నిర్మించిన 'ఛలో' ఫిబ్రవరి 2న విడుదల కానుంది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో జరిగిన విలేకర్ల సమావేశంలో కథానాయిక రష్మిక మాట్లాడుతూ– ''డిగ్రీ కంప్లీట్ చేయడానికి బెంగళూరు వచ్చా. ఆ టైమ్‌లోనే కన్నడ చిత్రం 'కిర్రిక్ పార్టీ'లో నటించే చాన్స్ వచ్చింది. అలా నా సినీ ప్రయాణం స్టార్టైంది. 'కిర్రిక్ పార్టీ'లో నా యాక్టింగ్ చూసి 'ఛలో' సినిమాలో నటించే అవకాశం ఇచ్చారు దర్శక–నిర్మాతలు. ఐరా క్రియేషన్స్ 'ఛలో' సినిమాతో టాలీవుడ్‌లోకి ఎంట్రీ ఇస్తున్నందుకు హ్యాపీ. షూటింగ్ స్పాట్‌లో చాలా ఎంజాయ్ చేశా. 'ఛలో' యాప్ట్ టైటిల్ అని సినిమా చూసిన తర్వాత ప్రేక్షకులు అనుకుంటారన్న నమ్మకం ఉంది. షూటింగ్‌కి ముందు రోజే దర్శకులు వెంకీగారు డైలాగ్స్ పేపర్స్ ఇచ్చేవారు. డైరెక్టర్‌కు థ్యాంక్స్. ప్రిపేరై లొకేషన్‌కి వెళ్లేదాన్ని. సొంతంగా డబ్బింగ్ చెప్పడానికి ఈ ప్రాసెస్ ఉపయోగపడింది. భవిష్యత్‌లో నేను చేయబోయే చిత్రాలకు సొంత డబ్బింగ్ కంటిన్యూ చేయాలనుకుంటున్నాను. నాగశౌర్య మోస్ట్ కంఫర్టబుల్ హీరో. షూటింగ్ టైమ్‌లో చాలా హెల్ప్ చేశారు. ఎవరినైనా ఇన్‌స్పైరింగ్‌గా తీసుకునేంత మెచ్యూర్టీ నాలో ఇంకా రాలేదు. కానీ హీరోయిన్ అనుష్కా శెట్టి వర్కింగ్ స్టైల్ అండ్ కమిట్‌మెంట్ నాకు ఇన్‌స్పైరింగ్‌లా అనిపిస్తాయి. ప్రజెంట్ తెలుగులో విజయ్ దేవరకొండ సరసన ఓ సినిమాలో హీరోయిన్‌గా నటిస్తున్నాను. కన్నడలో మరో రెండు సినిమాలు చేస్తున్నా'' అన్నారు.

అనగనగా ఓ దెయ్యం



● అరోహి

''ఇప్పటివరకూ ఎన్నో దెయ్యం సినిమాలు వచ్చాయి. కానీ, మా 'దెయ్యం చెప్పిన కథ' చిత్రం హారర్ సినిమాలకు కేరాఫ్‌గా నిలుస్తుంది. మూస ధోరణి కాకుండా విభిన్నమైన కథా, కథనాలతో పూర్తి హారర్ నేపథ్యంలో తెరకెక్కిస్తున్నాం'' అని దర్శకుడు ప్రదీప్ అన్నారు. నూతన నటీనటులతో ఆయన దర్శకత్వంలో ఆంధ్రప్రదేశ్ ఫిల్మ్‌చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు ఎస్వీయన్‌రావు సారథ్యంలో ఆరాధ్య ప్రొడక్షన్స్ పతాకంపై పెనాక దయాకర్‌రెడ్డి ఈ చిత్రం నిర్మిస్తున్నారు. ప్రదీప్ మాట్లాడుతూ– ''దెయ్యం ప్రధాన పాత్రగా సాగే ఈ సినిమా ఆద్యంతం ప్రేక్షకుల్ని ఉత్కంఠకు గురి చేసేలా ఉంటుంది. అన్ని సినిమాల్లాగా కమర్షియల్ హంగులు, సెట్టింగులు ఉండవు. ఈ చిత్రం ద్వారా 29 మంది కొత్తవారిని పరిచయం చేయబోతున్నాం. హీరోయిన్ అరోహి బాగా యాక్ట్ చేసింది'' అన్నారు. ''చిన్న బడ్జెట్‌లో ప్రదీప్ ఈ సినిమాను చక్కగా తెరకెక్కిస్తున్నారు. చిత్రాన్ని మార్చిలో విడుదల చేయాలనుకుంటున్నాం. ప్రదీప్ దర్శకత్వంలోనే 'దెయ్యంతో ఓ రాత్రి' చిత్రాన్ని ఫిబ్రవరిలో ప్రారంభిస్తున్నాం'' అన్నారు దయాకర్‌రెడ్డి. ఈ చిత్రానికి సంగీతం: నవీన్ .జె, కెమెరా, ఎడిటింగ్, దర్శకత్వం: ప్రదీప్.

పరి పరిశోధన

ఆ ప్రొటీన్‌తో వందేళ్లు, ఆరోగ్యం కూడా!

వందేళ్లు బతకాలని అందరూ కోరుకుంటారుగానీ.. ముసలి వయసులో వచ్చే ఆరోగ్య సమస్యలు గుర్తుకొస్తే మాత్రం.. ఒకటికి రెండుసార్లు ఆలోచిస్తారు. అందుకేనేమో.. బ్రౌన్ యూనివర్సిటీ శాస్త్రవేత్తలు ఆయుష్షును పెంచడం కాకుండా, బతికున్నంత కాలమూ ఆరోగ్యం ఉండటం ఎలా? అన్న అంశంపై దృష్టి పెట్టారు. ఈ విషయంపై ఈగలపై కొన్ని ప్రయోగాలు చేస్తే..



సిర్ట్4 అనే ప్రొటీన్‌తో ఇది సాధ్యమని తెలిసింది. ఈ ప్రొటీన్ అటు జీవక్రియలతోపాటు.. వయసుతోపాటు వచ్చే వ్యాధుల్లోనూ కీలకపాత్ర పోషిస్తున్నట్లు ఇప్పటికే గుర్తించారు. ఈ నేపథ్యంలో సిర్ట్4 ప్రొటీన్‌ను ఆరోగ్యం కోసం ఎలా ఉపయోగించుకోవచ్చో తెలుసుకునేందుకు ఈగలపై పరిశోధనలు జరిగాయన్నమాట. సిర్ట్4 ప్రొటీన్ ఎక్కువగా ఉత్పత్తి అయ్యే ఈగల ఆయుష్షు 20 శాతం ఎక్కువ కావడంతో పాటు ఆరోగ్యంగానూ ఉన్నట్లు తెలిసింది. ఈ ప్రొటీన్ ఉత్పత్తిని పూర్తిగా నిలిపివేసిన ఈగలను పరిశీలిస్తే ఆయుష్షు 20 శాతం వరకూ తగ్గినట్లు తెలిసింది. ఇంకో ముఖ్యమైన విషయం ఏమిటంటే.. ఉపవాసమున్నప్పుడు సిర్ట్4 ప్రొటీన్ కణాలకు అవసరమైన ఇంధనాన్ని అందిస్తుందని.. ఈ ప్రొటీన్ తక్కువ ఉన్న ఈగలు సాధారణ ఈగల కంటే వేగంగా చచ్చిపోయాయని ఈ పరిశోధనల్లో పాల్గొన్న శాస్త్రవేత్త స్టీఫెన్ హెల్‌ఫాండ్ తెలిపారు.

సోయా పాలతో దేహానికి పుష్టి...

ఒకప్పుడు పాలు అంటే ఆవు లేదా బర్రె నుంచి పిండుకున్నవే. మరిప్పుడో.. బోలెడన్ని రకాలు. సోయా, బాదాం, బియ్యపుపాలు, కొబ్బరిపాలు.. ఇలా పాలు వేర్వేరు రూపాల్లో అందుతోంది. ఆవు, బర్రెపాలు అంటే పడనివారు చాలామంది వీటిని ఉపయోగిస్తున్నారు కూడా. ఎన్ని రకాలు ఉంటేనేం ఆరోగ్యానికి ఆవుపాలే మేలు అంటున్నారా? మీ అంచనా నిజమేకానీ..



సోయా గింజల నుంచి సేకరించిన పాలు కూడా దాదాపు ఇంతే మేలు చేస్తాయని అంటున్నారు మెక్‌గిల్ యూనివర్సిటీ శాస్త్రవేత్తలు. గింజల, కాయల నుంచి సేకరించే రకరకాల పాలన్నింటిలోని పోషకాలను విశ్లేషించడం ద్వారా తాము ఈ అంచనాకు వచ్చామని... అన్ని రకాల పోషకాలు సమతులంగా ఉండే పాలు సోయా అని వారు చెప్పారు. సోయాలోని ఐసోఫ్లేవిన్స్ అనే రసాయనాలు కేన్సర్ నుంచి రక్షణ కల్పిస్తాయన్నది తెలిసిన విషయమే. దీంతోపోలిస్తే బియ్యంతో చేసిన పాలు తీయగా ఉన్నప్పటికీ పోషకాలు మాత్రం తక్కువేనని వీరి అధ్యయనంలో తెలిసింది. కార్బోహైడ్రేట్లు ఎక్కువగా ఉండటం వల్ల పసిపిల్లలకు అంత మంచిది కాదని హెచ్చరిస్తున్నారు శాస్త్రవేత్తలు. ఇక ఆసియాతోపాటు దక్షిణ అమెరికాలో ఎక్కువగా వినియోగించే కొబ్బరి పాలలో కేలరీలు తక్కువగా ఉంటాయి. అంతేకాకుండా చెడు కొలెస్ట్రాల్‌ను తగ్గించేందుకు ఉపయోగపడతాయి. ఇక బాదాంపాలలో ఉండే మోనోఅన్‌శాచురేటెడ్ కొవ్వులు బరువు తగ్గించుకునేందుకు భేషుగ్గా ఉపయోగపడతాయని శాస్త్రవేత్తల అంచనా.

బియ్యపు గింజ సైజులో రోబో!

శరీరంలోని వేర్వేరు అవయవాలకు నేరుగా మందులు అందించేందుకు వీలు కల్పించే ఓ బుల్లి రోబోను జర్మనీకి చెందిన శాస్త్రవేత్తలు తయారు చేశారు. కేవలం ఒక బియ్యపు గింజ సైజులో ఉండే ఈ రోబో గంతులేయడం మొదలుకొని పాకడం, ఎగబాకడం వంటి అన్ని రకాలుగా కదలగలగడం విశేషం. గొల్లభామ స్ఫూర్తితో తయారైన ఈ బుల్లి రోబోను శరీరం బయటి నుంచి అయస్కాంతాల నుంచి ఉపయోగించి నియంత్రించవచ్చు. శస్త్రచికిత్స చేయకుండానే





లోపలి అవయవాలకు మందులు అందించేందుకు ఈ రకమైన రోబోలు బాగా ఉపయోగపడతాయని మ్యాక్స్ ప్లాంక్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ ఇంటెలిజెంట్ సిస్టమ్స్‌కు చెందిన శాస్త్రవేత్త మెటిన్ సిట్టీ తెలిపారు. నోటి ద్వారా లేదంటే ఏదైనా ఇతర ప్రాంతాల నుంచి శరీరంలోకి దీన్ని చొప్పించవచ్చునని అయస్కాంతాల సాయంతో కావాల్సిన చోటికి తీసుకెళ్లి అక్కడ మందులు వదిలేలా చేయవచ్చునని ఆయన చెప్పారు. ఇప్పటివరకూ తాము దీన్ని కృత్రిమంగా తయారు చేసిన కడుపు నమూనాలో, కోడి కణజాలంలో ప్రయోగించి చూశామని.. అన్ని రకాల పరిసరాల్లోనూ ఇది భేషుగ్గా పనిచేసిందని వివరించారు.

సాక్షి ఫ్యామిలీ
విజయవాడ
బుధవారం
31-1-2018



సిద్ధబోయిన మునీందర్, పూజారి

ఆదివాసీలు పవిత్రంగా భావించే చిలకలగుట్ట మీద సమ్మక్క కొలువై ఉండే చోటు తెలిసిన అతికొద్ది మందిలో ఒకరు సిద్ధబోయిన మునీందర్. చిలకలగుట్టపైకి పూజారులంతా కలిసి వెళ్లినా మార్గమధ్యం నుంచి రహస్య ప్రాంతానికి చేరుకునే ఐదుగురిలో ప్రధానమైన వ్యక్తి ఇతనే. గడిచిన ఇరవై ఏళ్లుగా చిలకలగుట్టపై ఉన్న సమ్మక్కను కిందకు తీసుకువచ్చే బాధ్యతను నిర్వరిస్తున్నారు. అత్యవసరం అనుకుంటే తప్ప మునీందర్ నుంచి వివరాలు వెల్లడి కావు. ప్రచార ఆర్భాటాలకు దూరంగా ఉంటూ సమ్మక్క పూజారిగా నియమ నిష్టలతో కూడిన జీవితాన్ని గడిపే మునీందర్ 'నేను నా దైవం' కోసం సాక్షితో మాట్లాడారు.

మాఘ పౌర్ణమినాడు మనువు

ఆదివాసీల విశ్వాసం ప్రకారం సమ్మక్క భర్త పగిడిద్ద రాజు. వీరి సంతానం సారలమ్మ. పగిడిద్దరాజు సోదరుడు గోవిందరాజు. ఆదివాసీల ఇలవేల్పులైన వీరు నాలుగు వేర్వేరు ప్రాంతాల్లో కొలువై ఉంటారు. పూర్వం రోజుల్లో ప్రతి రెండేళ్లకు మాఘశుద్ధ పౌర్ణమిరోజు సమ్మక్క-పగిడిద్దరాజుకు వివాహం జరిపించడం ఆదివాసీ సంప్రదాయం. దీనికోసం సమ్మక్క పూజారులు గ్రామాల్లో తిరిగేవారు. వీరికి ఇచ్చేందుకు అప్పటి ఆదివాసీలు తమ పంటలో కొంత భాగాన్ని పక్కకు పెట్టేవారు. పంటలేని వారు కోళ్లు, మేకలు వంటి వస్తువులు సమర్పించుకునే వారు. ఇలా సేకరించిన వస్తువులతో మాఘశుద్ధ పౌర్ణమి లేదా ఆ పౌర్ణమికి ముందు వచ్చే బుధవారం రోజు సమ్మక్క, సారలమ్మలకు వివాహం జరిపిస్తారు. ఆ వివాహ వేడుక కాలక్రమేణా మేడారం జాతరగా మారింది.

అడవి తల్లి అందరి మాత

■ సమ్మక్క, సారలమ్మలను పోరాట యోధులు అంటారు. మరి వాళ్లెప్పుడు దేవుళ్లయ్యారు?

మాకు వాళ్లు పోరాట యోధులు కాదు. కాకతీయ రాజు ప్రతాపరుద్రుడు – సమ్మక్క యుద్ధం అనే ప్రచారంతో ఈ దేవతలతో సంబంధం లేదు. తరతరాలుగా సమ్మక్క సారలమ్మలు మా ఇలవేల్పులు.

■ జాతర మూడు రోజుల్లోనే కాకుండా మిగతా ఏడాది అంతా సమ్మక్క సారలమ్మలకు నిత్య పూజలు ఉంటాయా?

మా ఆదివాసీ సంప్రదాయాల ప్రకారం మిగిలిన రోజుల్లోనూ పూజలు చేస్తాం. అయితే బుధవారం నాడు మాత్రం సమ్మక్క వారంగా భావించి పూజలు చేస్తాం. బుధ, గురువారాలు, పౌర్ణమీ రోజుల్లోనూ పూజలు ఎక్కువగా ఉంటాయి. దసరా పండగ సందర్భంగా ప్రత్యేక పూజలు చేస్తాం.

■ ఈ మాఘపౌర్ణమి పూజల్లో నియమాలు ఏ విధంగా ఉంటాయి? వాటిని ఉల్లంఘిస్తే కీడు జరిగిన సందర్భాలున్నాయా?

వన దేవతలను తీసుకొచ్చే బాధ్యత ఉన్నందున మాకు కట్టుబాట్లు ఉన్నాయి. గ్రామాల్లో ఇండ్ల నుంచి వచ్చే కాలువ నీళ్లు తొక్కం. బయట ఇళ్లలో భోజనాలు చేయం. సాధ్యమైనంత వరకు ఉదయం బయటకు వెళితే సాయంత్రానికి ఎట్టి పరిస్థితుల్లో ఇంటికి చేరుకుంటాం. వనం తీసుకొచ్చేప్పుడు దిష్టి తగలకుండా కోడిగుడ్డు తిప్పి పడేస్తారు. ఇలా చేయకపోతే వనం తెచ్చేవారు ముందుకు కదలకుండా ఆగిపోతారు. గద్దెలకు బయల్దేరిన సారలమ్మ, గోవిందరాజు, పగిడిద్దరాజు ప్రయాణం విషయంలో ఈ విధానం కొనసాగుతుంది. ఎదురిళ్లు (ఎదుర్కోలు)దగ్గర శాంతిపూజ చేస్తాం. లేని పక్షంలో సమ్మక్క ముందుకు కదలదు. ఎదురిళ్లు దగ్గర ఏదైనా లోపం జరిగితే ప్రాణనష్టం ఉంటుంది. అలా జరగకుండా జాగ్రత్తలు తీసుకుంటాం కాబట్టి, ఇప్పటివరకు అలాంటి ప్రమాదాలు చూడలేదు. ఇక ఏడాది పొడవునా కూడా నియమాలను ఉల్లంఘించం. నేనైతే బుధ, గురువారాల్లో ఉపవాసం ఉంటాను. ఊరు విడిచి బయటకు వెళ్లను. ఊరంతా చేసే భోజనాల దగ్గర తినను. ఒకవేళ తినాలన్నా ముందుగా భోజనాన్ని తీసి ఉంచుతారు. ఇంట్లో కూడా ఎంగిలికాని అన్నమే తింటాను.

■ జాతర సందర్భంగా పూజారులు మద్యం సేవిస్తారని విన్నాం?

జాతర సందర్భంగా పూజారులు మద్యం సేవించడం తప్పనిసరి అని బయట ప్రచారం ఉంది. కానీ, గుడిమెలిగే పండగ నుంచి మా పూజారులందరూ ఉపవాసాలు ఉంటాం. మద్యం జోలికి అస్సలు వెళ్లం. నియమ నిష్టలు పాటించకుండా ఉంటే సమ్మక్క సహించదు. జాతర సందర్భంగా ముఖ్యమైన రోజుల్లో చిలకలగుట్ట పైకి చేరుకుని సమ్మక్కకు మా ఆదివాసీల పద్ధతిలో పూజలు చేస్తాం. ఈ సందర్భంగా నియమ నిష్టలు పాటించకుండా చిలకలగుట్ట ఎక్కడం ప్రారంభించామే అనుకోండి దాని ప్రభావం పలు రకాలుగా ఉంటుంది. గుట్ట ఎక్కలేం. ఎవరో చేత్తో వెనక్కి నెట్టేసినట్లుగా అవుతుంది. అడుగులు ముందుకు పడవు. కొన్నిసార్లు కనిపించని శక్తి (సమ్మక్క) కొరాడాతో కొడుతున్నట్లుగా అనిపిస్తుంది. ఇలాంటి సందర్భాలు ఎదురైనప్పుడు మధ్యలోనే మా పూజారులు ఆగిపోతారు. చేసిన తప్పులు మన్నించమని అమ్మతల్లిని వేడుకుంటాం. పరిహారం చెల్లిస్తామని మొక్కుకుంటాం. ఆ తర్వాతే ముందుకు కదులుతాం. సమ్మక్క తల్లికి ఎరుపు వర్ణం అంటే ఇష్టం. అందువల్ల చిలకలగుట్టపైకి చేరుకునే సందర్భంలో ఎరుపు రంగు గుడ్డను తలకు చుట్టుకుంటాం. అమ్మకు ఎరుపు రంగు వస్తువులనే ఇచ్చుకుంటాం.

■ మీరు సమ్మక్క, సారలమ్మను కాకుండా ఇంకెవరినైనా పూజిస్తారా?

ప్రత్యేకంగా ఇతర దేవతలను పూజించం. పండగ రోజులు, ప్రత్యేక రోజుల్లో మాత్రం వనదేవతలకు దండం పెట్టుకుంటాం.

■ జాతర సందర్భంగా కోటి పాతిక లక్షల మంది వస్తుంటారు. ఇంతమంది ఉన్నప్పుడు భక్తిభావన ఉంటుందా?

ఉంటుంది. ఆ భావన కోసమే అందరూ వస్తారు. ధనవంతులు సైతం వచ్చి అడవుల్లో, పొలాల్లో, వాగుల వెంట రెండు మూడు రోజులు బస చేస్తారు. ఎవ్వరికీ ఎటువంటి హానీ జరగదు. అడవిలో జరిగే జాతర అయినా సరే కనీసం పాము భయం కూడా లేకుండా భక్తులు ఇక్కడే ఉంటారు. భక్తుల రద్దీ ఎంత ఉన్నా అవాంఛనీయ సంఘటనలు జరగడం చాలా అరుదు. అంటే ఇక్కడ ఆ అమ్మతల్లుల దయ ఉండటం వల్లే ఇది సాధ్యమౌతుంది కదా!

■ మీ కుటుంబాల్లో సమ్మక్క, సారలమ్మలు చూపిన మహిమలు ఉన్నాయా?

జాతర సమయంలో, రాత్రి సమయంలో గుడి దగ్గరికి వెళ్లినప్పుడు గజ్జెల చప్పుడు వినిపిస్తుంది. పౌర్ణమి రోజున గద్దెల దగ్గరకు ఓ పెద్ద నాగుపాము వస్తుంది. నాకు చాలా సార్లు కనిపించింది. దేవాదాయశాఖ సిబ్బంది కూడా ఈ విషయం నాకు చెప్పారు. సమ్మక్క దగ్గరికి పాము రూపంలో పగిడిద్దరాజు వస్తాడు. అదే మాకు గుర్తు.

■ బెల్లం బంగారం అంటారు కదా! దీనికి కారణం ఏమైనా ఉందా?

మా ఆదివాసీలకు బెల్లం ఇష్టమైన వస్తువు, విలువైన వస్తువు కూడా. నిల్వ ఉంటుంది. తీపి కోసం తేనె మీదనే ఆధారపడేటోల్లు. ఇప్పుడంటే ఆ పరిస్థితులు లేవు కానీ, మరీ వెనుకటి రోజుల్లో బెల్లం తెచ్చుకోవాలంటే చాలా కష్టంగా ఉండేది. కష్టమైనదాన్ని సంపాదించి, దేవతలకు మొక్కు చెల్లిస్తే మంచి జరుగుతుందని మా నమ్మకం. అలా అందరి మొక్కు అయ్యింది.

■ పూజారులైన మీకు మిగతా రోజుల్లో ఎలాంటి గౌరవ మర్యాదలు లభిస్తాయి?

సమ్మక్క సారలమ్మ పూజారులం అని మేమెక్కడా బయట ఎవ్వరికీ చెప్పుకోం. దాంతో మా గురించి పెద్దగా ఎవ్వరికీ తెలియదు. మా ఊళ్లో వాళ్లకు తెలిసినప్పటికీ ఎవ్వరూ దాని గురించి ప్రస్తావించరు. అందరిలాగే మేము సాధారణ జీవితమే గడుపుతాం. జాతర ముగిస్తే వ్యవసాయం చేసుకుంటాం. లేదా అడవికి వెళ్తాం. ఇప్పుడు పేపరొళ్లు వచ్చి మమ్మల్ని పట్టుకుని ఫోటోలు తీసుకుని మాట్లాడుతున్నారు. ఆ పేపర్లు కూడా మేం చూడం. గత ఐదారేళ్ల నుంచి జాతర నిర్వాహణలో ప్రభుత్వ అధికారులు మా అభిప్రాయాలను కొంత మేరకు పరిగణలోకి తీసుకుంటున్నారు. మమ్మల్ని గుర్తుపట్టే భక్తులు.... మేము బొట్టు పెట్టాలని, బంగారం ప్రసాదం ఇవ్వాలని ఆరాటపడతారు. అంతవరకే మాకు తెలిసింది.

■ సమ్మక్క సారలమ్మ మిమ్మల్ని పూనడం, కల్లోకి వచ్చిన సందర్భాలున్నాయా?

జాతర ముందు రోజుల్లో కలలో ముసలమ్మ రూపంలో సమ్మక్క ఎక్కువగా కనిపిస్తది. ఆ సమయంలో ఉలిక్కిపడి లేవడం జరుగుతుంది. ఆ విషయాలు బయటకు చెప్పేవి కావు.

■ ఎక్కడైనా ఉపద్రవాలు, ప్రకృతి వైపరీత్యాలు రావడానికి ముందే మీకు సూచనలు ఏమైనా కన్పించాయా?

అలాంటివేవీ లేవు. వనదేవతలైన ఈ అమ్మవార్లను కొలుచుకోవడం, మా పనులు మేం చేసుకోవడం అంతే తప్ప వేరే విషయాలు అంతగా తెలియవు.

■ ఎన్ని తరాలుగా ఈ పూజారి విధానాన్ని మీరు అవలంబిస్తున్నారు. మీ తదనంతరం ఎవరికి ఈ విధానాన్ని, ఎలా పరిచయం చేస్తారు?

కచ్చితంగా చెప్పలేం. ఎప్పటి నుంచో వస్తుంది. మా తాతల హయాంలో మాత్రం మా పూర్వీకులు చత్తీస్‌గడ్ నుంచి గోదావరి దాటి ఇటు వచ్చారని తెలిసింది. అప్పటి నుంచి సమ్మక్క మా ఇలవేల్పు. వంశపార్యంపరంగా పూజలు చేస్తున్నాం. మా ఇండ్లలో మగపిల్లలకు ఒకరి నుంచి మరొకరికి పూజా బాధ్యతలు అప్పగిస్తాం. తొలుత జాతర సందర్భంగా ఇతర బాధ్యతలు అప్పగిస్తాం. ఒక్కో జాతర గడుస్తున్న కొద్దీ బాధ్యతలు పెంచుతాం. సరైన సమయం వచ్చినట్లు ఆ దేవతల నుంచి పిలుపు వస్తే అప్పుడు ప్రధాన పూజారి బాధ్యతలు అప్పగిస్తాం.

- తాండ్ర కృష్ణగోవింద్, వరంగల్, సాక్షిప్రతినిధి
ఫొటోలు: **దశరథ్**

అందరూ శిగమూగుతారు



జాతర ప్రారంభానికి ముందురోజు రాత్రి సారలమ్మ పూజారులంతా కన్నెపల్లిలో గుడికి చేరుకుంటాం. ఆవునెయ్యి, ఆవుపాలతో సారలమ్మ ఆలయంలో ఉన్న పూజా వస్తువులను శుభ్రం చేస్తాం. అనంతరం రెండు గంటల పాటు పూజలు చేసి తెల్లవారుజామున ఇంటికి వెళ్తాం. మరుసటి రోజున అమ్మవారిని తీసుకువచ్చాక మా ఆదివాసీ పద్ధతిలో పూజలు జరుగుతాయి. ఈ సమయంలోనే నాకు సారలమ్మ పూనుతుంది. సారలమ్మ ఆవహించిన తర్వాత నాకు తెలియకుండానే పరుగుల పెడతాను. దీంతో నన్ను(సారలమ్మ తల్లిని) శాంతిప జేసేందుకు నీళ్లు జల్లుతారు. మేడారం వెళ్లే దారిలో సారలమ్మకు కొమ్ము పడతారు. దూపం వేస్తారు. మేడారం బయల్దేరి సారలమ్మకు దారిపొడవునా భక్తులు జయజయ ధ్వానాలు చేస్తారు. శివాలతో ఊగిపోతుంటారు. సంతానం లేని వారు సంతాన ప్రాప్తికి, వరాల కోసం సాష్టాంగ నమస్కారాలు చేస్తారు. వారిపై నుండి పూజారులం దాటి వెళితే వారికి ఆ తల్లి ఆశీస్సులు వచ్చినట్లు నమ్ముతారు.

- కాక సారయ్య, పూజారి

అందరిలానే నేను



ఎంతో మంది భక్తులు తమ కోరికలు తీరాలని, తమ కష్టాలు తొలగిపోవాలని అమ్మ తల్లిని కొలుస్తారు. వారు అనుకున్న పనిని ఆ తల్లి చేసిపెడుతుంది. అందుకే ఏ ఏడుకి ఆ ఏడు భక్తుల సంఖ్య పెరుగుతూ వస్తోంది. అయితే ఆ తల్లిని స్వయంగా తీసుకువచ్చే మాకు మరింత మేలు జరుగుతుంది అందరూ అనుకుంటారు. కానీ, అందరిలానే నేను. అమ్మను తీసుకురావడం అనేది నా బాధ్యత అంతే. అందరికీ మేలు చేసే తల్లి నా కుటుంబానికీ మేలు చేస్తుంది.

- కొక్కెర కృష్ణయ్య, పూజారి

సంప్రదాయం - సైన్స్

నాలుగు పోచలు వేస్తే సరి!..

మనకున్న పవిత్రమయిన వృక్ష సంపదలో గడ్డి జాతికి చెందిన 'దర్భ' ముఖ్యమైనది. ఈ దర్భలో చాలా జాతులున్నాయి. అపర కర్మలలో దర్భలు లేకుండా పని జరగదు. దీని ఆవిర్భావం వెనక అనేక కథలున్నాయి. కొంతమంది దీనిని విశ్వామిత్రుని సృష్టిగా పరిగణిస్తారు. అయితే, కూర్మ పురాణం ఏమి చెబుతోందంటే, విష్ణుమూర్తి కూర్మావతారంలో మంధర పర్వతాన్ని మోస్తున్నప్పుడు, ఆ పర్వత రాపిడికి కూర్మం వంటిమీద ఉండే కేశాలు సముద్రంలో కలిసి అవి మెల్లిగా ఒడ్డుకు కొట్టుకొనిపోయి కుశలుగా మారాయనీ, అమృతం వచ్చినప్పుడు కొన్ని చుక్కలు ఈ కుశ అనే గడ్డి మీద పడటం వల్ల అవి అంతటి పవిత్రతను సంతరించుకున్నాయంటుంది. వరాహ పురాణం. ఈ దర్భలు వరాహావతారంలో ఉన్న శ్రీమహావిష్ణువు శరీర కేశాలని చెబుతోంది. అందువలననే దర్భగడ్డికి ఎంతో ప్రత్యేకత ఉంది. దర్భలకు వీటికి దేన్నయినా శుద్ధి చేసే శక్తి ఉందని ఒక నమ్మకం ప్రచారంలో ఉంది. దీన్ని నిజం చేస్తూ శాస్త్రవేత్తలు వీటిని విరేచనాలు, రక్తస్రావం, మూత్రపిండాలలో రాళ్ళు, మూత్రవిసర్జనలో లోపాలు వంటి వాటికి మందుగా వాడుతున్నారు.



అసలు దర్భ అన్న పదం వినగానే మనకు గుర్తుకొచ్చేది గ్రహణ కాలం. ఆ సమయంలో అన్నిటి మీదా దర్భను ఉంచడం పూర్వం నుంచి ఉన్న అలవాటు. కానీ అలా చేయటం వెనుక ఉన్న అసలు రహస్యమేమిటంటే... సూర్య, చంద్ర గ్రహణ సమయాలలో కొన్ని హానికరమయిన విష కిరణాలు అంటే అల్ట్రా వయొలెట్ రేస్ ఉత్పన్నమవుతాయట. అయితే, ఈ అతినీలలోహిత కిరణాలు దర్భల కట్టల మధ్యలోంచి దూరి వెళ్ళలేకపోతున్నాయని ఇటీవల కొన్ని పరిశోధనలలో తేలింది. అందుకే ఆఫ్రికా ప్రాంతంలోని కొన్ని ఆటవిక జాతులు తమ ఇళ్లను పూర్తిగా దర్భగడ్డితోనే నిర్మించుకుంటున్నారు. ఈ విషయాన్ని మన సనాతన మహర్షులు ఎప్పుడో గుర్తించబట్టే, గ్రహణ సమయంలో, ముఖ్యంగా సూర్యగ్రహణ సమయంలో ఇళ్ళ కప్పులను దర్భగడ్డితో కప్పుకొనమని శాసనం చేశారు. బహుశా అందుకే పూర్వం గడ్డితో ఇంటి పైకప్పుని ఎక్కువగా కప్పుకునేవారనుకుంటా. కాలక్రమంలో ఆ శాసనం మార్పులు చెంది, ఇంటి మధ్యలో రెండు దర్భ పరకలు పరచుకొని తూ తూ మంత్రంలా కానిచ్చేస్తున్నారు. ఇలాకాక, కనీసం పిడికెడు దర్భలైనా ప్రతివ్యక్తీ గ్రహణ సమయాలలో శిరస్సు మీద కప్పుకొంటే, చెడు కిరణాల ప్రభావం వుండదని ధర్మశాస్త్రాలు చెబుతున్నాయి.

నేడు చంద్రగ్రహణం కాబట్టి, చాలామంది ఇళ్లలోని పచ్చడి జాడీలు, ఇతర ఆహార పదార్థాలపై నాలుగు దర్భపరకలు వేస్తారు. పెద్దవాళ్లు పాటించే ఈ ఆచారం అంత తేలికగా కొట్టిపారేయడానికి వీలు లేదు. ఎందుకంటే, నిల్వ ఉండే ఊరగాయలు వంటివి గ్రహణ సమయంలో రేడియేషన్ ప్రభావానికి పాడవుతాయట. వాటి మీద దర్భలు వేయడం వల్ల రేడియో ధార్మిక కిరణాల ప్రభావం ఉండదట.

వీటి విలువ తెలిసింది కనుక ఎప్పుడూ ఒక గుప్పెడన్నా ఇంట్లోఉండేలా చూసుకోవడం మరువకండి.

గ్యాస్ట్రోఎంటరాలజీ కౌన్సెలింగ్

ఫ్యామిలీ డాక్టర్



కాలేయం సైజు పెరిగింది. ఎందుకిలా?

నా వయసు 35 ఏళ్లు. నేను నిద్రపోయే సమయంలో ఛాతీ కింద ఎడమవైపున గత వారం నుంచి నొప్పి వస్తోంది. డాక్టర్‌ను సంప్రదిస్తే లివర్ సైజు పెరిగిందని చెప్పారు. లివర్ సైజు ఎందుకు పెరుగుతుందో దయచేసి తెలియజేయండి.

- హేమంత్‌కుమార్, శ్రీకాకుళం

కాలేయం పెరగడానికి వివిధ రకాల కారణాలు ఉండవచ్చు. ఆల్కహాల్ ఎక్కువ మోతాదులో తీసుకునేవారిలో, స్థూలకాయం ఉన్నవారిలో కాలేయంలో కొవ్వు పేరుకుపోయి లివర్ సైజ్ పెరిగే అవకాశం ఉంది. మీ లేఖలో మీరు స్థూలకాయులా లేదా మీకు ఆల్కహాల్ అలవాటు ఉందా లేదా తెలియజేయలేదు. కొన్ని రకాల వైరల్ ఇన్ఫెక్షన్లు, హెపటైటిస్-బి, హెపటైటిస్-సి వంటి ఇన్ఫెక్షన్స్ వల్ల కూడా లివర్ పెరిగే అవకాశం ఉంది. కానీ మీరు రాసిన కాలేయం పరీక్షలో అన్నీ నార్మల్‌గా ఉన్నాయి కాబట్టి అలాంటివి ఉండే అవకాశం తక్కువ. ముందుగా మీలో లివర్ పరిమాణం ఎంత పెరిగిందో తెలుసుకోడానికి అల్ట్రా సౌండ్ స్కానింగ్ పరీక్ష చేయించండి. మీకు వస్తున్న కడుపులో నొప్పి ఎడమవైపు ఛాతీ కింది భాగంలో వస్తోంది కాబట్టి ఒకసారి ఎండోస్కోపీ కూడా చేయించగలరు. ఈ రెండు పరీక్షల వల్ల మీలో కాలేయం పరిమాణం పెరగడానికి కారణంతో పాటు నొప్పి ఎందుకు వస్తోంది అన్న విషయం కూడా తెలిసే అవకాశం ఉంది. మీకు మద్యం తాగడం, పొగ తాగడం వంటి అలవాట్లు ఉంటే వాటిని వెంటనే మానేయండి.

లివర్‌కూ, కిడ్నీకీ సంబంధం ఏమిటి?

నా వయసు 58 ఏళ్లు. నేను 'సిర్రోసిస్ ఆఫ్ లివర్' అనే వ్యాధితో బాధపడుతున్నాను. కడుపులో నీరు వచ్చి చేరుతోంది. డాక్టర్‌కు చూపించుకుంటే 'మీ కిడ్నీ సరిగా పనిచేయడం లేద'న్నారు. కిడ్నీ పనితీరుకూ కడుపులో నీరు చేరడానికి సంబంధం ఏమిటో అర్థం కాలేదు. కడుపులో నీరు తగ్గేదెలా?

- డి. రామమూర్తి, ఒంగోలు



మీరు చెబుతున్న లక్షణాలు బట్టి చూస్తే మీ కాలేయం పూర్తిగా చెడిపోయిన దశలో ఉన్నారు. కాలేయం చెడిపోవడం వల్ల కడుపులో నీరు చేరడం, కాళ్లల్లో వాపు రావడం వంటి లక్షణాలు కనిపిస్తాయి. ఈ సమస్యకు తొలిదశలో ఉప్పు తక్కువగా వాడటం, మూత్రం ఎక్కువగా వచ్చేటట్లు చేసే మందులు వాడాలి. కానీ మీ డిడ్నీ వ్యవస్థ సరిగా లేనందున ఆ మందులు వాడటం కుదరదు. ఇలాంటి పరిస్థితుల్లో ప్రతి రెండువారాలకు ఒకసారి కడుపులో నీరు తీయించుకోవడమే గాక... కొన్ని ఇంజెక్షన్స్ చేయించుకోవాలి. దీనివల్ల మీరు కొంతవరకు ఉపశమనం పొందవచ్చు. దీంతోపాటు ఉప్పును పూర్తిగా తగ్గించుకోవాలి. నీరు కూడా జాగ్రత్తగా తక్కువగా తాగడం మంచిది. ఈ సమస్యకు కాలేయమార్పిడి శస్త్రచికిత్సే మంచి పరిష్కారం. కాలేయ మార్పిడి వల్ల మీకు ఉన్న సమస్యను పూర్తిగా తొలగించవచ్చు. కాబట్టి మీరు కాలేయ మార్పిడి వైద్యుడిని కలిసి మాట్లాడి తగిన నిర్ణయం తీసుకోండి.

అప్పటి వ్యాధి ఇప్పుడు తిరగబెట్టిందా?

నా వయసు 47 ఏళ్లు. కొన్నేళ్ల కిందట నాకు ఆపరేషన్ చేసి ఎడమవైపు రొమ్ము తొలగించారు. ఇంతకాలంగా నాకు ఎలాంటి సమస్యా లేదు. కానీ నెల రోజుల నుంచి కళ్లు పచ్చగా కనిపిస్తున్నాయి. ఆకలి తగ్గింది. నీరసంగా ఉంటోంది. అప్పుడప్పుడూ కడుపులో నొప్పి వస్తోంది. గతంలో రొమ్ముకు వచ్చిన వ్యాధి ఇప్పుడు కడుపులోకి పాకిందంటారా? నాకు తగిన సలహా ఇవ్వండి.

- ఒక సోదరి, హైదరాబాద్

మీరు రాసిన విషయాలను బట్టి చూస్తే క్యాన్సర్ కారణంగా గతంలో మీకు రొమ్ము తొలగించారని అర్థమవుతోంది. ప్రస్తుతం మీరు కామెర్లతో బాధపడుతున్నారు. గతంలో ఉన్న రొమ్ముక్యాన్సర్ ప్రభావం కాలేయంపైన కూడా పడే అవకాశం ఉంది. కాబట్టి మీరు ఒకసారి అల్ట్రాసౌండ్ స్కానింగ్, కాలేయానికి సంబంధించిన రక్తపరీక్షలు చేయించుకోండి. ఈ పరీక్షల్లో మీ సమస్య బయటపడుతుంది. ఒకవేళ క్యాన్సర్ వల్ల మీ లివర్ ప్రభావితమైతే, దీన్ని వీలైనంత త్వరగా గుర్తించి, వెంటనే చికిత్స తీసుకోవాల్సి ఉంటుంది. కాబట్టి మీరు వీలైనంత త్వరగా దగ్గర్లోని గ్యాస్ట్రో ఎంటరాలజిస్టును సంప్రదించి, పరీక్షలు చేయించి, అవసరమైన చికిత్స తీసుకోగలరు.

బాబు కళ్లు పచ్చ బారుతున్నాయి... ఏం చేయాలి?



మా బాబు వయసు పదకొండేళ్లు. ఎనిమిదేళ్ల వయసప్పుడు అతడికి పచ్చకామెర్లు వచ్చాయి. అవి నెలలోపు వాటంతట అవే తగ్గిపోయాయి. మళ్లీ రెండు వారాల క్రితం నుంచి కళ్లు పచ్చగా కనిపిసర్తున్నాయి. దయచేసి సలహా ఇవ్వగలరు.

- ప్రకాశ్‌రావు, నిజామాబాద్

మీ అబ్బాయి వయసులోని వారికి ప్రధానంగా హైపటైటిస్ ఎ, హెపటైటిస్ ఈ అనే వైరస్‌ల వల్ల కామెర్లు రావడానికి అవకాశం ఉంటుంది. మీవాడికి ఇంతకుముందు కూడా ఒకసారి కామెర్లు వచ్చాయంటున్నారు. కాబట్టి ఈ వైరస్ వల్ల మళ్లీ మళ్లీ ఇన్ఫెక్షన్ సోకే అవకాశం చాలా అరుదు. ఒకసారి పై ఇన్ఫెక్షన్లు సోకితే వాటి పట్ల వ్యాధి నిరోధకశక్తి అభివృద్ధి అయ్యే అవకాశం ఉంది. దీన్ని బట్టి చూస్తే మీ బాబు కామెర్లకు ఇతర కారణాలు అంటే... విల్సన్ డిసీజ్ వంటివి ఉండవచ్చు. మీ బాబుకు దురద, రక్తహీనత వంటి లక్షణాలు ఉన్నాయా, లేవా అన్న విషయం మీరు రాయలేదు. మీరు ఆందోళన చెందకుండా దగ్గర్లోని గ్యాస్ట్రో ఎంటరాలజిస్ట్‌కు చూపించుకుని అవసరమైన పరీక్షలు చేయించండి.



డాక్టర్ భవానీరాజు
సీనియర్ గ్యాస్ట్రో ఎంటరాలజిస్ట్, కేర్ హాస్పిటల్స్, బంజారాహిల్స్, హైదరాబాద్

డబ్బింగ్ క్లాసిక్స్- 10

వీరప్పన్‌కు తొలి వెండితెర జవాబు



అడవిలోని బందిపోట్లు ఆలివ్ గ్రీన్ డ్రస్‌లో మెడకు తూటాల పట్టీ వేలాడ దీసుకుని బుర్ర మీసాలతో ఉంటారని వీరప్పన్ కథ వల్ల మనకు తెలిసింది.

కాని అడవి బయట ఉండే బందిపోట్లు తెల్ల చొక్కా తెల్ల పంచె కట్టుకుని భుజాన కండువాతో వేదికలెక్కి ఉపన్యాసాలిస్తుంటారని కూడా వీరప్పన్ కథ మనకు చెప్పింది.

వీరప్పన్ దోచుకుంది కొంత.

బయట అతని వల్ల దోచుకోబడింది కొండంత.

ప్రభుత్వానికి ప్రభుత్వమే విలన్ అయితే ఎటువంటి విలన్స్ ఉబికి వస్తారనడానికి కూడా వీరప్పన్ కథ ఒక ఉదాహరణే.

* * *

వీరప్పన్ తన పదిహేడవ ఏట మొదటి హత్య చేశాడు. దంతాల కోసం ఏనుగులను చంపుతున్నప్పుడు వాటిని అంకుశంతో బెదిరించవచ్చని అతడు గ్రహించాడు. కాని 'భయం' అనే అంకుశం ధరిస్తే ఏ మనిషి అయినా బెదిరిపోక తప్పదని కూడా గ్రహించాడు. డబ్బు సులభంగా రాదని డబ్బుకు వాటాదారులు ఎక్కువని కూడా అతడికి తెలుసు. వ్యవస్థకు ఎదురెళ్లాలంటే వ్యవస్థను లొంగదీసుకోవాలని కూడా తెలుసు. రెండు రాష్ట్రాలు... కర్నాటక, తమిళనాడు... వాటి సరిహద్దుల్లో ఉన్న అడవుల్లో రెండు రాష్ట్రాల వ్యవస్థలను లొంగదీసుకుని సామ్రాజ్యాన్ని స్థాపించినవాడు వీరప్పన్. నిజాయితీ ఉన్న అధికారి తన ప్రథమ శత్రువు అని తలచినవాడు. తెలుగు ప్రజలకు ఏ మాత్రం సంబంధం లేని ఈ కథకు ఒక ఉత్తమ ఆఫీసర్ బలి కావడం వల్ల కూడా తెలుగువారికి వీరప్పన్ విలన్ అయ్యాడు. వీరప్పన్‌ను మొదటగా అరెస్ట్ చేసిన ఒకే ఒక ఆఫీసర్– తెలుగువాడు– పందిళ్లపల్లి శ్రీనివాస్– వీరప్పన్‌కు పీడకలగా అవతరించాడు. అతణ్ణి 1986లో ఫారెస్ట్ ఆఫీసులో బంధించి విచారణ జరుపుతుండగా వీరప్పన్ తప్పించుకున్నాడు. అయినా శ్రీనివాస్ అతణ్ణి వదల్లేదు. ఉక్కిరిబిక్కిరి అయిన వీరప్పన్ 1991లో లొంగిపోతున్నానని కబురు పంపాడు. నిరాయుధంగా వస్తే లొంగిపోతానని చెప్పాడు. శ్రీనివాస్ అది నమ్మి వెళ్లి వీరప్పన్ చేతిలో హతమయ్యాడు.

* * *

బొమ్మ ఒక్కటే ఉండదు. బొరుసు కూడా ఒక్కలాగే ఉండవు. వీరప్పన్‌కు క్రూరమైన వ్యక్తిత్వం ఉన్నట్టే మానవీయమైన వ్యక్తిత్వం కూడా వెతికే వారు ఉన్నారు. అది కనిపించవచ్చు కూడా. అయినప్పటికీ అతడు సంఘ వ్యతిరేక శక్తి. సంఘానికి బెడదగా మారిన వ్యక్తి. అలాంటి వారు చట్టాన్నే కాదు కళలను కూడా ఆకర్షిస్తారు. వీరప్పన్‌ను అలా మొదటి సారి ఒక కమర్షియల్ సినిమాలోకి పట్టుకొచ్చిన సినిమా 'కెప్టెన్ ప్రభాకర్'.


వీరప్పన్

* * *

దర్శకుడు మణివణ్ణన్‌కు శిష్యుడైన ఆర్.కె. సెల్వమణి సమకాలీన ఘటనల నుంచి కథలను రాసుకోవడంలో సిద్ధహస్తుడు. అతడి తొలి సినిమా 'పోలీస్ విచారణ' మద్రాసులో సీరియల్ కిల్లర్‌గా ఖ్యాతి చెందిన 'ఆటో శంకర్' జీవితం ఆధారంగా రాసుకున్న కథ. పెద్ద హిట్ అయిన ఈ సినిమాకు హీరో విజయ్‌కాంత్. ఈ సినిమా హిట్ కావడంతో దానిని నిర్మించిన ఇబ్రాహీమ్ రౌతర్ తదుపరి సినిమా కూడా సెల్వమణికే ఇచ్చాడు. హీరోగా మళ్లీ విజయ్‌కాంత్‌నే తీసుకున్నాడు. ఈసారి సెల్వమణి అప్పుడు విస్తృతంగా వార్తల్లో ఉన్న వీరప్పన్ పాత్రను తీసుకుని 'కెప్టెన్ ప్రభాకర్' కథ రాసుకున్నాడు. సినిమాలో వీరప్పన్ పట్టుబడతాడు. కాని వీరప్పన్ కథ ముగియడానికి ఈ సినిమా రిలీజైన 13 ఏళ్లు పట్టింది.

* * *

గంధపు చెట్లు నరకడం, ఏనుగు దంతాలు సేకరించడం అడవిలో కష్టం కాదు. వాటిని రవాణా చేయడమే కష్టం. లారీలు చీమలు కావు చాటుగా వెళ్లడానికి. భారీ లారీల్లో గంధపు చెక్కలు రవాణా కావాలంటే దారుల వెంట ఉన్న చెక్ పోస్ట్‌లు 'ధారాళంగా' ఉండాలి. ఆఫీసర్లు ఉదారంగా ఉండాలి. వారిపై అజమాయిషీ చేసే ఆఫీసర్లు, వారిని పోస్ట్ చేసే మంత్రులు కూడా ఉదారంగా ఉండాలి. తద్వారా లాభాన్ని పంచుకోవాలి. ఈ వ్యవస్థ ఇలా స్థిరపడి ఉండటం ఈ సినిమాలో చూపిస్తాడు. వీరప్పన్‌కు మద్దతుగా సినిమాలో స్థానిక ఎం.ఎల్.ఏ, కలెక్టర్, పోలీస్ కమిషనర్ పని చేస్తుంటారు. విజయ్‌కాంత్ ఫారెస్ట్ ఆఫీసర్‌గా వచ్చేంతవరకు వీరప్పన్ ఊపుకు అడ్డే ఉండదు. విజయ్‌కాంత్ అతణ్ణి నిరోధించగలుగుతాడు.

* * *

అయితే అడవిలో ఎక్కువ సేపు కథను నడపలేమని దర్శకునికి తెలుసు. అందుకే ఫస్టాఫ్‌లో సిటీలోనే కొంత కథను నడుపుతాడు. విజయ్‌కాంత్ పాత్రను గొప్పగా ఇంట్రడ్యూస్ చేస్తాడు. అలాగే వీరప్పన్ పాత్రను కూడా. అడవిలోని వాతావరణం, గ్రామాల ప్రజలు, వీరప్పన్ బంధువర్గంలో అతడికి ఉండే విరోధులు, వాళ్ల పాత పగలు... ఇవన్నీ సినిమాలో అంతర్భాగం అవుతాయి. విజయ్‌కాంత్‌ను కేవలం ఒక ఆఫీసర్‌గా మాత్రమే చూపకుండా గృహస్తునిగా, భార్యా బిడ్డలతో, తల్లితో అనుబంధం ఉన్నవాడిగా కూడా చూపడం వల్ల స్త్రీల ప్రమేయం ఉన్న కథగా కూడా మారి మహిళా ప్రేక్షకులను ఆకట్టుకుంటుంది. సాధారణంగా సినిమాల్లో విలన్‌ల జోలికి పోలీసాఫీసరైన హీరో వెళితే అతడి కుటుంబం కష్టాల్లో పడుతుంటుంది. అది జోకనుకుంటాం. కాని ఇక్కడ నిజంగానే వీరప్పన్‌తో పెట్టుకుంటే అందరికీ ప్రమాదం వస్తుంది. కిడ్నాప్‌లకు మారుపేరైన వీరప్పన్ ఈ సినిమాలో కూడా విజయ్‌కాంత్ భార్యాబిడ్డల్ని కిడ్నాప్ చేస్తాడు. వాళ్లను విడిపించుకోవడమే క్లయిమాక్స్. తీరా వీరప్పన్‌ను పట్టుకుని ప్రభుత్వానికి అప్పజెప్పిన సమయంలో అతడి ద్వారా తమ రహస్యాలు బయటపడతాయనుకున్న పెద్దలు అతణ్ణి షూట్ చేసి చంపేస్తారు. విజయ్‌కాంత్ ఆ పెద్దలను కూడా చంపి కోర్టులో సుదీర్ఘ వాదన చేసి బయట పడతాడు. ఇది కొంత వాస్తవ దూరంగా ఉన్నా సినిమాగా చూస్తున్నప్పుడు సరే అని అనిపిస్తుంది.

* * *

కెప్టెన్ ప్రభాకర్ పెద్ద తెర మీద చూడాల్సిన, జనం చూసి మెచ్చిన సినిమా. కథ వల్ల, నేపథ్యం వల్ల, దర్శకుడి ప్రతిభ వల్ల కూడా ఈ సినిమా రక్తి కట్టింది. అన్నింటికీ మించి వీరప్పన్ అనే పాత్ర వల్ల ఇది ఆకర్షవంతమైంది.

ఈ సినిమా తర్వాత వీరప్పన్ మీద అనేక సినిమాలు వచ్చాయి. కాని కెప్టెన్ ప్రభాకర్ మాత్రం ఆ సినిమాలన్నింటిలో కెప్టెన్‌లాంటిది. నిజాయితీ నిండిన పోలీసాఫీసర్లకు సెల్యూట్‌లాంటిది.

సెల్యూట్.

– కె

కెప్టెన్ ప్రభాకరన్


సెల్వమణి

సెల్వమణి దర్శకత్వంలో 1991లో తమిళంలో విడుదలైన 'కెప్టెన్ ప్రభాకరన్' సూపర్ డూపర్ హిట్ అయ్యింది. తెలుగులో 'కెప్టెన్ ప్రభాకర్'గా విడుదలై అంతే విజయం సాధించింది. ముఖ్యంగా బి, సి సెంటర్లలో హౌస్‌ఫుల్ కలెక్షన్లతో నడిచింది. అప్పట్లో తమిళపులి 'ప్రభాకర్'కు తమిళనాట ఉన్న ఆదరణ కారణంగా హీరోకు ప్రభాకర్ అనే పేరు పెట్టారు. సాధారణంగా నూరో సినిమాలు అచ్చిరావనే అపప్రద తమిళంలో ఉంది. కానీ విజయ్‌కాంత్ నూరవ సినిమా అయిన 'కెప్టెన్ ప్రభాకరన్' బ్రహ్మాండమైన హిట్ అయ్యి విజయ్‌కాంత్‌కు 'కెప్టెన్' అనే ముద్దు పేరును సంపాదించి పెట్టింది. కేరళలోని 'చాలకుడి' ప్రాంతంలో అడవుల వెంట తీసిన ఈ సినిమా నిజంగానే గాఢమైన అడవుల్లో వీరప్పన్ కోసం వేట సాగిస్తున్నట్టుగా ఉంటుంది. ఈ సినిమాతో 'మన్సూర్ అలీఖాన్' విలన్‌గా తమిళంలో పెద్ద గుర్తింపు పొందాడు. రాజీవ్‌గాంధీ హత్య కేసు మీద 'కుట్రపత్రికై' తీసి సెన్సార్ కోరల్లో 14 ఏళ్ల పాటు చిక్కుకున్న సెల్వమణి కాలక్రమంలో 'చామంతి', 'సమరం' వంటి సినిమాలు తీసి నటి రోజా భర్తగా తెలుగువారి అల్లుడయ్యాడు. ఇక నటుడుగా, రాజకీయ నాయకునిగా విజయ్‌కాంత్ ప్రస్తుత పరిస్థితి అంత ఆశాజనకంగా లేదు. అతడికి మరో కెప్టెన్ ప్రభాకర్ అవసరం అయితే ఉంది.

నా చెయ్యి చెబుతున్నాది!


సమంత

హీరోయిన్ సమంత చేతికి కాస్త నొప్పిగా ఉన్నా షూట్‌లో పాల్గొన్నారట. అంత బాధపడుతూ షూటింగ్‌లో జాయిన్ అవ్వాల్సిన అవసరం ఏముంది? అంటే... సినిమాలో ఎంతో కీలకమైన సీన్స్ అవి. సమంత ఉండాల్సిందే. బహుశా తన వల్ల చిత్ర బృందానికి ఇబ్బంది కలగకూడదని ఆమె ఆలోచించారేమో. రామ్‌చరణ్ హీరోగా సుకుమార్ దర్శకత్వంలో మైత్రీ మూవీ మేకర్స్ పతాకంపై ఎర్నేని నవీన్, మోహన్ చెరుకూరి, వై. రవిశంకర్ నిర్మిస్తున్న సినిమా 'రంగస్థలం'. కొన్ని కీలకమైన సీన్స్‌తో పాటు రామ్‌చరణ్ ఇంట్రడక్షన్ సాంగ్‌ను రీసెంట్‌గా కంప్లీట్ అయిన రాజమండ్రి షెడ్యూల్‌లో చిత్రీకరించారు. ఈ షెడ్యూల్‌లో పాల్గొన్న సమంతకు ఓ రోజు హెవీ వర్క్ వల్ల కాస్త చెయ్యి నొప్పి అనిపించిందట.

అందుకనే ఆమె కట్టు కట్టించుకున్నారు. ఇన్‌సెట్‌లో ఉన్న ఫొటో చూశారుగా.. అందులో ఉన్నది సమంత హ్యాండే. ''ఫుల్‌గా హార్డ్ వర్క్ చేస్తున్నాం. అందుకు నా చెయ్యే నిదర్శనం'' అని సమంత పేర్కొన్నారు. సమంత చెయ్యి చూస్తుంటే.. 'నా కళ్లు చెబుతున్నాయి..' అని ఏయన్నార్ సాంగ్‌ని రివర్స్ చేసి, 'నా చెయ్యి చెబుతున్నాది' అని సరదాగా అనొచ్చేమో. ఏది ఏమైనా మేడమ్‌కి డెడికేషన్ ఎక్కువ గురూ. 'రంగస్థలం'లో వినికిడి లోపం ఉన్న చిట్టిబాబు క్యారెక్టర్‌లో రామ్‌చరణ్ నటిస్తున్న సంగతి తెలిసిందే. మూగమ్మాయి మహాలక్ష్మి క్యారెక్టర్‌లో సమంత కనిపించనున్నారన్న ఊహాగానాలు వినిపిస్తున్నాయి. ప్రకాశ్‌రాజ్, జగపతిబాబు, ఆది పినిశెట్టి తదితరులు నటిస్తున్న ఈ చిత్రాన్ని మార్చి 30న విడుదల చేయాలనుకుంటున్నారు.

ఈ ప్యాక్ బ్యాక్ ఎవరో?







ఇక్కడున్న ఫొటోలను గమనించారా? ఎవరో కనిపెట్టేశారా? ప్చ్.. లేదు అంటున్నారా? అయితే.. క్లూ ఇదిగో. ఒక ఫొటోలో ఇద్దరు ఉన్నారు కదా.. ఆ ఇద్దరూ అక్కాచెల్లెళ్లు. ఇంకో ఫొటోలో నల్ల ప్యాక్ వేసుకుంది చూశారూ.. ఆ అమ్మాయి మన అతిలోక సుందరి శ్రీదేవికి బంధువు అవుతుంది. బాలీవుడ్ అన్నమాట. మిల్క్‌లాంటి ప్యాక్ వేసుకున్న అమ్మాయి ఎవరనే క్లూ ఇవ్వక్కర్లేదేమో. ఈ క్లూస్‌తో ప్యాక్ బ్యాక్ ఉన్న ముఖారవిందం ఎవరిదో కనిపెట్టేసి ఉంటారు కదూ. తెలుసుకోలేని వాళ్ల కోసం పేర్లు చెప్పేస్తున్నాం... చెప్పేస్తున్నాం... చెప్పేస్తున్నాం. ఆ అక్కాచెల్లెళ్లు ఎవరో కాదు.. లోకనాయకుడు కమల్‌హాసన్ కుమార్తెలు శ్రుతీహాసన్, అక్షరా హాసన్. శ్రీదేవి బంధువు అంటే.. సోనమ్ కపూర్. శ్రీదేవి భర్త బోనీకపూర్ తమ్ముడు అనిల్ కపూర్ కుమార్తె సోనమ్ కపూర్ అనే విషయం తెలిసిందే. మిల్క్‌లాంటి ప్యాక్ వేసుకున్నది ఎవరో కాదు.. మిల్కీ బ్యూటీ తమన్నా. ముఖారవిందం మిలమిలా మెరిసే ముందు ఆ ముఖం కనిపించకుండా ఇలా 'ఫేస్‌ప్యాక్' వేసుకుంటారన్న మాట.

వీడి లవ్‌లో అన్నీ చిక్కులే


ఆనంది, జీవీ ప్రకాష్ కుమార్, నిక్కీ గల్రానీ

జీవీ ప్రకాష్ కుమార్, నిక్కీ గల్రానీ జంటగా ఎం. రాజేశ్ దర్శకత్వంలో తెరకెక్కిన ఓ తమిళ చిత్రాన్ని 'చెన్నై చిన్నోడు' పేరుతో తెలుగులో విడుదల చేయనున్నారు. 'వీడి లవ్ లో అన్నీ చిక్కులే' అన్నది ఉప శీర్షిక. యశ్వంత్ సాయి కుమార్ సమర్పణలో వి.జయంత్ కుమార్ (బి.టెక్) తెలుగులో అనువదిస్తున్నారు. ఈ సినిమా టీజర్, ఫస్ట్ లుక్ పోస్టర్‌ని నిర్మాత కేవీవీ సత్యానారాయణ రిలీజ్ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ– ''నేను కూడా డబ్బింగ్ సినిమాలతో నిర్మాతగా పరిశ్రమకు పరిచయమై తర్వాత పెద్ద సినిమాలు నిర్మించా. జయంత్ కూడా భవిష్యత్ లో మంచి సినిమాలు నిర్మించి, పెద్ద నిర్మాతగా పేరు తెచ్చుకోవాలి. ఈ చిత్రం ఘనవిజయం సాధించి నిర్మాతకు మంచి లాభాలు తీసుకురావాలి'' అన్నారు. వి.జయంత్ కుమార్ మాట్లాడుతూ– ''ప్రేక్షకులను ఆద్యంతం కడుపుబ్బా నవ్వించే చిత్రమిది. ప్రకాశ్‌రాజ్‌గారి పోలీస్ పాత్ర సినిమాకు హైలైట్. జి.వి. ప్రకాష్ అద్భుతమైన నటనతో పాటు, మంచి సంగీతం అందించారు. అందమైన ఫారిన్ లోకేషన్లలో పాటలు చిత్రీకరించారు'' అన్నారు. ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ ఎన్.కృష్ణ, పాటల రచయిత సీహెచ్ పూర్ణాచారి పాల్గొన్నారు. ఈ చిత్రానికి మాటలు: వెలిదెండ్ల రామ్మూర్తి.

ఏక్ నిరంజని!


నిత్యామీనన్

ఏక్ నిరంజన్ విన్నాం కానీ.. ఏక్ నిరంజని ఏంటి? అనుకుంటున్నారా? లైఫ్‌లో ఏ అమ్మాయీ లేని అబ్బాయిలు 'నేను ఏక్‌నిరంజన్' అంటుంటారు కదా. అమ్మాయిలైతే 'నిరంజని' అంటే తప్పు కాదేమో. హీరోయిన్ నిత్యామీనన్ పర్సనల్ లైఫ్ స్టేటస్ ఏంటి? సింగిల్. రీల్‌పై కూడా సింగిలే. ఇప్పటివరకూ చేసిన అన్ని సినిమాల్లోనూ హీరో పక్కన జతకట్టిన ఈ మలయాళ బ్యూటీ ఇప్పుడు ఒక సినిమాలో సోలోగా కనిపించనున్నారు. సినిమా మొత్తం ఆమె ఒక్కరే కనిపిస్తారు. సమాజంలోని సమస్యలపై పోరాడే రచయిత్రిగా ఈ సినిమాలో కనిపించనున్నారు. ఈ సినిమా పేరు 'ప్రాణ'. వీకే ప్రకాశ్ దర్శకత్వంలో నిత్యామీనన్ లీడ్ రోల్‌లో తెలుగు, మలయాళం, కన్నడ, హిందీ భాషల్లో ఈ సినిమా తెరకెక్కుతోంది. ప్రముఖ కెమెరామేన్ పీసీ శ్రీరామ్ ఈ చిత్రానికి ఛాయాగ్రాహకుడు. ''ప్రాణ' సినిమాలో ఓన్లీ వన్ క్యారెక్టర్. సమాజంలోని సమస్యలపై పోరాడే ప్రొగ్రెసివ్ రైటర్ క్యారెక్టర్‌లో నిత్యామీనన్ నటిస్తున్నారు. సినిమాలో ఆమె 'మ్యూజిక్ ఆఫ్ ఫ్రీడమ్' అనే బుక్ రాస్తుంది. ఈ బుక్‌కి కీలక పాత్ర ఉంది'' అని పేర్కొన్నారు పీసీ శ్రీరామ్. అంటే.. ఈ సినిమాకు ఆమే ఒక సైన్యం అన్నమాట. ఈ సినిమా కోసం 'సింకర్‌నైజ్డ్ సరౌండ్ సౌండ్ సిస్టమ్' అనే కొత్త టెక్నాలజీని సౌండ్ డిజైనర్ రసూల్ పూకుట్టి వాడుతున్నారు. ఏక కాలంలో నాలుగు భాషల్లో తెరకెక్కిస్తున్నారు. ''బెంగళూరులో ఉండటం వల్ల కన్నడతో ప్రాబ్లమ్ లేదు. మలయాళం నా మాతృభాష. తెలుగు సినిమాల్లో నటించాను కాబట్టి, అది కూడా వచ్చు. హిందీ అర్థం అవుతుంది. కానీ ఫ్లూయెంట్‌గా మాట్లాడలేను'' అని చెప్పుకొచ్చారు నిత్యామీనన్.

చంబల్ బందిపోటు


సుశాంత్ సింగ్ రాజ్‌పుత్

ఇక్కడ ఉన్న ఫొటో చూశారుగా! సుశాంత్‌సింగ్ రాజ్‌పుత్ తుపాకీతో ఎంత గంభీరంగా, స్టైల్‌గా చైర్‌లో కూర్చున్నాడో! ఇలా ఎందుకు కనిపిస్తున్నాడు అంటే నెక్ట్స్ తను నటించబోయే సినిమా కోసం. 'ఉడ్తా పంజాబ్' ఫేమ్ అభిషేక్ చౌబే దర్శకత్వంలో సుశాంత్‌సింగ్ రాజ్‌పుత్ హీరోగా రూపొందుతున్న సినిమా 'సోన చిరేయా'. ఇందులో భూమి పెడ్నేకర్ హీరోయిన్. మనోజ్ బాజ్‌పాయి కీలక పాత్రలో కనిపించనున్నారు. చంబల్ ప్రాంతంలోని బందిపోటు పాత్రలో కనిపించనున్నారు సుశాంత్. ఈ సినిమా షూటింగ్‌ను రీసెంట్‌గా స్టార్ట్ చేశారు. ప్రస్తుతం చంబల్‌లో షూట్ చేస్తున్నారు. క్యారెక్టర్ ఫర్‌ఫెక్షన్ కోసం లోకల్ పీపుల్స్‌ను సంప్రదిస్తున్నారట చిత్రబృందం. ఈ సినిమాలోని ఫస్ట్ లుక్‌ను సోషల్ మీడియాలో షేర్ చేశారు సుశాంత్‌సింగ్ రాజ్‌పుత్. ఇప్పటివరకూ ఇలాంటి రఫ్ లుక్‌లో సుశాంత్ సింగ్ రాజ్‌పుత్ కనిపించలేదు. అందుకే లుక్‌ని రిలీజ్ చేయగానే బాలీవుడ్ ప్రముఖులు ప్రశంసల వర్షం కురిపించారు.

నెల్లూరు టు ఖమ్మం


సతీష్ రెడ్డి, మౌర్యాని

సతీష్ రెడ్డి, మౌర్యాని, ముంతాజ్ ముఖ్య తారలుగా వీజే రెడ్డి దర్శకత్వంలో సిద్ధి విఘ్నేశ్వరా క్రియేషన్స్ పతాకంపై సీహెచ్ రఘునాథరెడ్డి నిర్మించిన చిత్రం 'నెల్లూరి పెద్దారెడ్డి'. గురురాజ్ సంగీతం అందించిన ఈ సినిమా పాటలను సీనియర్ దర్శకులు సాగర్, రేలంగి నరసింహారావు విడుదల చేశారు. సాగర్ మాట్లాడుతూ– ''మంచి సినిమా చేయడానికి కొంత సమయం తీసుకున్నా పర్లేదు కానీ ఏదో ఒకటి చేయాలనుకోకూడదు. 'నెల్లూరి పెద్దారెడ్డి' చిత్రాన్ని దర్శకుడు వీజే రెడ్డి పకడ్బందీగా రూపొందించారని తెలిసింది'' అన్నారు. ''ఈ చిత్రాన్ని నెల రోజుల్లోనే కంప్లీట్ చేయడం గొప్ప విషయం. కథను ఎంత బాగా చెప్పామన్నదే ప్రేక్షకులకు ముఖ్యం'' అన్నారు రేలంగి నరసింహారావు. ''నెల్లూరి నుంచి ఖమ్మం జిల్లా సీతాపురం గ్రామానికి వలస వెళ్లిన పెద్దారెడ్డి అనే వ్యక్తి కథ ఇది. తోటివారికి సాయం చేయాలనుకునే పెద్దారెడ్డి ఓ యువతి కుటుంబానికి ఆశ్రయం ఇవ్వడం వల్ల కథ ఎలాంటి మలుపులు తిరిగిందనేది ఆసక్తికరం. గురురాజ్ సంగీతం, డాక్టర్ కమలాకర కామేశ్వరరావు సాహిత్యం చక్కగా కుదిరాయి. ఈ సినిమాను ఫిబ్రవరిలో విడుదల చేయాలనుకుంటున్నాం'' అన్నారు వీజేరెడ్డి. ''సినిమాలో నెల్లూరి పెద్దారెడ్డి ప్రేక్షకులకు మర్చిపోలేని అనుభూతులను అందిస్తాడు'' అన్నారు సతీష్ రెడ్డి.

సచివాలయంలో సామాన్యులకు చుక్కలు

- సెక్రటేరియట్‌లోకి వెళ్లేందుకు అష్టకష్టాలు
- గంటల తరబడి వేచిచూసినా దొరకని అనుమతి
- తమ గోడు వినిపించుకునే వారులేరని ఆవేదన
- పనులు కావడంలేదని గగ్గోలు



సచివాలయం వెలుపల మంగళవారం సందర్శకుల నిరీక్షణ

సాక్షి, అమరావతి : తెల్లరేషన్ కార్డులు తొలగించారని కొందరు, భూమి రికార్డులు మారిపోయాయని ఇంకొందరు, దీర్ఘకాలిక జబ్బులకు వైద్యం అందలేదని మరికొందరు.. ఇలా రకరకాల సమస్యలతో, కొండంత ఆశతో తాత్కాలిక సచివాలయానికి వచ్చే సామాన్యులు ఇక్కడ పడుతున్న కష్టాలు అన్నీఇన్నీ కావు. ఉదయం 9 గంటల కల్లా ఇక్కడకు చేరుకునే వీరిని పట్టించుకునే దిక్కులేదు. ఇక్కడకు నిత్యం సుమారు 300మంది వరకు వస్తుంటారు. వీరు గంటల తరబడి ఎండలో నిలువు కాళ్ల మీద పడిగాపులు కాస్తున్నారు. మ.3 గంటల నుంచి సా.5 గంటల వరకు సందర్శకులకు అనుమతించాల్సి ఉన్నా ఆ విధానాన్ని సరిగ్గా అమలుచేయడంలేదు. అతి కష్టమ్మీద లోపలకు వెళ్లినా మంత్రి లేకపోవడమో, అధికారులు అందుబాటులో లేకపోవడమో జరుగుతుండటంతో వాళ్లు తీవ్ర నిరాశ, అసంతృప్తితో బయటకు వస్తున్నారు. అంతేకాక.. ఈ సమయంలో అధికారులు చాలామంది విధులు ముగించుకుని వెళ్లిపోయే మూడ్‌లో ఉంటున్నారని అనేకమంది సందర్శకులు ఫిర్యాదు చేస్తున్నారు.

- సచివాలయానికి కూతవేటు దూరంలో ఉన్న ఎర్రబాలెం గ్రామస్తురాలు తన ఆధార్ కార్డుకు కారు లింక్ చేసి ఉందంటూ తెల్లరేషన్ కార్డు తీసేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నిసార్లు తిరిగినా ఎవరూ పట్టించుకోవడంలేదని వాపోయారు.
- తాము పొద్దుననగా వచ్చామని, ఇక్కడ తాగడానికి నీళ్లు, తినడానికి తిండి కూడా లేదని, సాయంత్రం వరకూ లోపలకు అనుమతించలేమని పోలీసులు అడ్డుకుంటున్నారని ప్రకాశం జిల్లా బెస్తవారిపేట నుంచి వచ్చిన ఓ వృద్ధుడు తన అనుభవాన్ని వివరించారు. ఊర్లలో అధికారులు స్పందించడంలేదని, ఇక్కడ కూడా అదే పరిస్థితి ఎదురవుతోందని వాపోయారు.

ఇలా ఒకరు కాదు ఇద్దరు కాదు.. సచివాలయం గేటు బయట నిత్యం వందలాది మంది పడుతున్న తిప్పలు అన్నీ ఇన్నీ కావు. డిసెంబర్ 24, 25 తేదీల్లో క్రిస్మస్ పండుగ రావడం.. ఆ తర్వాత జనవరి 11 వరకూ జన్మభూమి.. మళ్లీ సంక్రాంతి పండుగ, అనంతరం కలెక్టర్ల కాన్ఫరెన్సు.. ఆ తర్వాత చంద్రబాబు దావోస్ పర్యటన వెరసి.. నెలన్నర రోజులపాటు కాళ్లరిగేలా తిరిగినా పనులు కావడం లేదని సామాన్య జనం గగ్గోలు పెడుతున్నారు.

ఒంగోలు ట్రిబుల్ ఐటీకి కలాం పేరు

సాక్షి, అమరావతి: ఒంగోలులో ఏర్పాటయ్యే ట్రిపుల్ ఐటీకి మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలామ్ పేరును పెడుతూ ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీచేసింది. ఈమేరకు ఉన్నత విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి, ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆదిత్యనాథ్ దాస్ జీవో 12 విడుదల చేశారు.

వేసవిలో తాగునీటికి రూ. 155 కోట్లతో ప్రణాళిక

ప్రభుత్వ ఆమోదానికి పంపిన పబ్లిక్ హెల్త్ డిపార్ట్‌మెంట్

సాక్షి, అమరావతి: రానున్న వేసవిలో తాగునీటి సమస్య పరిష్కారానికి రూ.155 కోట్లతో అధికారులు ప్రణాళికలు రూపొందించారు. 108 మున్సిపాల్టీలు, 16 నగర పాలక సంస్థల్లోని పరిస్థితులపై అధికారులు ప్రతిపాదనలు రూపొందించి ప్రభుత్వానికి సమర్పించారు. విజయవాడ, గుంటూరు, విశాఖపట్నంలో కొత్తగా పెరిగిన ప్రాంతాలు, విలీన గ్రామాల్లోని పరిస్థితులను కూడా పరిగణనలోకి తీసుకున్నారు. విలీన గ్రామాల్లోని ప్రజలకు మంచినీటిని సరఫరా చేసేందుకు కొత్తగా రక్షిత మంచినీటి పథకాలు నిర్మించకపోవడంతో ఆ ప్రాంతాలకు ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేసేందుకు అంచనాలు రూపొందించారు.

హైదరాబాద్‌లో 2నుంచి దేశీ విత్తనోత్సవం

సాక్షి, అమరావతి: దేశీ విత్తనోత్సవాన్ని హైదరాబాద్‌లో మూడు రోజులపాటు నిర్వహించనున్నారు. రామృకృష్ణ మఠం వేదికగా ఫిబ్రవరి 2, 3 4వ తేదీల్లో జరిగే విత్తనోత్సవం ప్రత్యేకతలను కార్యక్రమ నిర్వాహకులు, సేవ్ సంస్థ వ్యవస్థాపకుడు విజయ్‌రామ్ మంగళవారం వివరించారు. నేల తల్లి పరిరక్షణలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. నేలతల్లికి జరుగుతున్న నష్టం, పర్యావరణ పరిరక్షణ, పెరుగుతున్న భూ తాపం, రైతులు తీసుకోవాల్సిన చర్యలు తదితర విషయాలపై దేశీ విత్తనోత్సవంలో వివరిస్తారన్నారు. విత్తనోత్సవంలో దేశవాళీ కూరగాయలు, ఆకుకూరల విత్తనాలను అందుబాటులో ఉంచామని విజయ్‌రామ్ తెలిపారు. ప్రవేశం ఉచితమని చెప్పారు. విత్తనోత్సవానికి హాజరయ్యే రైతులకు కిలో బరువున్న రెండు రకాల విత్తనాల్ని ఉచితంగా అందజేయనున్నట్లు ప్రకటించారు. వివరాలకు 040 27654337, 8985106875 నెంబర్లలో సంప్రదించవచ్చన్నారు.

కంటి చూపే చంపేస్తోంది!



- గతేడాది అక్టోబరులో గుంటూరు జిల్లా ముప్పాళ్ల మండలం చాగంటివారిపాలెంలో ఓ ఇంజనీరింగ్ కళాశాల బస్సు డ్రైవర్ వీరారెడ్డి (63) తనకు ముందు వెళుతున్న ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టాడు. ఈ ఘటనలో బైకుపై వెళ్తున్న శ్రీనివాసరెడ్డి, శ్రీరంగమ్మలు అక్కడికక్కడే మృతి చెందగా బస్సు డ్రైవర్ వీరారెడ్డి గుండెపోటుతో బస్సులోనే కుప్పకూలిపోయి మరణించాడు. కంటిచూపు సమస్యలతో బాధపడుతున్న వీరారెడ్డి తాను చనిపోవటంతోపాటు రెండు నిండు ప్రాణాలు గాలిలో కలవటానికి కారకుడయ్యాడు.
- ఇటీవల భారత జాతీయ రహదారుల సంస్థ (ఎన్‌హెచ్‌ఏఐ) ఆధ్వర్యంలో గుంటూరు జిల్లా కాజ టోల్‌గేట్ వద్ద రవాణా డ్రైవర్లకు ఉచిత కంటి పరీక్షల వైద్య శిబిరం నిర్వహించగా వంద మందిలో ఐదుగురికి కలర్ బ్లెయిండ్‌నెస్ ఉన్నట్లు తేలింది. శంకర కంటి ఆస్పత్రి ఆధ్వర్యంలో గుంటూరు రవాణా శాఖ కార్యాలయంలో విద్యాసంస్థల బస్సుల డ్రైవర్లకు కంటి పరీక్షలు చేయగా నలుగురు కలర్ బ్లెయిండ్‌నెస్‌తో బాధపడుతున్నట్లు గుర్తించారు. 50 మంది పరీక్షలకు హాజరు కాగా పది మందికి పైగా హ్రస్వ దృష్టి, దూర దృష్టి సమస్యలున్నట్లు తేలింది.


- రాష్ట్రంలో దాదాపు 23 లక్షల మంది డ్రైవర్లకు కంటిచూపు సమస్యలు
- కలర్ బ్లైండ్‌నెస్‌తో 12 శాతం రోడ్డు ప్రమాదాలు
- 60 శాతం దుర్ఘటనలు రాత్రి 8 తర్వాతే..
- మద్యం పరీక్షలు, కేసు నమోదుతో సరి
- ఆర్టీసీ డ్రైవర్లను వేధిస్తున్న కంటి కష్టాలు

ఆర్టీసీలో 40 ఏళ్లకు పైబడిన డ్రైవర్లు కంటి పరీక్షలు చేయించుకుని కళ్లద్దాలు కొనుక్కునేందుకు అలవెన్సు పొందుదామనుకుంటే సంస్థ ఆస్పత్రిలో కంటి వైద్యులు లేరు.

సాక్షి, అమరావతి: రాష్ట్రవ్యాప్తంగా 65 లక్షల మంది డ్రైవర్లలో 35 శాతం మంది కంటి చూపు సమస్యలతో బాధపడుతున్నారు. అంటే 22.75 లక్షల మంది డ్రైవర్లకు కంటి చూపు సమస్యలున్నాయి. దృష్టి లోపం వల్ల 12 శాతం రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని రహదారుల భద్రతపై ఏర్పాటైన సుప్రీం కోర్టు కమిటీ నివేదిక వెల్లడించింది. రాష్ట్రంలో ఏటా కలర్ బ్లైండ్‌నెస్ (వర్ణాంధత) పెరగటం ఆందోళన కలిగిస్తోంది. రోడ్డు ప్రమాదాల సమయంలో కేసుల నమోదు, మద్యం పరీక్షలు మినహా డ్రైవర్ల ఫిట్‌నెస్, కంటి సమస్యలను పట్టించుకోవటం లేదు. డ్రైవింగ్ లైసెన్సు జారీ, రెన్యువల్ సమయాల్లో రవాణా శాఖ కంటి సామర్థ్య పరీక్షలు నిర్వహించడం లేదు. కనీసం కంటి పరీక్షలు చేసే ప్రాథమిక పరికరాలనూ సమకూర్చుకోవటం లేదు. 40 ఏళ్లు దాటినవారికి లైసెన్సు జారీ కోసం ఆరోగ్య ధ్రువపత్రం సమర్పించాలని కోరుతున్నారే కానీ కంటి చూపు సమస్యలను విస్మరిస్తున్నారు. రవాణా శాఖ కార్యాలయాల్లో నేత్ర వైద్యుడిని అందుబాటులో ఉంచి పరీక్షలు జరిపితే రోడ్డు ప్రమాదాలు తగ్గించే అవకాశం ఉంటుంది.

60 శాతం ప్రమాదాలు రాత్రి 8 తర్వాతే..

రోడ్డు ప్రమాదాలు అధికంగా రాత్రి 8 గంటల తరువాతే జరుగుతున్నాయి. రాత్రి 8 నుంచి 11 గంటల మధ్య 60 శాతం రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని సుప్రీంకోర్టు నియమించిన కమిటీకి రాష్ట్ర ప్రభుత్వం తెలిపింది. గతేడాది ఆర్టీసీలో 1,066 ప్రమాదాలు జరగగా రాత్రి ఎనిమిది గంటల నుంచి 11 గంటల మధ్యలో 379 ప్రమాదాలు సంభవించాయి.



ఏ రంగునూ గుర్తించలేని పరిస్థితి

కలర్ బ్లెయిండ్‌నెస్ కంటిచూపునకు సంబంధించిన ప్రధాన సమస్య. దీన్నే ఆర్‌బీజీ అని కూడా అంటారు. అంటే ఎరుపు, నీలం, ఆకుపచ్చ కలగలసి ఉండటం. ఈ మూడు కలిసి ఉంటే ఎదురుగా ఉన్నది ఏ రంగో గుర్తించలేం. దీన్నే పార్షియల్ కలర్ బ్లెయిండ్‌నెస్ అని కూడా అంటారు. ఈ సమస్య కారణంగా వాహనాల్లో వెళ్తున్నప్పుడు చాలా ఇబ్బందిగా ఉంటుంది. ఇది జన్యుపరంగా, వారసత్వంగా వస్తుంది. ఇదికాకుండా 45 ఏళ్లు దాటితే వచ్చే కంటిచూపు సమస్యను చత్వారం అంటారు. కంటి అద్దాల వినియోగం ద్వారా దీన్ని అధిగమించవచ్చు.

– డా.సుమంత్, అగర్వాల్ హాస్పిటల్, తిరుపతి

కలర్ బ్లైండ్‌నెస్ ఉంటే లైసెన్సు రద్దు

రవాణా శాఖ కార్యాలయాల్లో కంటి పరీక్షలు నిర్వహిస్తున్నాం. కలర్ బ్లైండ్‌నెస్ సమస్య ఉన్న వారి లైసెన్సును వెంటనే రద్దు చేసి సంబంధిత డ్రైవరు పనిచేసే విద్యా సంస్థ లేదా రవాణా రంగ సంస్థ యాజమాన్యానికి నోటీసులిస్తున్నాం. వారిని తొలగించాలని ఆదేశాలిస్తున్నాం.

– రాజారత్నం, డీటీసీ, గుంటూరు

ఏటా వంద మందికి డ్రైవింగ్‌లో తర్ఫీదు

కొందరు డ్రైవర్లు కంటి చూపు సమస్యలతో బాధపడుతున్న మాట వాస్తవమే. ప్రస్తుతం రాష్ట్రంలో డ్రైవర్ల కొరత ఉంది. నడిపేవారు లేక వందల వాహనాలు షెడ్డులకే పరిమితమవుతున్నాయి. లారీ ఓనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏటా వంద మందికి డ్రైవింగ్‌లో తర్ఫీదునిస్తున్నాం. ఈ సమయంలో వారికి అన్ని పరీక్షలు ఉచితంగా నిర్వహిస్తున్నాం.

– వైవీ ఈశ్వరరావు, ఏపీ లారీ ఓనర్ల అసోసియేషన్ అధ్యక్షుడు

అమరావతి ఔటర్ రింగ్‌రోడ్డుకు రూ 17,762 కోట్లు

- అమరావతి–అనంతపురం ఎక్స్‌ప్రెస్ హైవేలో జాప్యం వద్దు
- రహదారుల అభివృద్ధి సమీక్షలో సీఎం చంద్రబాబు



ఆర్ అండ్ బీ శాఖపై సమీక్షిస్తున్న సీఎం

సాక్షి, అమరావతి : సవరించిన అలైన్‌మెంట్ ప్రకారం అమరావతిలో మొత్తం 189 కిలోమీటర్ల మేర ఔటర్ రింగ్‌రోడ్డు నిర్మాణం చేపట్టనున్నామని ముఖ్యమంత్రి చంద్రబాబు చెప్పారు. ఇందుకు రూ.17,762 కోట్లు వెచ్చిస్తున్నామన్నారు. రాష్ట్రంలో రహదారుల అభివృద్ధిపై మంగళవారం రాత్రి సచివాలయంలో జరిగిన సమీక్షా సమావేశంలో సీఎం మాట్లాడుతూ, విజయవాడలో దుర్గగుడి ఫ్లైఓవర్ నిర్మాణ సంస్థ చేతకానితనం, అసమర్థత వల్ల రాష్ట్ర ప్రభుత్వం పరువుపోతోందని ఆగ్రహం వ్యక్తంచేశారు. మార్చి నాటికి ప్రధాన రహదారిపై రాకపోకలు పునరుద్ధరించకపోతే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. హైదరాబాద్ పీవీ ఎక్స్‌ప్రెస్ ఫ్లైఓవర్ తరహాలో విజయవాడలో కీలకమైన బెంజ్ సర్కిల్ ఫ్లైఓవర్‌ను నిడమానూరు వరకు పొడిగించే అంశాన్ని పరిశీలించాలని అధికారులకు సూచించారు. రాజమహేంద్రవరం-విజయవాడ మధ్య దెబ్బతిన్న రహదారికి వెంటనే మరమ్మతులు చేపట్టాలని సీఎం ఆదేశించారు. విజయవాడ-మచిలీపట్నం రహదారి మార్గం 38 శాతం పూర్తయ్యిందని, నిర్దేశించిన సమయానికి పూర్తిచేస్తామని అధికారులు తెలిపారు. అమరావతి-అనంతపురం ఎక్స్‌ప్రెస్ హైవే నిర్మాణానికి సంబంధించి పనులలో జాప్యం సరికాదని సీఎం చెప్పారు. రహదారుల నిర్వహణను తెలుసుకునేందుకు డ్రోన్లను వినియోగించుకోవాలని సూచించారు. రాష్ట్రంలోని అన్ని రహదారుల నిర్వహణ సమర్థంగా జరిగేలా చర్యలు తీసుకోవాలని సీఎం కోరారు.

జన్మభూమి కమిటీలను మార్చండి

జన్మభూమి కమిటీలను మార్చి కొత్త కమిటీలు వేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు పార్టీ నేతలను ఆదేశించారు. కొత్త కమిటీలు వేయడం ద్వారా పాత వారు చేసిన తప్పుల ప్రభావం పార్టీపై పడకుండా చూడాలన్నారు. మంత్రులు, ముఖ్య నేతలతో మంగళవారం ఆయన టీడీపీ సమన్వయ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఇక నుంచి పార్టీ కోసమే ఎక్కువ పనిచేస్తానని సీఎం తెలిపారు. ప్రభుత్వంపై సానుకూల వాతావరణం ఉందనే విషయాన్ని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లడం ద్వారా వ్యతిరేక ప్రచారాన్ని తగ్గించాలని సూచించారు. జిల్లా ఇన్‌ఛార్జి మంత్రులు నెలకు నాలుగైదు రోజులు పార్లమెంటు నియోజకవర్గంపై దృష్టి పెట్టి అక్కడి పార్టీ పనితీరును పర్యవేక్షించాలని సూచించారు. కాగా, సమావేశంలో విజయవాడ సెంట్రల్ ఎమ్మెల్యే బొండా ఉమ భూకబ్జా వ్యవహారం ప్రస్తావనకు రాగా.. ఇలాంటి విషయాలవల్ల పార్టీకి ఇబ్బంది వస్తోందని చంద్రబాబు ఆగ్రహం వ్యక్తంచేసినట్లు సమాచారం. అతనిపై తరచూ ఆరోపణలు వస్తున్నాయని, ఎన్నిసార్లు చెప్పినా పద్ధతి మార్చుకోలేదని చెప్పినట్లు తెలిసింది.

వర్సిటీ ఉద్యోగాల భర్తీకి మళ్లీ బ్రేక్

- సర్కారు తీరుతో మళ్లీ న్యాయవివాదం
- గతంలో హేతుబద్ధీకరణపై కోర్టు కేసులు
- తాజాగా కాంట్రాక్టు అధ్యాపకుల అంశం
- త్వరలోనే స్టే వెకేట్ చేయిస్తామంటున్న అధికారులు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని 14 యూనివర్సిటీల్లో సహాయాచార్యుల పోస్టుల భర్తీ అంశం మళ్లీ న్యాయవివాదాల్లో చిక్కుకుంది. గతంలో పలుసార్లు ఈ పోస్టుల భర్తీ అంశంపై కోర్టుల్లో పలు కేసులు దాఖలయ్యాయి. వరుసగా స్టేలు రాగా చివరకు వాటిని తొలగించుకొని ఉన్నత విద్యామండలి ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ద్వారా ఆయా పోస్టుల భర్తీకి స్క్రీనింగ్ టెస్టు నిర్వహణకు ఏర్పాట్లు చేస్తున్న తరుణంలో కాంట్రాక్టు సహాయాచార్యుల రూపంలో తాజాగా మరో వివాదం తెరపైకి వచ్చింది. తాము గత కొన్నేళ్లుగా వర్సిటీల్లో తాత్కాలిక సహాయాచార్యులుగా పనిచేస్తున్నామని, తమను రెగ్యులర్ చేయాలని, లేదా పోస్టుల భర్తీలో తమకు ప్రాధాన్యమివ్వాలని కోరుతూ వస్తున్నారు. వీరి డిమాండ్లపై ప్రభుత్వం కమిటీలను నియమించింది. దీనిపై ప్రత్యేక జీఓలు ఇచ్చింది. ఈ కమిటీలు ఇంకా అధ్యయనం చేస్తున్నాయి. అయితే అప్పటికే ఆయా వర్సిటీలు తమ నోటిఫికేషన్లను విడుదల చేశాయి. తమ సమస్యలు పరిష్కరిస్తామని ప్రభుత్వం కమిటీలు వేసి వాటి నివేదికలు రాకుండానే నోటిఫికేషన్లు ఇవ్వడంపై వారు ఉన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. కృష్ణా, ఆదికవి నన్నయ్య, విక్రమసింహపురి వర్సిటీల నోటిఫికేషన్లపై వీరు పిటిషన్ దాఖలు చేయగా విచారణకు స్వీకరించిన కోర్టు వీటిపై స్టే విధించింది. అన్ని వర్సిటీలకు కలిపి ఏపీపీఎస్సీ ద్వారా స్క్రీనింగ్ టెస్టు నిర్వహించాలని భావిస్తున్న తరుణంలో ఈ స్టేతో మొత్తం ప్రక్రియ నిలిచిపోయింది.

హడావుడి చర్యలతో ఆటంకాలు

రాష్ట్రంలోని 14 యూనివర్సిటీల్లోని 1,385 పోస్టుల్లో ప్రొఫెసర్, అసోసియేట్ ప్రొఫెసర్ పోస్టులు మినహాయించి తక్కిన 1,100 అధ్యాపక పోస్టుల భర్తీకి నిర్ణయించింది. ఈ పోస్టుల భర్తీకి ముందు హేతుబద్ధీకరణ పేరిట ప్రొఫెసర్, అసోసియేట్ ప్రొఫెసర్ పోస్టులను అసిస్టెంటు ప్రొఫెసర్ పోస్టులుగా కన్వర్ట్ చేయడంతో పాటు ఒక విభాగం పోస్టును మరో విభాగానికి మార్పు చేశారు. ఏకంగా 576 పోస్టులు కన్వర్ట్ చేస్తూ జీఓ 137ను కూడా విడుదల చేసింది. వీటిపై కేసులు దాఖలయ్యాయి. వాటిని దాటుకొని భర్తీ ఏర్పాట్లు జరుగుతున్న తరుణంలో మళ్లీ స్టే రావడంతో అభ్యర్థులు ఆందోళనలో పడుతున్నారు. ప్రభుత్వం సహాయాచార్యులకు ఇచ్చిన హామీ మేరకు నియమించిన కమిటీల నివేదికలు వచ్చిన తరువాత నోటిఫికేషన్లు ఇచ్చి ఉంటే ఇలా న్యాయవివాదాలు ఏర్పడేవి కాదని పేర్కొంటున్నారు. ప్రభుత్వం హడావుడి చర్యల కారణంగా ఈ ఆటంకాలు ఎదురవుతున్నాయని చెబుతున్నారు. ఈ వ్యవహారాన్ని ఉన్నత విద్యామండలి వైస్ ఛైర్మన్ ప్రొఫెసర్ నరసింహారావుతో ప్రస్తావించగా స్టేను త్వరలోనే తొలగింపచేసి షెడ్యూల్‌ను ప్రకటించి స్క్రీనింగ్ టెస్టును నిర్వహిస్తామని చెప్పారు. అభ్యర్థులు ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు.

బాసూ.. మెమరీ లాసు



- మనుషులను గుర్తించడంలో పోలీస్ రోబో తడబాటు
- కృత్రిమ మేధస్సుకు సంబంధించి మరిన్ని పరీక్షలకు ఏర్పాట్లు
- మార్చిలోనే బహిరంగ ప్రదేశాల్లో ప్రయోగ పరీక్షల నిర్వహణ
- ఫోరం, సుజనామాల్స్ సహా జేఎన్‌టీయూ వద్ద స్వల్పకాలం పరీక్ష..

సాక్షి, హైదరాబాద్: పోలీస్ రోబో.. రాష్ట్ర రాజధానిలో అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రాజెక్టు ఇదీ. అయితే ఈ పోలీస్ రోబో కాస్తా ఇప్పుడు మెమరీలాస్‌తో సతమతమవుతోంది. మనుషులను గుర్తించడం.. ఇతరత్రా సాంకేతిక విషయాల్లో తడబడుతోంది. నగరంలోని హెచ్‌బోట్స్ రోబోటిక్స్ సంస్థ రూ.7 లక్షల వ్యయంతో 'స్మార్ట్ పోలీసింగ్ రోబో బెటా వెర్షన్'ను రూపొందించింది. వాస్తవానికి డిసెంబర్ 31నే జూబ్లీహిల్స్ చెక్‌పోస్టు వద్ద ఈ రోబోను బహిరంగంగా పరీక్షించాలని భావించినా సాంకేతిక సమస్యల కారణంగా వాయిదా వేశారు. అయితే ఇప్పటికే ఫోరంమాల్‌తోపాటు జేఎన్‌టీయూ చౌరస్తాలో ఈ రోబోను ఒక గంట పాటు ప్రయోగాత్మకంగా పరీక్షించినట్టు హెచ్‌బోట్స్ సంస్థ నిర్వాహకులు చెబుతున్నారు. రోబోలోని కెమెరాలు అద్భుతంగా పనిచేస్తున్నాయని.. అయితే ప్రజల నుంచి ఫిర్యాదుల స్వీకరణ.. వారి ఫిర్యాదులకు ప్రతిస్పందించే తీరులో స్పష్టత లేకపోవడంతో ఈ రోబోపై మరిన్ని పరీక్షలు చేసి ఆధునికరిస్తామన్నారు. కాగా, త్వరలో నాగ్‌పూర్‌లోనూ ఈ రోబో కృత్రిమ మేధస్సుకు సంబంధించి పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ పరీక్షల అనంతరం మార్చిలో ఈ రోబోను బహిరంగ ప్రదేశాల్లో మరోసారి పరీక్షిస్తామని.. జూలై నుంచి సమర్థవంతంగా పనిచేసేలా తీర్చిదిద్దుతామని నిర్వాహకులు 'సాక్షి'కి తెలిపారు. పోలీసు విధుల్లో పాలు పంచుకునేందుకు జారీ చేసిన భద్రతా మార్గదర్శకాలను రోబోలో మిళితం చేసేందుకు ప్రయత్నం చేస్తున్నామన్నారు. ఆరు నెలలుగా నలుగురు ఫౌండర్లు, మరో 16 మంది సభ్యులు ఈ రోబో తయారీకి అహర్నిశలు శ్రమించారని హెచ్‌బోట్స్ రోబోటిక్స్ వ్యవస్థాపకుడు కిషన్ పీఎస్‌వీ తెలిపారు.

పోలీస్ రోబో చేయాల్సిన పనులివే..

- హాయ్ చెప్పడం, షేక్ హ్యాండ్ ఇవ్వడం. తల అటుఇటు కదిలించడం. ఎవరైనా ఇంగ్లిష్‌లో మాట్లాడితే ప్రతిగా సమాధానాలు, సలహాలు ఇవ్వాలి.
- ఫిర్యాదు చేస్తే టోకెన్ నంబర్ ఇస్తుంది. ఫిర్యాదు స్టేటస్ తెలియజేస్తుంది.
- ఉదర భాగంలో టచ్ స్క్రీన్ ఉంటుంది. కంప్లయింట్ ఆప్షన్‌పై నొక్కితే ఇమేజ్, వీడియో, ఆడియో తదితర రూపంలో ఫిర్యాదు చేయవచ్చు.
- ఎమర్జెన్సీ బటన్‌పై నొక్కితే అంబులెన్స్, ఫైర్, పోలీసులకు కాల్స్ చేయవచ్చు. షీ టీం కంప్లయింట్‌పై నొక్కి మహిళలు ఈవ్ టీజింగ్స్‌పై షీ టీమ్స్‌తో మాట్లాడవచ్చు. అత్యవసర సమయాల్లో దీనిపై నొక్కి ఇట్టే వెళ్లిపోయినా.. సమీప ప్రాంతాల్లో షీటీమ్స్‌ని అప్రమత్తం చేస్తుంది.
- రోడ్డు ప్రమాదాలు, స్నాచింగ్, కిడ్నాప్‌లు జరిగిన, పెద్ద గొడవ జరిగి జనం గుమిగూడినా వీడియో, ఆడియోలను పోలీసులకు చేరవేస్తుంది.

స్మార్ట్ పోలీసింగ్ రోబో ఇలా ఉంటుంది..

- ఎత్తు 5.2 అడుగులు, బరువు 43 కిలోలు ■ **ధర:** రూ.5 నుంచి రూ.8 లక్షలు
- ఇంటర్నెట్ కనెక్షన్ తప్పనిసరి
- లోపల బ్యాటరీ, ఉదర భాగంలో స్క్రీన్ ఉంటాయి
- ఇండోర్‌లో ఆటోమెటిక్‌గా రీఛార్జ్ చేసుకుంటుంది. ఔట్‌డోర్‌లో సోలార్ సిస్టమ్ ఏర్పాటు చేయాలి.
- ముందు, వెనుక భాగంలో 180 డిగ్రీల వ్యాసార్థంలో అంటే.. 360 డిగ్రీల వ్యాసార్థంలో ఫొటోలు, వీడియో తీసే సీసీ కెమెరాలు ఉంటాయి. రెండు కళ్లలో కెమెరాలుంటాయి. ■ వాయిస్ రికగ్నిషన్‌తో పని చేస్తుంది.

• తెలంగాణ

మగాళ్లా.. మృగాళ్లా..!

- బొటానికల్ గార్డెన్‌లో ఎనిమిది నెలల గర్భిణి దారుణ హత్య
- మృతదేహాన్ని ముక్కలుగా నరికిన దుండగులు
- కాళ్లు, చేతులు ముక్కులు చేసి.. తల, మొండెం విడదీత
- ఉద్యోగం కోసం వచ్చి హయత్‌నగర్‌లో శవమైన మరో యువతి
- చందానగర్ ఘటనలో ముగ్గురిని తానే చంపానన్న నిందితుడు మధు



బస్తాలో కనిపిస్తున్న మహిళ చేయి

సాక్షి, హైదరాబాద్/గచ్చిబౌలి/హయత్‌నగర్/చందానగర్: మానవత్వాన్ని మంటగలుపుతూ రాష్ట్ర రాజధానిలో మృగాళ్లు రెచ్చిపోతున్నారు. నిండు గర్భిణి అనే కనికరం లేకుండా.. కన్న కూతురనే ధ్యాస లేకుండా.. ఉద్యోగం కోసం వచ్చిన యువతిపై దయ చూపకుండా.. అత్యంత పాశవికంగా హత్యలు చేశారు. రంగారెడ్డి జిల్లా చందానగర్‌లో ముగ్గురి దారుణ హత్యను మరువక ముందే బొటానికల్ గార్డెన్ సమీపంలో నిండు గర్భిణిని ముక్కలుముక్కలుగా నరికి రెండు బస్తాల్లో కుక్కి నడి రోడ్డుపై విసిరేసిన ఘటన మంగళవారం కలకలం సృష్టించింది. మరోవైపు బీటెక్ చదివి ఉద్యోగాన్వేషణ కోసం నగరానికి వచ్చిన ఓ యువతి హయత్‌నగర్‌లో శవమై కనిపించింది. చందానగర్‌లో సహజీవనం చేస్తున్న మహిళ, ఆమె తల్లి, కన్న కూతురిని హత్య చేసింది తానేనని నిందితుడు మధు పోలీసుల ఎదుటలొంగిపోయాడు.

'అమ్మ'ను పది ముక్కలుగా నరికారు..

మంగళవారం ఉదయం 9 గంటల సమయం. కొత్తగూడలోని బొటానికల్ గార్డెన్ నైట్ సఫారీ గేట్ సమీపంలోని ప్రధాన రహదారి. రెండు బస్తాల నుంచి ముక్కుపుటాలు అదిరిపోయేలా వెలువడుతున్న దుర్వాసన. స్థానికులు సమాచారం ఇవ్వడంతో పోలీసులు అక్కడికి చేరుకున్నారు. బస్తాల్లో ఏముందో అని చూస్తే.. గుర్తుతెలియని ఎనిమిది నెలల గర్భిణి(30–35 ఏళ్ల వయసు)ని అత్యంత పాశవికంగా హత్య చేసి.. ఆమె శరీరాన్ని ముక్కలుముక్కలుగా నరికేశారు. రెండు కాళ్లను నాలుగు ముక్కలు, రెండు చేతులను నాలుగు ముక్కలు చేశారు. తల, మొండెం వేరు చేశారు. ఒక బస్తాలో కాళ్లు, చేతులు, తల లభించాయి. మొండాన్ని ప్లాస్టిక్ బ్యాగుల్లో పెట్టి ప్లాస్టర్‌తో ప్యాకింగ్ చేశారు. ఆపైన బస్తాలో వేసి మూట కట్టారు. ఘటనాస్థలి వద్ద మెరూన్ కుర్తా, రెడ్ కలర్ పైజమా, గాజులు, చేతి ఉంగరాలను క్లూస్‌టీమ్ సేకరించింది. డాగ్ స్క్వాడ్ ఘటనాస్థలి నుంచి ప్రధాన రహదారి వరకూ వెళ్లి ఆగిపోయింది.

ఉద్యోగం కోసం వచ్చి శవమైంది..



అనూష(ఫైల్)

హయత్‌నగర్‌లోని మిధానీ కాలనీలో అనుమానాస్పద స్థితిలో ఓ యువతి దారుణ హత్యకు గురైంది. నల్లగొండ జిల్లా కొండ భీమనపల్లి గిరిజానగర్ తండాకు చెందిన ఇనావత్ కోట్యా, రూప్లా దంపతుల కూతురు అనూష(23) రెండేళ్ల క్రితం బీటెక్ పూర్తి చేసింది. ఓ ఇన్సూరెన్స్ కంపెనీలో టెలీకాలర్ మేనేజర్‌గా పనిచేస్తున్న శంషాబాద్ వాసి మోతీలాల్‌తో నాలుగు నెలల క్రితం ఆమెకు వివాహం నిశ్చితార్థమైంది. అప్పటి నుంచి అనూషతో మోతీలాల్ సన్నిహితంగా ఉంటున్నాడు. హయత్‌నగర్‌లో ఉంటూ మేస్త్రీగా పనిచేస్తున్న అనూష బావ, అక్క సంక్రాంతి పండగ కోసం సొంతూరు వెళ్లారు. ఈ నెల 25న ఓ ప్రైవేట్ కంపెనీలో ఉద్యోగం ఉందని, ఇంటర్వ్యూకు హాజరు కావాలని మోతీలాల్ అనూషను నగరానికి రప్పించాడు. హయత్‌నగర్‌లోని అక్క ఇంట్లో ఉంటున్న అనూష శనివారం ఇంటర్వ్యూకు వెళ్తానని శుక్రవారం తల్లికి ఫోన్ చేసింది. ఆ తర్వాత నుంచి మళ్లీ ఫోన్ చేయకపోవడంతో అనూష అక్కాబావలు తమ ఇంటి పక్కనే ఉండే మేస్త్రీకి ఫోన్ చేశారు. అతను ఇంటికెళ్లి చూడగా రక్తపు మడుగులో పడి ఉన్న అనూష కనిపించింది. వెంటనే కుటుంబ సభ్యులకు, పోలీసులకు సమాచారం ఇచ్చాడు. క్లూస్‌టీమ్ వచ్చి ఆధారాలను సేకరించింది.

ముగ్గురిని నేనే చంపేశా

ట్రిపుల్ మర్డర్ కేసులో నిందితుడు మధు



మధు

చందానగర్‌లో అపర్ణదేవి, ఆమె తల్లి జయమ్మ, ఐదేళ్ల కుమార్తె కార్తికేయలను తానే చంపానని నిందితుడు ఆర్ మధు పోలీసుల విచారణలో ఒప్పుకున్నాడు. తన భార్య యామినికి ఫోన్ చేసి వేధిస్తున్నందువల్లే ఈ ఆఘాయిత్యానికి పాల్పడ్డానని వెల్లడించారు. ఈ కేసు వివరాలను మాదాపూర్ డీసీపీ విశ్వప్రసాద్ మీడియాకు తెలియజేశారు. 'పశ్చిమ గోదావరి జిల్లా పాలకొల్లు మండలం ఉల్లంపర్రు వాసి రావాడ మధు అదే గ్రామానికి చెందిన గూడూరు అపర్ణదేవి ప్రేమించుకున్నారు. 2004లో అమ్మ జయమ్మతో కలసి అపర్ణ నగరానికి వచ్చింది. కొన్ని రోజుల తర్వాత మధు హైదరాబాద్ వచ్చి అపర్ణతో సహజీవనం చేశాడు. 2009లో కుటుంబ సభ్యుల బలవంతంతో యామినీని పెళ్లి చేసుకున్నాడు. 2011లో తిరిగి సిటీకి వచ్చిన మధు కేపీహెచ్‌బీలో నివాసముంటూ అదే ప్రాంతంలో మొబైల్ రిపేర్ షాపును నిర్వహిస్తున్నాడు. అపర్ణతోనూ సహజీవనం చేస్తుండటంతో 2013లో కార్తికేయ జన్మించింది. అప్పటికే యామినీకి ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. అయితే యామినీకి అపర్ణ, ఆమె తల్లి ఫోన్ చేసి తరుచు వేధిస్తున్నారు. శుక్రవారం రాత్రి ఫోన్ చేసి ఇష్టమొచ్చినట్టు మాట్లాడిన మాటలను యామిని రికార్డు చేసి భర్తకు వినిపించింది. శనివారం మధ్యాహ్నం అపర్ణ ఫ్లాట్‌కు వచ్చిన మధు విజయమ్మతో గొడవపడి హత్య చేశాడు. అడ్డుకునేందుకు ప్రయత్నించిన కార్తికేయను చంపేశాడు. వారిని పడక గదిలో మంచంపై పడుకోబెట్టి.. టీవీ చూస్తూ కూర్చున్నాడు. మధ్యాహ్నం ఇంటికి వచ్చిన అపర్ణని హతమార్చాడు. సాయంత్రం ఇంటికి తాళం వేసి కేపీహెచ్‌బీలోని తన ఇంటికి వెళ్లాడు. ఆదివారం జరిగిన విషయాన్ని భార్యకు తెలిపి బంధువుల ఇంటికి పంపాడు. ఆత్మహత్య చేసుకుందామని పటాన్‌చెరులోని ఓ లాడ్జ్‌లో రూమ్ తీసుకుని.. వెంట తెచ్చుకున్న మద్యాన్ని సేవించి కత్తితో మణికట్లపై కోసుకున్నాడు. సోమవారం ఉదయం మెలకువ రావడంతో మీడియాలో కథనాలు చూసి పోలీసులకు లొంగిపోయాడు.

ఏపీడబ్ల్యూఆర్‌డీసీకి అదనపు రుణ సేకరణకు అనుమతి

సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్ జలవనరుల అభివృద్ధి సంస్థ (ఏపీడబ్ల్యూఆర్‌డీసీ)కు మరో రూ.రెండు వేల కోట్ల రుణం సమీకరణకు అనుమతి ఇస్తూ రాష్ట్ర జలవనరుల శాఖ కార్యదర్శి శశిభూషణ్ కుమార్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇప్పటికే ఈ సంస్థ రూ.మూడు వేల కోట్ల రుణాన్ని సేకరించింది. రాష్ట్రంలో సాగునీటి ప్రాజెక్టుల పనుల కోసం గరిష్ఠంగా రూ.మూడు వేల కోట్ల రుణం తీసుకోవడానికి అనుమతి ఇస్తూ 2004లో ప్రభుత్వం చట్టం చేసింది. ఇటీవల ఈ చట్టాన్ని సవరించిన ప్రభుత్వం రుణ పరిమితిని పూర్తిగా ఎత్తివేసింది. రాష్ట్రంలో సాగునీటి ప్రాజెక్టుల పనుల కోసం ఇప్పటికిప్పుడు రూ.10,796.53 కోట్లు అవసరమని ఇటీవల జలవనరుల శాఖ ఈఎన్‌సీ సర్కార్‌కు నివేదిక ఇచ్చారు. నిధుల కొరత నేపథ్యంలో సాగునీటి ప్రాజెక్టులకు బ్యాంకుల నుంచి రుణం తీసుకోవాలని సర్కార్ నిర్ణయించింది. ఈ నేపథ్యంలోనే ఆ సంస్థకు మరో రూ.రెండు వేల కోట్ల రుణ సమీకరణకు అనుమతి ఇస్తూ నిర్ణయం తీసుకున్నారు.

మహనీయులకు రుణపడి ఉన్నాం: డీజీపీ

మంగళగిరి పోలీస్ ప్రధాన కార్యాలయంలో జాతిపిత వర్ధంతి


మంగళగిరి పోలీస్ ప్రధాన కార్యాలయంలో మహాత్మునికి నివాళులర్పిస్తున్న డీజీపీ

సాక్షి, అమరావతి: దేశానికి స్వేచ్ఛ ప్రసాదించిన జాతిపిత మహాత్మగాంధీకి మనమంతా రుణపడి ఉన్నామని డీజీపీ ఎం.మాలకొండయ్య పేర్కొన్నారు. మంగళగిరిలోని పోలీస్ ప్రధాన కార్యాలయంలో మంగళవారం గాంధీజీ వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. గాంధీజీ చిత్రపటానికి పూలమాల వేసి రెండు నిముషాలు మౌనం పాటించారు. స్వాతంత్ర్య సమరయోధులు దేశం కోసం ఎన్నో త్యాగాలు చేశారని, జైలు జీవితాన్ని గడిపారని ఈ సందర్భంగా డీజీపీ మాలకొండయ్య కొనియాడారు. శాంతియుత సమాజాన్ని నెలకొల్పిన వారి త్యాగాలు మరువరానివన్నారు. కార్యక్రమంలో సీఐడీ ఏడీజీ సీహెచ్ ద్వారక తిరుమలరావు, శాంతి భద్రతల విభాగం ఏడీజీ హరీష్‌కుమార్ గుప్త, రైల్వేస్ ఏడీజీ కేఆర్ఎం కిషోర్‌కుమార్, సీఐడీ ఐజీ అమిత్‌గార్గ్, పర్సనల్ ఐజీ ఎన్.శ్రీధర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

మహాత్ముడికి సచివాలయ సిబ్బంది నివాళి

జాతిపిత మహాత్మాగాంధీ వర్ధంతిని పురస్కరించుకొని మంగళవారం వెలగపూడి సచివాలయంలోని మొదటి బ్లాక్‌లో సచివాలయ అధికారులు, ఉద్యోగులు రెండు నిమిషాలు మౌనం పాటించి నివాళులర్పించారు. కార్యక్రమంలో సాధారణ పరిపాలన శాఖ సంయుక్త కార్యదర్శులు లలితా రమణకుమారి, శివశంకర్, ఉప కార్యదర్శి హనుమంతరెడ్డి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

విదేశాలకు మాంసం ఎగుమతి

రాష్ట్ర మాంసం అభివృద్ధి కార్పొరేషన్


మాట్లాడుతున్న ప్రకాష్ నాయుడు. చిత్రంలో శ్రీనివాసరావు

నగరంపాలెం (గుంటూరు): విదేశాలకు ఎగుమతయ్యేలా మాంసం ప్రమాణాలను పెంపొందించడానికి రాష్ట్ర మాంసం అభివృద్ధి కార్పొరేషన్ చర్యలు తీసుకుంటోందని కార్పొరేషన్ చైర్మన్ ప్రకాష్‌నాయుడు తెలిపారు. గుంటూరు ఆర్ అండ్ బీ బంగ్లాలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. పీపీపీ పద్ధతిలో అత్యాధునిక మాంసం ప్రాసెసింగ్ యూనిట్‌లను ఏర్పాటు చేసి విదేశాలకు ఎగుమతి చేయడం ద్వారా స్థానిక నిరుద్యోగులకు ఉపాధి కల్పిస్తామన్నారు. జంతువధను వంశపారంపర్యంగా చేస్తున్న ఆరెకటికలను కసాయి వారిగా పిలవడాన్ని నేరంగా పరిగణించేలా త్వరలో ఉత్తర్వులు జారీ చేయిస్తామన్నారు. కాగా, ప్రజలకు తాజా మాంసం అందించాల్సిన బాధ్యత స్థానిక సంస్థల్లోని ప్రజారోగ్యశాఖదే అని ప్రకాష్‌నాయుడు అన్నారు. నగరపాలక సంస్థ ప్రజారోగ్యశాఖ అధికారులతో ప్రకాష్ నాయుడు ప్రత్యేక సమావేశం నిర్వహించారు. రాజధాని ప్రాంతంగా మారిన గుంటూరుకు రాష్ట్రవ్యాప్తంగా అతిథులు వస్తున్నారని, వీరికి నాణ్యమైన మాంసం అందేలా అధికారులు పర్యవేక్షించాలన్నారు. కార్యక్రమంలో నగరపాలక సంస్థ ప్రజారోగ్యశాఖ అధికారి డాక్టర్ శోభారాణి, స్టేట్ మీట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఎండీ శ్రీనివాసరావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

అంతర్జాతీయ క్రీడా ప్రమాణాలే లక్ష్యం: మంత్రి కొల్లు

ఏఎన్‌యూలో సివిల్ సర్వీసెస్ అథ్లెటిక్స్ పోటీలు ప్రారంభం



ఏఎన్‌యూ: రాష్ట్రంలో అంతర్జాతీయ క్రీడా ప్రమాణాలు, మౌలిక వసతుల కల్పనే లక్ష్యంగా చర్యలు తీసుకుంటున్నట్లు రాష్ట్ర క్రీడాశాఖ మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. కేంద్ర సివిల్ సర్వీసెస్, సేవా, సాంస్కృతిక, క్రీడా సంఘం ఆధ్వర్యంలో మూడు రోజులపాటు జరుగనున్న అఖిల భారత సివిల్ సర్వీసెస్ ఉద్యోగుల అథ్లెటిక్ చాంపియన్‌షిప్‌ను మంగళవారం మంత్రి రవీంద్ర లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో అత్యాధునిక క్రీడా సెంటర్‌ను నిర్మిస్తున్నామన్నారు. ఏఎన్‌యూ వీసీ ఎ.రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ.. ఏఎన్‌యూలో అంతర్జాతీయ ప్రమాణాలు ఉన్నాయన్నారు. కార్యక్రమంలో వర్సిటీ సాధారణ పరిపాలన ముఖ్య కార్యదర్శి గోపాలకృష్ణ ద్వివేది, శ్యాప్ ఎండీ బంగారు రాజు, ఏపీ అథ్లెటిక్స్ అసోసియేషన్ కార్యదర్శి రాజేంద్రరావు, ఏఎన్‌యూ ఫిజికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ ఆచార్య వై.కిషోర్, ఇండియన్ బ్లైండ్ క్రికెట్ టీమ్ కెప్టెన్ ఇందూరి అజయ్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ప్రారంభోత్సవ కార్యక్రమంలో భాగంగా క్రీడాకారుల గౌరవ వందనాన్ని మంత్రి స్వీకరించారు. దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల నుంచి 33 అథ్లెటిక్ బృందాలు మార్చ్‌ఫాస్ట్‌లో పాల్గొన్నాయి.

సమగ్ర మూల్యాంకనాన్ని పునఃసమీక్షించాలి

ఏబీవీపీ రాష్ట్ర కార్యదర్శి హరికృష్ణ

గాంధీనగర్ (విజయవాడ సెంట్రల్): గ్రామీణ ప్రాంత విద్యార్థులను దృష్టిలో ఉంచుకుని నిరంతర సమగ్ర మూల్యాంకన విధానాన్ని పునఃసమీక్షించాలని అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) రాష్ట్ర మహాసభల్లో తీర్మానించినట్లు ఏబీవీపీ రాష్ట్ర కార్యదర్శి నాగోతు హరికృష్ణ తెలిపారు. విజయవాడ గాంధీనగర్‌లోని ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రాన్ని విద్యాహబ్‌గా మార్చడమంటే ప్రైవేటు విశ్వవిద్యాలయాలకు అనుమతులివ్వడమా? అని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. అలాగే ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని డీఎస్సీ నియామకాలు చేపట్టడాన్ని ఆయన తప్పుబట్టారు. సాంఘిక సంక్షేమ హాస్టళ్లలో ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించాలని కోరారు. విద్యాహక్కు చట్టంపై శ్వేత పత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఏబీవీపీ జాతీయ కార్యవర్గ సభ్యులు ఆర్.లక్ష్మీ, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బాలు, నగర కార్యదర్శి దుర్గాభవానీ పాల్గొన్నారు.

మహిళలపై దాడులకు వ్యతిరేకంగా ప్రచారం

మహిళా కమిషన్ చైర్‌పర్సన్ నన్నపనేని

సాక్షి, న్యూఢిల్లీ: మహిళలపై జరుగుతున్న దాడులకు వ్యతిరేకంగా గ్రామాల్లో విస్తృత ప్రచారం కల్పిస్తున్నట్టు రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ నన్నపనేని రాజకుమారి తెలిపారు. జాతీయ మహిళా కమిషన్ ఏర్పాటై 25 ఏళ్లు పూర్తి అయిన సందర్భంగా మంగళవారం ఢిల్లీలో ఏర్పాటు చేసిన ప్రత్యేక సదస్సుకు ఆమెతో సహా రాష్ట్ర నుంచి 55 మంది మహిళా ప్రతినిధులు హాజరయ్యారు. ఈ సందర్భంగా నన్నపనేని రాజకుమారి మాట్లాడుతూ.. దాడులకు గురైన మహిళలకు న్యాయం చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని, ఆర్థికంగా, సామాజికంగా కూడా పూర్తి సహకారం అందిస్తోందని చెప్పారు.

జాత్యహంకార పోలండ్ రాయబారితో చర్చలా?

పవన్‌కు సీపీఐ రామకృష్ణ లేఖ

సాక్షి, అమరావతి: పోలండ్ రాయబారితో ఇటీవల జనసేన అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ చర్చలు జరపడం పట్ల సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈమేరకు ఆయన పవన్‌కు లేఖ రాశారు. పోలండ్ జాత్యహంకారంపై సుప్రసిద్ధ ఇంగ్లీష్ మ్యాగజైన్ కారవాన్‌లో ఈ నెలలో ప్రచురించిన సుదీర్ఘ వ్యాసాన్ని మంగళవారం పవన్ కల్యాణ్‌కు రాసిన లేఖతో జతచేసి పంపించినట్టు రామకృష్ణ పేర్కొన్నారు. ప్రపంచ వ్యాప్తంగా జాత్యహంకార శక్తులతో, వ్యక్తులతో పోలండ్ సంబంధాలు పెట్టుకుని వారిని ప్రభావితం చేయడానికి ప్రయత్నిస్తోందని తెలిపారు. రాష్ట్రంలో ఏ రాజకీయ పార్టీ నాయకుడిని కలవకుండా పవన్‌నే పోలండ్ రాయబారి కలిశారని గుర్తు చేశారు. దీనిపై జవాబు ఇవ్వాలని పవన్‌ను కోరారు.

ప్లాట్లు వేశారు... అమ్మేశారు

'బొండా'గిరీలో కొత్త కోణాలు

- 5.16 ఎకరాల్లో ఇప్పటికే 1.50 ఎకరాలు విక్రయం
- రూ.15 కోట్లు కొల్లగొట్టిన ఎమ్మెల్యే బొండా వర్గం
- పత్రాలను ఫోరెన్సిక్‌కు పంపాలంటున్న పోలీసులు
- సీఐడీ విచారణ తీరుపై సర్వత్రా ఆసక్తి

సాక్షి, అమరావతి బ్యూరో



ఎమ్మెల్యే బొండా ఉమా వర్గం అక్రమంగా దక్కించుకున్న భూమిలో కొంత భాగాన్ని విక్రయించినట్టు రిజిస్ట్రేషన్ శాఖ వెబ్‌సైట్‌లో చూపిస్తున్న దృశ్యం

బెజవాడలో 'బొండా'గిరీ అంటే మజాకానా... తప్పుడు పత్రాలతో దర్జాగా భూమిని కబ్జా చేయడమే కాదు... బరితెగించి ఆ భూమిని ప్లాట్లుగా విక్రయించేయడం .. అదీ బెజవాడలో 'బొండా'గిరీ అంటే.

స్వాతంత్ర్య సమరయోధుడు కసిరెడ్డి సూర్యనారాయణ కుటుంబానికి చెందిన 5.16 ఎకరాలను ఎమ్మెల్యే బొండా ఉమా కుటుంబం హస్తగతం చేసుకోవడం సంచలనం సృష్టిస్తోంది. బొండా భూ బాగోతంలో కొత్త కోణాలు వెలుగు చూస్తున్నాయి. తప్పుడు పత్రాలతో తమ పరం చేసుకున్న భూమిలో కొంత ఇప్పటికే గుట్టు చప్పుడు కాకుండా ప్లాట్లు రూపంలో అమ్మేసి రూ.కోట్లు జేబులో వేసుకున్నారు. 'సాక్షి' పరిశోధనలో రిజిస్ట్రేషన్ పత్రాలతో సహా ఈ వ్యవహారం వెలుగులోకి వచ్చింది.

ఇప్పటికి రూ.15కోట్ల విక్రయాలు

దీపం ఉండగానే ఇల్లు చక్కబెట్టుకోవడం అంటే ఏమిటో విజయవాడ సెంట్రల్ నియోజకవర్గ ఎమ్మెల్యే బొండా ఉమా చేతల్లో చూపిస్తున్నారు. అధికారాన్ని అడ్డంపెట్టుకుని రూ.50కోట్లు విలువైన 5.16 ఎకరాలను తన భార్య సుజాత, సన్నిహితుల పేరిట మార్పించేశారు. అది అక్రమంగా దక్కించుకున్న భూమి కావడంతో భవిష్యత్తులో సమస్యలు వస్తాయని సందేహించారు. అందుకే రెండేళ్లుగా గుట్టుచప్పుడు కాకుండా ఆ భూమిని ప్లాట్లు రూపంలో విక్రయించడం ప్రారంభించారు. తన సన్నిహితుడు, బినామీగా పేరుపడ్డ మాగంటి బాబు పేరుతో కథ నడిపించారు. ఆ భూమిని తన భార్య డైరెక్టర్‌గా ఉన్న రవితేజ బయోటెక్స్, మాగంటి బాబు పేరు ఉన్న సాయిరూపా ఇన్ఫ్రా డెవలపర్స్‌లతో జీపీఏ రిజిస్ట్రేషన్ చేయించారు. ఈ భూబాగోతంలో తాము పావులుగా వాడుకున్న రామిరెడ్డి కోటేశ్వరరావు, అబ్దుల్ మస్తాన్‌లతోపాటు మాగంటి బాబు పేరున ప్లాట్లు విక్రయాలు సాగించారు. ఆ భూమిని విభజించి ప్లాట్లు వేసినట్లు పత్రాల్లో చూపించి 2015–2017 మధ్యలో గజాల లెక్కన విక్రయించేశారు. విక్రయించినవాటిలో ఒక్కో ప్లాటు రెండుమూడు చేతులు మారింది. అలా మొదటి దశలో 1.50 ఎకరాలను విక్రయించడం ద్వారా ఇప్పటికే దాదాపు రూ.15కోట్లు వరకు జేబులో వేసుకున్నట్లు తెలుస్తోంది. అది స్వాతంత్ర్య సమరయోధుని కుటుంబానికి చెందిన భూమి అని తెలియక విజయవాడ, గుంటూరు, హైదరాబాద్‌లకు చెందిన పలువురు ప్లాట్లు కొనుగోలు చేశారు. ప్రస్తుతం ఎమ్మెల్యే బొండా భూబాగోతం తెలిసీ వారు లబోదిబోమంటున్నారు. ఈ భూబాగోతంలో ఎమ్మెల్యే బొండా ఉమా భార్య సుజాతను ఏ–8 నిందితురాలుగా, మాగంటి బాబు ఏ–7 నిందితులుగా సీఐడీ పేర్కొనడం గమనార్హం.

సీఐడీ కళ్లకు గంతలు!

భూబాగోతంపై సీఐడీ కళ్లకు గంతలు కట్టేందుకు ఎమ్మెల్యే బొండా వర్గం పావులు కదుపుతోంది. తాము అబ్దుల్ మస్తాన్, రామిరెడ్డి కోటేశ్వరరావులతో చేసుకున్న జనరల్ పవర్ ఆఫ్ అటార్నీ (జీపీఏ) రద్దు చేసినట్లు ప్రకటించింది. కానీ అంతకుముందే వారిద్దరి పేరుతో ఆ భూమిని ప్లాట్లుగా వేసి అమ్మేయడం గమనార్హం. కాబట్టి జీపీఏ కంటే ముందే తాము సాగించిన వ్యవహారాలను అధికారికంగా కొనసాగిస్తోందన్నమాట. అదే విధంగా వారి నుంచి మరికొందరు ఆ భూమిని ప్లాట్లు రూపంలో కొనుగోలు చేసినట్లు చూపించారు. వారిలో కూడా ఎమ్మెల్యే బొండా బినామీలు ఉన్నారని అధికారవర్గాలు చెబుతున్నాయి. తద్వారా మొత్తం మీద ఆ 5.16 ఎకరాలు పూర్తిగా తమ గుప్పిట్లోనే ఉంచుకునేలా ఎమ్మెల్యే బొండా కుటుంబం వ్యూహాత్మకంగా వ్యవహరిస్తోంది. రాజకీయ ఒత్తిడితో సీఐడీ కేసును నీరుగార్చిన అనంతరం ఆ రూ.50కోట్ల భూమి తమ గుప్పిట్లోనే ఉండాలన్నది అంతిమలక్ష్యం.

'ఫోరెన్సిక్'తోనే నిజం నిగ్గుతేలేది!

ఎమ్మెల్యే బొండా భూబాగోతాన్ని నిరూపించి దోషుల్ని శిక్షించాలంటే... ఈ కేసులో రిజిస్ట్రేషన్ కోసం చూపిన పత్రాలు, వాటిపై సంతకాలే కీలకమైనవని పోలీసు అధికారులు చెబుతున్నారు. ఎందుకంటే స్వాతంత్ర్య సమరయోధుడు కసిరెడ్డి సూర్యనారాయణ పెద్ద కుమారుడు వెంకటేశ్వరరావు ఆ 5.16 ఎకరాలను అబ్దుల్ మస్తాన్, రామిరెడ్డి కోటేశ్వరరావులకు విక్రయించినట్లు పత్రాలు సృష్టించారు. ఆ పత్రాలపై వెంకటేశ్వరరావు సంతకం, ఆ తర్వాత జరిపిన విక్రయాల పత్రాలపై అబ్దుల్‌మస్తాన్, రామిరెడ్డి కోటేశ్వరరావుల సంతకాలు సరైనవో కావో తేల్చాల్సి ఉంది. అందుకు ఆ పత్రాలను ఫోరెన్సిక్ పరీక్షలకు పంపడమే ఏకైన మార్గం అని పోలీసు అధికారులు చెబుతుండటం గమనార్హం. ప్రస్తుతం అబ్దుల్ మస్తాన్ తీవ్ర అనారోగ్యానికి గురై మాట్లాడలేని స్థితిలో ఉన్నారు. రామిరెడ్డి కోటేశ్వరరావు తాను ఆ భూమి కొనలేదు... ఎవరికీ అమ్మలేదని చెబుతున్నారు. ఎమ్మెల్యే వర్గీయులు తనను బెదిరిస్తున్నారని కూడా ఆయన పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ఈసారైనా పట్టాలెక్కిస్తారా?

- రైల్వే జోన్‌పై నాలుగేళ్లుగా నిరాశే
- రాష్ట్రంలో ఒక్క రైల్వే ప్రాజెక్టూ పూర్తికాలేదు

సాక్షి, అమరావతి: నాలుగేళ్లుగా పట్టించుకోని రైల్వే జోన్‌పై ఈ సారి బడ్జెట్‌లోనైనా కేంద్రం కరుణ చూపుతుందా? సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ప్రజల ఆంకాంక్షలను గౌరవిస్తుందా? అనే దానిపై రాష్ట్ర ప్రజలు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. విశాఖపట్నం కేంద్రంగా రైల్వే జోన్ ప్రకటించాలని ఈనెల 9న దక్షిణ మధ్య రైల్వే అధికారులతో జరిగిన సమావేశంలో వైఎస్సార్ సీపీ, టీడీపీ ఎంపీలు డిమాండ్ చేసిన విషయం తెలిసిందే. దీనిని దృష్టిలో పెట్టుకునైనా ఈ ఏడాది బడ్జెట్‌లో కేంద్రం జోన్‌ను ప్రకటిస్తుందా? లేక యథావిధిగా మొండి చేయి చూపుతుందా అనేది కొది సమయంలో తేలిపోనుంది. దక్షిణ మధ్య రైల్వేకు అధిక శాతం ఆదాయం ఏపీ నుంచే లభిస్తోంది. అయితే ఆ మేరకు ఏపీకి రైల్వే పనులు మాత్రం మంజూరు కావడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. మరోపక్క మంజూరు చేసిన ప్రాజెక్టుల్ని కూడా రద్దు చేస్తున్నారు. నాలుగేళ్లుగా ఏపీకి రైల్వే జోన్‌పై బోర్డు నాన్చివేత వైఖరి అవలంబిస్తుంటే.. రాష్ట్ర ప్రభుత్వం గట్టిగా కేంద్రంపై ఒత్తిడి తీసుకురాలేకపోతోంది. ఏపీలో రైల్వే ప్రాజెక్టుల కోసం రాష్ట్ర ప్రభుత్వం మినిస్ట్రీ ఆఫ్ రైల్వేస్‌తో జాయింట్ వెంచర్ (జేవీ) ఒప్పందం కుదుర్చుకుంది. మొత్తం ఏడు రైల్వే ప్రాజెక్టులకు జేవీ కింద రెండేళ్ల క్రితం ఒప్పందం కుదుర్చుకోగా, ఇంతవరకు ఒక్క ప్రాజెక్టు పూర్తి కాలేదు. పైగా జేవీ కంపెనీ కింద ఉన్న కాకినాడ–పిఠాపురం రైల్వే లైన్‌ను, మాచర్ల–నల్లగొండ రైల్వే లైన్ రద్దు చేశారు. రాజధాని అమరావతికి కొత్త రైల్వే లైన్‌కు గత బడ్జెట్‌లో కేంద్రం రూ. 2,816 కోట్లు కేటాయించింది. అయితే రాష్ట్ర ప్రభుత్వం భూ సేకరణ విషయంలో స్పందించకపోవడంతో ఈ ప్రాజెక్టుపై నీలినీడలు కమ్ముకుంటున్నాయి. సరుకు రవాణా కారిడార్లపై మూడేళ్ల నుంచి వినతులిస్తున్నా కేంద్ర మొండిచెయ్యే చూపుతోంది. రైల్వే యూనివర్సిటీని ఏపీకి ఇవ్వాలని ఎంపీలు విన్నవిస్తే, ఇటీవలే వడోదరకు కేటాయించారు.

రైల్వేజోన్‌పై వైఎస్సార్‌సీపీ మరో దీక్ష

- ఫిబ్రవరి 1న విశాఖలో..
- వైఎస్సార్‌సీపీ నేత అమర్‌నాథ్
- ఉత్తరాంధ్ర ఎంపీలకు చిత్తశుద్ధి లేదు



డాబాగార్డెన్స్ (విశాఖ దక్షిణ): విశాఖ కేంద్రంగా రైల్వేజోన్ సాధించేందుకు తమ పార్టీ మరోసారి దీక్ష చేపట్టనుందని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అనకాపల్లి పార్లమెంట్ జిల్లా అధ్యక్షుడు గుడివాడ అమర్‌నాథ్ తెలిపారు. నగరంలోని జగదాంబ జంక్షన్‌లోని పార్టీ జిల్లా కేంద్ర కార్యాలయంలో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడారు. రైల్వేజోన్‌పై టీడీపీ పార్లమెంట్ సభ్యులు ఒక్కొక్కరు ఒక్కో విధంగా మాట్లాడుతున్నారని విమర్శించారు. ఉత్తరాంధ్ర జిల్లాలకు చెందిన ఎంపీలెవరూ రైల్వేజోన్‌పై స్పందించడంలేదని.. విశాఖ ఎంపీ కంభంపాటి హరిబాబు ఆ విషయాన్నే తమ దృష్టికి తీసుకురాలేదని రైల్వే జోనల్ కన్సల్టీ కమిటీ సభ్యుడు జాన్‌బాబు మంగళవారం చెప్పారంటే.. వీరెవరికీ రైల్వేజోన్‌పై చిత్తశుద్ధి లేదనే విషయం అర్థమవుతోందని అమర్‌నాథ్ అన్నారు. రైల్వేజోన్ సాధనకు ఇప్పటికే వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పెద్దఎత్తున పాదయాత్రలు, ఆందోళనలు, నిరసనలు, నిరాహారదీక్షలు చేపట్టిన విషయాన్ని ఆయన గుర్తుచేశారు. మరోసారి రైల్వేజోన్ సాధనకు జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద ఫిబ్రవరి ఒకటిన దీక్ష చేపట్టనున్నట్టు అమర్‌నాథ్ ప్రకటించారు.

భూదందాపై 'సిట్' ఏం తేల్చింది?

ఇదిలా ఉండగా.. విశాఖ జిల్లాల్లో టీడీపీ మంత్రులు, ఎమ్మెల్యేలు, నేతల భూదందాపై విచారణ జరిపిన 'సిట్' చివరకు ఏం తేల్చిందో బహిర్గతం చేయాలని ఆయన డిమాండ్ చేశారు. దర్యాప్తు పూర్తయిన తర్వాత నగర పోలీస్ కమిషనర్‌కు నివేదికను అందజేశారే తప్ప భూదందాలకు పాల్పడ్డ నాయకులు ఎవరు? వారిపై తీసుకున్న చర్యలేంటి? వంటి విషయాలు వెల్లడించలేదన్నారు. దీంతో అందులో టీడీపీ వారే ఉన్నారనే అనుమానం బలపడుతోందన్నారు.

ఆరోగ్యశాఖకు పీసీబీ నోటీసులు

- మురుగు కాల్వల్లోకి విషపూరిత బయో వ్యర్థాలు
- సీవరేజీ ట్రీట్‌మెంట్ ప్లాంట్లు ఏర్పాటుచేయని ఆస్పత్రులు
- దీనివల్ల భయంకర జబ్బులు వచ్చే ప్రమాదం
- తక్షణమే నివేదిక ఇవ్వాలని వైద్యశాఖను ఆదేశించిన పీసీబీ

సాక్షి, అమరావతి: ఆస్పత్రుల నుంచి వెలువడే బయో మెడికల్ వ్యర్థాలను నేరుగా మున్సిపల్ డ్రైనేజీలో కలుపుతుండడంతో రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖపై కాలుష్య నియంత్రణ మండలి (పీసీబీ) కన్నెర్ర చేసింది. దీనిపై సమాధానం ఇవ్వాలని, లేదంటే చర్యలు తీసుకోవాల్సి ఉంటుందని నాలుగు రోజుల కింద నోటీసులు జారీచేసింది. సాధారణంగా.. ఆస్పత్రుల నుంచి వెలువడే బయో మెడికల్ వ్యర్థాలను నేరుగా మున్సిపల్ డ్రెయిన్లలో కలపకూడదు. దీనివల్ల విపరీతమైన దుష్ప్రభావాలు తలెత్తే అవకాశమున్నందువల్ల ప్రతి ఆస్పత్రిలో ఎస్‌టీపీ (సీవేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్)ను ఏర్పాటుచేయాలి. ఈ ప్లాంటు ద్వారా బయో వ్యర్థాల నీటిని శుద్ధిచేసిన తర్వాతే మున్సిపల్ డ్రెయిన్‌లో కలపాలి. కానీ, రాష్ట్రంలో అనేక ఆస్పత్రులు దీనిని పాటించడంలేదు. అత్యంత విషపూరితమైన వ్యర్థాలను డ్రెయిన్‌లలోకి నేరుగా వదులుతున్నాయి. రెండు మూడు ఆస్పత్రులు మినహా రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఏ బోధనాసుపత్రిలోనూ ఎస్‌టీపీ వ్యవస్థ లేదు. దీంతో పట్టణాల్లో ఇళ్ల మధ్య పారుతున్న సైడు కాలువల్లో బయో వ్యర్థాలు కలిసిపోయి వాతావరణాన్ని విషపూరితం చేస్తున్నాయి. వీటిని పరిశీలించిన కాలుష్య నియంత్రణా మండలి.. తక్షణమే దీనిపై సమాధానమివ్వాలని, లేదంటే చర్యలు తీసుకోవాల్సి వస్తుందని వైద్య ఆరోగ్యశాఖకు తాఖీదులిచ్చింది.

ప్రమాదకర జబ్బులకు కారకాలుగా..

రాష్ట్రంలో మొత్తం 11 బోధనాసుపత్రులు ఉన్నాయి. ఒక్కో దానిలో రోజుకు 20 నుంచి 30 శస్త్రచికిత్సలు జరుగుతాయి. ఇందులో రెండు మూడు ఆస్పత్రులకు మాత్రమే ఎస్‌టీపీలుండగా మిగిలిన వాటికి లేవు. సాధారణంగా ఒక్కో శస్త్రచికిత్స అనంతరం పేషెంటు నుంచి రోజుకు ఐదు నుంచి ఆరు లీటర్ల బయో వ్యర్థాలు విడుదలవుతాయి. ఇవిగాకుండా రెండు కేజీలకు పైగా ఘన బయో వ్యర్థాలు వస్తాయి. ఘన వ్యర్థాలను బయట నిర్వీర్యం చేస్తున్నా ద్రవ రూపంలో ఉన్న వ్యర్థాలు మాత్రం నేరుగా డ్రెయిన్లలో కలుస్తున్నాయి. దీనివల్ల హెపటైటిస్–బి, హెపటైటిస్–సి వంటి జబ్బులతో పాటు కాలేయం, మూత్రపిండాల వ్యాధులు సంక్రమించే అవకాశం ఉందని, చిన్న పిల్లలకు విషజ్వరాలు వచ్చే అవకాశముందని వైద్యులు హెచ్చరిస్తున్నారు. గత కొన్నేళ్లుగా బయో వ్యర్థాలను ఇష్టారాజ్యంగా డ్రెయిన్లలో కలిపేస్తున్నా అటు మున్సిపల్ అధికారులు గానీ, ఇటు ఆరోగ్యశాఖ అధికారులు గానీ పట్టించుకున్న దాఖలాల్లేవు. మరోవైపు.. ప్రైవేటు ఆస్పత్రుల తీరు ఇలాగే ఉంది. రాష్ట్రంలోని ప్రధాన నగరాలు, పట్టణాల్లోని నర్సింగ్ హోంలు, కార్పొరేట్ ఆస్పత్రులు అన్నీ బయో వ్యర్థాలను సైడ్ కాల్వల్లోనే కలిపేస్తున్నాయి.

సీవరేజీ ట్రీట్‌మెంటు ప్లాంట్లు లేని ప్రభుత్వ ఆస్పత్రులు

బోధనాసుపత్రులు	09
జిల్లా ఆస్పత్రులు	08
ఏరియా ఆస్పత్రులు	32
సామాజిక ఆరోగ్య కేంద్రాలు	192

రైల్వేమంత్రికి అపరిశుభ్ర టాయిలెట్ ఫొటో

ట్విట్టర్‌లో పంపిన ప్రయాణికుడు.. సత్వర చర్యలతో హర్షం

టీ.నగర్(చెన్నై): అపరిశుభ్రంగా ఉన్న రైల్లోని టాయిలెట్‌ను ఫొటో తీసి కేంద్ర రైల్వే మంత్రి పీయూష్ గోయెల్‌కు ఒక ప్రయాణికుడు ట్విట్టర్‌లో పంపడంతో ఆయన వెంటనే చర్యలు తీసుకున్నారు. నాగర్‌కోవిల్–బెంగళూరు మధ్య ప్రతిరోజూ ఎక్స్‌ప్రెస్ రైలు నడుస్తుంది. సోమవారం అర్ధరాత్రి ఈ రైల్లోని ఎస్–3 బోగీలో కేరళకు చెందిన కొందరు ప్రయాణిస్తున్నారు. వీరిలో ఒక యువకుడు టాయిలెట్‌కు వెళ్లగా అది అపరిశుభ్రంగా కనిపించింది. వెంటనే అతను ఈ టాయిలెట్‌ను ఫొటో తీసి ట్విట్టర్‌లో రైల్వేమంత్రి పియూష్‌గోయల్‌కి పంపాడు. ఇది చూసిన గోయల్ వెంటనే రైలు టాయిలెట్‌ను శుభ్రం చేయాలని తమిళనాడులోని నెల్లై జంక్షన్ రైల్వేస్టేషన్ అధికారులను ఆదేశించారు. ఈ రైలు నెల్లై చేరుకోగానే పారిశుధ్య సిబ్బంది టాయిలెట్‌ను శుభ్రం చేసి ఆ ఫొటోను కేంద్రమంత్రికి పంపారు. అనంతరం గోయెల్ ట్విట్టర్ ద్వారా ఫిర్యాదు చేసిన యువకుడికి ఫిర్యాదుపై చర్యలు తీసుకున్నట్లు సమాచారం పంపారు.

యువకుడి ఆత్మహత్యతో భగ్గుమన్న పలాస!

- నిందితుడు టీడీపీ కౌన్సిలర్ అరెస్టుకు మృతదేహంతో ధర్నా
- స్తంభించిన జనజీవనం..
- స్వచ్ఛందంగా బంద్ పాటించిన వ్యాపారస్తులు
- సీఐను సస్పెండ్ చేయాలని డిమాండ్
- కలెక్టర్, ఎస్పీల హామీతో శాంతించిన ఆందోళనకారులు


హరీష్ మృతదేహంతో నిరసన తెలుపుతున్న స్థానికులు

కాశీబుగ్గ: యువకుడి ఆత్మహత్యకు కారకుడైన టీడీపీ కౌన్సిలర్‌ను అరెస్టు చేయాలని.. ఫిర్యాదు చేసేందుకు వెళ్లిన వారితో అనుచితంగా మాట్లాడిన సీఐను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేస్తూ ప్రజలు పెద్దఎత్తున ఆందోళనకు దిగారు. యువకుడి మృతదేహంతో రాస్తారోకో చేశారు. దీంతో శ్రీకాకుళం జిల్లా పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీలో మంగళవారం తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. వ్యాపారులు దుకాణాలను మూసివేసి స్వచ్ఛందంగా బంద్ పాటించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకూ ధర్నాలు, నిరసనలతో జనజీవనం స్తంభించింది. చివరకు కౌన్సిలర్‌ను అరెస్టుచేసి రౌడీషీట్ తెరుస్తామని, చనిపోయిన యువకుడి కుటుంబానికి న్యాయం చేస్తామని అధికారులు హామీ ఇవ్వడంతో పరిస్థితి అదుపులోకి వచ్చింది. కాశీబుగ్గ కేటీ రోడ్డులో ఉన్న లక్ష్మీ స్వీట్స్ దుకాణానికి టీడీపీ కౌన్సిలర్ పైలా చక్రధర్ తన అనుచరులతో ఆదివారం సాయంత్రం వెళ్లాడు. ఎంగిలి చేతితో మిఠాయిలు తీసేందుకు ప్రయత్నించడంతో అందులో పనిచేస్తున్న బ్రాహ్మణతర్ల డోకి హరిష్ (25) అడ్డుకునే ప్రయత్నం చేశాడు. దీంతో ఆగ్రహించిన చక్రధర్ అతనిని దుకాణం నుంచి బయటకు ఈడ్చుకు వచ్చి చితకబాదాడు. అడ్డుకోబోయిన షాపులోని మహిళలపై కూడా దాడిచేశాడు. దీంతో కాశీబుగ్గ పోలీసులకు ఫిర్యాదు చేయడానికి హరిష్ వెళ్లగా సీఐ కె.అశోక్‌కుమార్ ఫిర్యాదు తీసుకోకుండా చులకనగా మాట్లాడారు. ఈ అవమానం తట్టుకోలేక.. తీవ్ర మనస్తాపంతో హరీష్ రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ విషయం సోమవారం సాయంత్రం ఊరంతా వ్యాపించింది. దీంతో స్థానికులు ఆగ్రహంతో మంగళవారం ఉదయం పలాస–కాశీబుగ్గ చేరుకున్నారు. పోస్టుమార్టం అనంతరం హరీష్ మృతదేహంతో పెద్దఎత్తున నిరసన, మానవహారాలు చేపట్టారు. రోడ్డు మధ్యలో బైఠాయించారు. టైర్లు కాలుస్తూ నిరసన తెలిపారు. ఉదయం నుంచి సాయంత్రం వరకూ నిరసన కొనసాగడంతో రాకపోకలు స్తంభించాయి. ఆందోళనకారులకు వైఎస్సార్‌సీపీ పలాస నియోజకవర్గ సమన్వయకర్త సీదిరి అప్పలరాజుతో పాటు కార్యకర్తలు అండగా నిలిచారు. దీంతో పలాస తహసీల్దార్ కల్యాణ చక్రవర్తి, డీఎస్పీ ఎస్.రాఘవ బాధితులకు నచ్చచెప్పినా ఫలితం లేకపోవడంతో విషయాన్ని జిల్లా ఎస్పీ త్రివిక్రమవర్మ, కలెక్టర్ కె. ధనంజయరెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. కలెక్టర్ స్పందించి మృతుడు హరిష్ కుటుంబానికి సీఎం సహాయనిధి ద్వారా సాయం అందజేస్తామని హామీ ఇచ్చారు. ఎస్పీ కాశీబుగ్గ చేరుకుని కౌన్సిలర్‌ను అరెస్టుచేసి రౌడీషీట్ తెరుస్తామని హామీ ఇవ్వడంతో నిరసనకారులు శాంతించారు.

ఆస్పత్రి నుంచి డిశ్చార్జైన పద్మశ్రీ నరసమ్మ


'సాక్షి' దినపత్రికను చదువుతున్న నరసమ్మ

శివాజీనగర (బెంగళూరు): శ్వాస సంబంధిత సమస్యతో బెంగళూరులోని ఫోర్టిస్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న పద్మశ్రీ సూలగిత్తి నరసమ్మ పూర్తిగా కోలుకుని మంగళవారం ఆస్పత్రి నుంచి డిశ్చార్జ్ అయ్యారు. ఆరేడు దశాబ్దాలుగా ఆమె తుమకూరు, చిత్రదుర్గ, అనంతపురం తదితర జిల్లాల్లో వేలాదిమందికి ఉచితంగా పురుడుపోసి ఎంతోమందికి ప్రాణదానం చేశారు. నరసమ్మ సేవలను గుర్తిస్తూ కేంద్రం ఇటీవల ఆమెకు పద్మశ్రీ పురస్కారాన్ని ప్రకటించిన సంగతి తెలిసిందే. కొద్దిరోజులుగా ఊపిరితిత్తుల సమస్య పీడిస్తుండడంతో ఆమె ఆస్పత్రిలో చేరారు. పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలు ఆమెను ఆస్పత్రిలో పరామర్శించారు. సూలగిత్తి నరసమ్మ కుమారుడు పావగడ శ్రీరామ్, మాదిగ దండోర బెంగళూరు నగర నాయకులు సీ.శ్రీనివాస్, త్రిలోక్ చందర్ తదితరులు ఆస్పత్రిలో ఆమెతో పాటు ఉన్నారు. కర్ణాటకకే గర్వకారణమైన నరసమ్మ వైద్య ఖర్చులను ప్రభుత్వమే భరించాలని చిత్రదుర్గ ఎంపీ చంద్రప్ప డిమాండ్ చేశారు. తెలుగు బాగా తెలిసిన నరసమ్మ ఆస్పత్రిలో 'సాక్షి' పత్రికను చదివారు.

చోరీ కేసులో నటుడు సమ్రాట్ అరెస్ట్

సాక్షి, హైదరాబాద్: టాలీవుడ్ యువ నటుడు సమ్రాట్‌రెడ్డిని జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించారు. తన ఇంట్లో చోరీకి పాల్పడ్డారని ఆయన భార్య హర్షితారెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు ఆయనను అరెస్ట్ చేశారు. సమ్రాట్‌ను మియాపూర్ కోర్టులో పోలీసులు హాజరుపర్చగా న్యాయమూర్తి 14 రోజుల జ్యుడీషియల్ రిమాండ్ విధించారు. మరోపక్క తనకు బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ సమ్రాట్ కోర్టుకు దాఖలు చేసుకున్న పిటిషన్‌పై విచారణ బుధవారానికి వాయిదా పడింది. దీంతో సమ్రాట్‌ను పోలీసులు జైలుకు తరలించారు.

దరఖాస్తు చేశారా?

- కెనరా బ్యాంక్‌లో 450 పీవో పోస్టులకు చివరి తేదీ: జనవరి 31, వెబ్‌సైట్: www.canarabank.com
- తెహ్రీ హైడ్రో డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్‌లో ఇంజనీర్ ట్రైనీ పోస్టులకు చివరి తేదీ: జనవరి 31, వెబ్‌సైట్: www.thdc.gov.in
- పవర్ గ్రిడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్‌లో ఎగ్జిక్యూటివ్ ట్రైనీస్ పోస్టులకు చివరి తేదీ: జనవరి 31, వెబ్‌సైట్: www.powergridindia.com
- ఎన్‌టీపీసీలో 150 ఎగ్జిక్యూటివ్ ట్రైనీస్ పోస్టులకు చివరి తేదీ: జనవరి 31. వెబ్‌సైట్: www.ntpccareers.net, www.ntpc.co.in

మీ సలహాలు, సందేహాలు పంపాల్సిన చిరునామా
సాక్షి ఎడ్యుకేషన్ డెస్క్,
సాక్షి దినపత్రిక,
రోడ్ నంబర్-1, బంజారాహిల్స్,
హైదరాబాద్-34. ఈ-మెయిల్
sakshieducation@gmail.com



ఢిల్లీ మెట్రో రైల్ కార్పొరేషన్ లిమిటెడ్..

1896 ఖాళీలు



ఢిల్లీ మెట్రో రైల్ కార్పొరేషన్ లిమిటెడ్ (డీఎంఆర్‌సీఎల్).. వివిధ విభాగాల్లోని ఎగ్జిక్యూటివ్, నాన్ ఎగ్జిక్యూటివ్ కేటగిరీలకు చెందిన 1,896 పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతూ ప్రకటన విడుదల చేసింది. డీఎంఆర్‌సీఎల్‌ను కేంద్ర ప్రభుత్వం, ఎన్‌సీటీ ఢిల్లీ ప్రభుత్వాలు సంయుక్తంగా నిర్వహిస్తున్నాయి.

- **పోస్టు-ఖాళీలు:** మొత్తం పోస్టులను నాలుగు సెక్షన్లుగా విభజించారు. ఇందులో ఏ, బీ సెక్షన్లలోని పోస్టులను రెగ్యులర్ ప్రాతిపదికన; సీ, డీ సెక్షన్లలోని పోస్టులను కాంట్రాక్టు పద్ధతిలో భర్తీ చేస్తారు. వివరాలు..
- **సెక్షన్ 'ఏ' (ఎగ్జిక్యూటివ్)లో** అసిస్టెంట్ మేనేజర్-49 (ఎలక్ట్రికల్-21+ఎస్ అండ్ టీ-12+ఆపరేషన్స్-8 ఫైర్-2+స్టోర్స్-2+ఎన్విరాన్‌మెంట్-1+ఐటీ-3).
- **సెక్షన్ 'బీ' (నాన్ ఎగ్జిక్యూటివ్)లో** జూనియర్ ఇంజనీర్-440 (ఎలక్ట్రికల్-192+ఎలక్ట్రానిక్స్-135+మెకానికల్-87+సివిల్-24+ఎన్విరాన్‌మెంట్-2); అసిస్టెంట్ ప్రోగ్రామర్-9; లీగల్ అసిస్టెంట్-4; ఫైర్ ఇన్‌స్పెక్టర్-10; లైబ్రేరియన్-2; మెయింటైనర్-1058 (ఎలక్ట్రీషియన్-317+ఎలక్ట్రానిక్ మెకానిక్-530+రిఫ్రిజిరేషన్ అండ్ ఏసీ మెకానిక్-33+ఫిట్టర్-178).
- **సెక్షన్ 'సీ' (ఎగ్జిక్యూటివ్)లో** అసిస్టెంట్ మేనేజర్-92 (ఎలక్ట్రికల్-25+ఎస్అండ్‌టీ-22+సివిల్-44+అలైన్‌మెంట్ డిజైన్-1).
- **సెక్షన్ 'డీ' (నాన్ ఎగ్జిక్యూటివ్)లో** జూనియర్ ఇంజనీర్-205 (ఎలక్ట్రికల్-7+ఎలక్ట్రానిక్స్-102+సివిల్-96) ఆఫీస్ అసిస్టెంట్-14; స్టోర్ అసిస్టెంట్-13.
- **వేతనశ్రేణి:** అసిస్టెంట్ మేనేజర్‌కు రూ.20,600-రూ.46,500; జూనియర్ ఇంజనీర్, అసిస్టెంట్ ప్రోగ్రామర్, లీగల్ అసిస్టెంట్, ఫైర్ ఇన్‌స్పెక్టర్, లైబ్రేరియన్-రూ.14,000-రూ.26,950; మెయింటైనర్-రూ.10,170-రూ.18,500; ఆఫీస్ అసిస్టెంట్, స్టోర్ అసిస్టెంట్-రూ.45,000.
- **అర్హతలు:** అసిస్టెంట్ మేనేజర్ పోస్టులకు సంబంధిత విభాగాల్లో కనీసం 60 శాతం మార్కులు/తత్సమాన గ్రేడ్‌తో బీఈ/బీటెక్/ఎంబీఏ/బీఎస్సీ/గేట్-2017 క్వాలిఫై; జూనియర్ ఇంజనీర్‌కు సంబంధిత విభాగాల్లో ఇంజనీరింగ్ డిప్లొమా; అసిస్టెంట్ ప్రోగ్రామర్‌కు ఇంజనీరింగ్ డిప్లొమా (కంప్యూటర్ సైన్స్)/బీసీఏ (కంప్యూటర్ అప్లికేషన్స్)/బీఎస్సీ (ఐటీ); లీగల్ అసిస్టెంట్‌కు కనీసం 50 శాతం మార్కులతో ఎల్‌ఎల్‌బీ; ఫైర్ ఇన్‌స్పెక్టర్‌కు బీఎస్సీ+ఏడాది ఫైర్ సేఫ్టీ కోర్స్; లైబ్రేరియన్‌కు కనీసం 60 శాతం మార్కులతో బీ.లైబ్; మెయింటైనర్‌కు సంబంధిత ట్రేడ్‌లో ఐటీఐ (ఎన్‌సీవీటీ/ఎస్‌సీవీటీ); ఆఫీస్ అసిస్టెంట్‌కు బీఏ/బీఎస్సీ/బీకామ్; స్టోర్ అసిస్టెంట్‌కు ఇంజనీరింగ్ డిప్లొమా (ఎలక్ట్రికల్/ఎలక్ట్రానిక్స్/మెకానికల్/సివిల్)/తత్సమాన కోర్సులో ఉత్తీర్ణత. అలాగే అన్ని పోస్టులకూ రైల్వే నిబంధనల ప్రకారం తగినంత ఆరోగ్యం, కొన్ని పోస్టులకు నిర్దేశిత శారీరక ప్రమాణాలూ ఉండాలి.
- **వయసు:** 2018, జనవరి 1 నాటికి అన్ని పోస్టులకూ 18-28 ఏళ్ల లోపు ఉండాలి. రిజర్వేషన్లు వర్తిస్తాయి.
- **ఎంపిక:** ఎగ్జిక్యూటివ్ పోస్టులకు సీబీటీ (రెండు పేపర్లు), గ్రూప్ డిస్కషన్, ఇంటర్వ్యూ, మెడికల్ ఎగ్జామినేషన్ ద్వారా; నాన్ ఎగ్జిక్యూటివ్ పోస్టులకు సీబీటీ (రెండు పేపర్లు), మెడికల్ ఎగ్జామినేషన్ ద్వారా ఎంపిక చేస్తారు. ఇందులోని మెయింటైనర్ పోస్టులకు కంప్యూటర్ బేస్డ్ పరీక్ష (సీబీటీ) ఒక పేపర్‌కు మాత్రమే నిర్వహిస్తారు.
- **కంప్యూటర్ బేస్డ్ టెస్ట్ (సీబీటీ) విధానం:** దీన్ని రెండు పేపర్లకు (మెయింటైనర్ పోస్టులకు మినహా) నిర్వహిస్తారు. పేపర్-1లో జనరల్ అవేర్‌నెస్, జనరల్ ఇంటెలిజెన్స్ అండ్ రీజనింగ్, క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్ (మెయిం టైనర్ పోస్టులకు జనరల్ ఇంగ్లిష్), అభ్యర్థి ఎంచుకున్న విభాగం నుంచి 120 ప్రశ్నలు ఇస్తారు. ప్రశ్నపత్రం ఇంగ్లిష్, హిందీల్లో మాత్ర మే ఉంటుంది. పేపర్-1 వ్యవధి 90 నిమిషా లు. పేపర్-2లో జనరల్ ఇంగ్లిష్ నుంచి 60 ప్రశ్నలు ఇస్తారు. పేపర్-2 వ్యవధి 45 నిమి షాలు. పేపర్-1, పేపర్-2లోని అన్ని ప్రశ్నల కీ సమాన మార్కులు కేటాయించారు. అలాగే ప్రతి తప్పు సమాధానానికీ 1/3 వంతు మార్కు కోత విధిస్తారు. సీబీటీలో నిర్దేశిత మార్కులతో ఉత్తీర్ణులైన అభ్యర్థులను తదుపరి దశకు ఎంపిక చేస్తారు.
- **దరఖాస్తు రుసుం:** రూ.500; ఎస్సీ/ఎస్టీ/దివ్యాంగ/మహిళలు-రూ.250.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్.
- **చివరి తేదీ:** ఫిబ్రవరి 26, 2018.
- **వెబ్‌సైట్:** www.delhimetrorail.com

టీఎస్‌పీఎస్సీ

423 ఖాళీలు

తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీఎస్‌పీఎస్సీ)... డైరెక్టర్ ఆఫ్ పబ్లిక్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ (డీపీహెచ్ అండ్ ఎఫ్‌డబ్ల్యూ), డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ (డీఎంఈ), తెలంగాణ వైద్య విధాన పరిషత్ (టీవీవీపీ), అగ్రికల్చర్ అండ్ కోఆపరేషన్ డిపార్ట్‌మెంట్‌లోని 423 ఖాళీల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తూ నాలుగు వేర్వేరు ప్రకటనలు విడుదల చేసింది.

- **ఖాళీలు:** ఫార్మసిస్ట్ గ్రేడ్ (2) (డీపీహెచ్ అండ్ ఎఫ్‌డబ్ల్యూ)-125; ఫార్మసిస్ట్ గ్రేడ్ (2) (డీఎంఈ)-58; ఫార్మసిస్ట్ గ్రేడ్ (2)(టీవీవీపీ)-55; ఏఎన్‌ఎం/ఎంపీహెచ్‌ఏ (ఎఫ్) (టీవీవీపీ)-152; హార్టికల్చర్ ఆఫీసర్ (హెచ్‌వో) (అగ్రికల్చర్ అండ్ కోఆపరేషన్)-27; అసిస్టెంట్ లైబ్రేరియన్ (డీఎంఈ)-6.
- **వేతనశ్రేణి:** ఫార్మసిస్ట్ గ్రేడ్ (2), ఏఎన్‌ఎం/ఎంపీహెచ్‌ఏ (ఎఫ్)-రూ.21,230- రూ.63,010; హార్టికల్చర్ ఆఫీసర్, అసిస్టెంట్ లైబ్రేరియన్-రూ.35,120-రూ.87,130.
- **అర్హతలు:** ఫార్మసిస్ట్ గ్రేడ్ (2)కి ఇంటర్మీడియెట్‌తో పాటు డీఫార్మసీ ఉత్తీర్ణత. అలాగే ఫార్మసీ కౌన్సిల్ రిజిస్ట్రేషన్; ఏఎన్‌ఎం/ఎంపీహెచ్‌ఏ (ఎఫ్)కు పదోతరగతి తోపాటు ఏపీ/తెలంగాణ ప్రభుత్వ ఎంపీహెచ్‌ఏ (ఎఫ్) కోర్సు ఉత్తీర్ణత, ఏపీ/తెలంగాణ నర్సింగ్ కౌన్సిల్లో రిజిస్ట్రేషన్; హార్టికల్చర్ ఆఫీసర్‌కు డిగ్రీ (హార్టికల్చర్) ఉత్తీర్ణత ఉండాలి. ఈ కోర్సు అభ్యర్థులు లేకపోతే హార్టికల్చర్ స్పెషలైజేషన్‌తో ఎంఎస్సీ (అగ్రికల్చర్) ఉత్తీర్ణులైన వారిని పరిగణిస్తారు. అలాగే ఎస్సీ/ఎస్టీ కేటగిరీ పోస్టులకు సంబంధించిన అభ్యర్థులు డిగ్రీ (హార్టికల్చర్)లో లేకపోతే డిగ్రీ (అగ్రికల్చర్) చేసిన వారిని పరిగణనలోకి తీసుకుంటారు. అసిస్టెంట్ లైబ్రేరియన్‌కు బీఏ/బీకామ్/బీఎస్సీతోపాటు బ్యాచిలర్ ఆఫ్ లైబ్రరీ సైన్సెస్ (బీఎల్ఎస్సీ) ఉండాలి. డిగ్రీ (బయాలజీ) ఉత్తీర్ణతతోపాటు కంప్యూటర్ డేటాబేస్‌లో ప్రావీణ్యం అభిలషణీయం.
- **వయసు:** 2018, జూలై 1 నాటికి 18-44 ఏళ్ల లోపు ఉండాలి. రిజర్వేషన్ కేటగిరీలకు నిబంధనల మేర వయోపరిమితిలో సడలింపు ఉంటుంది.
- **ఎంపిక:** ఫార్మసిస్ట్ గ్రేడ్ (2), ఏఎన్‌ఎం/ఎంపీహెచ్‌ఏ (ఎఫ్) పోస్టులకు రాతపరీక్ష (70 శాతం వెయిటేజీ)+ప్రభుత్వ సర్వీసులో ఉద్యోగానుభవం (30 శాతం వెయిటేజీ); హార్టికల్చర్ ఆఫీసర్ పోస్టులకు రాతపరీక్ష+ ఇంటర్వ్యూ; అసిస్టెంట్ లైబ్రేరియన్ పోస్టులకు రాతపరీక్ష ద్వారా.
- **రాతపరీక్ష విధానం:** దీన్ని రెండు పేపర్లుగా నిర్వహిస్తారు. పోస్టుల వారీ పేపర్లు, ప్రశ్నలు, మార్కుల వివరాలు..
- ఫార్మసిస్ట్ గ్రేడ్ (2)కు మొత్తం 150 మార్కులకు పరీక్ష ఉంటుంది. ఇందులో పేపర్-1లో జనరల్ ఎబిలిటీస్ నుంచి 50 ప్రశ్నలు ఇస్తారు. ప్రతి సరైన సమాధానానికి ఒక మార్కు చొప్పున గరిష్ఠ మార్కులు 50. పేపర్-2లో ఫార్మసీ (డిగ్రీ స్థాయి) నుంచి 100 ప్రశ్నలు ఇస్తారు. ప్రతి సరైన సమాధానానికి ఒక మార్కు చొప్పున గరిష్ఠ మార్కులు 100.
- ఏఎన్‌ఎం/ఎంపీహెచ్‌ఏ (ఎఫ్)కు మొత్తం 150 మార్కులకు పరీక్ష ఉంటుంది. ఇందులో పేపర్-1లో జనరల్ ఎబిలిటీస్ నుంచి 50 ప్రశ్నలు ఇస్తారు. ప్రతి సరైన సమాధానానికి ఒక మార్కు చొప్పున గరిష్ఠ మార్కులు 50. పేపర్-2లో నర్సింగ్ (ఏఎన్‌ఎం) నుంచి 100 ప్రశ్నలు ఇస్తారు. ప్రతి సరైన సమాధానానికి ఒక మార్కు చొప్పున గరిష్ఠ మార్కులు 100.
- హార్టికల్చర్ ఆఫీసర్- ఇందులో పార్ట్-ఏ కింద 450 మార్కులకు రాతపరీక్ష ఉంటుంది. పేపర్-1లో జనరల్ స్టడీస్ అండ్ జనరల్ ఎబిలిటీస్ నుంచి 150 ప్రశ్నలు 150 మార్కులకు ఇస్తారు. పేపర్-2లో హార్టికల్చర్ (డిగ్రీ స్థాయి) నుంచి 150 ప్రశ్నలు 300 మార్కులకు ఇస్తారు. ఒక్కో పేపర్‌కు 150 నిమిషాల చొప్పున వ్యవధి కేటాయిస్తారు. రాతపరీక్ష అనంతరం పార్ట్-బీ కింద ఇంటర్వ్యూ 50 మార్కులకు ఉంటుంది.
- అసిస్టెంట్ లైబ్రేరియన్- మొత్తం 300 మార్కులకు పరీక్ష ఉంటుంది. ఇందులో పేపర్-1, పేపర్-2ల్లో ఒక్కో దాన్నుంచి 150 చొప్పున 300 ప్రశ్నలు, ప్రతి ప్రశ్నకు ఒక మార్కు చొప్పున మొత్తం 300 మార్కులకు పరీక్ష ఉంటుంది. పరీక్ష వ్యవధి పేపర్-1కు 150 నిమిషాలు, పేపర్-2కు 150 నిమిషాలు.
- **దరఖాస్తు రుసుం:** రూ.280 (అప్లికేషన్ ఫీ-రూ.200+ఎగ్జామినేషన్ ఫీ-రూ.80); మాజీ సైనికోద్యోగ, దివ్యాంగ కేటగిరీలతోపాటు తెలంగాణ రాష్ట్రానికి చెందిన బీసీ, ఎస్సీ, ఎస్టీ, 18-44 ఏళ్ల లోపున్న నిరుద్యోగుల (సంబంధిత పత్రం సమర్పించాలి)కు ఎగ్జామినేషన్ ఫీజు నుంచి మినహాయింపు ఉంది.
- **దరఖాస్తు విధానం:** టీఎస్‌పీఎస్సీ వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్లో.
- **చివరి తేదీ:** ఫిబ్రవరి 28, 2018.
- **వెబ్‌సైట్:** www.tspsc.gov.in

ఎస్‌బీఐలో స్పెషలిస్టు కేడర్

407 ఖాళీలు

స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ).. వెల్త్ మేనేజ్‌మెంట్ విభాగంలోని 407 స్పెషలిస్ట్ కేడర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **పోస్టు-ఖాళీలు:** రిలేషన్‌షిప్ మేనేజర్-168; రిలేషన్‌షిప్ మేనేజర్ (ఇ-వెల్త్)-20; రిలేషన్‌షిప్ మేనేజర్ (ఎన్ఆర్ఐ)-10; రిలేషన్‌షిప్ మేనేజర్ (కార్పొరేట్)-4; అక్విజేషన్ రిలేషన్‌షిప్ మేనేజర్-80; ఇన్వెస్ట్‌మెంట్ కౌన్సిలర్ (ఐసీ)-33; రిలేషన్‌షిప్ మేనేజర్ (టీమ్ లీడ్)-22; కస్టమర్ రిలేషన్‌షిప్ ఎగ్జిక్యూటివ్ (సీఆర్ఈ)-55; సెంట్రల్ రీసెర్చ్ టీమ్ (సీఆర్‌టీ-వీపీ పోర్ట్‌ఫోలియో అనాలిసిస్ అండ్ డేటా అనలిటిక్స్)-1; జోనల్ హెడ్ సేల్స్ (రిటైల్)-2; హెడ్ (ఆపరేషన్స్)-1; కంప్లైన్స్ ఆఫీసర్-1; ప్రాజెక్ట్ డెవలప్‌మెంట్ మేనేజర్-2 (బిజినెస్-1+టెక్నాలజీ-1); మేనేజర్ (బిజినెస్ డెవలప్‌మెంట్)-1; ఇన్వెస్ట్‌మెంట్ అడ్వైజర్ (రిటైల్ అండ్ కార్పొరేట్)-2; సెంట్రల్ ఆపరేషన్స్ (టీమ్ సపోర్ట్)-2; సెంట్రల్ రీసెర్చ్ టీమ్ (సపోర్ట్)-1; జోనల్ హెడ్ (ఇ-వెల్త్)-1; జోనల్ హెడ్/టీమ్ లీడ్ ఎన్ఆర్ఐ-1.
- **వేతనం:** అర్హతలను బట్టి నిబంధనల మేరకు.
- **అర్హతలు:** సంబంధిత పోస్టులు, విభాగాలను బట్టి డిగ్రీ/పీజీ/ఎంబీఏ/పీజీడీఎం/ఎంఎంఎస్/ఎంఈ/ఎంటెక్/బీఈ/బీటెక్. అలాగే నిబంధనల మేర ఉద్యోగానుభవం.
- **వయసు:** 2017, డిసెంబర్ 1 నాటికి అక్విజేషన్ రిలేషన్‌షిప్ మేనేజర్‌కు 22-35 ఏళ్ల లోపు; ఇన్వెస్ట్‌మెంట్ కౌన్సిలర్ (ఐసీ), రిలేషన్‌షిప్ మేనేజర్ (టీమ్ లీడ్), ఇన్వెస్ట్‌మెంట్ అడ్వైజర్‌కు 28-40 ఏళ్ల లోపు; కస్టమర్ రిలేషన్‌షిప్ ఎగ్జిక్యూటివ్ (సీఆర్ఈ)కి 20-35 ఏళ్లు; సెంట్రల్ రీసెర్చ్ టీమ్ (సీఆర్‌టీ-వీపీ పోర్ట్‌ఫోలియో అనాలిసిస్ అండ్ డేటా అనలిటిక్స్), మేనేజర్ (బిజినెస్), సెంట్రల్ ఆపరేషన్స్ (టీమ్ సపోర్ట్)కు 30-40 ఏళ్లు; జోనల్ హెడ్ సేల్స్ (రిటైల్), జోనల్ హెడ్ (ఇ-వెల్త్), జోనల్ హెడ్/టీమ్ లీడ్ ఎన్ఆర్ఐకి 35-50 ఏళ్లు; హెడ్ (ఆపరేషన్స్)కు 35-45 ఏళ్లు; కంప్లైన్స్ ఆఫీసర్, ప్రాజెక్ట్ డెవలప్‌మెంట్ మేనేజర్‌కు 25-40 ఏళ్లు; సెంట్రల్ రీసెర్చ్ టీమ్ సపోర్ట్‌కు 25-35 ఏళ్లు; మిగిలిన పోస్టులకు 23-35 ఏళ్ల లోపు ఉండాలి. రిజర్వేషన్లు వర్తిస్తాయి.
- **ఎంపిక:** షార్ట్ లిస్టింగ్, ఇంటర్వ్యూ.
- **దరఖాస్తు రుసుం:** జనరల్/ఓబీసీ-రూ.600; ఎస్సీ/ఎస్టీ/దివ్యాంగ-రూ.100 (ఇంటిమేషన్ చార్జీలు మాత్రమే).
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్.
- **చివరి తేదీ:** ఫిబ్రవరి 15, 2018.
- **వెబ్‌సైట్:** www.sbi.co.in , bank.sbi

యూపీఎస్సీ

28 ఖాళీలు

యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (యూపీఎస్సీ)... వివిధ కేంద్ర ప్రభుత్వ విభాగాల్లోని 28 ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **పోస్టు-ఖాళీలు:** అసిస్టెంట్ కమిషనర్ (క్రాప్స్)-1; ఏరోనాటికల్ ఆఫీసర్-12; సైంటిస్ట్ 'బి' (మెకానికల్)-2; జూనియర్ సైంటిఫిక్ ఆఫీసర్ (ఎక్స్‌ప్లోజివ్)-2; అసిస్టెంట్ కెమిస్ట్ (మైన్స్)-11.
- **వేతన శ్రేణి:** అసిస్టెంట్ కమిషనర్- రూ.15,600-రూ.39,100; ఏరోనాటికల్ ఆఫీసర్-ఏడో వేతన సంఘం లెవెల్-10 పే మాట్రిక్స్ ప్రకారం; సైంటిస్ట్ 'బీ'-రూ.56,100 -రూ.1,77,500; జూనియర్ సైంటిఫిక్ ఆఫీసర్-రూ.44,900- రూ.1,42,400; అసిస్టెంట్ కెమిస్ట్-రూ.47,600-రూ.1,51,100.
- **అర్హతలు:** సంబంధిత పోస్టులు, విభాగాలను అనుసరించి బ్యాచిలర్ డిగ్రీ/మాస్టర్స్ డిగ్రీ. అలాగే నిబంధనల మేర ఉద్యోగానుభవం ఉండాలి.
- **వయసు:** అసిస్టెంట్ కమిషన్‌కు 40 ఏళ్లు; ఏరోనాటికల్ ఆఫీసర్, సైంటిస్ట్ 'బి'-35 ఏళ్లు; జూనియర్ సైంటిఫిక్ ఆఫీసర్, అసిస్టెంట్ కెమిస్ట్-30 ఏళ్లు మించకూడదు. రిజర్వేషన్లు వర్తిస్తాయి.
- **ఎంపిక:** రాతపరీక్ష, ఇంటర్వ్యూ.
- **దరఖాస్తు రుసుం:** రూ.25; ఎస్సీ/ఎస్టీ/దివ్యాంగ/మహిళ అభ్యర్థులకు ఫీజు లేదు.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్.
- **చివరి తేదీ:** ఫిబ్రవరి 15, 2018.
- **వెబ్‌సైట్:** www.upsconline.nic.in , www.upsc.gov.in

ఏఎస్ఆర్‌బీ సైంటిస్ట్

195 ఖాళీలు

ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ అగ్రికల్చరల్ రీసెర్చ్ (ఐసీఎంఆర్)కు చెందిన అగ్రికల్చరల్ సైంటిస్ట్స్ రిక్రూట్‌మెంట్ బోర్డు (ఏఎస్ఆర్‌బీ).. 195 అగ్రికల్చరల్ సైంటిస్టు ఖాళీల భర్తీకి అగ్రికల్చరల్ రీసెర్చ్ సర్వీస్ (ఏఆర్ఎస్) ఎగ్జామినేషన్-2017 (ప్రిలిమినరీ) ద్వారా దరఖాస్తులు కోరుతోంది.

- **పోస్టు:** అగ్రికల్చరల్ సైంటిస్ట్.
- **వేతనశ్రేణి:** రూ.15,600-రూ.39,100.
- **మొత్తం ఖాళీలు:** 195 (అన్‌రిజర్వ్‌డ్-103, ఓబీసీ-48, ఎస్సీ-23, ఎస్టీ-21).
- **విభాగాల వారీ ఖాళీలు:** అగ్రికల్చరల్ బయోటెక్నాలజీ-6, అగ్రికల్చరల్ ఎంటమాలజీ-1, అగ్రికల్చరల్ మైక్రోబయాలజీ-6, జెనెటిక్ అండ్ ప్లాంట్ బ్రీడింగ్-18, ప్లాంట్ బయోకెమిస్ట్రీ-9, ప్లాంట్ పాథాలజీ-8, ప్లాంట్ ఫిజియోలజీ-3, సీడ్ సైన్స్ అండ్ టెక్నాలజీ-2, యానిమల్ బయోటెక్నాలజీ-2, యానిమల్ జెనెటిక్స్ అండ్ బ్రీడింగ్-4, యానిమల్ ఫిజియాలజీ-2, లైవ్‌స్టాక్ ప్రొడక్షన్ మేనేజ్‌మెంట్-4, వెటర్నరీ మెడిసిన్-1, వెటర్నరీ ఫార్మకాలజీ-1, వెటర్నరీ పబ్లిక్ హెల్త్-1, ఫిషరీస్ రిసోర్స్ మేనేజ్‌మెంట్-6, అగ్రికల్చరల్ కెమికల్స్-5, అగ్రికల్చరల్ మెటియోరాలజీ-1, ఆగ్రోఫారెస్ట్రీ-4, ఆగ్రోనమీ-8, సాయిల్ సైన్సెస్-10, అగ్రికల్చరల్ ఎకనమిక్స్-16, అగ్రికల్చరల్ ఎక్స్‌టెన్షన్-6, అగ్రికల్చరల్ స్టాటిస్టిక్స్-9, ఫార్మ్ మెషినరీ అండ్ పవర్-9, కంప్యూటర్ అప్లికేషన్ అండ్ ఐటీ-22, ల్యాండ్ అండ్ వాటర్ మేనేజ్‌మెంట్ ఇంజనీరింగ్-8, బయోఇన్ఫర్మేటిక్స్-11, అగ్రికల్చరల్ స్ట్రక్చర్ అండ్ ప్రాసెస్ ఇంజనీరింగ్-12.
- **అర్హతలు:** సంబంధిత విభాగాలను బట్టి మాస్టర్స్ డిగ్రీ/తత్సమాన విద్య.
- **వయసు:** 2018, జనవరి 1 నాటికి 21-32 ఏళ్ల లోపు ఉండాలి. రిజర్వేషన్లు వర్తిస్తాయి.
- **ఎంపిక:** ప్రిలిమినరీ ఎగ్జామినేషన్, మెయిన్స్ ఎగ్జామినేషన్, వివా వోస్ ద్వారా.
- **ప్రిలిమినరీ ఎగ్జామినేషన్ విధానం:** దీన్ని 150 మార్కులకు ఆబ్జెక్టివ్ విధానంలో నిర్వహిస్తారు. అభ్యర్థి ఎంచుకున్న సబ్జెక్టు/సబ్జెక్టుల నుంచి ప్రశ్నలు ఉంటాయి. ప్రశ్నపత్రం ఇంగ్లిష్, హిందీల్లో మాత్రమే ఉంటుంది. ప్రతి తప్పు సమాధానానికీ 1/3 వ వంతు మార్కు కోత విధిస్తారు. పరీక్ష వ్యవధి రెండు గంటలు. దీన్ని అర్హత పరీక్షగా పరిగణిస్తారు. ఇందులో అర్హత సాధించిన అభ్యర్థుల జాబితా నుంచి 1:15 నిష్పత్తిలో మెయిన్స్‌కు ఎంపిక చేస్తారు.
- **మెయిన్స్ ఎగ్జామినేషన్ విధానం:** దీన్ని 240 మార్కులకు నిర్వహిస్తారు. ప్రశ్నపత్రంలో ఏ, బీ, సీ అనే మూడు విభాగాలు ఉంటాయి. 'ఏ' లో 40 పశ్నలు ఇస్తారు. ఒక్కో ప్రశ్నకు 10 పదాలకు మించకుండా సమాధానం రాయాలి. ప్రతి సరైన సమాధానానికి 2 మార్కులు కేటాయిస్తారు. 'బీ'లో 20 ప్రశ్నలు ఉంటాయి. ప్రతి ప్రశ్నకు 5 మార్కులు. 'సీ' లో 6 ఎస్సే/డిస్క్రిప్టివ్ టైప్ ప్రశ్నలు ఉంటాయి. ప్రతి ప్రశ్నకు 10 మార్కులు. మెయిన్స్‌లో ఉత్తీర్ణులైన వారి జాబితా నుంచి నుంచి 1:5 నిష్పత్తి (కేటగిరీ ప్రకారం)లో వివా వోస్‌కు ఎంపిక చేస్తారు. ఇందులోనూ ఉత్తీర్ణులైతే తుది ఎంపిక ఉంటుంది.
- **దరఖాస్తు రుసుం:** అన్‌రిజర్వ్‌డ్/ ఓబీసీ-రూ.500; ఎస్సీ/ఎస్టీ/దివ్యాంగ/మహిళ అభ్యర్థులకు ఫీజు లేదు.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్.
- **దరఖాస్తుల స్వీకరణ ప్రారంభం:** ఫిబ్రవరి 6, 2018
- **ముగింపు:** మార్చి 2, 2018.
- **వెబ్‌సైట్:** www.asrb.org.in

యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్

56 ఖాళీలు

హైదరాబాద్‌లోని యూని వర్సిటీ ఆఫ్ హైదరాబాద్ (యూఓహెచ్).. 56 బోధన ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతూ ప్రకటన విడుదల చేసింది.

- **పోస్టులు-ఖాళీలు:** ప్రొఫెసర్-18, అసోసియేట్ ప్రొఫెసర్-20, అసిస్టెంట్ ప్రొఫెసర్-18.
- **వేతనశ్రేణి:** ప్రొఫెసర్, అసోసియేట్ ప్రొఫెసర్-రూ.37,400-రూ.67,000; అసిస్టెంట్ ప్రొఫెసర్-రూ.15,600-రూ.39,100.
- **బోధనాంశాల వారీ ఖాళీలు:** మ్యాథమెటిక్స్ అండ్ స్టాటిస్టిక్స్-11, ఫిజిక్స్-6, కెమిస్ట్రీ-3, యానిమల్ బయాలజీ-1, బయోకెమిస్ట్రీ-3, ఇంజనీరింగ్ సైన్సెస్ అండ్ టెక్నాలజీ-4, హెల్త్ సైకాలజీ-2, ఎకనమిక్స్-6, ఎడ్యుకేషన్-1, ఇంగ్లిష్-1, పొలిటికల్ సైన్స్-4, సోషియాలజీ-3, ఆంత్రోపాలజీ-3, ఫిలాసఫీ-3, ఉర్దూ-2, అప్లైడ్ లింగ్విస్టిక్స్ అండ్ ట్రాన్స్‌లేషన్ స్టడీస్-1, మేనేజ్‌మెంట్ స్టడీస్-2.
- **అర్హతలు:** సంబంధిత పోస్టులు, బోధనాంశాలను అనుసరించి పీహెచ్‌డీ/మాస్టర్స్ డిగ్రీ+పీహెచ్‌డీ/బీఈ/బీటెక్+ఎంఈ/ఎంటెక్/తత్సమాన విద్య. అలాగే నిబంధనల మేరకు బోధనానుభవం, జర్నల్స్ ప్రచురణ, మార్కుల శాతం, నెట్/స్లెట్/సెట్ (అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులకు), అకడమిక్ రికార్డు తదితర అర్హతలుండాలి.
- **ఎంపిక:** ప్రీవియస్ రికార్డ్, ఇంటర్వ్యూ (సెమినార్/కొల్లోక్వియం/..).
- **దరఖాస్తు రుసుం:** రూ.1,000 (జనరల్/ఓబీసీ/థర్డ్ జెండర్); రూ.300 (ఎస్సీ/ఎస్టీ/దివ్యాంగ).
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్లో దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తు హార్డ్‌కాపీ ప్రింటవుట్‌కు సంబంధిత ధ్రువపత్రాల నకళ్లు, ఫొటోలు, డీడీ తదితర అవసరమైన వాటిని జతచేసి 'ది అసిస్టెంట్ రిజిస్ట్రార్ (రిక్రూట్‌మెంట్ సెల్), రూమ్.నెం.221, ఫస్ట్ ఫ్లోర్, అడ్మినిస్ట్రేటివ్ బిల్డింగ్, యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్, ప్రొఫెసర్ సీఆర్.రావ్ రోడ్, సెంట్రల్ యూనివర్సిటీ పీ.వో., గచ్చిబౌలి, హైదరాబాద్-500046, తెలంగాణ' చిరునామాకు పోస్టు/కొరియర్ ద్వారా గడువులోగా చేరేలా పంపాలి.
- **ఆన్‌లైన్ దరఖాస్తుల ప్రారంభం:** ఫిబ్రవరి 1, 2018.
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** మార్చి 5, 2018.
- **హార్డ్‌కాపీ చేరడానికి చివరి తేదీ:** మార్చి 12, 2018.
- **వెబ్‌సైట్:** www.uohyd.ac.in

సతీష్ ధావన్ స్పేస్ సెంటర్

33 ఖాళీలు



శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా శ్రీహరి కోటలోని సతీష్ ధావన్ స్పేస్ సెంటర్ షార్ (ఎస్‌డీఎస్‌సీ-ఎస్‌హెచ్ఏఆర్: షార్).. 33 ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది. షార్.. భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇండియన్ స్పేస్ రీసెర్చ్ ఆర్గనైజేషన్: ఇస్రో)కు చెందింది.

- **పోస్టు-ఖాళీలు:** ఫైర్‌మ్యాన్ 'ఏ'-7; కేటరింగ్ అటెండెంట్ 'ఏ'-17; కుక్-8; హిందీ టైపిస్ట్-1.
- **వేతనశ్రేణి:** ఫైర్‌మ్యాన్ 'ఏ', కుక్-రూ.19,900-రూ.63,200; కేటరింగ్ అటెండెంట్-రూ.18,000-రూ.56,900; హిందీ టైపిస్ట్-రూ.25,500-రూ.81,100.
- **అర్హతలు:** హిందీ టైపిస్ట్‌కు డిగ్రీ (ఆర్ట్స్/సైన్స్/కామర్స్/మేనేజ్‌మెంట్/కంప్యూటర్ అప్లికేషన్స్) ప్రథమశ్రేణిలో ఉత్తీర్ణత. అలాగే పదోతరగతి/డిగ్రీ స్థాయిలో హిందీ ఒక సబ్జెక్టుగా లేదా ఈ రెండు కోర్సుల్లో ఏదో ఒకటి హిందీ మీడియంలో చదివి ఉండాలి. దీంతోపాటు కంప్యూటర్ అంశాలపై పనిచేయగల నైపుణ్యం, హిదీ టైపింగ్ (నిమిషానికి 25 పదాలు కంప్యూటర్లో) ఉండాలి; మిగిలిన పోస్టులకు పదోతరగతి/తత్సమాన విద్యలో ఉత్తీర్ణులై ఉండాలి. కుక్ పోస్టుకు అదనంగా కనీసం ఐదేళ్ల అనుభవం ఉండాలి.
- **శారీరక ప్రమాణాలు (ఫైర్‌మ్యాన్ పోస్టుకు మాత్రమే):** ఎత్తు-కనీసం 165 సెం.మీ.; బరువు-కనీసం 50 కిలోలు, ఛాతీ-81 సెం.మీ. (సాధారణం)-86 (గాలి పీల్చినపుడు) సెం.మీ. ఉండాలి. తగిన దృష్టి, వినికిడి సామర్థ్యం, శారీరక, మానసిక ఆరోగ్యం తప్పనిసరి.
- **దేహ దారుఢ్య పరీక్ష (ఫైర్‌మ్యాన్ పోస్టులకు మాత్రమే):** పరుగు-1500 మీటర్ల దూరాన్ని 5 నిమిషాల 15 సెకన్లలోపు, 100 మీటర్ల దూరాన్ని 13 సెకన్లలోపు పూర్తిచేయాలి. హైజంప్-కనీసం 5 అడుగులు ఎగరగలగాలి. లాంగ్‌జంప్-కనీసం 17 అడుగుల దూరం దూకగలగాలి. షాట్‌పుట్-7.27 (16 ఎల్‌బీఎస్)ని కనీసం 24 అడుగుల దూరం విసరగలగాలి. త్రోయింగ్-క్రికెట్ బాల్‌ను కనీసం 225 అడుగుల దూరం విసరగలగాలి. రోప్ క్లైంబింగ్ (చేతులతో మాత్రమే)-14 అడుగుల ఎత్తు అధిగమించాలి. పుల్అప్స్-10 తీయగలగాలి. వీటిలో ఏవైనా ఐదు అంశాలను అభ్యర్థులు ఎంపిక చేసుకొని ఉత్తీర్ణులు కావాలి.
- **వయసు:** ఫైర్‌మ్యాన్ 'ఏ', కేటరింగ్ అటెండెంట్ 'ఏ' పోస్టులకు 18-25 ఏళ్ల లోపు; కుక్ పోస్టులకు 18-35 ఏళ్ల లోపు; హిందీ టైపిస్ట్‌కు 18-26 ఏళ్ల లోపు ఉండాలి. రిజర్వేషన్లు వర్తిస్తాయి.
- **ఎంపిక:** రాతపరీక్ష/స్కిల్ టెస్ట్.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్.
- **చివరి తేదీ:** ఫిబ్రవరి 16, 2018.
- **వెబ్‌సైట్:** www.shar.gov.in

సాక్షి బిజినెస్

బుధవారం 31-1-2018

WWW.SAKSHIBUSINESS.COM

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు

సెన్సెక్స్	నిఫ్టీ
250 ▼	81 ▼
36,034	11,050

మరిన్ని వార్తలు, స్టాక్ అప్‌డేట్స్ కోసం... www.sakshibusiness.com చూడండి

విదేశీ సూచీలు (రాత్రి రెండు రాత్రి 11.30కి)

సూచీ	విలువ	మార్పు
నాస్‌డాక్	7,410	▼ 57
డోజోన్స్	26,125	▼ 315
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,588	▼ 84
డాక్స్	13,198	▼ 127
షాంఘై	3,488	▼ 35
నికాయ్	23,292	▼ 337

• అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

ఫారెక్స్ రేట్లు రూ. లలో

			• కొనుగోలు	• అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	64.43	64.56
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	90.85	91.03
€	యూరో	ఎస్‌బీఐ	80.05	80.22
¥	జపాన్ ఎన్ (100)	ఎస్‌బీఐ	59.38	59.50
AUS	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	52.35	52.46
S$	సింగపూర్ డాలర్	ఎస్‌బీఐ	49.28	49.38
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	15.40	18.26
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	15.77	18.43
¥	చైనా యువాన్	థామస్‌కుక్	7.12	11.54

హీరో కొత్త బైక్.. 'ఎక్స్‌ట్రీమ్ 200ఆర్'

ధర శ్రేణి రూ.90,000-రూ.1,00,000?



న్యూఢిల్లీ: దేశీ దిగ్గజ టూవీలర్ల తయారీ కంపెనీ 'హీరో మోటొకార్ప్' తాజాగా 'ఎక్స్‌ట్రీమ్ 200ఆర్' పేరిట కొత్త బైక్‌ను మార్కెట్‌లో ఆవిష్కరించింది. దీని ధర రూ.90,000–రూ.1,00,000 శ్రేణిలో ఉండొచ్చని మార్కెట్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. ప్రీమియం విభాగంలో తన స్థానాన్ని మరింత బలోపేతం చేసుకోవాలనే లక్ష్యంతో కంపెనీ ఈ మోడల్‌ను తీసుకువస్తోంది. బీఎస్–4 ప్రమాణాలకు అనువైన 200 సీసీ ఎయిర్ కూల్డ్ ఇంజిన్ కలిగిన ఈ కొత్త బైక్.. ఏప్రిల్‌లో కస్టమర్లకు అందుబాటులోకి రానుంది. 150 సీసీ, ఆపై ప్రీమియం విభాగాలపై ప్రధానంగా దృష్టి కేంద్రీకరించామని, రానున్న రోజుల్లో వీటిల్లో మరిన్ని మోడళ్లను మార్కెట్‌లో ఆవిష్కరిస్తామని హీరో మోటొకార్ప్ హెడ్ (గ్లోబల్ ప్రొడక్ట్స్) మలో లే మాసన్ తెలిపారు. 'ఎక్స్‌ట్రీమ్ 200ఆర్ బైక్ 0–60 కిలోమీటర్ల వేగాన్ని 4.6 సెకన్లలో అందుకుంటుంది. దీని టాప్ స్పీడ్ గంటకు 114 కిలోమీటర్లు. ఇక బైక్ గరిష్ఠ శక్తి 18.4 పీఎస్' అని వివరించారు.

రైతులకు ఎస్‌బీఐ క్రెడిట్ కార్డులు

బ్యాంకు చైర్మన్ రజనీష్ కుమార్



కోల్‌కతా: దేశీ దిగ్గజ ప్రభుత్వ రంగ 'స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా' (ఎస్‌బీఐ) రైతులకు క్రెడిట్ కార్డులను అందించనున్నట్లు ప్రకటించింది. తమ అనుబంధ సంస్థ 'ఎస్‌బీఐ కార్డ్స్ అండ్ పేమెంట్స్ సర్వీసెస్' ద్వారా రైతులకు క్రెడిట్ కార్డులను అందిస్తామని ఎస్‌బీఐ చైర్మన్ రజనీష్ కుమార్ చెప్పారు. మంగళవారమిక్కడ జరిగిన 'ఫామ్ కార్ట్', 'డీలర్ బంధు' యాప్స్ ఆవిష్కరణ కార్యక్రమంలో మాట్లాడారు. 'గుజరాత్, రాజస్తాన్, మధ్యప్రదేశ్ రాష్ట్రాలలో పైలట్ ప్రాతిపదికన ఈ ప్రాజెక్ట్ చేపట్టాం. దీని విజయం ఆధారంగా తర్వాత దేశవ్యాప్త విస్తరణ ఉంటుంది' అని వివరించారు.

కిసాన్ క్రెడిట్ కార్డ్ (కేసీసీ) మాదిరి కాకుండా ఎస్‌బీఐ కార్డులో 40 రోజుల క్రెడిట్ సౌకర్యం అందుబాటులో ఉంటుందని రజనీష్ తెలిపారు. ఇతర ఎస్‌బీఐ కార్డులలాగే వీటిల్లోనూ వడ్డీ రేట్లు సాధారణంగా ఉంటాయని పేర్కొన్నారు. అయితే రైతులు నిర్ణీత కాలంలో చెల్లించాల్సిన మొత్తాన్ని కట్టలేకపోతే సంస్థ వసూలు చేసే పెనాల్టీలు ఇతర ఎస్‌బీఐ కార్డుల కన్నా చాలా తక్కువగా ఉంటాయన్నారు. ఇక రైతులు వారి కార్డులోని క్రెడిట్ లిమిట్‌లో 20 శాతాన్ని కన్స్యూమర్ ప్రొడక్టుల కొనుగోలుకు వెచ్చించవచ్చని పేర్కొన్నారు. మిగిలిన బ్యాలెన్స్‌తో అగ్రికల్చర్ ఇన్‌పుట్స్‌ను కొనుగోలు చేయాల్సి ఉంటుందన్నారు. మరోవైపు వ్యవసాయ రంగంలో ఈ– కామర్స్ వినియోగం పెరగాల్సి ఉందని అభిప్రాయపడ్డారు.

ఓలా విదేశీ జర్నీ

- త్వరలో ఆస్ట్రేలియా మార్కెట్‌లోకి
- ఉబెర్‌కు పోటీగా కార్యకలాపాలు



న్యూఢిల్లీ: ట్యాక్సీ సర్వీసుల దేశీ దిగ్గజం ఓలా... విదేశీ మార్కెట్లకు కూడా కార్యకలాపాలు విస్తరిస్తోంది. త్వరలో ఆస్ట్రేలియాలోనూ సర్వీసులు ప్రారంభించనుంది. ఇందులో భాగంగా.. ప్రస్తుతం సిడ్నీ, మెల్‌బోర్న్, పెర్త్ నగరాల్లో ప్రైవేట్ వాహనదారులను తమ ప్లాట్‌ఫాంపై నమోదు చేసే ప్రక్రియ కొనసాగుతున్నట్లు ఓలా ఒక ప్రకటనలో తెలియజేసింది. ఈ ఏడాది తొలినాళ్లలోనే ఆస్ట్రేలియాలో సేవలు ప్రారంభించాలని యోచిస్తున్నట్లు సంస్థ సహ వ్యవస్థాపకుడు, సీఈవో భవీష్ అగర్వాల్ తెలిపారు. డ్రైవర్ పార్ట్‌నర్స్‌కి ప్రాధాన్యమిస్తూ.. మెరుగైన ట్యాక్సీ సేవలను అందుబాటు ధరల్లో అందించాలనే లక్ష్యంతో పనిచేస్తున్నట్లు ఆయన చెప్పారు. నియంత్రణ సంస్థల నుంచి అనుమతులన్నీ లభించిన తర్వాత వ్యాపార కార్యకలాపాలను ప్రకటించనున్నట్లు తెలియజేశారు. ఆస్ట్రేలియా మార్కెట్లో అమెరికన్ దిగ్గజం ఉబెర్‌తో ఓలా పోటీపడనుంది. ఈ రెండు సంస్థల మధ్య ఇప్పటికే భారత మార్కెట్లో తీవ్రమైన పోటీ నడుస్తోంది. ఆస్ట్రేలియాలో ఉబెర్ 2012లో కార్యకలాపాలు ప్రారంభించింది. సిడ్నీ, మెల్‌బోర్న్, బ్రిస్బేన్, అడిలైడ్, పెర్త్, కాన్‌బెరా వంటి 19 ప్రధాన నగరాల్లో సేవలు అందిస్తోంది. మరోవైపు, 2011లో ప్రారంభమైన ఓలా... ప్రస్తుతం దేశీయంగా 110 నగరాల్లో ట్యాక్సీ సర్వీసులు అందిస్తోంది.

మధ్య తరగతి 'టేకాఫ్'

- దేశీ ప్రయాణికుల్లో ఏటా 15–25 శాతం వృద్ధి
- చైనా, అమెరికా సైతం వృద్ధిలో దిగువనే
- టాప్–3 మార్కెట్‌గా అవతరించిన భారత్
- 'ఉడాన్'తో పరిశ్రమకు కొత్త రెక్కలు
- మరో 60 నగరాల అనుసంధానం





హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: సమయం కలిసొస్తుంది! అందుబాటు ధరలూ ఉన్నాయి! ఇవే ఇపుడు విమాన ప్రయాణానికి ఇంధనంలా పనిచేస్తున్నాయి. ఈ ఏడాది దేశీయంగా విమాన ప్రయాణికుల సంఖ్య ఏకంగా 25% పెరిగి... 13 కోట్లకు చేరుతుందని విమానయాన శాఖ అంచనా వేస్తుండటం పరిశ్రమ పరుగుకు నిదర్శనం. ఒక దేశంలో అమ్ముడవుతున్న టికెట్ల పరంగా చూసినపుడు భారత్ టాప్–3లో నిలవటమే కాదు.. వేగంగా వృద్ధి చెందుతున్న మార్కెట్‌గా, వృద్ధిలో అమెరికా, చైనాలనూ తలదన్నిందని 'ఆర్థిక సర్వే'నే వెల్లడించింది.

ఆంక్షలు లేకుంటే..

దేశీయంగా సరే!! అంతర్జాతీయ సర్వీసుల విషయంలో అమలు చేస్తున్న ద్వైపాక్షిక ఆంక్షలను ప్రభుత్వం ఎత్తివేస్తే ట్రాఫిక్ వృద్ధి వచ్చే 3–5 ఏళ్ల ఏటా 15 శాతం దాటేస్తుందనే అంచనాలున్నాయి. ఈ ఆర్థిక సంవత్సరంలో అంతర్జాతీయ ప్రయాణికులు 12 శాతం వృద్ధితో 6.5 కోట్లకు చేరవచ్చని, 2018–19లో 7.5 కోట్లను తాకవచ్చని అంచనాలున్నాయి. అంతేకాదు! 2018లో కనీసం మూడు భారతీయ సంస్థలు అంతర్జాతీయ సర్వీసులను ప్రారంభిస్తాయని తెలుస్తోంది. ''మన ఏవియేషన్ పరిశ్రమలో సంస్కరణలకు డీజీసీఏనే ప్రధాన అడ్డంకి. ఎందుకంటే డీజీసీఏ వద్ద వనరులు, నైపుణ్యం లేవు. యూకే మాదిరి భారత్‌లో స్వయం ప్రతిపత్తి కలిగిన సివిల్ ఏవియేషన్ అథారిటీ ఉండాలి'' అని విమానయాన రంగ రీసెర్చ్ దిగ్గజం 'కాపా' దక్షిణాసియా సీఈవో కపిల్ కౌల్ ఘాటుగా వ్యాఖ్యానించారు. విమాన ఇంధన ధరలతో వృద్ధి స్వల్పంగా తగ్గే అవకాశం ఉందని బోయింగ్ కమర్షియల్ ఎయిర్‌ప్లేన్స్ ఆసియా పసిఫిక్, ఇండియా సీనియర్ వైస్ ప్రెసిడెంట్ దినేశ్ కేస్కర్ తెలియజేశారు.

దేశీయంగా పథకాల తోడు...

దేశీయ ప్రయాణాల్లో వృద్ధికి కేంద్రం ప్రవేశపెడుతున్న పథకాలూ కలిసొస్తున్నాయి. చిన్న పట్టణాలకు విమాన సౌకర్యం కలిగించేందుకు ఉద్దేశించిన 'ఉడాన్' పథకంలో భాగంగా ఇపుడు 17 చిన్న నగరాలకు విమానాలు తిరుగుతున్నాయి. ట్రూజెట్, ఎయిర్ ఇండియా, ఎయిర్ డెక్కన్, స్పైస్‌జెట్ ఈ పథకం కింద సర్వీసులు నడుపుతుండగా... త్వరలో జెట్ ఎయిర్‌వేస్, ఇండిగో, ఎయిర్ ఒడిశా పోటీకి రానున్నాయి. 2018లో కొత్తగా 60 నగరాల్లోకి తొలిసారి విమానాలు ల్యాండ్ కానున్నాయి. హైదరాబాద్‌కు చెందిన ట్రూజెట్... ఉడాన్ స్కీమ్ కింద నాలుగు నగరాల్లో సర్వీసులు నడుపుతోంది. ఈ ఏడాది మరో ఆరు నగరాల్లోకి అడుగు పెడతామని ట్రూజెట్‌ను ప్రమోట్ చేస్తున్న టర్బో మేఘా ఎయిర్‌వేస్ కమర్షియల్ హెడ్ సెంథిల్ రాజా 'సాక్షి' బిజినెస్ బ్యూరో ప్రతినిధికి చెప్పారు. ''ఉడాన్ రెండో దశలో మాకు కొత్తగా 20 రూట్లు దక్కాయి. కాండ్లా, అహ్మదాబాద్, పోర్‌బందర్, జైసల్మేర్, నాసిక్, జల్గావ్, గువాహటి, కూచ్‌బిహార్, తేజు, రూప్సి నగరాల మధ్య ఈ సర్వీసులుంటాయి'' అని తెలియజేశారు. ఇదే పథకం కింద నిరుపయోగంగా, పరిమిత సర్వీసులు నడుస్తున్న 50 విమానాశ్రయాలు, ఎయిర్‌స్ట్రిప్స్ పునరుద్ధరణకు కేంద్రం రూ.4,500 కోట్లు ఖర్చు చేస్తోంది. పునరుద్ధరణ పనులు ఈ ఏడాది డిసెంబరు చివరినాటికి పూర్తి కానున్నాయి. ఉడాన్ రెండో దశలో 17 విమాన సంస్థల నుంచి 502 కొత్త రూట్లలో సర్వీసులు నడిపేందుకు ప్రతిపాదనలు వచ్చాయి. ఇది కార్యరూపంలోకి వస్తే 126 విమానాశ్రయాలు, హెలిప్యాడ్స్ అనుసంధానమవుతాయి. మరోవంక 'దిశ' కార్యక్రమం కింద విమానాశ్రయాల్లో మెరుగైన సేవలకు ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా రూ.17,500 కోట్లతో ప్రణాళిక సైతం సిద్ధం చేసింది.

దేశీయ ప్రయాణికుల్లో వృద్ధి (శాతాల్లో)

	2016–17	2017–18	2018–19
భారత్	23.5	25 (అంచనా)	16(అంచనా)
అమెరికా	3.3	–	–
చైనా	10.7	–	–

జతకూడనున్న విమానాలు..

విమానయాన అభివృద్ధి నేపథ్యంలో... దేశీయంగా కొత్త నగరాల్లో అడుగు పెట్టడం, సర్వీసుల పెంపు, విదేశాలకు విస్తరించటం వంటివి జోరందుకున్నాయి. దీన్లో భాగంగా వచ్చే ఆర్థిక సంవత్సరంలో భారత్‌లోకి 124 నుంచి 130 కొత్త విమానాలు రావచ్చని సమాచారం. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే ఇది 25 శాతం అధికం. వీటిలో 25 విమానాలు అంతర్జాతీయ కార్యకలాపాలకు ఉద్దేశించినవి. అలాగే ఉడాన్ స్కీమ్ కోసం 22 దాకా విమానాలుంటాయని తెలిసింది. వచ్చే 20 ఏళ్లలో భారత్‌కు 290 బిలియన్ డాలర్ల విలువైన 2,100 విమానాలు కొత్తగా వచ్చి చేరతాయని బోయింగ్ కంపెనీ చెబుతోంది.

ఎయిరిండియాను కొనేంత పెద్దోళ్లం కాదు

స్పైస్‌జెట్ చైర్మన్ అజయ్ సింగ్ వ్యాఖ్య



ముంబై: ప్రభుత్వ రంగ విమానయాన దిగ్గజం ఎయిరిండియా కొనుగోలు రేసులో తాము లేమని చౌక చార్జీల విమానయాన సంస్థ స్పైస్‌జెట్ చైర్మన్ అజయ్ సింగ్ స్పష్టం చేశారు. తమది చాలా చిన్న సంస్థ అని.. ఎయిరిండియా లాంటి దిగ్గజాన్ని కొనేంత స్థాయి లేదని ఆయన వ్యాఖ్యానించారు. 'ఎయిరిండియా జాతి సంపదలాంటిది. దాన్ని కొనుగోలు చేసేందుకు టాటా– విస్తారా, జెట్ ఎయిర్‌వేస్ లాంటి పెద్ద కంపెనీలున్నాయి. మాది చాలా చిన్న కంపెనీ. అంత భారీ సంస్థ కొనుగోలుకు బిడ్ చేసే స్థాయి మాకు లేదు' అని విమానయాన రంగ కన్సల్టెన్సీ కాపా ఏర్పాటు చేసిన వార్షిక ఏవియేషన్ సదస్సులో పాల్గొన్న సందర్భంగా అజయ్ సింగ్ పేర్కొన్నారు. ఎయిరిండియా ప్రైవేటీకరణ అంశాన్ని తాము కూడా మదింపు చేయాలనుకుంటున్నట్లు ఇటీవలే వెల్లడించిన అజయ్ సింగ్ తాజాగా అందుకు భిన్నంగా మాట్లాడటం గమనార్హం. టాటాల సారథ్యంలోని విస్తారా, జెట్ ఎయిర్‌వేస్, ఇండిగో, స్పైస్‌జెట్ సంస్థలు ఎయిరిండియా కొనుగోలు రేసులో పోటీ పడుతున్నాయంటూ కాపా వెల్లడించిన వేదికపైనే అజయ్ సింగ్ తాజా వివరణ ఇవ్వడం ప్రాధాన్యం సంతరించుకుంది. ఈ నాలుగు కంపెనీలతో పాటు రెండు విదేశీ విమానయానేతర సంస్థలు కూడా బరిలో ఉన్నాయని కాపా ఒక నివేదికలో పేర్కొంది. ఎయిరిండియా ప్రైవేటీకరణకు సంబంధించి వచ్చే నెల మధ్యలో బిడ్లను ఆహ్వానించవచ్చని, విక్రయ ప్రక్రియ జూలై నాటికల్లా పూర్తి కావొచ్చని కాపా భారత విభాగం హెడ్ కపిల్ కౌల్ అభిప్రాయపడ్డారు.

కాల్ డ్రాప్స్ కట్టడికి టెల్కోల 74,000 కోట్లు!!

టెలికం కార్యదర్శి అరుణ సుందరరాజన్



న్యూఢిల్లీ: టెలికం కంపెనీలు కాల్ డ్రాప్స్ సమస్య పరిష్కారానికి భారీ పెట్టుబడులు పెట్టడానికి సిద్ధమయ్యాయి. భారతీ ఎయిర్‌టెల్, రిలయన్స్ జియో సహా ఇతర టెలికం కంపెనీలు రూ.74,000 కోట్లకు పైగా ఇన్వెస్ట్‌మెంట్లతో వాటి ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌ను అప్‌గ్రేడ్ చేసుకోనున్నాయని టెలికం కార్యదర్శి అరుణ సుందరరాజన్ తెలిపారు. ఆమె మంగళవారమిక్కడ టెలికం కంపెనీల సీనియర్ అధికారులతో సమావేశమైన అనంతరం మీడియాతో మాట్లాడారు. టెల్కోలు ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అప్‌గ్రేడ్, విస్తరణతో కాల్ డ్రాప్స్ సమస్యను అధిగమించడానికి ప్రయత్నిస్తున్నాయని పేర్కొన్నారు. టెలికం ఆపరేటర్లు మొబైల్ టవర్ల ఏర్పాటుకు స్థలం లభ్యత కష్టంగా మారడం సహా పలు ఇతర సమస్యలు ఎదురొతున్నట్లు పేర్కొన్న విషయం తెలిసిందే. 'భారతీ ఎయిర్‌టెల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌పై రూ.16,000 కోట్లు పెట్టుబడులు పెట్టింది. మరో రూ.24,000 కోట్లు ఇన్వెస్ట్ చేయనుంది. ఇక జియో వచ్చే ఆర్థిక సంవత్సరంలో లక్ష టవర్ల ఏర్పాటుకు రూ.50,000 కోట్లు ఇన్వెస్ట్ చేయనుంది' అని సుందరరాజన్ వివరించారు. ఇక ఐడియా, వొడాఫోన్ కంపెనీలు కూడా వాటి మొబైల్ టవర్ల పెంపునకు కట్టుబడి ఉన్నాయని తెలిపారు.

ఓబీసీ నష్టాలు రూ.1,985 కోట్లు

మొండి, కేటాయింపుల ప్రభావం



న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగ ఓరియంటల్ బ్యాంక్ ఆఫ్ కామర్స్(ఓబీసీ) నికర నష్టాలు ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసిక కాలంలో మరింతగా పెరిగాయి. గత క్యూ3లో రూ.130 కోట్లుగా ఉన్న నికర నష్టాలు ఈ క్యూ3లో రూ.1,985 కోట్లకు పెరిగాయని ఓబీసీ తెలిపింది. మొండి బకాయిలు పెరగడం, వీటికి కేటాయింపులు పెంచడం వల్ల నికర నష్టాలు బాగా పెరిగాయని తెలిపింది. మొత్తం ఆదాయం రూ.5,416 కోట్ల నుంచి రూ.4,699 కోట్లకు తగ్గింది.

సీక్వెన్షియల్‌గా తగ్గిన కేటాయింపులు..: గత క్యూ3లో రూ.1,430 కోట్లుగా ఉన్న మొండి బకాయిలకు కేటాయింపులు ఈ క్యూ3లో రూ.2,340 కోట్లకు ఎగిశాయి. అయితే సీక్వెన్షియల్‌గా చూసినపుడు మాత్రం ఈ కేటాయింపులు తగ్గాయి. ఈ క్యూ2లో మొండి బకాయిలు కేటాయింపులు రూ.3,147 కోట్లుగా ఉన్నాయి. స్థూల మొండి బకాయిలు రూ.20,492 కోట్ల నుంచి రూ.27,551 కోట్లకు. నికర మొండి బకాయిలు రూ.13,688 కోట్ల నుంచి రూ.14,195 కోట్లకు పెరిగాయని బ్యాంకు తెలిపింది. శాతం పరంగా చూస్తే, స్థూల మొండి బకాయిలు 13.80 శాతం నుంచి 16.95 శాతానికి పెరగ్గా, నికర మొండి బకాయిలు మాత్రం 9.68 శాతం నుంచి 9.52 శాతానికి తగ్గాయని పేర్కొంది. ఆర్థిక ఫలితాలు అధ్వానంగా ఉండటంతో బీఎస్‌ఈలో ఓబీసీ షేర్ 2.4 శాతం తగ్గి రూ.117 వద్ద ముగిసింది.

ఐఓసీ బోనస్ బొనాంజా

- రెండు రెట్లు పెరిగిన నికర లాభం
- ప్రతి షేరుకూ మరో షేరు బోనస్
- షేర్‌కు రూ.19 మధ్యంతర డివిడెండ్
- ఐవోసీ చైర్మన్ సంజీవ్ సింగ్ వెల్లడి



న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగ ఆయిల్ మార్కెటింగ్ కంపెనీ, ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్(ఐవోసీ) నికర లాభం ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసిక కాలంలో ఏకంగా రెండు రెట్లు పెరిగింది. స్టాండ్ అలోన్ ప్రాతిపదికన గత క్యూ3లో రూ.3,995 కోట్లుగా ఉన్న నికర లాభం... ఈ క్యూ3లో రూ.7,883 కోట్లకు పెరిగినట్లు ఐవోసీ తెలియజేసింది. ఇన్వెంటరీ లాభాలతో పాటు రిఫైనరీ మార్జిన్ కూడా పెరగడం వల్ల నికర లాభం ఈ స్థాయిలో వృద్ధి చెందినట్లు కంపెనీ చైర్మన్ సంజీవ్ సింగ్ చెప్పారు. రూ.10 ముఖ విలువ గల ఒక్కో షేర్‌కు అంతే ముఖ విలువ గల ఒక షేర్‌ను బోనస్‌గా (1:1) ఇవ్వడానికి కంపెనీ డైరెక్టర్ల బోర్డ్ ఆమోదం తెలిపిందని, ఈ బోనస్ షేర్ల జారీకి వాటాదారుల ఆమోదం పొందాల్సి ఉందని వెల్లడించారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి గాను ఒక్కో షేర్‌కు రూ.19 చొప్పున (190 శాతం) మధ్యంతర డివిడెండ్‌ను చెల్లిస్తామని, ఈ డివిడెండ్ చెల్లింపునకు అర్హులైన వాటాదారుల్ని నిర్ణయించడానికి వచ్చేనెల 9వ తేదీని రికార్డు తేదీగా నిర్ణయించామని తెలియజేశారు. వచ్చే నెల 28 లోపు వాటాదారుల ఖాతాల్లోకి డివిడెండ్ చేరుతుందన్నారు.

12 డాలర్లకు పెరిగిన జీఆర్ఎమ్..

ఒక్కో బ్యారెల్ ముడి చమురును ఇంధనంగా మార్చడం వల్ల వచ్చే స్థూల రిఫైనరీ మార్జిన్ (జీఆర్ఎమ్) 7.67 డాలర్ల నుంచి 12.32 డాలర్లకు పెరిగినట్లు సింగ్ వివరించారు. గత క్యూ3లో రూ.3,051 కోట్లుగా ఉన్న ఇన్వెంటరీ లాభాలు ఈ క్యూ3లో రూ.6,301 కోట్లకు పెరిగాయన్నారు. ఈ క్యూ2లో రూ.90,567 కోట్లుగా ఉన్న నిర్వహణ ఆదాయం ఈ క్యూ3లో 22 శాతం వృద్ధితో రూ.1.1 లక్షల కోట్లకు పెరిగిందని, క్వార్టర్ ఆన్ క్వార్టర్ ప్రాతిపదికన నిర్వహణ లాభం 80 శాతం వృద్ధి చెంది రూ.12,269 కోట్లకు ఎగిసినట్లు వివరించారు.

జీఎస్‌టీ ఎఫెక్ట్..రూ.700 కోట్ల ప్రభావం

జీఎస్‌టీ పరిధిలో పెట్రోల్ లేనందున తమ మొత్తం ఆదాయంపై రూ.700 కోట్ల మేర ప్రభావం పడిందని ఐవోసీ డైరెక్టర్ (ఫైనాన్స్) ఎ.కె. శర్మ చెప్పారు. ముడి పదార్థాలపై జీఎస్‌టీని చెల్లిస్తున్నామని, కానీ ఈ పన్నులను తుది ఉత్పత్తిపై భర్తీ చేసుకోలేకపోతున్నామని చెప్పారాయన. ఈ భారం వార్షికంగా రూ.2,000 కోట్ల మేర ఉండొచ్చన్నారు. కాగా ఫలితాలు అంచనాలను మించడం, డివిడెండ్ చెల్లింపు, బోనస్ షేర్ల జారీ వంటి సానుకూలాంశాల కారణంగా బీఎస్‌ఈలో ఐఓసీ షేర్ 4% లాభంతో రూ.416 వద్ద ముగిసింది.

ప్రపంచ మార్కెట్ల స్థాయికి పెట్రో ధరలు

భారత్‌లో పెట్రోల్, డీజిల్ ధరలు దాదాపు అంతర్జాతీయ మార్కెట్‌లోని ధరల స్థాయికి సమానంగా ఉన్నాయని ఐవోసీ చైర్మన్ సంజీవ్ సింగ్ చెప్పారు. 15 రోజుల అంతర్జాతీయ ధరల సగటు ఆధారంగా రోజూ పెట్రోల్, డీజిల్ ధరలను సవరిస్తున్నామని తెలిపారు. డిసెంబర్‌లో తొలి పదిహేను రోజుల్లో పెట్రోల్, డీజిల్ ఇంధన ధరలను రోజుకు 1–3 పైసల రేంజ్‌లో ఐవోసీ వంటి ప్రభుత్వ రంగ ఆయిల్ మార్కెటింగ్ సంస్థలు తగ్గించాయి. గుజరాత్ ఎన్నికల్లో పోలింగ్ ముగిసిన డిసెంబర్ 14 తర్వాత పెట్రోల్, డీజిల్ ధరలు పెరగడం ప్రారంభమైంది.

ఆందోళనకర స్థాయిలో షేర్ల ధరలు

వృద్ధి దన్ను లేకుంటే భారీ పతనానికి చాన్స్ ● ఆర్థిక సలహాదారు అరవింద్ సుబ్రమణియన్



న్యూఢిల్లీ: స్టాక్స్ ధరలు భారీ స్థాయిలో పెరిగిపోవడం ఆందోళనకరమని కేంద్ర ప్రభుత్వ ప్రధాన ఆర్థిక సలహాదారు అరవింద్ సుబ్రమణియన్ వ్యాఖ్యానించారు. ఈ నేపథ్యంలో మరింత అప్రమత్తత అవసరమని, తగినంత స్థాయిలో వృద్ధి దన్ను లేకపోతే... షేర్ల ధరలు భారీ పతనానికి గురికావచ్చని హెచ్చరించారు. 2016–17లో 7.1 శాతంగా ఉన్న వృద్ధి రేటు ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 6.75 శాతానికి మందగించవచ్చన్న అంచనాలున్నట్లు అరవింద్ పేర్కొన్నారు. భారత్, అమెరికా ఆర్థిక వ్యవస్థలు భిన్న విధానాలను అనుసరిస్తున్నప్పటికీ... ఈ మధ్య కాలంలో రెండు దేశాల స్టాక్ మార్కెట్స్‌కి సంబంధించి ధర– రాబడుల నిష్పత్తి దాదాపు ఒకే స్థాయికి చేరిందని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ వేల్యుయేషన్స్‌ని నిలబెట్టుకోవాలంటే అందుకు తగ్గట్లుగా వృద్ధి సాధించడంతో పాటు అంచనాలకు అనుగుణంగా కంపెనీల ఆదాయాలు కూడా ఉండాలన్నారు. లేని పక్షంలో కరెక్షన్‌కి లోనయ్యే అవకాశాలను తోసిపుచ్చలేమని చెప్పారాయన. ప్రస్తుత పరిస్థితుల్లో పోర్ట్‌ఫోలియోను ఎప్పటికప్పుడు సవరించుకోవాల్సిన అవసరం ఉందని అరవింద్ పేర్కొన్నారు.

గత రెండు ఆర్థిక సంవత్సరాల్లో మిగతా దేశాలతో పోలిస్తే భారత స్టాక్ మార్కెట్లు భారీగా ఎగిశాయి. 2015 డిసెంబర్ ఆఖరు నుంచి చూస్తే రూపాయి మారకంలో నిఫ్టీ 45%, సెన్సెక్స్ 46% పెరిగాయి. అమెరికాతో పోలిస్తే భారత్‌లో స్టాక్‌మార్కెట్ బూమ్ చాలా భిన్నమైనదని అరవింద్ పేర్కొన్నారు. కంపెనీల లాభాలు మెరుగ్గా ఉంటాయన్న అంచనాలు, పోర్ట్‌ఫోలియోలో బంగారం... రియల్టీ కాకుండా ఈక్విటీలకు కేటాయింపులు భారీగా పెరగడం, వడ్డీ రేట్లు వంటి అంశాలు దేశీ స్టాక్ మార్కెట్ బూమ్‌కి కారణమని చెప్పారు. ఈ సందర్భంలో మరింత అప్రమత్తంగా వ్యవహరించాల్సి ఉంటుందన్నారు.

న్యాయ సంస్కరణలకు పెద్దపీట

ఆర్థికంగా స్త్రీ, పురుషుల్లో సమానత్వానికి చర్యలు, శాస్త్ర,సాంకేతిక అభివృద్ధిపై దృష్టి, న్యాయ సంస్కరణల ఆవశ్యకత వంటి అంశాలు ఆర్థిక సర్వేలో ఈ దఫా పేర్కొనదగిన ప్రత్యేక అంశాలన్నారు. న్యాయ వ్యవస్థలో సంస్కరణల జోలికి వెళ్లే సాహసం చేయవద్దని కుటుంబ సభ్యులు, స్నేహితులు సూచించినప్పటికీ, ఈ విషయంలో విప్లవాత్మక అంశాలు, సూచనలను సర్వేలో జోడించినట్లు తెలిపారు.

ఎస్‌బీఐ బల్క్ డిపాజిట్లపై వడ్డీ పెంపు!

75 నుంచి 140 బేసిస్ పాయింట్ల పెరుగుదల



ముంబై: బ్యాంకింగ్ దిగ్గజం– స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) రూ.కోటి పైబడిన బల్క్ డిపాజిట్లపై వడ్డీరేటును మంగళవారం పెంచింది. 75 నుంచి 140 బేసిస్ పాయింట్ల (100 బేసిస్ పాయింట్లు ఒక శాతం) మేర పెంచామని, తక్షణం ఈ పెంపు అమల్లోకి వస్తుందని బ్యాంకు ఒక ప్రకటనలో తెలిపింది. గతేడాది నవంబర్‌లో కూడా ఎస్‌బీఐ ఈ తరహా నిర్ణయాన్ని తీసుకుంది. ఆ నెల్లో కోటి, ఆపైబడిన డిపాజిట్లపై వడ్డీరేటును ఒక శాతం పెంచింది.

- తాజా మార్పులతో స్వల్పకాల బల్క్ డిపాజిట్ (46–179 రోజులు అలాగే 180– 210 రోజులు) రేటు 4.85 నుంచి 6.25 శాతానికి చేరింది.
- ఏడాది నుంచి రెండేళ్ల రేటు 5.25 శాతం నుంచి 6.25 శాతానికి పెరుగుతుంది.
- రెండు నుంచి పదేళ్ల కాలానికి డిపాజిట్ రేటు 5.25 శాతం నుంచి 6 శాతానికి పెరుగుతుంది.



నిత్యావసరాల ధరలు (హోల్‌సేల్/క్వింటాల్‌కు)

పత్తి (వరంగల్, (వ్యాపారస్తులు)) రూ.4,450 (కనిష్టం) రూ.4,780 (గరిష్టం)



మిర్చి (వరంగల్, తేజ) రూ.6,000 (కనిష్టం) రూ.10,500 (గరిష్టం)



పసుపు (నిజామాబాద్, కొమ్ము) -- --



ఉల్లి (కర్నూలు) -- --




చక్కెర (చెన్నై) రూ.3,500



బియ్యం (కరీంనగర్) 3,800 (హెచ్‌ఎంటీ)



కందిపప్పు (చెన్నై) రూ.7,200



సుబాబులు (కృష్ణా) రూ.4,400 (టన్నుకు)



ఆయిల్ పామ్ (పశ్చిమ గోదావరి) --



బులియన్ రూ.లలో

ముంబై			
బంగారం (99.9, 10గ్రా)	30,455	▲	70
బంగారం (99.5, 10గ్రా)	30,305	▲	70
వెండి (కిలో)	39,190	▼	195
చెన్నై			
బంగారం (24 క్యారెట్లు)	– –		
బంగారం (22 క్యారెట్లు)	28,920	▼	30
వెండి (కిలో)	--		
హైదరాబాద్			
బంగారం (24 క్యారెట్లు)	30,370	▼	30
బంగారం (22 క్యారెట్లు)	28,920	▼	30
వెండి (కిలో)	42,100	▼	500
ప్రొద్దుటూరు			
బంగారం (24 క్యారెట్లు)	30,780	▼	290
బంగారం (22 క్యారెట్లు)	28,520	▼	300
వెండి (కిలో)	40,200	▼	500
విశాఖపట్నం			
బంగారం(24 క్యారెట్లు)	31,610		0
బంగారం (22 క్యారెట్లు)	28,980		0
వెండి (కిలో)	41,000		0
విజయవాడ			
బంగారం (24 క్యారెట్లు)	31,400	▲	150
బంగారం (22 క్యారెట్లు)	28,800	▼	100
వెండి(కిలో)	41,500	▲	700
ఏపీ బులియన్ అసోసియేషన్			
బంగారం (24 క్యారెట్లు)	31,300		0
బంగారం (22 క్యారెట్లు)	28,920	▼	30
వెండి (కిలో)	40,100	▼	500

గమనిక: గిట్టుబాటు, నిల్వ, పోటీ వంటి పలు అంశాల ప్రాతిపదికన షాపుల మధ్య పసిడి ధరల్లో కొంత వ్యత్యాసం ఉండవచ్చు.

కోడిగుడ్లు (హోల్‌సేల్ -నెక్ /100కు రూ.లలో) 31-1-2018

విశాఖ	382–00
చిత్తూరు	383–00
వరంగల్	362–00
ముంబై	415–00
చెన్నై	390–00
విజయవాడ	372–00
గోదావరి	372–00
నమక్కల్	375–00
30–1–2018 ఫామ్ ధర...	
హైదరాబాద్	360–00
రిటైల్ (ఒక గుడ్డుకు)	4.20

బడ్జెట్‌కు 'ముందు' జాగ్రత్త

- బలహీనంగా అంతర్జాతీయ సంకేతాలు
- 250 పాయింట్ల నష్టంతో 36,034కు సెన్సెక్స్
- 81 పాయింట్లు పడిపోయి 11,050కు నిఫ్టీ



స్టాక్ సూచీలు శిఖర స్థాయిలకు ఎగసిన నేపథ్యంలో మంగళవారం లాభాల స్వీకరణ చోటు చేసుకుంది. అంతర్జాతీయ సంకేతాలు ప్రతికూలంగా ఉండడం కూడా తోడవడంతో స్టాక్ మార్కెట్ నష్టాల్లో ముగిసింది. బీఎస్‌ఈ సెన్సెక్స్ 250 పాయింట్ల నష్టంతో 36,034 పాయింట్ల వద్ద, నిఫ్టీ 81 పాయింట్ల నష్టంతో 11,050 పాయింట్ల వద్ద ముగిశాయి. మరో రెండు రోజుల్లో బడ్జెట్ రానున్నందున ఇన్వెస్టర్లు లాభాల స్వీకరణ జరిపారని, తాజా పొజిషన్లు తీసుకోలేదని నిపుణులు పేర్కొన్నారు. ఇంట్రాడేలో సెన్సెక్స్ 290 పాయింట్ల దాకా నష్టపోయింది.

ప్రపంచ మార్కెట్ల పతనం...: టెక్నాలజీ దిగ్గజం యాపిల్ షేర్లలో అమ్మకాలు వెల్లువెత్తిన కారణంగా అమెరికా మార్కెట్ సోమవారం నష్టపోయింది. ఈ ప్రభావంతో ఆసియా మార్కెట్లు కూడా పతనం కావడం, యూరప్ మార్కెట్లు నష్టాల్లో ఆరంభం కావటం... మన మార్కెట్‌పై ప్రతికూల ప్రభావం చూపించాయి. మరో వైపు అమెరికా ఫెడరల్ రిజర్వ్ రెండు రోజుల సమావేశం బుధవారం నుంచి ఆరంభం కానుండడంతో ఇన్వెస్టర్లు అప్రమత్తంగా వ్యవహరించారు. మొత్తం మీద అంతర్జాతీయ మార్కెట్ల బలహీనత మన మార్కెట్‌పై ప్రతికూల ప్రభావం చూపించిందని జియోజిత్ ఫైనాన్షియల్ సర్వీసెస్ రీసెర్చ్ హెడ్ వినోద్ నాయర్ చెప్పారు.

లాభాల్లో ఓఎమ్‌సీలు...

ఐఓసీ క్యూ3 ఫలితాలు అంచనాలను మించడం, 1:1 బోనస్ ఇవ్వనుండడం, అంతర్జాతీయ మార్కెట్లో చమురు ధరలు తగ్గడంతో ఇతర ప్రభుత్వ రంగ ఆయిల్ మార్కెటింగ్ కంపెనీల షేర్లు–హెచ్‌పీసీఎల్, బీపీసీఎల్‌లు 3–5 శాతం రేంజ్‌లో పెరిగాయి. ఈ క్యూ3లో నికర నష్టాలు తగ్గడంతో రిలయన్స్ కమ్యూనికేషన్స్ 10 శాతం లాభంతో రూ.30 వద్ద ముగిసింది.

స్టాక్ మార్కెట్ డేటా

టర్నోవర్ (రూ. కోట్లలో)	
బీఎస్‌ఈ	5,283
ఎన్‌ఎస్‌ఈ (ఈక్విటీ)	34,631
ఎన్‌ఎస్‌ఈ (డెరివేటివ్స్)	3,52,936
ఎఫ్‌ఐఐ	-106
డీఐఐ	-282

నేటి బోర్డ్ మీటింగ్స్

ఐసీఐసీఐ బ్యాంక్, ఎన్‌టీపీసీ, ఎల్ అండ్ టీ, వేదాంత, ఐడీబీఐ బ్యాంక్, అరవింద్, హిందుస్తాన్ కాపర్, హిందుస్తాన్ కన్‌స్ట్రక్షన్ కంపెనీ, ఐఐఎఫ్‌ఎల్, జమ్మూ అండ్ కశ్మీర్ బ్యాంక్, జేకే లక్ష్మీ సిమెంట్, జేఎస్‌డబ్ల్యూ స్టీల్, పీవీఆర్, షాపర్స్ స్టాప్, అలెంబిక్ ఫార్మా, డాబర్ ఇండియా, ఎస్కార్ట్స్, ఎక్సైడ్ ఇండస్ట్రీస్, పెట్రోనెట్ ఎల్‌ఎన్‌జీ, ఫిలిప్స్ కార్బన్, విమ్టా ల్యాబ్స్, ఆర్చీస్, హెచ్‌సీఎల్ ఇన్ఫోసిస్టమ్స్, హెచ్‌ఈజీ

స్వల్పంగా పెరిగిన రిలయన్స్ పవర్ లాభం



న్యూఢిల్లీ: రిలయన్స్ పవర్ నికర లాభం ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికంలో స్వల్పంగా పెరిగింది. గత క్యూ3లో రూ.276 కోట్లుగా ఉన్న నికర లాభం(కన్సాలిడేటెడ్) ఈ క్యూ3లో 2 శాతం లాభంతో రూ.280 కోట్లకు పెరిగింది. అయితే మొత్తం ఆదాయం మాత్రం రూ.2,985 కోట్ల నుంచి రూ.2,590 కోట్లకు తగ్గింది. వడ్డీ వ్యయాలు రూ.766 కోట్ల నుంచి రూ.749 కోట్లకు తగ్గాయని, తరుగుదల, తదితర వ్యయాలు కూడా రూ.268 కోట్ల నుంచి రూ.188 కోట్లకు తగ్గాయని కంపెనీ తెలిపింది. ఆర్థిక ఫలితాల నేపథ్యంలో బీఎస్‌ఈలో రిలయన్స్ పవర్ షేర్ 1 శాతం లాభంతో రూ.47 వద్ద ముగిసింది.

సువెన్ లాభం 34 కోట్లు

సువెన్ లైఫ్ సైన్సెస్ డిసెంబరు త్రైమాసికం స్టాండలోన్ ఫలితాల్లో నికర లాభం క్రితంతో పోలిస్తే రూ.24 కోట్ల నుంచి రూ.34 కోట్లకు చేరింది. టర్నోవరు రూ.120 కోట్ల నుంచి రూ.167 కోట్లకు ఎగసింది.

ప్రాంతీయ భాష ఇంటర్నెట్ యూజర్లు 75 శాతానికి!!

దేశీ ఇంటర్నెట్ యూజర్లలో 2021 నాటికి ప్రాంతీయ భాష యూజర్లు 75 శాతానికి చేరే అవకాశముంది. డిజిటల్ అక్షరాస్యత పెరుగుదల, అందుబాటు ధరల్లోని స్మార్ట్‌ఫోన్స్ విరివిగా లభ్యంకావడంవంటి అంశాలు దోహదపడతాయని టైమ్స్ ఇంటర్నెట్ అధ్యయనంలో వెల్లడయ్యింది.

హిటాచీ నుంచి కొత్త ఏసీలు

దేశీ మూడో అతిపెద్ద ఎయిర్ కండీషనర్ బ్రాండ్ 'హిటాచీ' తాజాగా సరికొత్త ఎక్స్‌పాండబుల్ ఇన్వర్టర్ ఎయిర్ కండీషనర్ ఉత్పత్తుల శ్రేణిని ఆవిష్కరించింది. జాన్సన్ కంట్రోల్స్–హిటాచీ ఎయిర్ కండీషనింగ్ మార్కెటింగ్ అండ్ చానల్ డెవలప్‌మెంట్, గ్లోబల్ సేల్స్ హెడ్ హోవర్డ్ లాంగ్, సంస్థ ఇండియా ఎండీ గుర్మీత్ సింగ్, సంస్థ సీవోవో అండ్ ప్రెసిడెంట్ శినిచి లిజుకా ఈ ప్రొడక్టులను మార్కెట్‌లోకి విడుదల చేశారు.



ఎస్‌బీఐ లైఫ్ లాభం 21% అప్

రూ.9,720 కోట్లకు పెరిగిన మొత్తం ఆదాయం



న్యూఢిల్లీ: ఎస్‌బీఐ లైఫ్ ఇన్సూరెన్స్ కంపెనీ నికర లాభం ప్రస్తుత ఆర్థిక సంవత్సరం డిసెంబర్ క్వార్టర్లో 21 శాతం పెరిగింది. గత క్యూ3లో రూ.190 కోట్లుగా ఉన్న నికర లాభం ఈ క్యూ3లో రూ.230 కోట్లకు ఎగసిందని ఎస్‌బీఐ లైఫ్ ఇన్సూరెన్స్ తెలిపింది. మొత్తం ఆదాయం రూ.6,060 కోట్ల నుంచి రూ.9,720 కోట్లకు పెరిగింది. నికర ప్రీమియం ఆదాయం రూ.5,240 కోట్ల నుంచి 30 శాతం పెరిగి రూ.6,780 కోట్లకు ఎగసింది. రిటైల్ కొత్త వ్యాపారంతో పాటు రిటైల్ వ్యాపార రెన్యూవల్ ప్రీమియం కూడా పెరగడం వల్ల నికర ప్రీమియం ఆదాయం పెరిగిందని పేర్కొంది.

23 శాతం పెరిగిన నిర్వహణ ఆస్తులు...

గత క్యూ3లో రూ.90,720 కోట్లుగా ఉన్న నిర్వహణ ఆస్తులు ఈ క్యూ3లో 23 శాతం వృద్ధి చెంది రూ.1,11,630 కోట్లకు పెరిగాయని ఎస్‌బీఐ లైఫ్ ఇన్సూరెన్స్ తెలిపింది. సాల్వెన్సీ రేషియో 2.09 శాతం నుంచి 2.06 శాతానికి చేరిందని పేర్కొంది. ఆర్థిక ఫలితాల నేపథ్యంలో బీఎస్‌ఈలో ఎస్‌బీఐ లైఫ్ ఇన్సూరెన్స్ కంపెనీ షేర్ 2 శాతం నష్టపోయి రూ.669 వద్ద ముగిసింది.

అక్టోబర్ - డిసెంబర్ క్వార్టర్ ఆర్థిక ఫలితాలు

కంపెనీ	నికర లాభం (కోట్లలో)			మొత్తం ఆదాయం (కోట్లలో)		
	2017–18	2016–17	వృ/క్షీ(%)	2017–18	2016–17	వృ/క్షీ(%)
మహీంద్రా లైఫ్ స్పేస్	26	35	-26	186	228	-18
పిరిమల్ ఎంటర్‌ప్రైజెస్	490	404	21	2,856	2,342	22
జేకే పేపర్	70	36	94	797	678	18
టీమ్‌లీజ్ సర్వీసెస్	18	9	100	922	818	13
సుందరమ్ ఫైనాన్స్	154	138	12	710	624	14
లక్ష్మీ విలాస్ బ్యాంక్	(39)	78	--	818	879	-7
బ్లూ డార్ట్ ఎక్స్‌ప్రెస్	45	28	62	710	727	-2
చోళమండలం ఇన్వె & ఫై.	249	163	53	--	--	--

గోద్రేజ్ కన్స్యూమర్ ప్రొడక్ట్స్ 22 శాతం పెరిగిన నికర లాభం

ఒక్కో షేర్‌కు రూ. 1 డివిడెండ్




న్యూఢిల్లీ: ఎఫ్‌ఎంసీజీ దిగ్గజం గోద్రేజ్ కన్స్యూమర్ ప్రొడక్ట్స్ లిమిటెడ్ (జీసీపీఎల్) ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసిక కాలంలో రూ.430 కోట్ల నికర లాభాన్ని సాధించింది. గత ఆర్థిక సంవత్సరం క్యూ3లో వచ్చిన నికర లాభం రూ.352 కోట్లతో పోలిస్తే 22 శాతం వృద్ధి చెందిందని జీసీపీఎల్ తెలిపింది. మొత్తం ఆదాయం రూ.2,057 కోట్ల నుంచి 6 శాతం వృద్ధితో రూ.2,666 కోట్లకు పెరిగిందని కంపెనీ ఎగ్జిక్యూటివ్ చైర్‌పర్సన్ నిసాబా గోద్రేజ్ తెలిపారు. ఇబిటా 18 శాతం వృద్ధి చెందిందన్నారు. రూ.1 ముఖ విలువ గల ఒక్కో షేర్‌కు రూ.1 మధ్యంతర డివిడెండ్ (వంద శాతం) ఇవ్వనున్నామని తెలిపారు.

11 శాతం పెరిగిన 'భారత' ఆదాయం

మొత్తం వ్యయాలు రూ.2,057 కోట్ల నుంచి 3 శాతం వృద్ధితో రూ.2,120 కోట్లకు పెరిగాయని నిసాబా వివరించారు. ప్రకటనలు, ప్రచార వ్యయాలు 18 శాతం పెరిగి రూ.226 కోట్లకు చేరాయని తెలిపారు. భారత కార్యకలాపాల ఆదాయం రూ.1,280 కోట్ల నుంచి 11 శాతం వృద్ధితో రూ.1,425 కోట్లకు, ఆఫ్రికా ఆదాయం 5 శాతం వృద్ధితో రూ.599 కోట్లకు పెరిగాయని వివరించారు. అయితే ఇండోనేసియా కార్యకలాపాల ఆదాయం 8 శాతం తగ్గి రూ.364 కోట్లకు పడిపోయిందని పేర్కొన్నారు. ఆర్థిక ఫలితాల నేపథ్యంలో బీఎస్‌ఈలో జీసీపీఎల్ షేర్ స్వల్పంగా పెరిగి రూ.1,061 వద్ద ముగిసింది.

కోటక్ ఎంఎఫ్ కొత్త స్కీమ్

- 'కోటక్ ఇండియా గ్రోత్ ఫండ్ సిరీస్–4' ఆవిష్కరణ
- ఫిబ్రవరి 12 వరకు సబ్‌స్క్రిప్షన్‌కు అవకాశం



ముంబై: కోటక్ మ్యూచువల్ ఫండ్ తాజాగా లార్జ్ క్యాప్, మిడ్ క్యాప్, స్మాల్ క్యాప్ స్టాక్స్‌లో ఇన్వెస్ట్‌మెంట్లే ప్రధాన లక్ష్యంగా కొత్త స్కీమ్ 'కోటక్ ఇండియా గ్రోత్ ఫండ్ సిరీస్–4'ను మార్కెట్‌లోకి తీసుకువచ్చింది. ఇది ఫిబ్రవరి 12 వరకు అందుబాటులో ఉంటుంది. 'ఫండ్ పెట్టుబడులు 80–100 శాతం ఇండియన్ ఈక్విటీస్‌లోనే ఉంటాయి. లార్జ్ క్యాప్, మిడ్ క్యాప్, స్మాల్ క్యాప్ స్టాక్స్‌లో ఇన్వెస్ట్ చేస్తాం. డైవర్సిఫైడ్ పోర్ట్‌ఫోలియో ద్వారా మూలధన పెరుగుదలే ఫండ్ లక్ష్యం' అని వివరించింది. తాజా ఫండ్‌లో 'పుట్ ఆప్షన్ స్ట్రాటజీ' ప్రత్యేకత ఉందని పేర్కొంది. దీని ద్వారా మార్కెట్లు నష్టాల్లో ఉన్నప్పుడు ప్రస్తుత స్థాయిల్లోని స్ట్రైక్ ప్రైస్‌తో మూడేళ్లపాటు అట్ ద మనీ నిఫ్టీ–50 పుట్ ఆప్షన్‌ను కొనుగోలు చేయడం ద్వారా నష్టాలను పరిమితం చేసుకోవచ్చు. అంటే స్ట్రైక్ ప్రైస్ వద్ద నుంచి నిఫ్టీ దిగువకు వెళ్లే కొద్దీ నిఫ్టీ–50 పుట్ ఆప్షన్ విలువ పెరుగుతుంది. అప్పుడు స్టాక్స్ విలువ పడిపోయినా పుట్ ఆప్షన్ విలువ పెరగడం వల్ల నష్టం పరిమితంగా ఉంటుంది. ఇక స్టాక్ ధర పెరిగినప్పుడు ఎలాంటి భయం ఉండదు. అప్పుడు పుట్ ఆప్షన్ విలువ తగ్గుతుంది. అదే సమయంలో ఫండ్ విలువ పెరుగుతుంది. ఇలాంటప్పుడు కేవలం పుట్ ఆప్షన్ ప్రీమియం మాత్రమే కోల్పోతాం. పెరిగిన ఫండ్ విలువతో పోలిస్తే ప్రీమియాన్ని పరిగణనలోకి తీసుకోవాల్సిన అవసరం లేదు. దీన్లో కనీస ఇన్వెస్ట్‌మెంట్ రూ.5,000.

అంబర్... లిస్టింగ్ అదరహో!

న్యూఢిల్లీ: అంబర్ ఎంటర్‌ప్రైజెస్ షేర్ స్టాక్ మార్కెట్ లిస్టింగ్‌లో మెరుపులు మెరిపించింది. ఇష్యూ ధర రూ.859 తో పోలిస్తే ఈ షేర్ బీఎస్‌ఈలో 37 శాతం లాభంతో రూ.1,180 వద్ద లిస్టయింది. ఇంట్రాడేలో 47 శాతం లాభంతో రూ.1,263 గరిష్ట స్థాయిని తాకింది. చివరకు 44 శాతం లాభంతో రూ.1,237 వద్ద ముగిసింది. ఇక ఎన్‌ఎస్‌ఈలో ఈ షేర్ 45 శాతం లాభంతో రూ.1,245 వద్ద ముగిసింది. బీఎస్‌ఈలో 18 లక్షల షేర్లు, ఎన్‌ఎస్‌ఈలో కోటికి పైగా షేర్లు ట్రేడయ్యాయి.

ఎన్‌ఎస్‌ఈ నగదు విభాగంలో ట్రేడైన షేర్లు

కంపెనీ పేరు	ముగింపు ధర	క్రితం ముగింపు
ADANI PO	428.25	436.65
AMBUJA C	261.5	263.65
ASIAN PA	1126.7	1152.05
AXIS BAN	593.75	605.55
BAJAJ AU	3358.3	3363.9
BAJAJ FI	1678.4	1715.3
BHARTI A	440.6	440.6
BOSCH LI	19495.55	19879.2
BHARAT P	485.6	469.8
CIPLA LT	605.95	615
COAL IND	305.9	301.75
EICHER M	26689.4	27453.65
GAIL (IN	476.1	474.35
HCL TECH	1000.4	1012.05
HDFC LTD	1937.5	1967.6
HDFC BAN	1995.5	1999.65
HERO MOT	3687.85	3641.75
HINDALCO	253.55	258.6
HIND.petrol	393	375.15
HIND.unilever	1400.25	1397.3
INDIABUL	1415	1421.15
ICICI BA	353.25	357.65
INDUSIND	1736.05	1742.5
BHARTI I	344.45	353.4
INFOSYS	1170.65	1182.9
INDIAN O	416.25	399.65
ITC LTD	275.2	275.65
KOTAK MA	1088.05	1115.1
LARSEN &	1429.9	1431.95
LUPIN LI	902.75	912.2
MAHINDRA	764.9	764.35
MARUTI S	9571.55	9630.7
NTPC LTD	170.3	171.05
OIL AND	204.8	205.15
POWER GR	194.95	194.15
RELIANCE	950.4	964.5
STATE BA	313.55	312.1
SUN PHAR	591.95	587.95
TATA MOT	395.85	399.25
TATA STE	775.85	783.15
TATA CON	3152.85	3198.85
TECH MAH	602.95	604.8
ULTRATEC	4363.2	4390.7
UPL LIMI	770.75	788.5
VEDANTA	341.3	345
WIPRO LT	307.3	311.15
YES BANK	353.35	358
ZEE ENTE	603	608.9

నిఫ్టీ నెక్స్ట్ ఫిఫ్టీ

కంపెనీ పేరు	ముగింపు ధర	క్రితం ముగింపు
ABB INDI	1605.8	1621.8
ACC LIMI	1728.1	1738.7
ASHOK LE	125.75	125.4
BAJAJ FI	4875.65	4912.4
BANK OF	160.2	162.35
BHARAT E	177	175.65
BHEL	101.6	101.9
BRITANNI	4705.6	4692.1
CADILA H	425.3	419.8
COLGATE	1138.6	1148.8
CONTAINE	1380	1400.4
CUMMINS	909.2	897.2
DABUR IN	358.6	359.7
DLF LIMI	253.9	254.05
AVENUE S	1184.6	1181.9
EMAMI LI	1142.6	1230.45
GLAXOSMI	2456.3	2449.55
GLENMARK	615.8	622.1
GODREJ C	1057.7	1060
GLAXOSMI	6540.55	6476.65
HAVELLS	552.85	575.5
HIND.zinc	310.9	304.15
ICICI PR	414.75	417.2
IDEA CEL	94	93.6
INTERGLO	1213.1	1200.4
JSW STEE	289.1	293.45
LIC HOUS	537.6	547.8
MARICO L	315.45	310.7
UNITED S	3281.15	3284.75
MOTHERSO	362.3	369.95
MRF LTD	68261.55	66906.75
NHPC LTD	29.9	29.85
NMDC LTD	143.7	143.3
ORACLE F	4121.35	4206.15
OIL INDI	359.45	366.45
PIRAMAL	2766.95	2794.05
PETRONET	257.9	250.5
POWER FI	117.35	117.6
P&G HYGI	9310.6	9252.15
PIDILITE	885.95	893.6
PUNJAB N	172.65	173.95
RURAL EL	156.8	157.6
STEEL AU	91.1	91.85
SHREE CE	17326.55	17826.7
SIEMENS	1289.25	1288.05
SHRIRAM	1374.85	1431.45
SUN TV N	1027.55	1021.1
TATA POW	90.6	90.05
TITAN CO	884.15	896.2
TORRENT	1356.6	1378.35

బీఎస్‌ఈలో ఏపీ,టీఎస్ స్టాక్స్

కంపెనీ పేరు	ముగింపు ధర	క్రితం ముగింపు
AditSpin	9.25	9.6
Alphageo	907	916.55
Alu Flouride	129.25	136.05
Amar Raja Bat	812.1	807.95
And Bank	53.15	54.25
And Cemen	12.64	12.05
And Paper	346.8	347
And Petro	69.25	72.85
Anjani Portl	230	232.4
Aries Agro Ltd	224	235.55
Aurobindo Ph	631.15	635.2
Avantel Soft	553.2	526.9
Avanti Feeds	2271.65	2378.25
AvonOrg	15.61	14.87
BKV Industrs	1.52	1.6
BN Rathi Sec	43	44
Balaji Amin	682.15	719.25
Bambino Agro	287.6	286.35
Bartronics	14.03	14.16
Bhagira Chem	305.05	315.65
Bhagya Nag	42	42
Bhagya Wood	29	29.1
Brilliant Sec	16.04	15.28
CIL Securi	34.8	34.25
Color Chip	41.2	43.05
Cont Coffee	285.25	290.75
CoroFert	523.05	532.9
Cosboard Ind	41.85	43.6
Country Club	16	16.2
Cubex Tub	24.7	26
Cybermate	3.65	3.6
DR Reddy	2312	2355.75
Danlaw Tec	95.5	92.65
DecCement	579.45	580.4
Divi's Lab	1078.15	1100.25
Divya Granit	110	115
Dolphin Medi	1.67	1.7
Dredgin Corp	694.05	715.85
Empee Sugars	4.38	4.59
Essen Supple	21.5	20.5
Everest Org	146.9	141.7
Fortune Info	97	98.8
Four Soft	103.15	103.75
GMR Ferro	3.5	3.56
GMR Infra	22.1	22.7
GVK Power	20.75	20.2
Gati Corpn	129.8	133.2
Gayatri Bio	10	9.65
Gayatri Proj	210	217.05
Gayatri Sugrs	10.21	10.35
Gennex Lab	4.79	4.89
GodavDru	36.95	37.9
Goldstn Tele	224.25	215.2
Goldstone Tech	14.5	15.15
Granules (I)	132.5	134.95
HBL Nife Pow	61.9	64.25
HYDIndus	1762.5	1844.1
Heritage Food	775	777.1
Hifco Marwel	42.5	40.5
HindFlurocarb	14.92	14.25
ICSA Ltd	4.09	4.3
IDL Industrs	610.5	615.75
IKF Soft	0.95	0.87
IQMS Soft	14.8	16.1
IVRCL Infras	5.37	5.44
Incap	103	108.15
IndoNationl	894.9	900.6
Infotech En	628	649.25
Innaredy Com	4.09	4.3
Invinex Lab	119.75	122.05
JSTL	48.9	49.05
KCP LTD	145.15	145.85
KNR Constructio	312.95	313.55
Kabsons Indu	9.75	9.9
KakatiCem	365.45	371.1
KakatiTex	2.63	2.76
Kallam Spg	22.2	21.65
Karan Woo-sn	1.73	1.65
Karuna Cable	0.09	0.09
Kernex Micro	55.5	56.55
Krebs Bio	140.05	145.5
LGS Global	6.27	6.46
LancoIndus	382.1	393.1
Lokesh Mach	69.55	69.05
Lotus Choc	54.45	52.8
MIC Elec	9	9.19
Madhucon Proje	32.1	32.2
Maytas Infra	45.8	46.65
Mold-tek	70.35	69.8
Moldtek Plastic	346.45	351.7
Moschip Semi	38.9	39.05
NCCFinance	1.16	1.22
NCLInd	267.5	278.3
NETTLINX	90.4	85.9
NMDC Ltd	143.65	143.15
NagarAgrich	54.5	53.95
NagarConst	125.25	127
Natco Pharma	976.35	982.85
Nava Bh Ventur	161.5	159.45
Neha Inter	7.9	8.09
Neocure Ther	4.44	4.36
Neuland Lab	840	865.35
Nihar Info Glo	14.49	14.6
Nile	932	940.4
Oil Country	51.7	54.35
Ortin labs	20.7	21.75
Padmalaya Tele	5.75	5.8
Pankaj Poly	18.05	18.8
Panyam Cemen	57.25	58.8
Peeti Securt	7.98	8.4
PennInd	61.55	62.2
Phytochem I	75	76
Pitti Lamin	84.6	88.6
Pokarna	217.4	219.05
Prajay Engs	14.68	15.45
PremiExpl	428	442.6
Prism Cement	137.85	130.3
Rain Industries	395.65	403.3
Raj Packagin	38.75	39.9
Ram Informat	37	37
RavilFin	14	14
RavilGr	23.15	24.35
Reg.Ceramic	6.6	6.63
Restile Cer	7.79	8.11
Roopa Indus	14.2	14.77
Sagar Cem	1005.2	1011.75
Sai Wires(I)	1.82	1.82
Samkrg Pist	324	330.85
Sampre Nutri	71	72.05
SangInd	121.6	125.95
Satvah. Ispat	27.3	27.7
Sibar Auto	19.57	18.64
Softsol	41.9	44.1
South Bio Tech	3.95	4.07
SrRayAlk	63.85	65.15
Srinivasa Ship	75.95	75.05
Starchik Sp	20.4	20.8
Sujana Metal	1.6	1.6
Sujana Towers	4.64	4.73
Sujana Univers	1.07	1.02
Surana Strip	2.33	2.43
Surana Tele	5.75	5.8
Suryachakra Pow	1.62	1.64
Suryalata Sp	168	170.5
Suryava Spin	7.34	7.7
SuvarCem	161	165
Suven Pharma	224.4	240
TCI Finance	35.15	32.2
Taj Gvk Hotel	176.8	175.8
Tanla Solutions	33.8	33.55
Trans Biotek	2.42	2.36
Transport Co	275.8	280.8
Trendy Knit	0.24	0.25
Usher Agro	8.09	7.95
VBC Ferro	47.15	49.5
VST Indus	3300	3300
Vamshi Rubb	50	50
Viceroy Hotels	17.7	17.8
VijayTextil	59.85	62.95
Vimta Labs	212.55	208.15
Virat Crane	48.15	48.3
Virinchi Con	128.55	133.4
VisakaInd	735.5	757.9
Vista Pharma	42.3	42.2
Vivimed Labs	84.75	89.45
Vjil Consult	17.15	18.05
ZenoTech Lab	46.55	47

వ్యాపార వృద్ధి కోసమే ఆటోమేషన్

- టీసీఎస్ సీవోవో గణపతి సుబ్రమణియం వ్యాఖ్య



దావోస్: వ్యాపారాలను మరింతగా విస్తరించుకునేందుకే కంపెనీలు ఆటోమేషన్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌వైపు మొగ్గు చూపుతున్నాయని ఐటీ దిగ్గజం టీసీఎస్ సీవోవో ఎన్.గణపతి సుబ్రమణియం తెలిపారు. వీటి వల్ల ఐటీ రంగంలో ఉద్యోగాలకు కోత పడుతుందన్న వాదనలు అతిశయోక్తి మాత్రమేనన్నారు. వరల్డ్ ఎకనమిక్ ఫోరం సదస్సులో పాల్గొన్న సందర్భంగా గణపతి ఈ విషయాలు తెలిపారు. ''ఐటీ రంగంలో మార్పులు అనివార్యం. సాధారణంగానే ఐటీ రంగంలో ప్రతి 3–5 ఏళ్లకోసారి పెను మార్పులు చోటు చేసుకుంటూ ఉంటాయి. కాబట్టి నిరంతరం నైపుణ్యాలను మెరుగుపర్చుకుంటూనే ఉండాలి. ఎలాంటి కొత్త సవాలునైనా ఎదుర్కొనేందుకు సర్వసన్నద్ధంగా ఉండాలి'' అని వివరించారు.

నేడు శ్రీవారి ఆలయం, శ్రీశైలాలయం మూత

చంద్రగ్రహణం సందర్భంగా..

సాక్షి, తిరుమల/శ్రీశైలం: చంద్రగ్రహణం కారణంగా బుధవారం ఉదయం 11 గంటల నుంచి రాత్రి 9.30 వరకు శ్రీవారి ఆలయం తలుపులు తాత్కాలికంగా మూసివేయనున్నారు. సాయంత్రం 5.18కి చంద్రగ్రహణం ప్రారంభమై రాత్రి 8.41కి పూర్తి కానుంది. గ్రహణం తర్వాత రాత్రి 9.30కి ఆలయ తలుపులు తెరిచి శుద్ధి, పుణ్యాహవచనం, రాత్రి కైంకర్యాలు నిర్వహించనున్నారు. రాత్రి 10.30 నుంచి 12 వరకు భక్తులకు సర్వదర్శనం కల్పిస్తారు. ఆర్జితసేవలు సహస్రకలశాభిషేకం, కల్యాణోత్సవం, ఊంజల్‌సేవ, బ్రహ్మోత్సవం, వసంతోత్సవం, సహస్రదీపాలంకరణ సేవలను టీటీడీ రద్దు చేసింది. వీఐపీ బ్రేక్ దర్శనం కూడా ప్రొటోకాల్ ప్రముఖులకు పరిమితం చేశారు. నిత్యాన్నప్రసాద భవనం, వైకుంఠం క్యూకాంప్లెక్స్‌లోని వంటశాల, పీఏసీల్లోని అన్నవితరణ కేంద్రాలు, ఉద్యోగుల క్యాంటీన్లు ఉదయం 11 నుంచి రాత్రి 9.30 వరకు మూసివేయనున్నారు.

శ్రీశైలాలయం కూడా..: చంద్రగ్రహణం సందర్భంగా శ్రీశైలంలోని స్వామి అమ్మవార్ల ఆలయాలను బుధవారం ఉదయం 8 గంటల నుంచి మూసివేస్తున్నట్లు ఈవో భరత్‌గుప్తా తెలిపారు. బుధవారం వేకువజామున 3.30 గంటలకు ఆలయ ద్వారాలు తెరిచి మంగళవాయిద్యాలు, సుప్రభాతసేవ, మహామంగళహారతుల అనంతరం ఉదయం 5.30 నుంచి 7.30 గంటల వరకు మాత్రమే భక్తుల సర్వదర్శనానికి అనుమతిస్తామన్నారు. మరుసటి రోజు గురువారం వేకువజామున 3 గంటల తరువాత తెరుస్తామన్నారు.

వేణుగోపాలస్వామి సేవలో జస్టిస్ భట్



భాగవత సప్తాహాన్ని ఆలకిస్తున్న జస్టిస్ భట్

కోడూరు (అవనిగడ్డ): కృష్ణాజిల్లా హంసలదీవిలోని రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాలస్వామి వారిని హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి ఎస్.వెంకట నారాయణ భట్ దంపతులు మంగళవారం దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. తొలుత వేదపండితులు వారికి పూర్ణకుంభ స్వాగతం పలికారు. అనంతరం వారు దేవాలయం పక్కనే ఉన్న కుప్పా వంశీయుల సత్రాలను సందర్శించారు. అక్కడే జరుగుతున్న 97వ భాగవత సప్తాహం ముగింపులో పాల్గొని ప్రవచనాలను ఆలకించారు. తర్వాత జస్టిస్ వెంకటనారాయణ దంపతులు స్వామివారికి నూతన వస్త్రాలు సమర్పించారు. కార్యక్రమంలో టీటీడీ వేద పాఠశాల ప్రిన్సిపాల్ కుప్పా సుబ్రహ్మణ్య అవధాని, దుర్గగుడి ఏఈవో సాయిబాబు, జిల్లా జడ్జి వై.లక్ష్మణరావు, అవనిగడ్డ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ అమరలింగేశ్వరరావు, డీఎల్‌పీవో సత్యనారాయణ, తహసీల్దార్ కేపీ నారాయణరెడ్డి, ఎంపీడీవో వెంకటేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

ఎస్టీల్లో చేర్చాలంటూ మత్స్యకారుల జలదీక్ష



జలదీక్ష అనంతరం ర్యాలీలో పాల్గొన్న మత్స్యకారులు

గార: మత్స్యకారులను ఎస్టీల్లో చేరుస్తామని ఎన్నికల ముందు ఇచ్చిన హామీని సీఎం చంద్రబాబు నెరవేర్చాలని మత్స్యకారుల ఎస్టీ సాధనా సమితి డిమాండ్ చేసింది. శ్రీకాకుళం జిల్లా గార మండలంలో మత్స్యకారుల ఎస్టీ సాధనా సమితి ఆధ్వర్యంలో పోర్టు కళింగపట్నం నుంచి బందరువానిపేట వరకు వెయ్యి మంది మత్స్యకారులు మంగళవారం పాదయాత్ర చేశారు. అనంతరం సముద్రంలో జలదీక్ష చేశారు. మత్స్యకారుల సంఘం నాయకుడు దూడ సుధాకర్ మాట్లాడుతూ.. గ్రామాల వారీగా కమిటీలు వేసి, సంఘటితంగా ఒకే పార్టీకి ఓటు వేసి మన హక్కులను సాధించుకోవాలని మత్స్యకారులకు పిలుపునిచ్చారు. మత్స్యకారులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని.. లేని పక్షంలో రానున్న ఎన్నికల్లో ఓటుతో బుద్ధి చెబుతామని టీడీపీ ప్రభుత్వాన్ని హెచ్చరించారు. జలదీక్షలో కెప్టెన్‌లు మైలపల్లి జనార్దన్, మైలపల్లి ఎర్రన్న, గుంటు లక్ష్మయ్య, మత్స్యకార సంఘ నాయకులు చీకటి దానయ్య, గుంటు రామచంద్రరరావు పాల్గొన్నారు.

బడ్జెట్ సమావేశాల్లో ప్రత్యేక హోదా ప్రకటించాలి

వైఎస్సార్‌ఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు సలాంబాబు డిమాండ్

కడప కార్పొరేషన్: రాబోయే పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల్లో ఏపీకి ప్రత్యేక హోదా ప్రకటించాలని వైఎస్సార్ స్టూడెంట్ యూనియన్ (వైఎస్సార్‌ఎస్‌యూ) రాష్ట్ర అధ్యక్షుడు సలాంబాబు డిమాండ్ చేశారు. ప్రత్యేక హోదా డిమాండ్‌తో ఫిబ్రవరి మొదటి వారంలో రాష్ట్ర విశ్వవిద్యాలయాల్లో వైఎస్సార్‌ఎస్‌యూ ఆధ్వర్యంలో నిరసనలకు దిగనున్నట్లు వెల్లడించారు. మంగళవారం ఆయన వైఎస్సార్ జిల్లా కడపలో విలేకరులతో మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి చంద్రబాబు ఓటుకు కోట్లు కేసులో దొరికిపోయి ప్రత్యేక హోదాను కేంద్రం వద్ద తాకట్టు పెట్టారని ఆరోపించారు. హోదా బదులు ప్రత్యేక ప్యాకేజీ తెస్తామన్న సీఎం ఇంతవరకూ ఎన్ని నిధులు తెచ్చారో శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ప్రత్యేక హోదా ముగిసిపోయిన అధ్యాయమని టీడీపీ నాయకులు చేస్తున్న ప్రకటనలను విద్యార్థులు, నిరుద్యోగులు ఆమోదించబోరని స్పష్టం చేశారు. ప్రత్యేక హోదా కోసం ప్రతిపక్ష నేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేస్తున్న పోరాటంలో విద్యార్థులు, యువత భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు.

దేవాదాయ ఉద్యోగుల సంఘం కార్యవర్గం ఎన్నిక

అధ్యక్షుడిగా టీవీఎస్ సుబ్రహ్మణ్యం

వన్‌టౌన్ (విజయవాడ పశ్చిమ): ఆంధ్రప్రదేశ్ దేవాదాయ, ధర్మాదాయ శాఖ పరిపాలన ఉద్యోగుల సంఘం రాష్ట్రస్థాయి సమావేశం మంగళవారం విజయవాడలో జరిగింది. సంఘం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. 13 జిల్లాల్లోని ఆర్‌జేసీ, డీసీ, ఏసీ, ఎగ్జిక్యూటివ్ ఇంజనీరింగ్ తదితర శాఖలకు చెందిన సిబ్బంది హాజరయ్యారు. సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా టీవీఎస్ సుబ్రహ్మణ్యం (సహాయ కమిషనర్, ఏలూరు), ప్రధాన కార్యదర్శిగా మల్లికార్జున రెడ్డి (ఆర్‌జేసీ కార్యాలయం, తిరుపతి), ఉపాధ్యక్షులుగా ప్రసాద్ (విశాఖ), వెంకటసుబ్బయ్య (కడప), జాయింట్ సెక్రటరీలుగా తిరుమలరెడ్డి (కర్నూలు), వీఎల్‌ఎన్ నరసింహారెడ్డి (రాజమండ్రి), ఆర్గనైజింగ్ సెక్రటరీలుగా ఏ.సుజన్‌కుమార్ (విజయవాడ), రామతులసి (అనంతపురం), కోశాధికారిగా శేషు సుబ్రహ్మణ్యం (గుంటూరు), రాష్ట్ర కార్యవర్గ సభ్యులుగా కే.వీ.అనూరాధ, ప్రసన్నలక్ష్మీ, ఫణిరాజుశయన, ఎన్.వెంకటరమణ, కేఎల్.సుధారాణి, వై.వీ.రమణి ఎన్నికయ్యారు.

విజయవాడలో మరో భూ కబ్జా

- ఎస్‌ఆర్‌ఆర్ ప్రభుత్వ కళాశాలకు చెందిన 6.67 ఎకరాలు కబ్జా
- ఆ స్థలం విలువ రూ.300 కోట్లు
- కోర్టులో కేసులున్నా కట్టడాలకు అనుమతిస్తున్న అధికారులు
- అక్రమ కట్టడాలను కూల్చివేసిన విద్యార్థులు
- స్థానిక ఎమ్మెల్యేకు తెలియకుండా జరుగుతోందా?: విష్ణు, జోగి రమేష్



విజయవాడలోని ఎస్‌ఆర్‌ఆర్ కాలేజీకి చెందిన కబ్జాకు గురైన స్థలంలో ధర్నా చేస్తున్న విద్యార్థులు

సాక్షి, విజయవాడ: తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకుడు ఎన్టీ రామారావు చదువుకున్న కళాశాల.. కవిసామ్రాట్ విశ్వనాథ సత్యనారాయణ బోధించిన కళాశాల.. ఎందరో మాజీ మంత్రులు ఐఏఎస్‌లు, ఐపీఎస్‌లను అందించిన విద్యాసంస్థ.. విజయవాడలోని ఎస్‌ఆర్‌ఆర్ కళాశాల. అటువంటి కళాశాలకు చెందిన రూ.300 కోట్లు విలువైన 6.67 ఎకరాల స్థలం కబ్జా జరిగినా రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. గత్యంతరం లేని పరిస్థితుల్లో కళాశాల స్థలాన్ని కాపాడుకునేందుకు మంగళవారం విద్యార్థులు, పూర్వ విద్యార్థులు రంగంలోకి దిగారు. కళాశాల స్థలాలను కాపాడాలంటూ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ధర్నా నిర్వహించి అక్రమ కట్టడాలను కూల్చివేశారు. దీంతో ఉద్రిక్తత పరిస్థితులు ఏర్పడంతో పోలీసులు రంగప్రవేశం చేశారు. స్థానిక ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు, ఆయన అనుచరుల కనుసన్నల్లోనే ఆక్రమ నిర్మాణాలు జరుగుతున్నాయని వైఎస్సార్ కాంగ్రెస్ ఆరోపించింది.

దాతలు ఇచ్చిన భూమి...

ఎస్‌ఆర్‌ఆర్ కళాశాలకు సమీపంలోని బీఆర్‌టీఎస్ రోడ్డులో 6.67 ఎకరాల స్థలాన్ని నూజివీడు రాజా రాజ రంగయ్య అప్పారావు 50 ఏళ్ల కిందట కళాశాలకు బహూకరించారు. పెదర్ల నరసింహారావు అనే వ్యక్తి గడ్డి పెంచుకునేందుకు అప్పట్లో ఈ స్థలాన్ని కళాశాల వద్ద లీజుకు తీసుకున్నారు. ఆ తరువాత తమ ఆస్తిగా నకిలీ పత్రాలు సృష్టించారు. అందులో సుమారు మూడు ఎకరాలు ప్లాట్‌గా వేసి విక్రయించడంతో చేతులు మారిపోయింది. ఇందులో గతంలో 15కు పైగా నిర్మాణాలు జరిగాయి. ఆ ఆక్రమణలు విషయమై 2009 మార్చిలో హైకోర్టుకు వెళ్లారు. ప్రస్తుతం హైకోర్టులో కేసు ఉండగానే కార్పొరేషన్ అధికారులు ఈ స్థలాల్లోనే నూతన భవన నిర్మాణాలకు అనుమతులు ఇవ్వడంతో కొనుగోలుదారులు మరో రెండు భవనాలు నిర్మాణాలు చేపట్టారు. ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావుకు అనుచరుడు, స్థానిక టీడీపీ కార్పొరేటర్ కాకు మల్లికార్జున యాదవ్ కార్యాలయానికి కూతవేటు దూరంలోనే ఈ ఆక్రమ నిర్మాణాలు జరుగుతూ ఉండటం గమనార్హం.

మంత్రి దేవినేని ఉమా దృష్టికి..

గత ఏడాది నవంబర్‌లో జరిగిన పూర్వ విద్యార్థుల సమావేశానికి జల వనరుల శాఖ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు వచ్చినప్పుడు విద్యార్థులు ఆక్రమణలు గురించి ఆయన దృష్టికి తెచ్చారు. అక్రమ కట్టడాలను అడ్డుకుంటానని ఆయన హామీ ఇచ్చారు. అక్రమ నిర్మాణాలు ఆపాలంటూ కళాశాల ప్రిన్సిపాల్ వెలగా జోషి కూడా రెవెన్యూ, కార్పొరేషన్ అధికారుల్ని కోరారు. ప్రభుత్వం, అధికారులు స్పందించకపోవడంతో అక్రమ నిర్మాణాలు ఆగలేదు. దీంతో మంగళవారం విద్యార్థులు, పూర్వవిద్యార్థులు రంగంలోకి దిగి ఎస్‌ఆర్‌ఆర్ కళాశాల నుంచి ధర్నా నిర్వహించి కబ్జాకు గురైన స్థలంలో నిర్మిస్తున్న ఒక ఇంటి ప్రహరీగోడ, మెష్‌లను కూల్చివేశారు. మరొక ఇంటి పిల్లర్లను, గోడలను జేసీబీలతో తొలగించారు. మిగిలిన నాలుగు ఎకరాల స్థలంలో ఉన్న చెట్లను తొలగించారు. వివిధ రాజకీయ పార్టీలలో ఉన్న పూర్వ విద్యార్థులు వారికి అండగా నిలిచారు.

తీవ్ర ఉద్రిక్తత...

సుమారు 1500మందికి పైగా విద్యార్థులు ఒకేసారి వచ్చి అక్కడ ధర్నా చేసి భవనాల ప్రహరీలను, గోడలను కూల్చివేయడంతో తీవ్ర ఉద్రిక్తత పరిస్థితి ఏర్పడింది. సుమారు గంటసేపు అక్కడ గందరగోళ పరిస్థితి నెలకొంది. దీంతో పోలీసులు రంగప్రవేశం చేసి విద్యార్థులను అక్కడ నుంచి పంపేశారు. ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు, కార్పొరేటర్ మల్లికార్జున యాదవ్‌కు తెలియకుండా అక్రమ నిర్మాణాలు జరుగుతాయా? అని వైఎస్సార్‌సీపీ నగర వర్కింగ్ ప్రెసిడెంట్ మల్లాదివిష్ణు, మైలవరం సమన్వయకర్త జోగి రమేష్‌లు ధ్వజమెత్తారు. ప్రభుత్వం తక్షణం స్పందించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని పూర్వ విద్యార్థులు డిమాండ్ చేశారు. ధర్నాలో తెలుగుదేశం రాష్ట్ర కార్యదర్శి గన్నే నారాయణ వరప్రసాద్, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి దోనేపూడి శంకర్, సీపీఎం నాయకుడు దోనేపూడి కాశీనాథ్, పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షుడు లంకా జానయ్య, కేపీరావు తదితరులు పాల్గొన్నారు. కళాశాలకు చెందిన స్థలమని తెలియక మోసపోయి కొనుగోలు చేశామని భవన నిర్మాణదారులు వాపోతున్నారు.

ప్రేమికుడి మోసం.. ప్రేయసి బలవన్మరణం

మూడేళ్లుగా వలపు పేరుతో వెంటపడ్డాడు. శారీరకంగా లోబరుచుకున్నాడు. పెళ్లి ప్రస్తావన తేగానే మొహంచాటేసి కట్నం కావాలన్నాడు. అమ్మాయి తల్లిదండ్రులు నిరుపేదలైనా రూ.2 లక్షలు ముట్టజెప్పి పెద్దల సమక్షంలో పెళ్లి కుదుర్చి నిశ్చితార్థం చేశారు. ఎన్నాళ్లైనా పెళ్లి ఊసెత్తలేదు. ఇదేమని నిలదీస్తే యువతి తల్లిదండ్రులపై దాడి చేశారు. చావే శరణ్యమంటూ యువతి కాళ్లావేళ్లాపడ్డా కనికరించలేదు. తీవ్ర మనస్తాపానికి గురై ప్రియుడి ఇంటిముందే పురుగుమందు తాగి తనువుచాలించిందా యువతి.



విచారణ జరుపుతున్న పోలీసులు, వరలక్ష్మి(ఫైల్)

విశాఖపట్నం జిల్లాలో ఘటన

ఆనందపురం (భీమిలి): విశాఖ జిల్లా ఆనందపురం మండలం పందలపాకలో మంగళవారం అమానవీయ ఘటన చోటుచేసుకుంది. పోలీసులు, స్థానికుల కథనం మేరకు.. పందలపాకలో నివసిస్తున్న యర్ర రాము, యర్ర కామమ్మలకు ఇద్దరు ఆడపిల్లలు. పెద్ద కుమార్తె కొన్నేళ్ల క్రితం మృతి చెందగా రెండో కుమార్తె వరలక్ష్మి (20) తల్లిదండ్రులతో ఉంటోంది. వీరి ఇంటికి ఎదురుగా నివసిస్తున్న నరసింగరావు మూడేళ్లుగా వరలక్ష్మి వెంటబడి ప్రేమిస్తున్నానని నమ్మించాడు. షికార్లకు తీసుకెళ్లి శారీరకంగా అనుభవించాడు. రెండేళ్ల నుంచి పెళ్లి ప్రస్తావన తెస్తున్నా పలకడం లేదు. పెద్దల వద్ద పలుమార్లు పంచాయితీ జరిగింది. ఎట్టకేలకు నరసింగరావు పెళ్లికి అంగీకరించడంతో 2017 అక్టోబర్ 7న పెద్దల సమక్షంలో నిశ్చితార్థం జరిగింది. కట్నం కింద రూ.2 లక్షలిచ్చారు. నెలలు గడుస్తున్న పెళ్లి ప్రస్తావన తేకపోవడంతో మంగళవారం ఉదయం నరసింగరావు తల్లిదండ్రులు సూరి, లక్ష్మి వద్దకు వరలక్ష్మి తల్లిదండ్రులు వెళ్లి పెళ్లి ప్రస్తావన తేగానే కోపోద్రిక్తులై దాడికి పాల్పడ్డారు. మరోమారు పెళ్లంటే అంతుచూస్తామని బెదిరించారు. విషయాన్ని కుమార్తెకు వరలక్ష్మికి తెలపడంతో ఆమె వెళ్లి నరసింగరావును నిలదీసింది. మరో రూ.5 లక్షలిస్తేగానీ పెళ్లి చేసుకోనని తెగేసిచెప్పడంతో చావే శరణ్యమని యువతి బతిమాలింది. అయినా కనికరించకపోవడంతో తీవ్ర మనస్తాపానికి గురై పురుగు మందు తాగి ప్రియుడి ఇంటి ముందే కుప్పకూలింది. స్థానికులు ఆస్పత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ చనిపోయింది. ఘటనా స్థలానికి సీఐ గోవిందరావు చేరుకొని విచారించారు. నరసింగరావును అదుపులోకి తీసుకొని కేసు దర్యాప్తు చేస్తున్నారు. కాగా, వరలక్ష్మి అక్క కల్పనది బలవన్మరణమే. ఆనందపురం కాలనీకి చెందిన గణపతితో ఆరేళ్ల క్రితం వివాహమైంది. బాబు, పాప ఉన్నారు. భర్త, అత్త హింసలు భరించలేక కాల్చుకొని ఆత్మహత్యకు పాల్పడింది.

ఆడ పిల్లలు పుట్టారని భర్త వేధింపులు

ఆడపిల్లలు నట్టింట్లో తిరుగాడుతుంటే దేవతలు సంచరిస్తున్నంత కళ. అలాంటి చిట్టితల్లులు కళ్లెదుట కనపడుతుంటే ఓర్వలేకపోయాడో కసాయి తండ్రి. ఆడపిల్లలను కన్నతల్లిలా చూసుకోవాల్సిందిపోయి అనుక్షణం ఇల్లాలిని మగపిల్లలు లేరంటూ వేధిస్తుండటంతో ఆ తల్లి నరకయాతన అనుభవించసాగింది. అవమానాలు దిగమింగుతూ బతుకీడ్చేకంటే దేవుడి దగ్గరకు వెళ్లిపోవడమే మార్గమని ఇద్దరు చిన్నారులకు ఉరితాడు బిగించి తానూ ఉరేసుకుంది.



విగతజీవులుగా వేలాడుతున్న తల్లీపిల్లలు

హిందూపురం అర్బన్: భర్త వేధింపులు తాళలేక ఇద్దరు పిల్లలకు ఉరివేసి అనంతరం తల్లి కూడా ఆత్మహత్యకు పాల్పడిన ఘటన అనంతపురం జిల్లా నాయనపల్లిలో మంగళవారం జరిగింది. మృతురాలి తల్లిదండ్రులు, ఎస్‌ఐ ఆంజనేయులు తెలిపిన వివరాలివీ.. సోమందేపల్లి మండలం తుంగోడుకు చెందిన రత్నమ్మ, శివాచారి దంపతుల కుమార్తె కల్పనకు లేపాక్షి మండలంలోని నాయనపల్లికి చెందిన వీరభద్రాచారితో ఎనిమిదేళ్ల క్రితం వివాహమైంది. వీరికి మేఘన (6), యశస్విని (4) సంతానం. దంపతులిద్దరూ హిందూపురంలోని గార్మెంట్స్ ఫ్యాక్టరీలో పనిచేస్తున్నారు. మంగళవారం ఉదయం భర్త విధులకు వెళ్లిన సమయంలో కల్పన (25) తన ఇద్దరు కుమార్తెలకు ఇంట్లోనే ఉరిపోసి తానూ ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. సర్పంచ్ సదాశివరెడ్డి ఇనుప సమ్మెట అవసరమై కల్పన ఇంటి తలుపు తట్టగా ఎవరూ స్పందించ లేదు. అనుమానం వచ్చి కిటికీలో చూడగా పిల్లలతో పాటు తల్లి ఉరేసుకుని ఉండటాన్ని చూసి వీరభద్రాచారికి విషయం తెలిపాడు. ఇంటికి చేరుకున్న ఆయన తలుపులు తీసి పోలీసులకు సమాచారమిచ్చాడు.

ఆడపిల్లలు పుట్టారని తరచూ వేధింపులు..

ఆడపిల్లలు పుట్టారనే విషయమై దంపతులు మధ్య తరచుగా గొడవ జరుగుతుండేదని కుటుంబ సభ్యులు తెలిపారు. మూడురోజుల క్రితం కూడా ఇదే విషయమై భార్యాభర్తలు ఘర్షణ పడినట్లు తెలుస్తోంది. రెండు రోజులుగా కల్పన ఫ్యాక్టరీకి వెళ్లకుండా ఇంట్లోనే పిల్లలతో ఉంటోంది. ఇంట్లో ఎవరూ లేని సమయంలో కల్పన క్షణికావేశంలో ఇద్దరు పిల్లలతో కలిసి ఆత్మహత్యకు పాల్పడింది. కాగా, అల్లుడే ఈ ఘోరానికి పాల్పడి ఆత్మహత్యగా చిత్రీకరించాడని మృతురాలి తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. వీరి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ ఆంజనేయులు తెలిపారు.

‘భోగాపురం’ పనులు ప్రభుత్వ సంస్థకే అప్పగించాలి

- అశోక్‌గజపతిరాజుపై చర్యలు తీసుకోవాలి
- ప్రధానికి బొత్స సత్యనారాయణ లేఖ

సాక్షి, హైదరాబాద్/విజయవాడ సిటీ: భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం నిర్మాణానికి సంబంధించి రాబడిలో రాష్ట్ర ప్రభుత్వానికి అత్యధికంగా వాటా ఇస్తానని బిడ్ దాఖలు చేసిన కేంద్ర ప్రభుత్వ సంస్థ ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియాకు నిర్మాణ పనులు అప్పగించాల్సిందిగా రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించాలని వైఎస్సార్ కాంగ్రెస్ నేత బొత్స సత్యనారాయణ ప్రధానిని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ బిడ్‌ను రద్దు చేస్తుంటే కేంద్ర విమానయాన శాఖ మంత్రిగా ఉండి కూడా నోరెత్తని అశోక్‌గజపతిరాజుపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన ప్రధాని నరేంద్రమోదీకి రాసిన లేఖను మంగళవారం విడుదల చేశారు. రాష్ట్ర ప్రభుత్వం టెండర్లు రద్దు చేయడంపై ఆయన ఈ లేఖలో విపులంగా వివరించారు. తమకు వచ్చే రాబడిలో 21.6 శాతం రాష్ట్ర ప్రభుత్వానికి ఇస్తామని ప్రైవేటు సంస్థ, 30.2 శాతం ఇస్తామని ఎయిర్‌పోర్ట్సు అథారిటీ ఆఫ్ ఇండియా బిడ్లు వేశాయన్నారు. అయితే అనూహ్యంగా ఈ నెల 21న జరిగిన రాష్ట్ర మంత్రివర్గ సమావేశం ఈ బిడ్‌లను రద్దే చేసి అందరిని ఆశ్చర్యపరిచారన్నారు. కాగా, విజయవాడలో బొత్స విలేకరులతో మాట్లాడుతూ భూ కబ్జాలకు పాల్పడుతున్న ఎమ్మెల్యే బొండాపై ఇప్పటి వరకు చంద్రబాబు చర్యలు తీసుకోలేదంటే కారణం తనే బొండా నడిపిస్తుండమే అన్నారు. ఆఖరికి ప్రభుత్వ కళాశాలైన ఎస్‌ఆర్‌ఆర్ కళాశాల స్థలాన్ని కూడా బొండా ఉమా కబ్జా చేస్తుంటే రాజధానిలో ఉన్న సీఎం చంద్రబాబు, డీజీపీ, రెవెన్యూ, రిజిస్ట్రేషన్ శాఖలు ఏమి చేస్తున్నాయని ప్రశ్నించారు. ఇలా ఉండగా, మహాత్మాగాంధీ వర్ధంతి సందర్భంగా పార్టీ నేతలు ఘన నివాళులర్పించారు.



విజయవాడ పార్టీ రాష్ట్ర కార్యాలయంలో మహాత్మునికి నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ నేతలు

మావోయిస్టు దళ కమాండర్ సునీల్ లొంగుబాటు

చింతూరు (రంపచోడవరం): ఆంధ్రప్రదేశ్, ఛత్తీస్‌గఢ్ సరిహద్దులతో పాటు విలీన మండలాల్లో చురుకుగా కార్యకలాపాలు నిర్వహిస్తున్న మావోయిస్టు శబరి ఏరియా కమిటీ దళ కమాండర్ ఉబ్బా మోహన్‌రావు అలియాస్ సునీల్ మంగళవారం తెలంగాణ పోలీసుల ఎదుట లొంగిపోయాడు. అనారోగ్య కారణాల వల్ల లొంగిపోయినట్లు భద్రాచలం ఏఎస్పీ సునీల్‌దత్‌కు చెప్పారు. సునీల్‌పై దుమ్ముగూడెం, చర్ల పోలీస్‌స్టేషన్లలో పలు కేసులున్నాయి. తెలంగాణలోని దుమ్ముగూడెం మండలం అంజిబాకకు చెందిన సునీల్‌కు భార్య, ముగ్గురు పిల్లలున్నారు. 2013లో అప్పటి ఖమ్మం జిల్లా మావోయిస్టు కార్యదర్శి కిరణ్ ప్రోత్సాహంతో శబరి ఏరియా కమిటీలో దళ సభ్యుడిగా చేరాడు.

ఆత్మహత్యలే శరణ్యం

- ‘కేశవరెడ్డి’ బాధిత కుటుంబం ఆవేదన
- సచివాలయంలోకి అనుమతించని అధికారులు

సాక్షి, అమరావతి, అమరావతి బ్యూరో/ తుళ్లూరు రూరల్: కేశవరెడ్డి విద్యాసంస్థల యాజమాన్యం నుంచి తమకు రావాల్సిన రూ.5 లక్షలు ఇప్పించకపోతే తమ కుటుంబం ఆత్మహత్యకు పాల్పడుతుందని బాధితుడు గంగుల శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. వైఎస్సార్ జిల్లా ప్రొద్దుటూరుకు చెందిన శ్రీనివాసరెడ్డి తన భార్య హైమావతి ముగ్గురు పిల్లలు పావని, తులసి, సుదేశ్‌రెడ్డిలతో కలసి మంగళవారం సచివాలయానికి చేరుకుని అధికారులకు తమ గోడు విన్నవించుకునేందుకు ప్రయత్నించారు. అయితే ‘కేశవరెడ్డి’ బాధితులు అని చెప్పడంతో భద్రతా సిబ్బంది లోపలికి అనుమతించలేదు. దీంతో శ్రీనివాస్‌రెడ్డి మీడియాతో మాట్లాడుతూ.. 2012లో మంత్రి ఆదినారాయణ వియ్యంకుడు కేశవరెడ్డికి రూ.5 లక్షలు అప్పుగా ఇచ్చామని, అప్పటి నుంచి అడుగుతున్నా పట్టించుకోవట్లేదని వాపోయారు. మంత్రి కాళ్ల మీద పడి న్యాయం చేయాలని కోరినా ఇంత వరకు స్పందించలేదన్నారు. ఇప్పుడు తమ ఇద్దరు పిల్లలు అనారోగ్యానికి గురైతే వైద్యం చేయించుకోలేని దుస్థితిలో ఉన్నామని ఆవేదన వ్యక్తం చేశారు. నాలుగు రోజుల్లో తమకు అందాల్సిన డబ్బివ్వకుంటే కుటుంబంతో కలసి ఆత్మహత్య చేసుకుంటానని హెచ్చరించారు. తాము చనిపోతే మంత్రి ఆది బాధ్యత వహించాల్సి ఉంటుందని తెలిపారు.



మీడియాతో మాట్లాడుతున్న బాధితులు

స్మగ్లర్లా.. మావోలా?

- శ్రీవారి మెట్టు వద్ద పేలుడు పదార్థాలు లభ్యం
- ఉలిక్కిపడ్డ అధికార యంత్రాంగం

సాక్షి, తిరుపతి: శ్రీవారి మెట్టు వద్ద సోమవారం రాత్రి పేలుడు పదార్థాలు లభ్యం కావటంతో అధికార యంత్రాంగం ఉలిక్కిపడింది. ఎర్రచందనం స్మగ్లర్లు తెగించారా? లేక మావోయిస్టులు చొరబడుతున్నారా? అనే అనుమానాలు జోరందుకున్నాయి. దర్యాప్తు బృందాలు అన్ని కోణాల్లోనూ విచారణ చేపట్టాయి. శేషాచలం అడవుల్లో ఎర్రచందనం దుంగల కోసం స్మగ్లర్లు.. తమకు అడ్డొచ్చిన అటవీ అధికారులపై తిరగబడటం, దాడులు చేయడం నిత్యకృత్యంగా మారింది. ఇదే క్రమంలో 2015లో కూంబింగ్ నిర్వహిస్తున్న టాస్క్‌ఫోర్స్ సిబ్బంది జరిపిన ఎన్‌కౌంటర్‌లో తమిళనాడుకు చెందిన 20 మంది ‘ఎర్ర’కూలీలు మృతి చెందారు. 2015 ఎన్‌కౌంటర్‌కు ప్రతీకారం తీర్చుకోవటంతో పాటు.. ఎర్రచందనం రవాణాను ముమ్మరం చేయటానికి స్మగ్లర్లు శేషాచలం అడవుల్లో అక్కడక్కడా పేలుళ్లు జరపాలని నిర్ణయించి ఉంటారని టాస్క్‌ఫోర్స్ అధికారులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. అదే సమయంలో శ్రీవారి మెట్టు వద్ద లభ్యమైన పేలుడు పదార్థాల బ్యాగు కూడా తిరుచ్చికి చెందిన చిరునామా ఉండటంతో.. స్మగ్లర్ల పనిగానే అధికారులు భావిస్తున్నారు. ఇదే కోణంలో విచారణ చేపట్టినట్లు తెలిసింది. మరోవైపు మావోలపైన కూడా అధికారులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల కాలంలో ఆంధ్ర, ఒడిశా సరిహద్దు ప్రాంతంలో పోలీసుల దాడులు అధికమయ్యాయి. మావోయిస్టుల జోన్‌గా పేరున్న ఒడిశా సరిహద్దుపై పోలీసుల నిఘా పెరగటంతో.. శేషాచలంపై కన్నేసి ఉంటారేమోనని అనుమానిస్తున్నారు. మొత్తంగా శ్రీవారి మెట్టు వద్ద లభ్యమైన పేలుడు పదార్థాలతో ఇంటెలిజెన్స్, టీటీడీ విజిలెన్స్, టాస్క్‌ఫోర్స్, కౌంటర్ ఇంటెలిజెన్స్, స్పెషల్ బ్రాంచ్, పోలీసులు విచారణ ముమ్మరం చేశారు.

దేశ వ్యాప్తంగా శ్రీవారి ఆలయాల విస్తరణ

- వాటి కేంద్రంగానే ధర్మప్రచారం విస్తరణకు టీటీడీ సన్నద్ధం
- కురుక్షేత్ర, కన్యాకుమారిలో వెంకన్న ఆలయాలు సిద్ధం

సాక్షి, తిరుమల: ధార్మిక ప్రచారానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్న టీటీడీ దేశ వ్యాప్తంగా శ్రీవారి ఆలయ నిర్మాణాలు క్రమంగా పెంచుతోంది. కార్పొరేట్ నగరాలతోపాటు గిరిజన ఆవాసాలైన ఏజెన్సీ ప్రాంతాల్లోనూ రూ.కోట్లు ఖర్చుచేస్తూ ఆలయ నిర్మాణాలు వేగవంతం చేయాలని సంకల్పించింది.

కోట్లతో కురుక్షేత్రలో సిద్ధమైన శ్రీవారి ఆలయాలు

హర్యానా రాష్ట్రం కురుక్షేత్ర పుణ్యక్షేత్రంలో టీటీడీ శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయాన్ని నిర్మిస్తోంది. అక్కడి ప్రభుత్వ పరిధిలోని కురుక్షేత్ర డెవలప్‌బోర్డు విరాళం ఇచ్చిన ఐదెకరాల భూమిలో సుమారు రూ.34 కోట్లతో పనులు చేపట్టారు. తొలివిడతగా రూ.17.6 కోట్ల అంచనాలతో పూర్తిగా రాతితో కూడిన శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయాన్ని నిర్మించారు. రాజగోపురం, ముఖమండపం, మహామణిమండపం, అర్ధమండపం, గర్భాలయం, వైకుంఠం ద్వారం, పరివార దేవతలుగా పద్మావతి, గోదాదేవి ఆలయాలతో పాటు వెలుపల నాల్గు మాడ వీధులు నిర్మించారు. ఇక మరో రూ.17 కోట్లతో ఆలయానికి అనుబంధంగా రథమండపం, వాహన మండపం, అన్నదాన భవనం, అధికారులు, సిబ్బంది క్వార్టర్ల నిర్మాణం పనులు నిర్మాణ దశలో ఉన్నాయి.

22 కోట్లతో కన్యాకుమారిలోనూ కోనేటిరాయని ఆలయం

తమిళనాడులోని కన్యాకుమారిలో స్వామి వివేకానందుడు ధ్యానం చేసిన సముద్రపు ఒడ్డున ఆహ్లాదకరమైన వాతావరణంలో 5 ఎకరాల స్థలంలో రూ.22 కోట్ల ఖర్చుతో శ్రీవారి ఆలయ నిర్మాణానికి టీటీడీ శ్రీకారం చుట్టింది. తొలిదశలో సుమారు రూ.13 కోట్ల అంచనాలతో శ్రీవారి ఆలయం, పద్మావతి, గోదాదేవి అమ్మవారి ఆలయాలతోపాటు నాలుగు మాడ వీధులు నిర్మించారు. మరికొన్ని పనులు టెండర్ దశలో ఉన్నాయి. కురుక్షేత్రతోపాటు కన్యాకుమారి ఆలయాలకు త్వరలో మహాసంప్రోక్షణ చేయాలని భావిస్తోంది. మతమార్పిడులకు అవకాశం లేకుండా గిరిజనుల ఏజెన్సీ ప్రాంతాల్లోనూ శ్రీవారి ఆలయాలు నిర్మించేందుకు టీటీడీ ఈవో అనిల్‌కుమార్ ప్రణాళికలు సిద్ధం చేశారు. ఇందులో భాగంగా రాష్ట్రంలోని అరకు, రంపచోడవరం, పార్వతీపురం, సీతంపేటలో రూ.18 కోట్లతో శ్రీవేంకటేశ్వర స్వామివారి దివ్యక్షేత్రాల నిర్మించాలని టీటీడీ నిర్ణయించింది. విశాఖపట్నం, భువనేశ్వర్‌లో దివ్యక్షేత్రాల నిర్మాణానికి, రాష్ట్ర దేవాదాయశాఖ అధీనంలోని 36 అత్యంత పురాతన ఆలయాల్లో రూ.7 కోట్ల వ్యయంతో పునరుద్ధరణ చర్యలు చేపట్టారు. రూ.40 కోట్లతో ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాల నివాస ప్రాంతాల్లో భజన మందిర నిర్మాణాలు చేపట్టనున్నారు.

ఆలయాల కేంద్రంగానే ధార్మిక ప్రచారం

దక్షిణాది రాష్ట్రాలతోపాటు ఉత్తరాది రాష్ట్రాల్లోని ముఖ్యనగరాల్లో టీటీడీ ఆలయాలు, సమాచార కేంద్రాలు ఉన్నాయి. వీటితోపాటు తాజాగా నిర్మిస్తున్న ఆలయాల కేంద్రంగానే ధార్మిక, నిత్య సంగీత, భజన గోష్ఠి, కార్యక్రమాలు విస్తరించాలని టీటీడీ భావిస్తోంది. ఆయా ఆలయాల కేంద్రంగానే శ్రీనివాస కల్యాణాలు, శ్రీవారి వైభవోత్సవాలు సంఖ్యను రెట్టింపుస్థాయిలో నిర్వహించాలని సంకల్పించింది. ఆయా మాసాల ప్రత్యేక పర్వదినాల సందర్భంగా ధర్మప్రచార కార్యక్రమాలు విస్తరించాలని నిర్ణయించారు.

గాయంతో డివిలియర్స్ అవుట్



డర్బన్: భారత్‌తో వన్డే సిరీస్‌కు ముందు దక్షిణాఫ్రికాకు భారీ దెబ్బ తగిలింది. వేలి గాయం కారణంగా స్టార్ బ్యాట్స్‌మన్ ఏబీ డివిలియర్స్ సిరీస్‌లోని తొలి మూడు వన్డేలకు దూరమయ్యాడు. మూడో టెస్టులో కోహ్లి క్యాచ్‌ను అందుకునే క్రమంలో ఏబీ వేలికి గాయమైంది. అతను కోలుకునేందుకు రెండు వారాల విశ్రాంతి అవసరమని వైద్యులు తేల్చారు. నాలుగో వన్డే నుంచి డివిలియర్స్ జట్టుకు అందుబాటులో ఉంటాడు. మూడు వన్డేలకే జట్టును ఎంపిక చేసిన దక్షిణాఫ్రికా ఏబీ స్థానంలో ఎవరినీ తీసుకోకపోవడంతో జోండో అరంగేట్రం చేసే అవకాశం ఉంది.

మెయిన్ డ్రాకు నందగోపాల్ జోడీ

ఇండియా ఓపెన్ టోర్నీ



న్యూఢిల్లీ: ఇండియా ఓపెన్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో తెలుగు క్రీడాకారులు నందగోపాల్, కృష్ణప్రసాద్ తమ భాగస్వాములతో కలిసి పురుషుల డబుల్స్‌లో మెయిన్ డ్రా ఈవెంట్‌కు అర్హత సాధించారు. మంగళవారం జరిగిన క్వాలిఫయింగ్ పోటీల్లో కె.నందగోపాల్–ఫ్రాన్సిల్ ఆల్విన్ (భారత్) జంట 21–13, 21–13తో దీపేశ్ ధమి–రత్నజిత్ తమంగ్ (నేపాల్) ద్వయంపై గెలుపొందగా, కృష్ణప్రసాద్–ధ్రువ్ కపిల జోడీ 21–11, 21–15తో భారత్‌కే చెందిన సిద్ధార్థ్–ప్రేమ్ సింగ్ చౌహాన్ జంటపై విజయం సాధించింది. పురుషుల సింగిల్స్‌లో సిరిల్ వర్మ క్వాలిఫయింగ్‌లోనే వెనుదిరిగాడు. కార్తికేయ్ గుల్షన్ కుమార్ 21–17, 15–21, 21–7తో సిరిల్‌ను ఓడించాడు. బుధవారం నుంచి మెయిన్ డ్రా మ్యాచ్‌లు జరుగుతాయి.

శ్యామ్‌కు పతకం ఖాయం



న్యూఢిల్లీ: ఇండియా ఓపెన్ అంతర్జాతీయ బాక్సింగ్ టోర్నమెంట్‌లో భారత బాక్సర్ కాకర శ్యామ్ కుమార్ (49 కేజీలు) సెమీఫైనల్లోకి ప్రవేశించి కనీసం కాంస్య పతకాన్ని ఖాయం చేసుకున్నాడు. వైజాగ్‌కు చెందిన శ్యామ్ మంగళవారం జరిగిన క్వార్టర్ ఫైనల్లో ఇలాహి ఇంగాతన్ (ఇండోనేసియా)పై గెలుపొందాడు. మహిళల విభాగంలో మేరీకోమ్ (51 కేజీలు), సరితా దేవి (60 కేజీలు) కూడా సెమీస్ చేరారు.

స్వర్ణం నెగ్గిన శ్రీజ



రాంచీ: జాతీయ సీనియర్ టేబుల్ టెన్నిస్ చాంపియన్‌షిప్‌లో ఆర్‌బీఐకు ప్రాతినిధ్యం వహించిన తెలంగాణ క్రీడాకారిణి ఆకుల శ్రీజ స్వర్ణ పతకాన్ని సాధించింది. మిక్స్‌డ్ డబుల్స్ విభాగం ఫైనల్లో శ్రీజ–రాజ్ మోండల్ (ఆర్‌బీఐ) ద్వయం 3–2తో ఆకాశ్–అంకిత (బెంగాల్) జోడీపై గెలిచింది. పురుషుల సింగిల్స్‌లో శరత్ కమల్ ఎనిమిదోసారి విజేతగా నిలిచి కమలేశ్ మెహతా పేరిట ఉన్న రికార్డును సమం చేశాడు.



‘పూర్’ వాండరర్స్!

జొహన్నెస్‌బర్గ్ పిచ్‌ను నాసిరకంగా తేల్చేసిన ఐసీసీ

దుబాయ్: అనూహ్యమైన బౌన్స్‌తో బ్యాట్స్‌మెన్‌ను ఒక ఆటాడుకున్న జొహన్నెస్‌బర్గ్ పిచ్‌పై ఊహించినట్లుగానే అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) స్పందించింది. భారత్, దక్షిణాఫ్రికా మధ్య మూడో టెస్టుకు వేదికగా నిలిచిన వాండరర్స్ మైదానాన్ని ‘నాసిరకం’గా గుర్తిస్తూ ఐసీసీ హెచ్చరిక జారీ చేసింది. ఈ మ్యాచ్ మూడో రోజు క్రికెటర్లు పలు మార్లు గాయాలకు గురి కావడంతో అంపైర్లు, రిఫరీ మ్యాచ్‌ను నిలిపివేయాల్సి వచ్చింది. ‘వాండరర్స్ స్టేడియం పిచ్ నాసిరకంగా ఉందని ఐసీసీ రిఫరీ ఆండీ పైక్రాఫ్ట్ గుర్తిస్తూ ‘పూర్’ రేటింగ్ ఇచ్చారు. ఈ పిచ్‌కు మూడు డీ మెరిట్ పాయింట్లు శిక్షగా విధించారు’ అని ఐసీసీ ప్రకటించింది. సాధారణం కంటే తక్కువ ప్రమాణాలతో ఉండే పిచ్‌లకే ఐసీసీ ఒక డీ మెరిట్ పాయింట్ శిక్షగా విధిస్తున్న నేపథ్యంలో మూడు డీ మెరిట్ పాయింట్లు ఇవ్వడం వాండరర్స్ పరిస్థితికి ఉదాహరణ. ఐదేళ్ల వ్యవధిలో డీ మెరిట్ పాయింట్ల సంఖ్య ఐదుకు చేరితే ఆ మైదానంలో ఏడాది పాటు అంతర్జాతీయ మ్యాచ్ జరగకుండా నిషేధం పడుతుంది.

పాకిస్తాన్‌ను పసికూన చేశారు. వారి బౌలింగ్‌లో పసలేదనేలా బాదేశారు. తర్వాత పేస్‌తో బెంబేలెత్తించారు. దాయాదికి అవకాశమే లేకుండా కుప్పకూల్చారు. మొత్తం మీద భారత కుర్రాళ్లు చిరకాల ప్రత్యర్థిని కలసికట్టుగా కుమ్మేశారు. అండర్-19 ప్రపంచకప్‌లో సగర్వంగా, అజేయంగా అంతిమ సమరానికి అర్హత సాధించారు.

కుర్రాళ్లు అదుర్స్

సెమీస్‌లో పాకిస్తాన్‌పై 203 పరుగులతో ఘనవిజయం



శుభ్‌మన్

అండర్-19 ప్రపంచకప్ ఫైనల్లో భారత్

- శుభ్‌మన్ గిల్ అజేయ శతకం
- బౌలింగ్‌లో హడలెత్తించిన ఇషాన్
- శనివారం ఆస్ట్రేలియాతో టైటిల్ పోరు

క్రైస్ట్‌చర్చ్: అన్ని రంగాల్లో ఆధిపత్యం చలాయించిన భారత యువ జట్టు అండర్–19 క్రికెట్ ప్రపంచకప్‌లో ఫైనల్‌కు చేరింది. మంగళవారం ఇక్కడ జరిగిన రెండో సెమీఫైనల్లో పాకిస్తాన్‌పై టీమిండియా 203 పరుగులతో ఘనవిజయం సాధించింది. వన్‌డౌన్ బ్యాట్స్‌మన్ శుభ్‌మన్ గిల్ (94 బంతుల్లో 102 నాటౌట్; 7 ఫోర్లు) అజేయ శతకానికి తోడు కెప్టెన్ పృథ్వీ షా (42 బంతుల్లో 41; 3 ఫోర్లు, 1 సిక్స్); ఓపెనర్ మన్‌జోత్ కల్రా (59 బంతుల్లో 47; 7 ఫోర్లు); చివర్లో అనుకూల్ రాయ్ (45 బంతుల్లో 33; 4 ఫోర్లు) సమయోచిత ఆటతో భారత్ నిర్ణీత 50 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 272 పరుగులు చేసింది. పాక్ బౌలర్లలో అర్షద్ ఇక్బాల్ (3/51), మూసా (4/67) రాణించారు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన పాక్‌ను భారత పేసర్ ఇషాన్ పొరెల్ (4/17) దారుణంగా దెబ్బతీశాడు. అతని ధాటికి ప్రత్యర్థి 28 పరుగులకే నాలుగు వికెట్లు కోల్పోయింది. ఇవన్నీ ఇషాన్‌కే దక్కాయి. స్పిన్నర్ శివ సింగ్ (2/20), ఆల్‌రౌండర్ పరాగ్ (2/6) కూడా ఓ చేయి వేయడంతో పాక్ 29.3 ఓవర్లలో 69 పరుగులకే ఆలౌటైంది. గిల్‌కే ‘మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్’ పురస్కారం దక్కింది. ఫిబ్రవరి 3న జరిగే ఫైనల్లో ఆస్ట్రేలియాతో భారత్ తలపడుతుంది.



ఇషాన్

భళా... శుభ్‌మన్: టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన భారత్‌కు ఓపెనర్లు పృథ్వీ షా, కల్రా చక్కటి ఆరంభం ఇచ్చారు. తొలి వికెట్‌కు వీరు 89 పరుగులు జోడించారు. అసలు హైలైట్ మాత్రం శుభ్‌మన్ ఇన్నింగ్సే. జట్టు స్కోరు 94 పరుగుల వద్ద క్రీజులోకి వచ్చిన గిల్ ఓవైపు వరుసగా వికెట్లు పడుతున్నా ధీమాగా ఆడి జట్టును నిలబెట్టాడు. పోరాడే స్కోరు అందించాడు. రెండు క్యాచ్‌లతో పాటు రనౌట్ అవకాశం చేజార్చిన పాక్ పేలవ ఫీల్డింగ్ కూడా అతడికి కలిసొచ్చింది. అయినప్పటికీ... గిల్ ఆటను తక్కువ చేయలేం. మంచి క్రికెటింగ్ షాట్లు కొట్టిన అతడు ఇన్నింగ్స్ చివరి ఓవర్లో శతకం పూర్తిచేసుకున్నాడు. 273 పరుగుల లక్ష్య ఛేదనలో ప్రత్యర్థి బ్యాట్స్‌మెన్ ఏమాత్రం ప్రతిఘటన చూపలేకపోయారు.

6 అండర్-19 ప్రపంచకప్ చరిత్రలో భారత్ ఫైనల్ చేరడం ఇది ఆరోసారి. గతంలో 2000, 2008, 2012లలో భారత్ విజేతగా నిలిచింది. 2006, 2016 ఫైనల్స్‌లో ఓడి రన్నరప్‌గా నిలిచింది.

స్కోరు వివరాలు

భారత ఇన్నింగ్స్: పృథ్వీ షా (రనౌట్) 41; కల్రా (సి) నజీర్ (బి) మూసా 47; శుభ్‌మన్ గిల్ (నాటౌట్) 102; హార్విక్ దేశాయ్ (సి) సాద్ ఖాన్ (బి) ఇక్బాల్ 20; పరాగ్ (సి) నజీర్ (బి) ఇక్బాల్ 2; అభిషేక్ శర్మ (సి) నజీర్ (బి) ఇక్బాల్ 5; రాయ్ (సి) నజీర్ (బి) మూసా 33; నాగర్‌కోటి (బి) షహీన్ అఫ్రిది 1; శివమ్ మావి (సి అండ్ బి) మూసా 10; శివ సింగ్ ఎల్బీడబ్ల్యూ (బి) మూసా 1; ఇషాన్ పొరెల్ (నాటౌట్) 1; ఎక్స్‌ట్రాలు 9; **మొత్తం (50 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి) 272**
వికెట్ల పతనం: 1–89, 2–94, 3–148, 4–156, 5–166, 6–233, 7–242, 8–265, 9–267.
బౌలింగ్: ఇక్బాల్ 10–0–51–3, మూసా 10–0–67–4, షహీన్ అఫ్రిది 10–0–62–1, హసన్ ఖాన్ 10–0–46–0, తాహా 7–0–35–0, అలీ జరియబ్ 3–0–11–0.

పాకిస్తాన్ ఇన్నింగ్స్: ఇమ్రాన్ షా (సి) పృథ్వీ షా (బి) ఇషాన్ 2; జైద్ అలం (సి) శివం మావి (బి) ఇషాన్ 7; నజీర్ (సి) శుభ్‌మన్ (బి) పరాగ్ 18; అలీ జరియబ్ (సి) పృథ్వీ షా (బి) ఇషాన్ 1; ఆలమ్ (సి) శివం మావి (బి) ఇషాన్ 4; తాహా (సి) నాగర్‌కోటి (బి) శివ సింగ్ 4; సాద్ ఖాన్ (స్టంప్డ్) దేశాయ్ (బి) రాయ్ 15; హసన్ ఖాన్ (సి) శుభ్‌మన్ (బి) పరాగ్ 1; షహీన్ అఫ్రిది (సి అండ్ బి) శివ సింగ్ 0; మూసా (నాటౌట్) 11, అర్షద్ ఇక్బాల్ (సి) ఇషాన్ (బి) అభిషేక్ శర్మ 1; ఎక్స్‌ట్రాలు 5; **మొత్తం (29.3 ఓవర్లలో ఆలౌట్) 69**
వికెట్ల పతనం: 1–10, 2–13, 3–20, 4–28, 5–37, 6–41, 7–45, 8–48, 9–68, 10–69.
బౌలింగ్: శివం మావి 4–3–6–0, ఇషాన్ 6–2–17–4, నాగర్‌కోటి 5–1–7–0, శివ సింగ్ 8–0–20–2, పరాగ్ 4–1–6–2, రాయ్ 2–0–11–1, అభిషేక్ శర్మ 0.3–0–0–1.

కర్నూలులో మెడికో ఆత్మహత్య



మృతిచెందిన విష్ణుప్రియ

కర్నూలు హాస్పిటల్ : కర్నూలు మెడికల్ కళాశాల ఆర్థోపెడిక్ విభాగంలో పీజీ రెండవ సంవత్సరం చదువుతున్న విష్ణుప్రియ అనే విద్యార్థిని మంగళవారం ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. అనంతపురం నగరానికి చెందిన ఎన్.వి.మోహన్‌రెడ్డి భూగర్భ జలవనరుల శాఖలో ఉద్యోగం చేసి పదవీ విరమణ పొందారు. ప్రస్తుతం ఆయన బళ్లారిలోని ఓ ప్రైవేటు కంపెనీలో పనిచేస్తున్నారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమార్తెలు. పెద్ద కుమార్తె బెంగళూరులో ఉద్యోగం చేస్తోంది. రెండవ కుమార్తె విష్ణుప్రియకు కర్నూలు మెడికల్ కళాశాల ఆర్థోపెడిక్ విభాగంలో పీజీ సీటు రావడంతో మిడుతూరు డిప్యూటీ తహశీల్దార్‌గా పనిచేస్తున్న పిన్ని ఇంటిలో ఉంటోంది. మంగళవారం రాత్రి 7 గంటలకు విధులు ముగించుకుని స్థానిక చాణక్యపురి కాలనీలోని నివాసానికి చేరుకున్న విష్ణుప్రియ పిన్నికి విష్ణుప్రియ ఉరేసుకుని ఉండడం కనిపించింది. వెంటనే కుటుంబ సభ్యులతో కలసి విష్ణుప్రియను ఆసుపత్రికి తరలించారు. అప్పటికే ఆమె మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. ఆత్మహత్యకు కారణాలు తెలియాల్సి ఉంది. చలాకీగా, అందరితో కలుపుగోలుగా ఉండే అమ్మాయి ఆత్మహత్య చేసుకుందంటే నమ్మలేకపోతున్నామని ఆర్థోపెడిక్ విభాగం వైద్యులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 'నాన్నా.. నన్ను క్షమించు. జీవితంలో ఓడిపోయాను. నేను బలహీనురాలిని. పోరాడే ధైర్యం లేదు' అంటూ విష్ణుప్రియ సూసైడ్ నోట్‌లో పేర్కొన్నట్లు తెలుస్తోంది. మూడవ పట్టణ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

రాయలసీమలో హైకోర్టు ఏర్పాటు చేయాలి

- పెద్ద మనుషుల ఒప్పందాన్ని అమలు చేయాలి
- ఏసీజేకు రాయలసీమ హైకోర్టు సాధన సమితి వినతి

సాక్షి, హైదరాబాద్: ఆంధ్రప్రదేశ్ హైకోర్టును రాయలసీమలో ఏర్పాటు చేయాలని 'రాయలసీమ హైకోర్టు సాధన సమితి' సభ్యులు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు వారు మంగళవారం హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి (ఏసీజే) జస్టిస్ రమేశ్ రంగనాథన్‌ను కలిశారు. వినతిపత్రం సమర్పించారు. ఈ అంశంపై మిగిలిన న్యాయమూర్తులతో చర్చిస్తానని ఏసీజే హామీ ఇచ్చినట్లు వారు తెలిపారు. రాయలసీమలో హైకోర్టు ఏర్పాటు ఆవశ్యకతను ఏసీజేకు న్యాయవాదులు వివరించారు. గతంలో కుదిరిన పెద్ద మనుషుల ఒప్పందం మేరకు పాలనను వికేంద్రీకరించాలని డిమాండ్ చేశారు. అందులో భాగంగా రాజధాని, హైకోర్టులను వేర్వేరు ప్రాంతాల్లో ఏర్పాటు చేయాల్సి ఉందన్నారు. రాష్ట్ర విభజన జరిగిన తర్వాత చంద్రబాబు ప్రభుత్వం పాలనను మొత్తం ఒకే ప్రాంతంలో కేంద్రీకరించాలని చూస్తోందన్నారు. హైకోర్టును రాజధాని ప్రాంతంలోనే ఏర్పాటు చేసేందుకు ప్రయత్నిస్తోందని, ఇది ఎంత మాత్రం సరికాదని పేర్కొన్నారు. పలు రాష్ట్రాల్లో రాజధానులతో సంబంధం లేకుండా హైకోర్టులు వేరే చోట ఉన్నాయని గుర్తుచేశారు. ఏపీ హైకోర్టును రాయలసీమ ప్రాంతంలో కర్నూలు, కడప, అనంతపురం, చిత్తూరు జిల్లాల్లో ఎక్కడ ఏర్పాటు చేసినా అభ్యంతరం లేదన్నారు. ఏసీజేను కలిసి వినతిపత్రం ఇచ్చిన వారిలో హైకోర్టు న్యాయవాదులతోపాటు కడప, కర్నూలు, అనంతపురం, చిత్తూరు జిల్లాల న్యాయవాద సంఘాల ప్రతినిధులు కూడా ఉన్నారు.

14 వరకు ఓటర్ల నమోదు

- 'సాక్షి'తో రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ఆర్.పి.సిసోడియా
- ముసాయిదా ఓటర్ల జాబితాలు బూత్ స్థాయిలో అందుబాటులో
- పేర్లు లేనివారు అక్కడికక్కడే నమోదు చేసుకోవచ్చు
- ఆన్‌లైన్‌లో కూడా నమోదుకు అవకాశం
- 4, 11న ప్రత్యేకంగా బూత్ స్థాయిల్లో నమోదుకు ఏర్పాట్లు
- మార్చి 24న ఓటర్ల తుది జాబితా ప్రకటన
- ముసాయిదా ఓటర్ల జాబితాలో మహిళలే అధికం

ముసాయిదా ఓటర్ల జాబితా	
మొత్తం ఓటర్ల సంఖ్య	3,43,02,150
పురుష ఓటర్ల సంఖ్య	1,70,21,316
మహిళా ఓటర్ల సంఖ్య	1,72,77,745
ట్రాన్స్‌జెండర్ ఓటర్ల సంఖ్య	3089

సాక్షి, అమరావతి: ఈ ఏడాది జనవరి 1వ తేదీ నాటికి 18 సంవత్సరాలు నిండిన యువతీ యువకులంతా ఓటర్లుగా నమోదు చేసుకోవాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ఆర్.పి.సిసోడియా సూచించారు. ఈనెల 23వ తేదీన ప్రకటించిన ముసాయిదా ఓటర్ల జాబితాను సరిచూసుకుని పేర్లు లేనివారు నమోదు చేసుకోవాలని కోరారు. ఫిబ్రవరి 14వ తేదీ వరకు ఓటర్ల నమోదు, జాబితా సవరణలకు ప్రత్యేక కార్యక్రమం చేపట్టామని చెప్పారు. సిసోడియా మంగళవారం 'సాక్షి'తో మాట్లాడారు. ఒకచోటు నుంచి మరోచోటుకు మారిన వారికి ప్రస్తుతం ఉన్న ప్రాంతంలో ఓటరుగా నమోదుకు అవకాశం కల్పించామన్నారు.

రెండు ఆదివారాలు ప్రత్యేకంగా నమోదు

రాష్ట్రంలో బూత్ స్థాయి (పోలింగ్ కేంద్రాలు)లో ముసాయిదా ఓటర్ల జాబితాలు అందుబాటులో ఉంచామని సిసోడియా చెప్పారు. జాబితాలో పేర్లు సరిచూసుకుని లేనివారు అక్కడికక్కడే నమోదు చేసుకోవచ్చునని సూచించారు. ఫిబ్రవరి 4, 11వ తేదీల్లో (ఆదివారాలు) ప్రత్యేకంగా బూత్ స్థాయిలో ఓటర్ల నమోదుకు ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ఆ రెండు ఆదివారాలు బూత్ స్థాయి ఆఫీసర్లు ఉదయం నుంచి సాయంత్రం వరకు ఓటర్ల జాబితాలతో పోలింగ్ కేంద్రాల వద్ద అందుబాటులో ఉంటారని చెప్పారు. అక్కడకు వెళ్లి జాబితాలో పేరు ఉందో లేదో చూసుకోవచ్చని, పేర్లు లేనివారు నమోదు కోసం అక్కడికక్కడే ఫారం నింపి ఇవ్వవచ్చని వివరించారు.

తనిఖీల తరువాతే నమోదు

ఓటర్ల నమోదుకు ఎవరైనా గంపగుత్తగా దరఖాస్తులను ఇస్తే తనిఖీ చేసిన తరువాతనే నమోదు చేస్తామని స్పష్టం చేశారు. మండల కార్యాలయాల్లో కూడా ఓటరు నమోదు, సవరణ ఫారాలు అందుబాటులో ఉంటాయన్నారు. అక్కడ కూడా ఓటరుగా నమోదు చేసుకోవచ్చని తెలిపారు. ఆన్‌లైన్‌లో కూడా ఓటరు నమోదు, సవరణలకు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. http://ceoandhra.nic.inలో దరఖాస్తు చేసుకోవచ్చునని చెప్పారు. ఫిబ్రవరి 14వతేదీ వరకు అందిన దరఖాస్తులను పరిశీలించిన తరువాత అర్హులందరి పేర్లను ఓటర్లగా నమోదు చేస్తామన్నారు. ఓటర్ల తుది జాబితాను మార్చి 24వ తేదీన ప్రకటిస్తామని వెల్లడించారు.

మహిళా ఓటర్లే ఎక్కువ

ఈనెల 23వ తేదీన ప్రకటించిన ముసాయిదా ఓటర్ల జాబితా ప్రకారం రాష్ట్రంలో మహిళా ఓటర్ల సంఖ్యే ఎక్కువగా ఉంది. పురుష ఓటర్ల కన్నా మహిళా ఓటర్లు 2,56,429 మంది అధికంగా ఉండటం గమనార్హం.

డిజిటల్ నానో కోప్ ప్రారంభం

ఎన్ఎక్స్‌టీ డిజిటల్, హిందూజా మీడియా గ్రూప్ ఆధ్వర్యంలో..

సాక్షిప్రతినిధి, ఖమ్మం: కేబుల్ ఆపరేటర్లను ఆర్థిక స్వతంత్రులను చేయడంతోపాటు స్వయం ఉపాధి కల్పించుకునేందుకు తోడ్పాటు అందించే లక్ష్యంతో హిందూజా మీడియా గ్రూపు ఆధ్వర్యంలో ఎన్ఎక్స్‌టీ డిజిటల్ నానో కోప్‌ను ఖమ్మంలో ప్రారంభించింది. కేబుల్ ఆపరేటర్లను స్వతంత్ర వ్యాపారిగా తీర్చిదిద్ది.. ఎవరిపై ఆధారపడకుండా ఉండాలనే లక్ష్యంతోపాటు ఈ డిజిటల్ ద్వారా నాణ్యమైన ప్రసారాలను అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని జోడించి అందించాలనేదే తమ ప్రధాన ధ్యేయమని హిందూజా మీడియా గ్రూపు ఎండీ, సీఈవో అశోక్ మన్‌సుఖానీ చెప్పారు. తెలంగాణ రీజినల్ హెడ్ శ్రీకుమార్‌తో కలసి ఆయన మంగళవారం ఖమ్మంలో నానోకోప్‌ను ప్రారంభించారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. దేశంలో అతిపెద్ద డిజిటల్ టీవీ కంపెనీ వేదికగా ఉన్న ఎన్ఎక్స్‌టీ డిజిటల్ రంగంలో విప్లవాత్మకమైన నిర్ణయం తీసుకుని ఆపరేటర్లకు మరింత చేరువ కావడం ద్వారా నాణ్యమైన ప్రసారాలను అందించాలని నిర్ణయించిందన్నారు. ప్రతి ఆపరేటర్ రూ.15 లక్షల ఖర్చుతో 500కు పైగా చానల్స్ వచ్చేలా ఏర్పాటు చేసుకోవచ్చని చెప్పారు. గ్రామీణ ప్రాంతాల ఆపరేటర్లు రూ.4.40 లక్షలతో దాదాపు 250 చానల్స్‌ను అందించవచ్చని, నగర ప్రాంత ఆపరేటర్లు హెచ్‌డీ నాణ్యతగల చానల్స్‌ను అందించగలుగుతారన్నారు. కేబుల్ ఆపరేటర్లు తమ వ్యవస్థతో అనుసంధానమైతే ఎక్కడి నుంచైనా ప్రసారాలను ఆపరేట్ చేసుకోవచ్చని, నాణ్యతా ప్రమాణాలు దేశస్థాయిలో ఒకేలా ఉంటాయని శ్రీకుమార్ తెలిపారు. ప్రాంతీయ అవసరాలకు తగినట్టు ప్యాకేజీల రూపకల్పన జరుగుతుందని, 'మీ నెట్‌వర్క్.. మీ వ్యాపారం.. మీ లాభాలు' అనే నినాదంతో తమ వ్యాపార ప్రక్రియ ప్రారంభమవుతుందని చెప్పారు. కార్యక్రమంలో పలువురు కేబుల్ ఆపరేటర్లు పాల్గొన్నారు.





కడప పెద్ద దర్గాలో ఉరుసు ప్రారంభం

గంధం సమర్పించిన పీఠాధిపతి • కిటకిటలాడిన దర్గా పరిసరాలు

- ప్రార్థనల్లో పాల్గొన్న ఏఆర్ రెహ్మాన్



మలంగ్‌షాతో దీక్ష వహింపజేస్తున్న పీఠాధిపతి

.కడప కల్చరల్: కడపలోని అమీన్‌పీర్ దర్గా ప్రధాన ఉరుసు ఉత్సవాలు మంగళవారం ప్రారంభమయ్యాయి. దర్గా పీఠాధిపతి హజరత్ సయ్యద్‌షా ఆరీఫుల్లా హుసేనీ సాహెబ్ ఆధ్వర్యంలో ముషాయిరా హాలులో దర్గా ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సేవా సంస్థల వార్షిక నివేదిక సమర్పణ నిర్వహించారు. అనంతరం పీఠాధిపతి గంధం కలశాన్ని ఫకీర్ల మేళతాళాల మధ్య ఊరేగింపుగా దర్గాలోని గురువుల మజార్ల వద్దకు తీసుకొచ్చారు. ప్రార్థనలు చేసి గంధం సమర్పించి ఫాతెహా చేశారు. ప్రముఖ సినీ సంగీత దర్శకుడు ఏఆర్ రెహ్మాన్ దర్గా పీఠాధిపతితో కలిసి గంధం ఉత్సవంలో పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన ఖవ్వాలీ కచేరీ విశేషంగా ఆకట్టుకుంది. ఉరుసు ఉత్సవాల కోసం దేశం నలుమూలల నుంచి వచ్చిన వారితో దర్గా పరిసరాల్లోని రోడ్లన్నీ రద్దీగా మారాయి. పలువురు ప్రజాప్రతినిధులు, జిల్లా అధికారులు ఉత్సవంలో పాల్గొన్నారు.







Published and Printed by K.Ramachandra Murthy, Editorial Director, on behalf of Jagati Publications Limited, Published at Phase – 2, Plot No. 06, 100 Feet Road, Auto Nagar, Vijayawada, Krishna District – 520 007 (AP) and Printed at Jagati Publications Limited, Phase – 2, Plot No. 06, 100 Feet Road, Auto Nagar, Vijayawada, Krishna District – 520 007 (AP), and D. No. 5- 625, Vadlamudi Road, Atmakur Village, Mangalagiri Mandal, Guntur Dist-522 503. Editor: V. Murali, Phone No : 0863-2512581 Fax No: 0863-2512584, RNI Regn No. APTEL/2008/23794.